# శ్రీవ్రతేశము

(టీకా తాత్పర్య విశేషార్థ సహితము)



రచయిత్రి

శ్రీనివాసపురం జ్యోతి కుమారి (జ్యోతిశ్రీ)

శ్రీః

శ్రీ గోదాయైనమః

# శ్రీవ్రతము

(టీకా తాత్పర్య విశేషార్థ సహితము)



56046

రచయిత్రి

శ్రీనివాసపురం జ్యోతి కుమారి (జ్యోతిశ్రీ)

సర్వహక్కులు గ్రంథకర్తవి
2002

PLACED ON ...
Date............

శ్రీవ్రతము
(టీకా తాత్పర్య విశేషార్థ సహితము)

రచయిత్రి
శ్రీనివాసపురం జ్యోతి కుమారి (జ్యోతిశ్రీ)

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
ACC No. 56046
Date ...
TIRUPATI.

ప్రతులు . 1000
మూల్యం 30/-

ఈ పుస్తకము
**తిరుమల తిరుపతి దేవస్థానము** వారి
ఆర్థిక సహాయంతో ప్రచురింపబడినది

ముద్రణ :
శ్రీ శ్రీనివాస డిజిటల్ గ్రాఫిక్స్
381, పంటవీధి, తిరుపతి
ఫోన్. 21882

# నివేదనము

నాకు సంగీత సాహిత్యములు రెండును రెండుకన్నులు. విద్య చెడని పదార్థము. శరీర పాతమైనను విద్య నశించునదికాదు మీాది జన్మమున జీవుడు గైకొను దేహోపాధి యందు ఆవిద్య సంస్కారము నిలువద్రొక్కుకొని ప్రకాశించుననుట నిర్విదాంశము. "తత్ర బుద్ధి సంయోగం లభతే పౌర్వ దేహికమ్" - అన్నాడు. వ్యాసభట్టారకుడు (భ.గీ.అ.6. శ్లో.43) అభ్యస్తాః పూర్వదేహే యేతానేవ భజతేగుణాన్" అని ఆయుర్వేదాచార్యుడు సుశ్రుతుడు కూడ అన్నాడు. (శారీర స్థానము ద్వి.అ. శ్లో 56) ఈ విషయము శ్రీమచ్ఛంకరాచార్యులిట్లు స్పష్టపరిచియున్నారు.

"జీవో ముఖ్య ప్రాణ సచివః సేంద్రియః సమనస్కః విద్యా కర్మ పూర్వ ప్రజ్ఞా పరిగ్రహః పూర్వదేహం విహాయ దేహాంతరం ప్రతిపద్యతే ఇత్యేత దవగతమ్

(శాంకర బ్రహ్మసూత్ర భాష్యము, 3. అ. 1. పా. 1. సూ.)

గణితశాస్త్ర విదుషీమణి శ్రీమతి శకుంతలాదేవి (బెంగుళూరు) గారు ఇందుకు ప్రబల నిదర్శనము

"ఏకోనారాయణః" - అనబడిన పరంధామునకు నమోవాకములు. ప్రాథమికోన్నత పాఠశాల కాలములో రచనా పద్ధతికి మార్గదర్శకులైన బ్రహ్మశ్రీ పండిత శ్రీ యస్. చెన్న కృష్ణమాచార్యులు మాతాత (తండ్రికి తండ్రి) గారికి, వ్యాకృతిని సొంతము నేర్పిన మాన్య శ్రీమానాయనమ్మ ఆదిలక్ష్మమ్మ గారికి, నాటక లక్షణాదుల నిర్వహించిన శ్రీయుత డాక్టరు శ్రీనివాసపురము నరసింహాచార్యులు (మా పెద్ద పినతండ్రి) గారికి నామనః పూర్వక నందనములు. ఇరువదేండ్లకు పూర్వము నన్నుద్బోధించిన ఈ భాషా గురుత్రయము కాలవశమున బరమపదించి చాలకాలమైనను వారిని నేను మరువజాలను.

ఈ గ్రంథరచనమునకై ప్రాయికముగ పదునొకండు ఆళ్వారుల గ్రంధముల నన్నింటిని బరిశీలించితిని. అవినాకు చాలనుపకరించినవి. విశిష్టాద్వైత ప్రతిభను వేనోళ్ల చాటిన వారిలో ఆళ్వారులు అగ్రగణ్యులు అట్టి

మహనీయులు సర్వదా స్మరింపదగినవారు. ఇవిగాక మరికొన్ని వ్యాఖ్యానములు గూడ నీయనువాదమున కుపయుక్తములైనవి. ఆయా వ్యాఖ్యాతలకు కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు.

ఆలంకారికులు కావ్యములను ఉత్తమ, మధ్యమ, అధమములని మూడు భేదములతో విభజించి యుండుట విజ్ఞలోకవిదితము. వీనిలో ధ్వన్యర్థము ప్రధానముగాగల కావ్యములు ఉత్తమములు. ధ్వన్యర్థమనగా శబ్దమువలన గోచరించు ముఖ్యార్థము కన్న దాని నవలంబించిన తోచు సహృదయ హృదయాహ్లాదమును జనింపజేయు అర్థము నిదర్శనము. చాతక పక్షి నాలుక ఆర్చుకొనిపోవు దాహమును కొన్నను, ప్రాణము పోవు పరిస్థితి దాపురించినను, భూమిపై పడిన నీటిని త్రాగి దాహమును తీర్చుకొనదు. స్వర్గాధిపతి దేవేంద్రుడు మేఘముల ద్వారా వర్షించు సమయములో నోరుతెరచి అంతరాళములోనే ఆ నీటిని త్రాగి దాహమును తీర్చికొనును. ఎంత చిత్రము! ఈ పదములో నెంత నిగూఢమైన అర్థమిమిడి యున్నదో చూడుడు. చాతకపక్షి వలెనే నిజమైన శ్రియఃపతి భక్తుడు కూడ తనకెన్ని కష్టములు తటస్థించినను, ఆ కష్టముల నుండి తన్ను విముక్తుని జేయుడని యితరదేవతలను కోరడు. వారికి పూజలు చేయడు. వారిని భజింపడు. నీట ముంచినను, పాలముంచినను నీదే భారమని శ్రీమన్నారాయణునే నమ్మియుండి, ఆతని ద్వారముననే ఆ కష్టములను బాపుకొనును. ప్రాణము పోవునంతటి అవస్థ తటస్థించినను, దేవతాంతరముల భజంపడు, యాచింపడు అని పిండితార్థము. దీనినే ధ్వన్యర్థమందురు. ఈ యర్థమే కావ్యమునకు ప్రాధాన్యము నిచ్చునది.

ముఖ్యార్థమునకు మించిన మనోరంజకమగు నర్థము నీయక దానితో సమానమైన విశేషార్థమును మాత్రమే బోధించు కావ్యము మధ్యమము. "వాహిన్యః ధర్మ రాజస్య సర్వతోముఖ సంభ్రమాః" - అనునది దృష్టాంతము. వర్షాకాలముననది సర్వతోధికముగా ప్రవహించునటుల ధర్మరాజు యొక్కసేనలు అనంతటును వ్యాపించినది అని భావము. దీనిలోనదీ యుదకములు ప్రవహించుట, ధర్మరాజు సేనలు వ్యాపించుట అను రెండర్థములలో విశేషవైలక్షణము గోచరించుట లేదు. దీనిని మధ్యమ కావ్యమనిరి. గుణీ భూతవ్యంగ్యమని కూడ దీనినందురు.

## నివేదనము

శబ్దము వలన వచ్చు అర్థము కంటె వేరొక అర్థము గోచరింపని కావ్యము అధమము "సూర్యేత్వస్తంగతే నిత్యం స్వనీడం యాన్తిపక్షిణః" - అనునది తార్కాణము. సూర్యుడస్తమించగనే పక్షులు తమ గూళ్లకు జేరుచున్నవి అని అర్థము. దీనిలో వ్యంగ్యార్థమేమియు గోచరింపక పోవుటచేతనిది అధమ కావ్యముగా పేర్కొనబడినది.

మనకు నిత్యపారాయణములో నున్న రామాయణము కావ్యము. ఆది కావ్యము, మహా కావ్యము, ఉత్తమ కావ్యము అని వ్యవహరింప బడుచున్నది. కావ్యము చిరంజీవముగ నుండవలయునన్న సర్వజన, స్వభావ, ద్యోతక వస్తు విధాన కల్పనా చమత్కృతులతో నొప్పియుండ వలయునని సాహిత్యకారుల నిర్ణయము. ఇందుకు రామాయణాది మహాకావ్యములను, శాకుంతలాది నాటకములను నిదర్శనములుగా దీసికొనవచ్చును. మహాకవుల కావ్యములందీ నాలుగంశములు ననివార్యము గనుండును.

మమ్మటాచార్యులు తన కావ్యప్రకాశిక లోకవిస్పృష్టినిట్లు నుడివి యున్నాడు.

"నియతకృతి నియమ రహితాం
హ్లాదైక మయీా, మనన్య
పరతంత్రాంన వరసరుచిరాం,
నిర్మితి మాదధతి భారతీకవేః"

ఇందలి యొక్కొక్క పదము నొక్కొక్క వ్యాసముగ తీర్చిదిద్ద దగినంత భావ గంభీరముగ నున్నది. కవియొక్క భారతి నియమ బద్ధముగాదు. హ్లాదైకమయమును, నవరసరుచిరమునైన స్వతంత్ర నిర్మాణము! లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మ కావ్యమని మమ్మటుని యభిప్రాయము. ఈ యభిప్రాయమును లాక్షణికులందరు నేదోయొక విధముగ నంగీకరించి యున్నారు. లోకోత్తరమనగా అనుభవ సాక్షిక మయిన యాహ్లాదగత చమత్కారమని పండిత రాయలును, చమత్కార మనగా చిత్తవిస్తార రూపమగు విస్మయమని విశ్వనాథులు సెలవిచ్చియున్నారు. మమ్మటుడు కవిత్వమును నియతికృత నియమ రహితమనియు, అనన్య పరతంత్ర

మనియు, నిర్మితియనియు జెప్పియుండుట వలన సంస్కృత లాక్షణికులకు గూడ, శిల్పము స్వతంత్ర సృష్టియను నిర్వచనము సమ్మతముగ నున్నట్లు తెలియుచున్నది

రామాయణము వేద స్వరూపమని మనమందుము. ఇతిహాసమని ఆలంకారికులు నిర్ణయించిరి. అనాది సిద్ధబ్రహ్మ విద్య ప్రతిపాదకము ఉపనిషత్తు, అదియే వేదాంతము. వేదాంతార్థోపదేశమే ఇతిహాసలక్షణము. సంహారయుత కథాకథన రూపము. అఖ్యానోపాఖ్యాన రూపమున లౌకిక వ్యవహార లక్షణములు తెలుపుచున్నను పరోక్షమున వేద తత్వార్థ రహస్యములను సైతము ఇతిహాసము బోధించుచుండును. కావుననే రామాయణ భారతములు భారతేతిహాసముగా పేరుగాంచినవి. కర్మ ప్రవృత్తిని కల్గించు రామాయణము వంటిదే తిరుప్పావై దివ్య ప్రబంధము కూడ. కర్మ అనగా చేయుపని అని అర్థము మనచే పనిచేయించునది అంత యుగర్మయే. హృదయము ప్రేమ పూరితమైనపుడే మనస్సు సత్కర్మలను ప్రేరేపించును, సర్వసమానత్వమును నేర్పునది ప్రేమ. ప్రేమ హృదయము అమృతమయము. అట్టి హృదయమును కన్న తల్లి యందేమనము చూడగలము. పెరియాళ్వారుల పుత్రిక గోదాదేవి శ్రీకృష్ణునే వివాహమాడ గోరి మార్గశీర్ష స్నాన రూపమగు వ్రతము నాచరించినది. "ఏకః స్వాదు నభుంజీత" మిక్కిలి రుచిగల పదార్థమును ఒక్కరే భుజింపరాదు - అనెడి న్యాయమునను సరించి ఆండాళుతల్లి తనకు లభించిన ఆనందమును నలుగరకును పంచిపెట్టదలచి, అపరిమితానందముతో ఆమెతాను ఆచరించిన ఆ వ్రతమును ప్రబంధరూపమున లోకుల కనుగ్రహించినారు. అదియే "తిరుప్పావు" తిరు అనగా శ్రీ పావై అనగా వ్రతము. శ్రీపదమగు వ్రతమనిపేరు. ఈ వ్రతము ఇహపరలోకముల ఐశ్వర్యములను, నిరంతర భగవత్సమాశ్లేష పూర్వక భగవత్కైంకర్యమును ప్రసాదించును. తిరుప్పావై వ్రతము ముప్పదిరోజులలో పూర్తిచేయు భగవదుపాసనము శ్రీకృష్ణ పరబ్రహ్మమునకు సుప్రభాతము పాడి మంగళాశాసనము చేయుటచే సంప్రాప్తమగును.

"సుప్తముద్బోధ్య కృష్ణం శ్రుతిశత శిరస్సిద్ధ మధ్యాపయన్తీ" - అను తిరుప్పావు తనియలోనే ఆ గ్రంథము యొక్క ఉత్తమత్వము చాటబడు

చున్నది. అంతటి ఉత్తమ గ్రంథము కాబట్టియే "ఈరాయిరము", "మువ్వాయిరము," "నాలాయిరము", "ఆరాయిరము" - అనబడు నమ్మాళ్వారులు సాయించిన తిరువాయిమొళి దివ్య ప్రబంధమునకు వలె దీనికిని అనేక వ్యాఖ్యానములు, ఆవిర్భవించినవి. ఇది అంతగొప్ప ప్రబంధమగుట వలననే దీనిని నిత్యము విడువక అనుసంధించు మన సిద్ధాంత ప్రవర్తకులగు రామానుజుల వారికి - "తిరుప్పావై జీయర్" - అను తిరునామము సార్థకమైనది. వేయేల? నాలాయిర దివ్య ప్రబంధములలోనే గ్రంథమును గాని అనుసంధించరాదను నిర్బంధము గల తిరుక్కార్తి అనబడు అనధ్యయన దినములో గూడ మధ్య గూడ ధనుర్మాసమను నెపముతో పూర్వాచార్యులు దీనిననుసంధించక యుండజాలకుండిరి. ఈ ప్రబంధము ననుసంధింపనిచో ఆలయములలో గాని, గృహములలో గాని నిత్యార్చన పూర్తికాదని పెద్దల నిర్ణయము

తిరుప్పావై దివ్య ప్రబంధములో గోదామాత ఆచిన్న వయస్సులోనెన్ని రహస్యములైన అర్థములను వినిపించినదో, ఎంత యోపికతో గోపికా భావము నవలంబించి తన జాతీయులగు గోపాంగనలు భగవత్కటాక్ష పాత్రముల నొనర్చినదో, వర్షార్థమని పేరుపెట్టి చివరి పాశురములో నెట్టి నిరవచ్ఛిన్న కైంకర్యమును ప్రార్థించినదో? అట్టి దివ్య ప్రబంధాను సంధాన భాగ్యము మన శ్రీవైష్ణవలుకే అబ్బినది. అది మనకెంతయు గర్వకారణము. ఇట్టి తిరుప్పావవై ప్రబంధమును ఉత్తమ కావ్యముగా పరిగణించుటలో నాశ్చర్యమేమున్నది? ఈ కావ్యములోని ప్రతిపాశురమునందును నీ ధ్వన్యర్థమును "వేదాంతార్థము," "స్వాపదేశార్థము" - అను పేరులలో పెద్దలు సాయించిన ప్రబంధములలో గాంచవచ్చును.

ఈ తిరుప్పావునకు మార్గశీర్ష మాసము ప్రధాన సమయము. ఈ మార్గశీర్ష శబ్దమునొకింత విచారింతము. "శీర్ష" మనగా - "ఉత్తమాఙ్గం శిరశ్శీర్షమ్" - అనుకోశమును బట్టి శరీరములోని శిరస్సే ఈ శబ్దమున కర్థమని గోచరించుచున్నది. "ఉత్" - అనగా శరీరము నందలిపైభాగము. అనగా చేతుల కొధారమైన మొండెము. "ఉత్తర" మనగా జ్ఞానేంద్రియముల కాధారమైన ముఖభాగము. "ఉత్తమ" మనగా అంతకంటెను పైది లేని శిరోభాగము. ఏమయినను, "శీర్ష" - మనగా సర్వోత్తమ స్థానమని

నిర్ణీతమైనది. ఈ శబ్దము ససంధిక శబ్దము. అనగా వేనిలో సర్వోత్తమ మైనది? అను ప్రశ్న యుదయించును. దాని వెనుక నున్న "మార్గ" శబ్దము ఈ యర్థములను తెలుపుచున్నది. ఇది నిర్ధారణ షష్ఠి అనగా మార్గములలో సర్వోత్తమమైనది అని భావము. దానిని బోధించుటయే యీ ప్రబంధమునకు ప్రధానమగుటచేత ఈ మాసము దీనికి ప్రధానముగా పరిగణింపబడినది.

చరమశ్లోకవ్యాఖ్యా నావసరమున అష్టాదశ రహస్య ప్రణేతలైన శ్రీ పిళ్లైలో కాచార్య మహాశయులు "ధర్మ" శబ్దముచే మోక్ష సాధనముల నన్నింటి నివివరించిరి. ఆ మార్గములన్నింటిలోను ఉత్తమమైన మార్గము నీ తిరుప్పావై దివ్య ప్రబంధము బోధించుచున్నది. "మార్గ" శబ్దమునకు "ఉపాయ" మర్థమను విషయమును మరువరాదు. అనగా ఆచార్య నిష్ఠయే అంతిమోపాయమని దీని భావము. అదియే "మార్గశీర్ష" మని సిద్ధాంతీకరింపబడినది. ఈ విషయము నింకను విపులముగా తెలియగోరువారు నాచే వ్రాయబడిన "మహా యోగిని శబరి" అను గ్రంథమును చూడనగును. ఆ గ్రంథమున ఈ మార్గముల నన్నింటిని విమర్శించి, వానిలోగల కాఠిన్యమును వివరించి, చివరకు అంతిమోపాయమగు "ఆచార్య నిష్ఠను' ' శాస్త్ర ప్రమాణ పూర్వకముగా వివరించుట జరిగినది. "పల్లాణ్డుక్కు ఆళ్కి దక్కలాం," "తిరుప్పావైక్కు ఆళ్ పట్టాతు" - అని పూర్వాచార్యుల శ్రీసూక్తి. అనగా పల్లాండు భగవత్ స్తుతి పరమనియు, తిరుప్పావై ప్రబంధము భాగవతస్తుతి పరమనియును భావము. భగవత్‌స్తుతిని చేయుటకు కొందరైనను సిద్ధపడుదురుగాని, భాగవత స్తుతికి మనుష్యులు లభించుట మిక్కిలి దుర్లభము అట్టి భాగవత స్తుతి పరమైనది తిరుప్పావై దివ్య ప్రబంధము. ఆచార్యులందరును భాగవతులగుదురుగాని, భాగవతులందరు ఆచార్యులుకారుకదా! అందుచే ఆచార్యులను ఆచార్యులుగాను, భాగవతులుగాను మనము ఆదరింతుము. ఏమయినను, తిరుప్పావై దివ్య ప్రబంధము మోక్షమునకుత్తమ సాధనమగు ఆచార్య నిష్ఠనే బోధించుచున్నదని సిద్ధాంతము. తిరుప్పావు నందు ముప్పది పాటలు కలవు. ఈ పాటలు "శెన్ తమిళ్" భాషలో నున్నవి. శ్రీవైష్ణవ సిద్ధాంత రహస్యము లన్నియు నిందునిండియున్నవి.

## నివేదనము

సాక్షాత్తు భూదేవి యవతారముగా చెప్పబడిన గోదాదేవి రచియించుటచే నీ పాటలు పదప్రయోగములోనేమి, అర్థగాంభీర్యములో నేమి, రచనా సౌష్టవములో నేమి, అద్వితీయములై గానయోగ్యములైనవి తిరుప్పావై దివ్య ప్రబంధములోని సంభాషణములు సహజ సుందరములు అయియున్నవి. సన్నివేశములు నాటకీయతచే నిబంధింపబడినవి. భాష సరళముగానున్నది. కవితా దృష్టిచే చూచిన యెడల తిరుప్పావై పాటలు అత్యంత రమణీయములై దివ్య గీతములుగా భాసించును. శ్రీవైష్ణవునికి కావలసిన శేషత్వము, పారతంత్ర్యము, కైంకర్యము అనునీ మూడును తిరుప్పావులో విశదముగా చెప్పబడినవి. రెండవ పాశురమున జెప్పబడిన విధి నిషేదములు వ్రతకాలమునందేగాక, యావజ్జీవము ఆచరింపబడినవి. శ్రీవైష్ణవులకు తిరుప్పావై దివ్య ప్రబంధమును సేవించినచో సర్వప్రబంధములను సేవించినట్లగును. ఈ వ్రతఫలము దివ్యానందప్రదముగ జెప్పబడినది. మొదటి దశను అభిముఖ్య దశయనియు, రెండవదశను ఆశ్రయణదశయనియు, మూడవ దానిని అనుభవదశయనియు పేర్కొనవచ్చును. దీనినే క్రమముగా అనన్య శేషత్వమనియు, అనన్య శరణ్యమనియు, అనన్య భోగ్యత్వమనియు గూడనందురు.

శ్రీవైష్ణవులకు కామ్యక వ్రతములు ఆచరణీయములు కావు. అవి అల్ప, అస్థిర ఫలప్రదములు కావున త్యాజ్యములు శిష్టాచారమైన తిరుప్పావు ఒక్కటే ఆచరిపందగినది. ఇది యుత్తమమైన, శాశ్వతమైన ఫలమునిచ్చునది. మూడవ పాశురములో విశ్వశ్రేయము ప్రతిపాదింపబడినది. అల్ప ప్రజ్ఞులు, అల్ప శక్తులు అయిన మానవులకు తిరప్పావు ఒక్కటే సులభమైన వ్రతము అన్ని వయస్సులలోని వారికి, అన్ని ఆశ్రమములోని వారికి, అన్ని వర్గముల వారికి, స్త్రీలకు, పురుషులకు ఈ తిరుప్పావు వ్రతము సులభముగా ఆచరింపబదగినది. ఈ వ్రతమునకు ఫలము భగవత్సంశ్లేషము. ఈ వ్రత నిష్ఠలకు ఉపాయోపాయములు భగవత్కైంకర్య మనెడి ఫలము తప్పక లభించును. ఐహికములైన సంపదలు కూడ లభించును.

శ్రీవైష్ణవ దర్శనమున భక్తిజ్ఞాన వైరాగ్య సంపన్నులై, విశిష్టాద్వైత మతధర్మ విస్తారకులై, పరమేశ్వర భక్తిరస ప్రవాహ నిమగ్నులై తరించిన మహనీయులైన ఆళ్వారుల దివ్య ప్రబంధములు వేదవేదాంగముల వంటివి.

వీనిని "నాలాయిరము" లందురు. ఈ నాలాయిర దివ్య ప్రబంధములో తిరుప్పావై కూడ కలదు. తిరుక్కార్తిలో (అనధ్యయన దినములలో) దివ్య ప్రబంధముల ననుసంధింపరు. ఐనను, తిరుప్పావై ప్రబంధమున కట్టి నిషేదములేదు. ద్వయమంత్రము వలె సదానుసంధానయోగ్యమై యుండుటచే దీనికి గల విశిష్టత యెట్టిదో ద్యోతకము కాగలదు.

సకల జీవరాశులలో మానవుడు పరమ శ్రేష్ఠుడను విషయము నిర్వివాదమైనది. అట్టి మానవ జన్మయెన్నియో జన్మలలో జేసిన పుణ్యముల వలనగాని లభించునదికాదు. తదితర ప్రాణులకు లేని విలక్షణమైన శరీర నిర్మాణము, విశిష్టమేధా సంపత్తి, విచిత్రమైన బుద్ధి విశేషము మానవునకు మహోత్కృష్టత సమకూర్చినవి. దుర్లభమైన ఇట్టి జన్మమును విషయ లోలురై వ్యర్థముకానీయక వివేకముచేత ధన్యము చేసికొనవలసియున్నది. ఎన్నడును తరగని ఆనందమునందుకొనుటకు తగిన సాధనమును తెలిసికొని ఆచరించుటకు ఏర్పడినదీ మానవ జీవితము. కేవలము మానవుడే కాదు చీమ మొదలు బ్రహ్మ పర్యంతమును గల జీవరాసులన్నియు గూడ అట్టి ఆనందస్థితిని పొందవలయుననియే కోరుకొనును. కాని, వానికి దానిని గురించి ఆలోచించే యోగ్యతలేదు. భగవానుడే స్వయముగ తెలిపిన అట్టి ఆనంద ప్రాప్తిని, తత్సాధనములను, తెలిసికొను యోగ్యత గల మానవు లందరికిని స్వయముగ ఆచరించి చూపుట కొరకే శ్రీగోదామాత శ్రీవిష్ణుచిత్తులవారికి ముద్దుల పట్టిగ అవతరించినది. నిత్య జీవితమును కొనసాగించుచు, కోరిన ఫలముల నన్నింటిని అనుభవించుచు, నిత్య సుఖమును గూడనందు కొనవలయునంటే, దానినందించే భగవానుని ఉపాయముగ, సాధనముగ స్వీకరింపవలయుననియు, దానిని ఫలింపజేయువారు భగవద్భక్తులనియు, వారి వలన లభించు సదాచార్యులు, వారి వలన లభించుభగవన్మంత్రము, ఆ మంత్రముచే మనస్సులను ప్రభావితముచేయుచు, ఇహ పరములరెంటి యందును గూడసుఖాను భవముల నియ్యజాలిన శ్రీ దివ్యమంగళ విగ్రహమును దాల్చిన అర్చామూర్తియే అను విషయమును శ్రీ ఆండాళు తల్లినెలదినములలో ధనుర్మాస వ్రతముగ తాను ఆచరించి, సరళమనోజ్ఞమైన సులభశైలిలో ప్రపన్నులకు అనుగ్రహించిన సర్వ వేదాంత సారమైన తమిళ ప్రబంధము తిరుప్పావై.

తిరుప్పావై అనగా వ్రతము లేక నోము అని అర్థము. గోదామాత సుభాషితములు గలది తిరుప్పావై. ఇందలి పాశురములు ముప్పది. తిరుప్పావై ప్రబంధము ద్రావిడ వేదమునందు గల ప్రథమ సహస్రమున ఆరవ శతకముగా చేర్చబడినది. ఇది ఆమె మహోన్నత స్థితికి నిదర్శనము

ఈ పాశురములను చదివిన వారికి శ్రీ ఆండాళుతల్లి భక్తి ప్రపత్తుల స్వరూప స్వభావము లెంతయుదాత్తములైనవో తెలియును. పాశురమనగా పాటయని అర్థము. అది తెలుగున పద్యము వలెనుండి, శ్రావ్యముగా పాడుటకు అనువుగా నుండును ఈ వ్రతమును ఆచరించుటకు అందరికిని అధికారమున్నది. కేవలము ఆచరించవలయునను కోరిక మాత్రముండినను చాలును, ఆచరించిన సర్వ ఫలములను అందించునది ఈ వ్రతము.

ఈ వ్రతము ప్రతిసంవత్సరము సూర్యుడు ధనుస్సులో ప్రవేశించుటతో ప్రారంభింపబడి, సూర్యుడు మకరరాశిలో ప్రవేశించుటతో పరిసమాప్త మగును. తిరుపదమును సంస్కృతమున “శ్రీ” అని వ్యవహరింతురు. అందుచేత నీ తిరుప్పావై వ్రతమునకు గోదావ్రతము, ధనుర్మాస వ్రతము, శ్రీ వ్రతము అను పర్యాయనామములు కూడ ఏర్పడినవి. విశిష్టాద్వైత సంప్రదాయములో తిరుప్పావై ప్రబంధమునకు మహోన్నత స్థానము కలదు. తల్లిదండ్రులీమెకు పెట్టిన పేరు “కోదై” కోదై అనగా “పూలదండ” అని అర్థము. ఈ కోదై అను తమిళ పదము తెలుగులో గోదాదేవిగా మారినది. శ్రీ విష్ణు చిత్తులవారు వటపత్రశాయి అయిన శ్రీ మహావిష్ణువునకు ప్రతి నిత్యము సమర్పించు తోమాలలను ముందుగా ఈమె ధరించి, తరువాత వానిని మన్నారు స్వామికి యిచ్చి, భగవంతుని యెడ తనకు గల మధుర భక్తిని వెల్లడించుచుండినందు వలన నామె ద్రావిడమున “చూడికొడుత్తాళ్” - అను ప్రసిద్ధినొందినది. శూడిక్కొడుత్తె అనగా తాను ముడిచి విడచిన పుష్పమాలలను వటపత్రశాయికి ఇచ్చినది అని యర్థము. అదే అర్థమును స్ఫురింపజేయు సంస్కృత భాషానామము - “ఆముక్తమాల్యద” అని.

సహజసిద్ధమైన తులసీదళములకు పరిమళము అబ్బినట్లే ఈమెకు భక్తి జ్ఞాన వైరాగ్యములు క్రమముగా అలవడినవి. ఇందుకు తండ్రి గారి ప్రవచనములు, జ్ఞానబోధ ప్రధానకారణములు. శ్రీ గోదామాత ఆనతిచ్చిన తిరుప్పావై ప్రబంధమునకు తెలుగుసేత వివరణములే ఈ శ్రీవ్రతము. ఇది

అపూర్వమైన కావ్యము ఇంతటి పరిపూర్ణమైన, సమగ్రమైన ప్రబంధమింతకుముందు వెలువడలేదు శ్రీ ఆండాళు తల్లి తిరుప్పావు ప్రబంధము ద్వారా అమృతత్వమును, శాశతత్త్వమును మనకు అందించినది గదా? అందులో లేనివి ఏవి? అన్నియు నున్నవి దివ్యత్వసిద్ధికి అవసరమైన విద్య తిరుప్పావైలో ఉన్నది యోగ సాధనలో అన్ని స్థాయిలలో కలిగే అనుభూతులు, అడుగడుగునను ఎదురయ్యే సమస్యలు గ్రంథస్థము చేయుట జరిగినది అన్ని యోగముల సారము ఈ కావ్యములో అక్షర రూపము ధరించినది ఇందులోని ప్రతిపాశురమును చిత్తశుద్ధితో చదివినప్పడు ప్రతిపాఠకుడు యోగి అయి, అది మానస జగత్తులో ప్రవేశించుట జరుగును మనిషి చదువు వలన పొందలేని "ఆత్మవిద్య" ఇది. లయాన్వితముగా చదువుచున్నప్పడు తన్మయస్థితిలో ఓంకార నాదాలు చెవులలో ప్రతిధ్వనించును.

శ్రీ ఆండాళు తల్లి మనకొరకు, మానవకళ్యాణము కొరకు ఒక సుగమమైన మార్గమును ఏర్పరచినది. ఆ మహాయోగిని పొందిన మహత్తర పరిణామమే తిరుప్పావై. ఆమె యోగఫలమే తిరుప్పావై అవతరణము కథా వస్తువు అమరమైనది. శాశ్వతమైనది. వ్రాసిన తీరు విశిష్టమైనది. ఇది గోదామాత మానవాళికి అనుగ్రహించిన అమృత ఫలము! వేద విజ్ఞానము. ఉపనిషత్ జ్ఞానము యావత్తు తిరుప్పావై కావ్యములో నిక్షేపించినది గోదామాత కవిత్వమును అనువదించుట కత్తి మీది సాము. ప్రత్యేకించి ఆయనువాదకుడు కేవలము కవియే కాకుండ, గోదామాతవలె ద్రష్ట అయినప్పడు ఈ పని మరింత క్లిష్టము, ఇంచుమించు అసాధ్యము కూడ. సాధారణముగా కవిత్వము" అను వాదమునకు అందని వాక్కు" అని అందురు ఏలనన? భాషాంతరీ కరణము నిర్మాణ కౌశలముతో ఒప్పారు చిత్రలేకనము వంటిది. భాషలోని జాతీయరీతులను పాటించు రసోచితములైన మాటలతో కూడిన భావ ప్రకటనయే భాషాంతరీ కరణమునకు ప్రాణము మూలములోనున్న సొగసులు, సూక్ష్మమైన శబ్దార్థవైచిత్రులు, మౌళికమైన లయ, అపూర్వమైన శయ్యే మొదలగు వానిని అనువాదములో ప్రతిబింబింపజేయుట దాదాపు అసాధ్యమే కాక, శుష్కమైన పరిశ్రమ అనికూడ కొందరి మతము. పాఠకుల సౌలభ్యము కొరకు

వీలైనంతవరకు అనువాదములో యీ విషయములపై శ్రద్ధతీసికొనుటయు, భాషను సరళ వ్యవహారములోనికి మార్పు చేయుటయు జరిగినది. విషయములో కించిత్తు మార్పులేదు.

తరతమ భేదములేకుండ ఈ వ్రతమును ఎవరు ఏయే కోరికలతో ఆచరింతురో, ఆయా కోరికలు వారికి తప్పక లభించును స్త్రీలకు వివాహము, సంతానము, సౌభాగ్యము, ఆరోగ్యము మొదలగు మనోరథములను ఫలింపజేయును. ఇంతటి మహోత్కృష్టమైన శ్రీ వ్రతమును ఆచరించి ఇహ, పర సుఖములను పొందుటకు మానవుల ప్రయత్నింపవలసిన అవసరము ఎంతైనను కలదు శ్రీ ఆండాళు తల్లి కృపాకటాక్ష వీక్షణములను పొందుటకు శ్రీ వ్రతము ముఖ్యసాధనము. అనుటలో నెంతమాత్రము సంశయము లేదు. ఐహికాముష్మిక సుఖ సంపదలనభిలషించు ప్రతి భక్తునకును తప్పక అనుసంధింపవలసిదియు, అనుష్ఠింపవలసినదియునై యున్నది ఈ తిరుప్పావై దివ్య ప్రబంధము. ఇంకను విపులముగ నీ ప్రబంధమును గూర్చి చెప్పవచ్చును. కాని, విస్తరభీతిచే మానుకొంటిని.

ఇట్టి మహత్తరమైన ప్రబంధమును అందరు నంతగా ఆదరింపక పోవుటకుగారణము శ్రీ గోదామాత వైభవమును, ఆ ప్రబంధమున తెలుపబడిన చేతన ప్రధాన కర్తవ్యములును తెలియక పోవుటయే. తెలిసినచో అనుసంధానానుష్ఠానముల నందరును ఆదరించి, ఆచరింతురను నమ్మకముతో ప్రతిపదార్థ తాత్పర్యములతో ఆవెంన్తుతిని, తెలువు విశేషములన్నింటిని చేర్చి యీ యనువాదము రచియింపబడినది.

అంతేకాదు - శ్రీ ఆండాళు తల్లిని గురించియు, ఆమె దివ్య ప్రబంధమును గురించియు, ఆమె ఆచరించిన ధనుర్మాస వ్రతానుష్ఠానమును గురించియు, ఆమె కళ్యాణమును గురించియు నెరుగవలసినట్టియు, అనుష్ఠించవలసినట్టియునగు విషయములు సమస్తమును అందరు నెరుగునట్లు సులభ ఆంధ్ర భాషలో వ్రాయుట జరిగినది. ఐహికాముష్మిక సుఖోత్తర జీవితమును గడవదలచిన వారు ఈయనువాదమును పరిశీలించి, యనుష్ఠించి, ఆదరింతురని ఆశించుచున్నాను.

## నివేదనము

నాలుగు అక్షరములు ఒంటబట్టు శరీరము నిచ్చి, నాయోగ క్షేమములే వారి భోగభాగ్యములుగా జీవించి, వయోధర్మమును బట్టి మరణమును పొంది, దివినుండి కూడ నిత్యము నన్ను ఆశీర్వదించి, అభయమును ప్రసాదించు బ్రహ్మశ్రీ వేదమూర్తులు, నా తండ్రిగారును అయిన డాక్టరు యస్. శేషాచార్యులవారి దివ్య పాదపద్మములకు అనంత ప్రణామములు.

నావిద్యా జీవితమునకు సార్థకత చేకూర్చినన్ను యెప్పుడు పుత్రికా వాత్సల్యముతో చూచుకొనుచున్న నా పెద్దచిననాన్న శ్రీ వి. యల్. నారాయణన్ (అరకోణం) దంపతులకు శాశ్వత సాష్టాంగ ప్రణతులు.

నాకు ఆ జీవన విద్యాభిక్ష ప్రదాత గురుతుల్యులు నా చినచిననాన్న గారైన డాక్టరు యస్. రామాచార్యుల (పలమనేరు) వారికి శతాధిక వందనములు.

నాలో రచనా జిజ్ఞాసను రగిల్చి, వెన్నుతట్టి కార్యోన్ముఖురాలినిగా జేసిన మాశ్రీవారు పాగొండ రామాచార్యుల వారికి హృదయపూర్వక నమస్సుల నావిష్కరించుచున్నాను.

వ్రాతప్రతిని చూచి మార్పులు, చేర్పులు ఏమైననున్న యెడల సవరింప ప్రార్థించినతోడనే ఏలాంటి తడవొనరింపక దయతో శ్రమకోర్చి, చదివి, మెరుగులు దిద్దియంపిన మా పిన తల్లులు శ్రీ యస్ రమాదేవి శ్రీ యస్. లక్ష్మిదేవి ద్వయమునకు నా హృదయ పూర్వక కృతజ్ఞతల నావిష్క రించుచున్నాను.

తొలినుండి నాయీ ప్రయత్నములో అనేక విధములుగా సహకరించి, నాయభివృద్ధిని ఆకాంక్షించిన కళాతపస్విని మా మాతృమూర్తి శ్రీ యన్. రుక్మిణీ దేవమ్మకు కృతజ్ఞతాంజలులు. వీరిమేలేనాటికిని మఱవజాలను.

ఎందుకో ఈ కావ్యరచనా సంకల్పము కలిగినది. మా అత్తగారైన వేదవల్లి తాయారమ్మ వ్రాయుచున్న నా కావ్యము కొలది విని ఉత్సాహ శక్తినిచ్చిన తేజోమూర్తులు. సర్వశక్తియగు శ్రీ వేంకటరమణుడు ఆమెకు చక్కని ఆరోగ్యము నిచ్చి యింకను కొంతకాలము జీవించునట్లు అనుగ్రహింపమని వినీత హృదయముతో ప్రార్థించుచున్నాను.

ఈ మహత్కార్యమున నన్ను నియోగించి కృతార్థురాలను జేసిన

ఆత్మీయసఖి, సహోద్యోగిని అయిన శ్రీమతి సుగుణమ్మకు ఆశీస్సులు అర్పించుకొనుచున్నాను. ఆమెకు, ఆమె కుటుంబము వారికి వారి యిలవేల్పు, సర్వేశ్వరుడునైన శ్రీ తిరుమలేశుడు ఆయురారోగ్య భోగభాగ్యములు సిద్ధింపజేసి సర్వదా రక్షించుగాక!

సాహిత్యాభిలాషినిగా తనకుగల ఆసక్తితో నాయీ భాషాంతరీ కరణమునకు తనవంతు ప్రోత్సాహ సహకారముల నందించిన నా (పెద్ద) కోడలు చి.సౌ. కుం. వరలక్ష్మికి నా హార్దికాశీస్సులు

నా యీ కావ్యమునకు స్పష్టమైన, సరళమైన, సమగ్ర ఆకృతినిచ్చుటకు సహకరించిన నా పెద్ద కుమారుడు చిరంజీవి చందునకు అనంతాశీస్సులు.

చెప్పచుండగా తనకు గల సహజ ఆసక్తితో ఈ కావ్యమును చిత్ర లేఖనము వలె మనోజ్ఞముగా వ్రాసి ముద్రణకు సిద్ధపరచిన నా చిన్న కుమారుడు చిరంజీవి పాగొండ రమేష్‌బాబును నిండు మనస్సుతో ఆశీర్వదించుచున్నాను. ఇట్టి అవ్యాజ కరుణాలవులకు, మహోపకారులకు, ఇంగితజ్ఞులకు, సుహృదయులకు శతానేక కృతజ్ఞతలాచరించుచున్నాను.

పుణ్య శ్లోకుల పుణ్య చరిత్రలను లోకమునకు తెలుపుకొని, జన్మ చరితార్థముగావించుకొనుట సత్కర్మలలో సర్వోత్తమ ధర్మమని భావించి, శ్రీ గోదామాత ప్రణీతమైన తిరుప్పావై ప్రబంధమును భాషాంతరీకరింప బూనుకొంటిని. కాని, అందుకు మనస్సు వెనుకంజ వేసినది. వేయకపోయినా నేను చేయునదేమున్నది? నాకున్న ఛందో జ్ఞానము పరిమితము. ఆయుత్కృష్ట గ్రంథమును అనువదించుటకు నాకు శక్తిచాలదు. "ప్రాంసులభ్యే ఫలేలోభాత్ ఉద్బాహురివ వామనః" - పొడుగు చేతులు గల వాడు పొందదగిన పండుకై వామనుడు తనకుఱుచ చేతులను చాచినట్లుగా నా ప్రయత్న మంతయు పరిహాసభాజనమగును గదా!

ఆ ప్రయత్నమును మానుకొని నాకు పరిచితులైన కొందరు విజ్ఞులను తిరుప్పావై ప్రబంధమును అనువదించుటలో సహాయమును గోరితిని. వారు మూల గ్రంథమును కొంతవరకు పరిశీలించి, పెరియాళ్వారు, నమ్మాళ్వారుల కవితలకెంతయు తీసిపోని కవితయిది. ఆంధ్ర, ద్రావిడ భాషామతల్లులకు ఒక అనిర్వచనీయ, అపూర్వ ఆభరణమని దాని అంచులకు కూడ రావెరసిరి కాని, మానవ ప్రయత్నమునకుతోడుగ, నావెన్నంటియున్న ఆపదోద్ధారకుడు

## నివేదనము

ఆ శ్రీ వేంకటరమణ స్వామి కరుణించి, గ్రంథానువాద కార్యమునకై తటస్థించిన లోపమును పూరణార్థమై, ఆ కావ్య సృజనాత్మక యజ్ఞమున ప్రధాన భూమిక నిర్వహించుటకై నా మూడవ పినతండ్రి గారైన శ్రీమాన్ యస్ అనంతాచార్యులవారిని నా యింట సముఖముగావించెను. వారు నా ప్రయత్నమును సహృదయముతో విని, మన్నించి, ఆదరించి, దాని భారము తమపై వేయుమని అభయమిచ్చిరి. "పరోపకారాయ సతాంవి భూతయః" - అన్నట్లుగా తదాదిగా, అయాచితముగనే ఆకార్య భారమంతటిని తమ భుజస్కంధములవహించి కావ్యమును హృష్టపుష్ట సర్వాంగసుందరము గావించి, నా మనస్సున కానందమొనగూర్చిరి. ఆంధ్రలోకమునకు కావ్య సంతతిని గూడ ప్రసాదించిన ఆ నా మూడవ పినతండ్రి గారికి ఆజన్మాంతము ఋణపడితిని. ఏ కార్యమును చేపట్టినను, అది పూర్తియగు వరకు నిద్రించని కార్యదీక్షాపరుడు ఆతడు! నిరంతర కార్యాచరణదక్షులయిన ఆతడు పంచవింశత్యధిక కావ్యకర్త. వారి కృతులలో శ్రీరాధా మాధవీయము, శ్రీనివాససుప్రభాతము, శ్రీరామశతకము, కరావలంబన స్తోత్రము, యోగ విద్యాప్రకాశిక, లోకములు - లోకాంతరములు తద్యాత్ర, జీవ విద్యారహస్యము మొదలగునవి సుప్రసిద్ధములు. ఆంధ్రలోకము పవిత్ర "కవి కిశోర" యను బిరుదముతో వారిని సత్కరించినది. వారు నిష్కామ కర్మోపాసకులు. ఈ తిరుప్పావై ప్రబంధ భాషాంతరీ కరణమునకై వారొసంగిన తోడ్పాటే యిందుకు ప్రబలతార్కాణము. అది యిట్టిదని చెప్పదలచిన దానిని కించపరచిన దాననగుదును. వారికి యితోధికఆయుర్వృద్ధి ప్రసాదించుమని బ్రహ్మాండపతి, శేషపర్వతాధ్యక్షుడు, శ్రీ కళాపూజ్యుడునైన వేంకటరమణుని మనసాస్మరించుచున్నాను. కలియుగ ప్రత్యక్షదైవమగు శ్రీ శ్రీనివాసుడు యుగపురుషుడై తనను సేవించు భక్త జనులు కొండలంత కోర్కెలను దీర్ప, వడ్డికాసులవాడై, తానార్జించిన ధనరాసులను, సఫలత నాపాదించుటకై విద్య, వైద్య సంస్థలకు, కల్యాణ మండప నిర్మాణాది సమాజ శ్రేయోదాయ కార్యక్రమములకు, లలిత కళాపోషణకు, అనేక ప్రాచీన, మహనీయ అపూర్వ గ్రంథముద్రణకు ఉదారముగా తన ప్రతినిధిగా ఆర్థిక సహాయమందించు తిరుపతి తిరుమల దేవస్థానముల నిర్వహణాధికారి యగు మాన్యశ్రీ పి. క్రిష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారికి, పాలక మండలసభ్యులకు నాకృతజ్ఞతా పూర్వక

నతులనర్పించు కొనుచున్నాను. సప్తగిరి పత్రికా ప్రధాన సంపాదకులగు పూజ్యశ్రీ ఎన్.ఎస్. రామమూర్తి, ఎమ్.ఎ., గారు వారిచ్చిన అమూల్య సహాయమునకు అనేక అభివందనలు

ఈ తిరుప్పావై ప్రబంధానువాదము రూపురేఖలు దీర్చుకొనుటకు నాకు అమూల్యమైన సూచనలిచ్చి, సహాయసంపదలందించిన (తోడ్పడిన) సఖీ జనమునకు, పండితులకు, ఆప్తులకు, బంధువులకు కృతజ్ఞతాపూర్వక సమస్సుమాంజలులు.

అడిగిన వెంటనే తనకెన్ని పనులున్న మాని "అభినందన" వ్రాసి యిచ్చిన ఆచార్య కె. సర్వోత్తమరావు, విశ్రాంత ఆంధ్రఆచార్యులు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి వారికి కృతజ్ఞతాభివందనములను తెలియజేసి కొనుచున్నాము.

ఈ శ్రీవ్రత మహా ప్రబంధానువాదమును సర్వాంగ సుందరముగ లోకమునకు సమర్పించుటలో ఆలస్యమునకు తావీయక, అర్థమే ప్రధానమని భావించక తమముద్రణాలయమున భక్తి శ్రద్ధలలో అనతికాలమున ముద్రింపజేసిన శ్రీ శ్రీనివాస డిజిటల్ గ్రాఫిక్స్ అధినేత కె. శ్రీనివాసులు నాయుడు గారికి, వారి సిబ్బందికి నాశుభాభినందనలు.

వీరందరూ శ్రీ దేవతా సార్వభౌముడును, ఎల్లప్పడు నన్ను చల్లగా చూచుచున్న వాడును అయిన శ్రీ మత్తిరుమల తిరుపతి వేకంటేశ్వర స్వామి కృపాకటాక్షములతో చిరాయు స్సంపదలతో వర్ధిల్లునట్లు అను గ్రహింప శ్రీరంగ విహారమూర్తి శ్రీరంగనాథ పరబ్రహ్మమును ప్రార్థించుచున్నాను.
"జయంతితే సుకృతి రససిద్ధాః కవీశ్వరాః"

శ్రీనివాసోభిరక్షతు
46/బి వినాయక నగరం,
తిరుపతి-1

బుధజన విధేయ,
శ్రీనివాసపురము జ్యోతీకుమారి
(జ్యోతిశ్రీ)

నివేదనము

**ఆచార్య కె. సర్వోత్తమ రావు**
విశ్రాంత ఆంధ్ర ఆచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

తిరుపతి
4-6-2002

# అభినందన

'భక్తి ద్రావిడ ఉపజీలాయే అన్నారు పెద్దలు ద్రావిడ దేశంలో భక్తి మతం పుట్టిందని పై వాక్యానికి అర్థం. ఆళ్వార్లు, నాయనార్లు ఈ భక్తి మతాన్ని ప్రచారం చేసిన వారిలో ప్రముఖులు. వీరే నిజమయిన సామాజిక కవులు.... సంఘ సంస్కరణను భక్తిమార్గంలో నడిపించిన ఘనులు.

తెలుగులో ఆళ్వారుల సాహిత్యం చాలా తక్కువ. తెలుగువారికి తొండరడిప్పొడి ఆళ్వారు తిరుమంగై ఆళ్వారులు నచ్చినవారు. అందుకే ఆయా ఆళ్వారుల చరిత్రలపై ఎన్నో గ్రంథాలు వచ్చాయి. రాయలు ఆముక్తమాల్యదలో పెరియాళ్వారును, గోదాదేవిని పరిచయం చేసిన మహాకవి. చెదరు మదురుగా ఆచార్య సూక్తిముక్తావళి పరమయోగి విలాసం లాంటివి లేకపోలేదు. ఇటీవల 'ఆండాళుకు' సంబంధించిన రచనలు ఎక్కువ వెలువడుతున్నాయి. కారణాలు రెండు - ఒకటి వైష్ణవాభిమానం. రెండవది కార్య వైశిష్ట్యం.

తమిళంలో 'పావై' సాహిత్యముంది. వాటిలో తిరుప్పావై. తిరువెంబావై చాలా ప్రసిద్ధి పొందిన రచనలు. ఈ రెండు రచనలుకు ఖండ ఖండాతర వ్యాప్తి ఉంది. ఇవి ధనుర్మాస వ్రతాలకు సంబంధించినవి స్త్రీలకు సంబంధించినవి మొదటిది 'గోదా' రచితం రెండవది మాణిక్యవాచకర రచించింది. స్త్రీలకు సంబంధించిన వాఙ్మయాన్ని స్త్రీలే వ్రాయడంలో ప్రత్యేకత ఉంది. 'తిరుప్పావై అలాంటిదే'

తెలుగులో 'తిరుప్పావై' అనువాదాలు చాలా వచ్చాయి. దేవులపల్లి, కోవెల సంపతుమాచారుల అనువాదాలు బాగా ప్రసిద్ధి పొందాయి. అనువాదాల కంటే మూల గ్రంథ పఠనం వల్ల విశేషాలు తెలుస్తాయి. మరి వ్యాక్యానం ఉంటే ఆ గ్రంథ పఠనం వల్ల కలశ ఫలితం. 'ఇబ్బడి ముబ్బడి' అనడంలో సందేహం లేదు.

# నివేదనము

ప్రస్తుత గ్రంథం 'శ్రీ వ్రతం' తిరుప్పావై అనువదించినవారు రకరకాలుగా మేలునోము. ఆముక్త లాంటి పేర్లతో తమ రచనల్ని అనువదించారు. మా ఈ గ్రంథనామం అందంగా ఉంది. అశ్వర్థంగా కూడా ఉంది

శ్రీమతి జ్యోతికుమారికి వైష్ణవ పరిచయం ఉంది వైష్ణవ వాజ్మయ పరిశీలన ఉంది. వైష్ణవులతో సహజసపరిచయం ఉంది పై పెచ్చు వైష్ణవాభిమానం ఉంది ఇవన్నీ రచనలో పూచాయి. పరిమళించాయి. అనుభూతి వాసనలకు నలువైపుల వెదజల్లుతున్నాయి. పవిత్రగ్రంథానికి చేసే వ్యాఖ్యానాం కూడా పవిత్రమే.

తమిళ గ్రంథములుగా తెలుగు తనం నిలపడం జ్యోతికుమారి ప్రత్యేకత. ఈ గ్రంథం బాగా ప్రచారం కావాలని ఆకాంక్ష

కె సర్వోత్తమరావు

# నివేదనము

# ప్రార్థనాధికము

"జ్యోతిశ్రీ"

శ్రీకారుణ్య కటాక్ష వీక్షణ కళా
శృంగార కల్యాణ దీ
క్షైకారంభ జగద్విలాస మహిమా
నేకావతారప్రభా
స్తోకశ్రీలలనామణీహృదయ సం
స్తుత్యానుసంధానమున్
శ్రీ కైవల్య పదావలంబమును, బ్రా
ర్థింతున్ బరబ్రహ్మమున్

తల్లీ! నిన్ను దలంచి నెమ్మది గవి
త్వప్రౌఢి నుల్లాస మం
దుల్లం బొప్పగ వ్రాయ బూనితని శ
క్త్యోపాయనమ్మోచు రం
జిల్లం గావ్యము బ్రాజ్ఞులెల్లబరితో
షింపంగనేనిప్డు నీ
వల్లంబొందెద దీవనల్ గృపను శ్రీ
వాణీశ్వరీ! ఈశ్వరీ!

శ్రీమంతమ్ము, సమస్త భక్తజనతా
క్షేమప్రద, మ్మాశ్రిత
స్తోమానందపదమ్ము, వైదిక శిఖా
శుద్ధాంత సౌందర్య లీ
లామాంగల్య కళానుగమ్య, మలమే
ల్మంగాళ్ళ పద్మావతీ
శ్రీమద్వేంకట నాథ! పాదయుగళ
శ్రీమమ్ము రక్షించుతన్.

## గీర్వాణ కవి పురస్కృతి

సరస సంస్కృత వాఙ్మయ సాగరంబు
చిలికి కావ్యామృతమ్ము పంచిన విబుధుల
ఘనుల బ్రాచేత సవ్యాస కాళిదాస
దండి భవభూతి మాఘసత్కవుల దలతు

## ఆంధ్రకవి పురస్కృతి

నన్నయ్యను దిక్కననె
ర్రన్నను సోమన్న భాస్కరామాత్యుల భీ
మన్నను వేమన్నను లిం
గన్నను మదినాదరింతు కవితాశ్రీకిన్

శ్రీనాథ పెద్దనార్యుల
బూనిక మరితిమ్మనాది ముఖ్యకవుల స
మ్మానిత కవితాశక్తి
జ్ఞానధురీణుల దలంతు జ్ఞానశ్రీకిన్.

భక్తిగల్మోడ్చి నుతియింతు పరమపుణ్యు
నార్య జనపూజ్యు భాగవతాగ్రగణ్యు
గలుషదూరుని దత్త్వజ్ఞగవి శరణ్యు
భూరిశాంతుని బమ్మెర పోతనార్యు!

## కవయిత్రి జననీ జనకులు

జన్మనిచ్చిన రుక్మిణీ జనని దలిచి,
అలఘు శ్రీ శేషవర్యుని నాత్మజనకు
చిన్మయాకృతి సద్భక్తి మన్మనోబ్జ
భద్రపీఠస్థితుని జేసి, ప్రస్తుతింతు.

# మెట్టిన గ్రామప్రసక్తి

ఆంధ్రదేశంబునందు శోభాస్పదంబు,
చిత్తూరీ మండలం బందు శ్రీలుచిందు
పుంగనూరను పురమొండు పొసగుమహిత
పుణ్య నిలయంబు సాధుసంపూజితంబు

వేదశాస్త్ర పురాణ విద్యావిధులయందు
బ్రహ్మనైనను గెల్చు బ్రాహ్మణులును,
ధైర్యగాంభీర్య చాతుర్య జయంబుల
సవ్యసాచిని మించు క్షత్రియులును,
ధనసముపార్జన ధనదుని మెచ్చక
ప్రఖ్యాతిగాంచిన వైశ్యవరులు,
హలమును చేపట్టి హర్షవిస్ఫూర్తిని
హలినైన మెచ్చని హాలికులును,

దైవగురు జన భక్తుల దప్పకెరిగి
మాతృపితరుల సేవలు మాననట్టి
మోక్షవిజ్ఞాన సాధనా దక్షులైన
జనులచే నొప్పునాపురి శౌరికృపను.

వ. ఆ పుంగనూరు పట్టణంబునకు నడిమి ప్రదేశంబున జ్వాలాముఖి యను నదికిం దూరుపుదిశగ పంచదశ క్రోశ మాత్రదూరంబున సోమల యనెడి పల్లెసీమ యొకండు కలదు. అది యుదయభాను మనోజ్ఞ మయూఖ కాంతులతో ఫుల్లసువర్ణ పద్మమటుల గానుపించుచు జనులకు గనువిందు సేయుచుండును. వివేకవంతులును, విద్యావంతులును అను తెంగలశాఖ శ్రీ వైష్ణవ బ్రాహ్మణుల కాగ్రామము నివాసస్థలము. ఆ గ్రామమందు సత్పురుషులకు బ్రసిద్ధమైన దళవాయి వంశనామకపాగొండ యనెడి వంశము కలదు. ఆ వంశమందు జన్మించినవారు భాగ్య విశేషములతో నొప్పచు గొప్ప సిరిసంపదలతో వెలయు యక్షరాజైన గుబేరుని

సైతము సరకుసేయరు. సోమల గ్రామము నలువలంకుల పాదపంబు లందున్న శుకపికముల కలకల ధ్వనులు- “వానకాలము కొరకు మిగిలిన ఋతువులందును, రాత్రికొరకు బగలును, ముసలితనము కొరకు బ్రాయముననను, బరమునకై యిహమునందును బాటుపడవలయును” అనెడి సుభాషితమును దలపునకు దెచ్చుచు నీనులకు విందొనర్చు చుండును మరియును

ప్రకృతి సంసిద్ధసరః ప్రాంత రమణీయ
వాహినీ పర్వత భాసితంబు,
ఫలపుష్పమూలికాభర జీవనౌషధీ
తరులతాగుల్మ సంతానకంబు,
నిత్యనవ్యాంకూర నిర్ఝరనైక స
స్యశ్రీ కరాకార చారుభూమి,
ప్రణయ గీతాలాపవరశారికా కీర
కలకంఠకుల వధూకలకలంబు,

అవ్యయానంద సుఖముల కాటపట్టు,
కాపుకొలముల పాలిబంగారు గట్టు,
కల్లగారడి విద్దెల కన్నుగట్టు,
పరులెరుంగని గుట్టు ఆ పల్లెపట్టు.

ఆయత సౌఖ్య జీవనము
హాయిగజేయగ దూరవాసు లా
ప్యాయత చేరవచ్చెదరు
పల్లెలో మామది కోరినట్టి ప
సాయము నైనజేసెదరు
సజ్జను లాదరవృత్తియంచు నీ
రాయలసీమలో నిదియె
రమ్యతరంబని యూహసేయుచున్

వ. శ్రీమంతమగు పాగొండవంశమను పాల్కడలికి కల్పవృక్షమును శ్రీ సరస్వతీ లక్ష్ముల విలాసములకు నంగడి వీథియు, విద్యయనెడి వనమునకు కోయిలయు, విద్వాంసులనెడి తామరలను వికసింపజేయుటలో దయచే

జిల్లని సూర్యుడును, సజ్జనత్వమను నమృతమునకు నిధియు, నుత్తములును హితములునగు గుణములకు బ్రోవును, శ్రీ తెంగలశాఖ శ్రీ వైష్ణవ బ్రాహ్మణ వంశమునకు ప్రదీపమును, సత్సంప్రదాయ మర్మజ్ఞుడును, సనాతన ధర్మ పరాయణుడును, పరమ భాగవతోత్తముడును, వేదాంతాది విద్యల పారంగతుడును, బహుజన్మ సుకృత పరిపాకమువలననగాని లబ్ధముగాని దైవభక్తిగలిగి, భగవత్పరిచర్యయే పరమపురుషార్థమని యెంచి, ప్రత్యహమును భగవత్పూజాదికము లాచరించుచుండువాడును, అయిన యొక పండితోత్తము డుండెడువాడు. ఆతడు

శ్రీ భరద్వాజ గోత్రుడు ప్రథితయశుడు,
శ్రీ దళదవాయి వంశాబ్ధి శీతకరుడు,
అఖిల విభవ సమంచితుడనఘుడసమ
రమ్యగుణశీలి శ్రీరామరాయమౌళి.

సోమల గ్రామమందున యశోవిభవాఢ్యుడు, శీలవంతుడ
త్యామల శాంతికాముడును, దాతయు, నొజ్జయు, నిర్మలాంగుడున్,
శ్యామల దేహు, డుజ్జ్వల ప్రజాహిత కార్యదురంధరుండు, నౌ
రామయనామ కాఖ్యబుధు డాశ్రిత వత్సలు నెన్నశక్యమే!

వ. మరియు నెల్లప్పడు తెంపులేని కార్యములయందు మునిగియు సజ్జన సంగతిచే సంతుష్టాంతరంగుడై నిర్మలమైన నీతిచే గంభీరుడై సమస్త న్యాయతంత్రముల యందు నేర్పరియై వెలయుచు సారవంతములగు సరసవచనములచే సజ్జన సముదాయమును రంజిల్ల జేయుచుండెడివారు. ఆతని త్యాగలీలతో విద్వాంసులను, కవీంద్రులను సంతోషపరచుటచే వారిపేరు సార్థకమైనది. అంతియగాక, విశాలమైన ప్రాపంచిక దృష్టిగలవాడై సమస్తమగు లోకవృత్తమును జక్కగ నాలోచించుచు శాంతి సౌజన్యములకు నెలవైన తన జీవితమును నియమబద్ధముగ గడుపుచుండువాడు. సాటిలేని నీతిశీలుడును, భయము మమకారములేనివాడై వాడిమిగల తన మేధాశక్తి చేతను, ప్రతిజ్ఞచే తను వెలయుచు నిత్యసంతోషుడై ప్రపంచములోని వాస్తవిక తత్త్వములను చెప్పచుండువాడు. వీరి స్వభావము మిక్కిలి పవిత్రము మనోహరము.

ఎదుట నున్నట్టి దైవమే యితడటంచు,
ముంచుకొని వచ్చు నిజభక్తి మూర్తిగొనగ

పల్లె ప్రజలెల్ల గొలువంగవరలు నతడు
ప్రజలసేమమే యతనికి పరమపదము.

మహిత భారద్వాజ సగోత్రమండ నుండె
వడు, యజుశ్శాఖ పెద్దవంగడము వాడు
పరగము ప్రొద్దునర్ఘ్యంబు వదలునతడు
రామయాభిధేయుండతి రమ్యగుణుడు.

అతనికిర్వురు పుత్త్రకులందుజిన్ని
సుతుడు రామానుజాఖ్యు విశుద్ధచరితు
డనుచు లోకులు వొగడుదు రతడునాకు
మామ సతతమాతని నేనుమదిదలంతు.

అన్ని మతముల కనుకూలుడైనవాడు
గుణము బొడగన్న వరవుడననెడివాడు,
అన్నియున్న ననాసక్తుడైనవాడు
విమలవిజ్ఞాని నామామవేదరాశి.

వ. అదియునుంగాక మరియును సహృదయ సంఘములో సాటిలేని మనస్వి సరస బుద్ధులలో సారమును గ్రహించెడి గుణజ్ఞుడు. సముచిత సంప్రదాయములను తెలిసినవారిలో సాటిలేని నీతికోవిదుడు. సకల విషయములను తెలిసిన సత్యవచనులు. ఎంతటి కార్యప్రపంచము నందు మునిగియున్నను వారిలోని శాంతి కళతరుగునది కాదు.

అతడు లబ్ధప్రతిష్ఠుండు మతినిదనిసి
వరములిచ్చెనా? దప్పించువలతిలేడు;
అతని యడుగుల చెంతనాష్టాంగ మెరగి
వినుతులొనరింతు రెంతటి వేత్తలైన.

ఆ యజుశ్శాఖి తనకునర్ధాంగిగాగ
బరిణయంబయ్యె వేదమ్మ పరమసాధ్వి
సర్వలక్షణ సంపన్న చారుశీల
వేదవిహితాను సారమ్ము విబుధులెన్న.

శ్రీకి నిలయమ్మైన శ్రీ పరాంకుశవంశ
మందు పద్మనిలయమనగ బరగు
"వేదవల్లి" నాకు వేద విహితమైన
అత్తయగును దయగుణైకరాశి.

రామామణి నాశ్వశ్రువు
నామక శ్రీ వేదవల్లి నయమును గూర్పన్
నీమమ్మున నాశ్వశురుడు
సోమునివలె నిత్యవృద్ధి శోభిలె జగతిన్.

వ. పెక్కు పుణ్యములచే నా వేదవల్లి తాయారాంబ బహుపుణ్యశాలియగు శ్రీ పొగొండ రామానుజయ్యకు ద్వితీయ భార్యయైనది. విశాలహృదయుడగు నాతడామెపై బ్రీతి నెరపుచు సత్యశీలుడై పెక్కుధర్మము లాచరించెను. ఆ వేదవల్లి తాయారమ్మ ఆతనివలన మనోవాక్కాయోపేతమగు దైనందిన జీవనశీల సంపన్నుడును, అనసూయకుడునునైన శ్రీ పొగొండ రామాచార్యులను, ఆతనికి బహిఃప్రాణులనదగు అచ్యుత, శేషాద్రి, ఆనంద శేఖరులను నలుగురు కుమారులను, తర్వాత శీలమును మించిన చెలువు, చెలువును మించిన శీలముగల లక్ష్మీకాంతయను సుముఖిని, చివర కుటుంబములో దనకుగల స్థానమెరిగి, దానికనుగుణముగ వర్తించిన, వర్తించుచున్న, వర్తింపగల పుణ్యశీలయను సార్థక నామధేయురాలగు సుజాతను కనినది. వారు సౌజన్యము, సౌశీల్యము మొదలగు సుగుణములతో వెలయుచు లోకులచే తండ్రికి తగ్గ సంతానమని కొనియాడబడుచున్నారు. వీరిలో జ్యేష్ఠుడైన శ్రీ రామాచార్యులనువారు నా దక్షిణహస్తము. ఆతని వలన నాకు హేమచంద్రుడు, రమేష్ అను నిద్దరు పుత్రులు కలిగిరి.

ఇట్టి నాచేత ననూదితంబగు శ్రీ వ్రతమను ప్రబంధ సామ్రాజ్యమునకు మూర్ధాభిషిక్తుండును, తాపత్రయములను నాశనము జేయు వాడును, సచ్చిదానంద స్వరూపుడునునైన దివ్య నాయకుని ప్రభావం బెట్టిదనిన

అఘదైత్యుకడుపున నణగిన గోపబా
    లుర దెచ్చినట్టి నేర్పరి యెవండు?
యమపురిజేరిన యతివర్యుసాందీప
    గురుపుత్త్రు దెచ్చిన పరముడెవరు?

వరుణ పాశంబుల బడిన నందునిపున
ర్జీవితుం జేసిన దేవుడెవడు?
కార్చిచ్చు దరికొన్న కడుభీతులైన గో
పకులను గాచిన భవ్యుడెవరు?

అట్టి నరకాంతకుడను, కాళియఫణి భేది
కంసదమనుండు, భక్త సంకటహరుండు,
పతితపావను డిందిరా ప్రాణనాథు
నకు సమంబగు దైవమ్ము గానమెందు.

వ. అని పలికి నా పాలిటి శ్రీ కృష్ణమూర్తి దివ్య మంగళ విగ్రహంబును హృదయ కమలకర్ణిక మందారోపించి, యా దేవదేవునకు బ్రదక్షిణ పూర్వకంబుగా దండ ప్రణామంబాచరించి, నమస్కరించి, వినుతించి, మొదలంగృతి ముఖాలంకారంబుగా గృతి నాయకుని గురించి.

## షష్ఠ్యంతములు

శ్రీ మహిళా లోలునకున్
కామితదాయకున, కమిత కల్పకమునకున్,
శ్రీమద్వైకుంఠపురీ
థామునకున్, సకలలోక దైవతమునకున్.

దానవ మత్తకరడ్వం
చాననుకు, హలధరాను జన్మున, కజర
స్థానీ కృత నిఖిలజన
స్థానునకున్, మౌనిహృదయ సంస్థానునకున్.

వేలాతిక్రయ విక్రయ
శాలికి, నౌ దార్శ్య ధైర్య శాలికి, దేజో
హేళికి, నిగమాతిగ సం
వ్యాళికి, గుణనిధికి, సత్య వారాన్నిధికిన్.

కదనగతా సూక్తృత మురవదనునకు, గృహీత ధర్మ పరివేష్టునకున్,
సదయునకున్, విమలగుణా
స్పదున, కళిలలో కపాల సామ్రాజ్యునకున్.

వ. అనంతకోటి శిరస్సాష్టాంగ దండప్రణామ పురస్సరాంకిత కృతిగా

జ్వాలాముఖీతీర జగతి ప్రసిద్ధమౌ
పుంగనూరనియెడి పురము నందు,
వైష్ణవ బ్రాహ్మణ వంశవర్ధనుడైన
గురుశేషవర్మని కూరిమిసతి
శ్రీ రుక్మిణీ దేవి శ్రీ గర్భవాసంబు
నదొలి కూతురు నైజననము నొంది,
శ్రీరామచంద్ర పాదారవిందాభివం
దనలబ్ధ కవితా వితాన విభవ

జ్యోతినామాభి ధేయ విఖ్యాత చరిత
భవ్య గుణయుక్త అండాళు దివ్యగాథ
ఆంధ్రభాషను విరచింతునను విధాన
ఆంధ్రప్రజలకు ఉపయుక్త మౌనటంచు.

వ. ఒనర్చునట్టి సమస్త కలికల్మషాపనోదన పారీణంబును, వందారు సమస్తార్య బ్రాహ్మణ బృందారకృత సమస్త సత్పదవీ నిర్మాణంబును నయిన శ్రీ వ్రతంబను నాంధ్ర పద్య కావ్యరూపగ్రంథంబునకు గధా క్రమం బెట్టిదనిన

# అవతారిక

ఈ యతారికలో శ్రీవ్రతమను ప్రబంధమును లోకమునకు ప్రసాదించిన శ్రీ అండాళు తల్లియొక్క వైలక్షణ్యమును, ప్రబంధవైలక్షణ్యమును, కావ్య విషయ వైలక్షణ్యమును తెలియజేయబడుచున్నది.

దేహమే ఆత్మయను భావముకల సంసారులకును, ఆత్మ స్వరూపమును బహుచక్కగా తెలిసికొన్న ఋషులకును పర్వత పరమాణువుల యంత భేదము గలదు. ఆ ఋషులకును, శ్రీ పెరియాళ్వా

రులకును అంతటి భేదము కలదు. శ్రీ విష్ణు చిత్తుల వారికిని, శ్రీ ఆండాళు తల్లికిని అంతటి తారతమ్యము గలదు. వారికంటెను ఈమెకు గల భేదమేది యనగా -"అనాది యగు మాయచే తయోగుణ రూప నిద్రలో నుండువా' ' రన్నట్లు సంసారమున అజ్ఞాన రూపమగు నిద్రలో నుండునట్టి చేతనులను లేపి, సర్వేశ్వరుడే తాను స్వయముగ తనను చూపింపగా చూచి ఆనంద తన్మయులైనవారు ఆళ్వారులు. గోదామాత అట్లుగాక, తానే స్వయముగా వెళ్లి సర్వేశ్వరుని లేపి, తనకుగల కొరతను దెల్పినది కనుక, వారి కంటెను ఈమె విలక్షణురాలగుచున్నది. ఆళ్వారులకు దేవునిపై నుండు ప్రేమ కంటె గోదాదేవికి భగవంతుని పై నుండు ప్రేమ మధికార్తియుతము. నందాదుల కంటె కృష్ణప్రేమ గోపికల యందే యధికముగా భాసించెనని వేదవ్యాస మహర్షి కూడ శ్రీ మద్భాగవతమున వక్కాణించి యుండెను గదా? రంగేశలగ్న హృదయ యయిన శ్రీ ఆండాళు బాల్యము నుండియు భగవత్కళ్యాణ గుణముల యందే యెక్కువ ప్రీతి కలిగి, ఒక పురుషునిపై నింకొక పురుషునకు, స్త్రీ యందు స్త్రీకి, స్త్రీ యందు పురుషునకు కలుగు ప్రేమ మెరకు నుండి పల్లమునకు దిగునట్లు అప్రయత్నముగా సాగును. అది స్వాభావిక మగుట చేత శ్రీ ఆండాళు తల్లి సాయించిన తిరుప్పావు నందలి అభిప్రాయమే మనగా మార్గశిర మాసమున స్నానము చేయుట అనునొక వ్యాజమును నిమిత్తీకరించుకొని, "నోము" అను నొకనెపముతో, సర్వేశ్వరుని సన్నిధానమునకు బోయి, నీకు శేష భూతమగు ఆత్మవస్తువును అనర్థమున పడకుండజేసి, దీనికి స్వరూపానురూపమగు కైంకర్యముల నొసిగి, అవి కూడనీ యాత్మ యుండునంత వరకు నుండునట్ల ననుగ్రహింపుము అని ప్రార్థించుట చేత నీమెకీ యౌన్నత్యము సిద్ధించి దనియందురు.

ఇదియునుగాక అధ్యయనపరులీ విధముగా కూడజెప్పదురు. ఒక అధికైశ్వరయుక్తమగు కుటుంబములో పండ్రెండు మంది సోదరులు కలరు. వారి కపార సంపదయున్నది. ఆ పన్నిద్దరిలో నొక్కనికి మాత్రమే ఒక ఆడబిడ్డ కలదు. అదియొక అవిభక్తకుటుంబము కాబట్టి యీ పండ్రెండు మంది ఐశ్వర్య సంపత్తి అంతయు నా యొక్కఆడు బిడ్డకే చెందునటుల, జ్ఞాన ధనాఢ్యులగు పన్నిద్దరాళ్వారులలో, ఎట్లు ప్రాప్తించిన నేమి? బిడ్డయనదగు నీ ఆండాళు తల్లి శ్రీ విష్ణు చిత్తులవారి ముద్దుల పట్టియై పెరుగుచున్న

దగుట వలన నా యాళ్వారులందరి జ్ఞాన సంపద మొత్తము నీమె కొక్కతికే సంక్రమించుటచే నీమెకీ యౌన్నత్యము సంప్రాప్తించినది.

ఈ నోముకు ప్రమాణము -

"యశ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః
న స సిద్ధి మవాప్నోతిన సుఖం న పరాంగతిమ్॥"

శాస్త్రమున చెప్పబడిన కర్మలను శాస్త్రవిధి తప్పిచేసినను, శాస్త్రమున చెప్పబడని కర్మల నెంతయో శ్రద్ధగా నాచరించినను, ఆ కర్మలకు ఫలము గాని, సుఖముగాని, మోక్షము గాని పొంద జాలరని యుండుటచే ఈ నోమునకు ప్రమాణమే మనగా -

మీమాంసాశాస్త్రమున "హొలాధి కరణన్యాయ" మని యొక న్యాయము కలదు. "హొల" యనగా వసంతోత్సవము. దీనిని "హొలాహ" మనియు చెప్పదురు. ఫాల్గుణ కృష్ణ పాడ్యమినాడు ఈ వ్రతము నాచరింతురు. దీనికి "హొళి"యని నామాంతరము. ఆనాడు ఊరెల్ల పండుగ. ఇంటింట నింపైన అలంకారములు. పెద్దల యుత్సాహము, పిల్లల యుల్లాసము ఆదినమున వెల్లువలై ప్రవహించును. వసంతము వర్షమువలె భేదమెరుగక అందిన వారి నందరను ముంచియెత్తును. వసంతమును నాజూకుగ నాలుగు బొట్లు చిలుకు వారు కొందరు, దూరమైననేమిని చాచిచారపడునట్లు పోయువారు మరికొందరు, లోభబుద్ధి యేటికని కుండపోతుగ క్రుమ్మరించు వారింక కొందరు. ఇట్లిందొకరి పైనొకరు వసంతమును జల్లు కొందురు. ఇదియే యీ శ్రీవ్రతమునకు ప్రమాణము.

ఉపనిషత్తులో - "యే తత్ర బ్రహ్మణాస్సమ్మర్శినః... యథాతే తత్ర వర్తేవ్। తథా వర్తేథాః" - గృహస్థాశ్రమములో నుండగా నొక కర్మను చేయవచ్చునా? చేయరాదా? ఎట్లు చేయవలయును, అను సందేహము కలిగినప్పుడు మంచి చెడ్డల నెరింగినట్టియు, అర్థకాములు గాక, ధర్మకాములులైనట్టియు పెద్దలు ఆ సందర్భముగా నెట్లు వర్తింతురో నీవును నట్లే వర్తింపుమనియు, భగవానుడు భగవద్గీతలో - "యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః" - శిష్టులుగా పరిగణింపబడువారు అట్టి సమయములలో ప్రవర్తించు విధమును గమనించి యట్లే చేయవలయుననియు చెప్పటచే నిది శిష్టాచారమే.

దీనినే శ్రీ గోదామాత తిరుప్పావైలోని 26వ పాశురమున - "మేలైయార్ శెయ్‌వనగళ్ వేణ్డువన కేట్టియేల్" - పూర్వులాచరించినదని సూయించిరి.

ఈమెకు వివాహ వయస్సు రాగానే విష్ణు చిత్తాళ్వారు లీమెకు తగినవరునన్వేంచుటలో వ్యగ్రచిత్తులై యుండగా నామె తండ్రిగారితో - "భగవన్తం వినానాన్యం। వృణే భీష్టంపిత। స్వతీ। మా శోకంకురు ధర్మజ్ఞ మదర్థం రక్షకో హరి:॥" "నాయన గారూ! నేను భగవంతునే పెండ్లాడుదును. నాకతడే రక్షకుడు. మీరు నా విషయమై నిశ్చింతగా నుండు" డని చెప్పి యోదార్చెను. అంతట నా భట్టనాథులవారు నూటయెనిమిదివ్యతిరుపతులలో నున్న మూర్తులను వివరించగా నామె శ్రీ రంగనాధుని భర్తగా వరించినది.

ఇట్లుండగా తండ్రిగారు ప్రతి నిత్యమును తనకు వినిపించు శ్రీ మద్భాగవతమున గోకుల మందలి గోపాంగనలు అందరును కలసి హేమంత ఋతువునందు మార్గశిర మాసమున కాత్యయనీ వ్రతము నాచరించి శ్రీ కృష్ణుని అనుగ్రహ పాత్రులై అభీష్టమును బడసిన వృత్తాంతము నెరింగి, తానను అటులనే యాచరించగోరి శ్రీ విల్లివుత్తూరునే గోకులముగను, వటపత్రశాయి కోవెలనే నందగోపుని భవనముగను, గర్భాలయమున వేంచేసియున్నవట పత్రశాయినే శ్రీ కృష్ణునిగను భావించి యీ శ్రీ వ్రతమును ధనుర్మాస వ్రతమును ఆచరించెను. హేమంత ఋతువులోని మొదటి నెలపేరు అగ్రహాయనము. (నవంబరు, డిసెంబరు నెలలు) "కాత్యాయని" యని దుర్గదేవికి నామంతరము.

## -: గోదాదేవి అనుష్ఠించిన శ్రీ వ్రత విధానము :-

శ్రీ రంగనాధుని విగ్రమును తనయింటిలోనే నిర్మించుకొని, బ్రాహ్మ ముహూర్తమునందు "రంగా! రంగా!!" యని మేల్కొని స్నానమాచరించి తెల్లని శుభ్రవస్త్రమును, ఊర్ధ్వపుండ్రము ధరించి, రంగనాథ విగ్రహమును పీతాంబరముతోను, భూషణములలోను అలంకరించి షోడచోపచారములను శాస్త్రోక్తముగ జరుపును. పిమ్మట వ్యంజనములతో శర్కరపొంగలిని భక్తితో నైవేద్యము గావించి, తాంబూలము సమర్పించి, ద్రావిడ భాషలో దినమున కొకపాశురము చొప్పన వ్రాసి కర్పూర హారతితో విన్నవించుచు శ్రీరంగ నాధునకు ప్రదక్షిణ సమస్కారముల నొనర్చి చేతులు జోడించి, నిలచి,

తలకోరికను నిశ్చల చిత్తముతో, వినయముట్టి పడునట్లు విన్నవించు చుండెడిది భగవంతుని ప్రీతికై ప్రతి దినమునను భాగవత తదీయా రాధనమును సలుపుచుండెడిది. తాను మాత్రము భగవంతనకు నివేదించిన కట్టు పొంగలి (పులగము)ని ఒక్కమారు మాత్రమే ఆరగించి యొకనెల దినము లీ వ్రతము నొనర్చెను. ఇట్లు ప్రతిదినమొక పాశురము చొప్పన ముప్పది దినములు విన్నవించిన ముప్పది పాశురములే తిరుప్పావై దివ్య ప్రబంధమైనది.

## శ్రీ వ్రత మూలకారణము

భగవానుడు ధర్మగ్లాని గల్గినపుడు, అధర్మము పైకొన్నప్పడు దుష్టుల శిక్షింప, శిష్టుల రక్షింప నవతరింతునన్నాడు. ఆ విధముగా దశావతారము లను, మోహిన్యాద్వేక వింశత్యవతారములనెత్తినాడు. అందుకొన్ని జంతురూపములు, కొన్ని మానవములు, కొన్ని సంకీర్ణములు. కాని వానిలో అరు అవతారములు లోకమునకు హెచ్చుగా నుపయోగించుననవి కాలేదు. శ్రీ రామ కృష్ణావతారములు రెండు మాత్రమే యొకటి అనుష్ఠానము మూలముగను, మరియొకటి యుపదేశము మూలముగను మనకు ఉపయోగించునవతారములు. శ్రీ రామావ తారములో లేని సౌలభ్య స్ఫూర్తికై శ్రీ కృష్ణావతారమును శ్రీమదాది నారాయణుడు స్వీకరించెను. అందుచే శ్రీ కృష్ణుడు మధురానగరిలో నవతరించినను, అప్పటికప్పడు గోకులమునకు బోయి, తన సౌందర్య గుణ చేష్టాదులచే నా నగరిలో గల అనేకమంది ఆడపిల్లలను వశపరచుకొని వారితో కలసి పెరుగుచున్న సమయమున వారు తనతో సమానమగు యవ్వనమును కలిగియుండగా శ్రీ కృష్ణుని శృంగార చేష్టలను గోప వృద్ధులు సహింపజాలక, ఆతని నడ్డజాలక తమపిల్లలనందరను నేల మాన్యములో దాచియుంచి కృష్ణునితో కలియనీయకుండ జేసిరి. ఆ విషయము నెరింగిన శ్రీ కృష్ణుడు వర్ష దానాదాన సమర్థుడుగటచే వర్షము కురియకుండజేసెను. వర్షాభావముచే పశువులకును, మనుష్యులకును జీవితము దుర్ఘట మయ్యెను తమ తప్పిదమును దెలిసికొనిన గోప వృద్ధులు పశ్చాత్తప్త హృదయములతో కన్నెపిల్లలను దీసికొని శ్రీ కృష్ణుని సన్నిధికేగి, తమ తప్పిదములను కృపతో మన్నించి, వర్షపాతమునకు మూలమగు నోమును తమ పిల్లలచే

నోపించుమని మిక్కిలి ప్రార్థించిరి. శ్రీ కృష్ణుడు పెద్దల ప్రార్థనను నంగీకరించి, వారతో "మీ కన్యలను ప్రతిదినమును తప్పక బ్రహ్మా ముహూర్తమునకు నా వద్దకు బంపినచో ఆవ్రతము నెట్లు చేయవలయునో ఆ విధానమును భోధించుటయేకాక దగ్గరుండి చేయింతును చెప్పినట్లు చేసినచో వర్షము కురిసి దేశము సుభిక్షముగ నుండును. మీరు నిశ్చింతగా మీ మీ గృహములకు నెళ్ళుడు' అని కన్య పిల్లలతో -"నవలావణ్య యువతులారా! మీరు నన్ను స్నానమునకు తీసికొని పొండు. నియమము తప్పక రావలయును సుమా" అని సెలవిచ్చెను. గోపికలకు చదువు సాములు లేవు, కాని, వైదిక జ్ఞానములో ప్రామాణికులైన బ్రాహ్మణుల నుండి వారు సకల జ్ఞానములను వినియుండిరి. గోపికల ఏకైక వాంఛ కృష్ణభావనలో నిరంతరము నిమగ్నులై యుండుటయే!

కనుక, గోపికలును అతికష్టముపై తమ ఇండ్లకుబోయి పరున్నను నిద్రపట్టక, కృష్ణ గుణచేష్టతములను తలంచుకొని, లేవజాలక పరున్నవారి నొక్కొక్కరినే లేపుకొనుచు బ్రహ్మా ముహూర్తమునకు శ్రీ కృష్ణుని, భవనమునకు జేరి, వరుసగా కృష్ణుని లేపి, కావలసిన దానిని పొంది శ్రీ వ్రతమును పూర్తిచేయుచున్నారు. ఇది గోపికల అత్యుత్తమ లక్షణము కృష్ణుని యెడల గోపికల వైఖరి పైకి మోహావేశముగా కానవచ్చినను అతి సామాన్య మహిళల మోహవాంఛల వంటిదని భావింపరాదు. కృష్ణుని యెడల భక్తియుక్తమైన సేవదివ్యమైనది గనుక అది కామ్య కర్మఫలమునకు కారణము కాదు.

## శ్రీ ఆండాళు తల్లి వైభవము.

కర్కటే పూర్వ పల్గున్యాం, తులసీ కాననోద్భవామ్,
పాణ్డ్యే విశ్వం భరాం గోదాం, వన్దే శ్రీరంగనాయకీమ్॥

శ్రీ విష్ణుచిత్తాళ్వారుల యొక్క పుత్రిక గోదాదేవి. అవివాహితుడైన భట్ట నాథుల వారికి దైవప్రసాదితగా గోదాదేవి కుమార్తెగా ప్రాప్తించుట యనునదొక విచిత్ర గాథ.

పూర్వము త్రేతా యుగములో విదేహ దేశమునందలి మిథిలా నగరములో జనకమహారాజు యాగశాలను నిర్మించుటకు బంగారు నాగలితో భూమిని దున్నించుచుండగా ఆ భూమియందు శ్రీ దేవి

యంశమున ఒక స్త్రీ శిశువు కాన్పించగా, అది భగవత్ప్రసాదముగా భావించి, ఆ బిడ్డకు "సీత" - అని తిరునామముంచి, మిగుల గారాబముగా పెంచుచుండెను జనకుడు మహాజ్ఞాని, న్యాయవిదుడు, పండితుడు, ధర్మ సూత్రములు క్షుణ్ణముగా ఎరిగినవాడు

శ్రీ విల్లి పుత్తూరులోని శ్రీ రంగనాధ దేవాలయమునకు సమీపమున నున్న తోటలో పర్ణశాల నేర్పరచుకొని ఋషి జీవితమును గడుపుచుండిన విష్ణు చిత్తులవారు, అనుదినము తులసీ ధళముల గోసి, తులసీ దలమాలను గట్టి శ్రీ రంగనాథ స్వామికి అర్పించుచుండెడివాడు. ఆప్రకారమొకనాడు పెరియాళ్వారులు తిరుత్తుళాయికి పాదులను అమర్చుటకు మట్టిని త్రవ్వుచుండగా ఆ భూమి యందు భూదేవి యంశమున శ్రీ అండాళు అయోనిజయై కలి 97వ నళనామ సంవత్సరము కర్కటక మాసమున శుక్లపక్ష చతుర్ధశీ మంగళవారమున పుబ్బా నక్షత్రముతో కూడియున్న శుభతిథి యందు వికసిత తామర పుష్పము వలె శోభిల్లుచు కనులపండువుగా నాతనికి ప్రత్యక్షమయినది దైవమే తనకు బిడ్డను ప్రసాదించెననియు, యిక తన కర్తవ్యము బిడ్డను పెంచుటయనియు భక్తుడైన భట్టునాధులవారు తలపోసెను పెరియాళ్వారులు వాత్సల్యమున బిడ్డనెత్తుకొని ఆ శిశువుకు తానే తల్లిగా, తండ్రిగా భావించి, పెంచదొడగెను. ఆమె సీతవలె భూదేవి యవతారమని తలంచిన విష్ణు చిత్తాళ్వారులు ఆమెకు "కోదై" యని తిరునామ ముంచెను. కోదై అను పదము తెలుగున గోదాదేవి (భూదేవి)గా మార్పు చెందినది. ఆమె భక్తిగీత ప్రభావము నెరుగగోని అవతరించిన ధరాంగన సకల "సీమంతినీ లోక సమితశాయి" యగు దివ్య సౌందర్యముతో విలసిల్లు నామె భగవంతుని యందను రక్తయై తన తండ్రి కట్టెడు కమ్మ చెంగల్వ విరులతో మాలెలను తాను ధరించి తనిసి, మరల వానిని యథాప్రకారము పూలబుట్టలో నుంచుచుండినది. ఆ కారణముచే నామెకు "చూడికొడుత్తాళ్" అను ద్రావిడ నామమేర్పడినది. చూడికొడుత్తనాచ్చియార్ అను ద్రావిడ పదము యొక్క సంస్కృతీకరణమే "ఆముక్తమాల్యద". ఈ పదమునకు ఆముక్తమయిన తాను ముడిచి విడిచిన, మాల్యములను భగవంతున కిచ్చనదియని భావము గోదాదేవికి ఆళ్వారులే పంచసంస్కారములు చేసి బ్రహ్మజ్ఞానము నుపదేశిరచిరనుట విజ్ఞులకు విదిత పూర్వము.

అల్లారు ముద్దుగా పెరిగిన ఆ చిన్నారి శుక్లపక్ష శశిరేఖవలె దినదినాభివృద్ధి గాంచుచు, దల్లిదండ్రులను తన బాల్య చేష్టలచేతను, వచ్చిరాని మాటలచేతను, సమృద్ధమగు సౌందర్యము చేతను సంతోషము నోలార్చుచుండెను. ఆమె శరీరకశోభ వర్ణనాతీతము. అవయవసౌష్ఠవము, పసిడివన్నె, వెన్నెలవంటి చూడ్కులు, మందహాసమున నొప్పారు ముఖ వర్చస్సులను గాంచి విష్ణు చిత్తులాశ్చర్య పోవుచుండిరి. ఇమె యొకమరు వంపుమొలక, తేజోమయురాలు.

బాల్యమున నా పసిపాప యాక్రందము సేయ దల్లిదండ్రులు శ్రీ కృష్ణనామాంకితములగు పాటలు పాడుచుండ రోదనము మాని శ్రవణానందము గావించుచుండెను. పాటపానపుడేడ్చుటయు, బాడునపుడేద్వకుండుటయు బట్టి, ఆపసికూన పాట కొరకే యేడ్చుచున్నదా అన్నట్లుండెను. ఇట్లానిసుగునకు బసి తనముననే శ్రీమన్నారాయణ గానాభిలాష పెంపొందెను. ఈ ప్రవర్తనను బట్టి ఆమె సాధారణమైనది కాదనియు, భగన్నామ గాన మాధుర్యమును నవిచూచుటకై పసిపాపరూపమున జన్మించిన శ్రీదేవియో, భూదేవియో కావచ్చునని నిరూపిత మగుచున్నది. శ్రీ దేవియు, భూదేవియు వేద విజ్ఞానము నందు ఆసక్తలయి ఉందురు. అయితే, వేదవిజ్ఞాన సారము భగవద్గీతతో - "వేదైశ్చ సర్వైరహమేవవేదః" - అని చెప్పబడినది. వేద విజ్ఞానమునకు లక్ష్యము భగవంతుని తెలిసికొనుటయే!

ఇట్లుండ నామెకు యౌవన మావిర్భవించెను. మొదలనే లావణ్యవతి జవ్వన మామెమేనికి మెరుగు పెట్టెను. ఆమె భూమాత యవతారమగుటచే బూర్వోమైత్రిని పురస్కరించుకొని ఆపురిలోని భాగవతుల యిండ్లలో మరాళిక, ఏకావళి, హారిణి, స్రగ్విణి అను నామములతో నాగకన్యలుదయించి, గోదామాతకు జెలికత్తెలై సహకరించుచుండిరి. ఆండాళు తల్లి వారందరితో గలిసి యెల్లపుడును సీతారాములకును, రుక్మిణీ కృష్ణులకును, లక్ష్మీనారాయణులకును బొమ్మ పెండ్లిండ్లు చేయుచు, వారి అనంత కళ్యాణ గుణములభివర్ణించుచు, బాటలు పాదుచు నానందించు చుండెడిది. తల్లి దండ్రులు తనకే మధుర పదార్థముల నిచ్చినను, ముందు తన సీతారాములకు నివేదించి పిదపతాను భుజించెడిది. తాను పరుండ బోవునప్పడు తనదైవములను బంగరు టూయల మంచమున బరుండబెట్టి,

నిదురపుచ్చి, తాను నిదుర పోయెడిది క్రమముగా ఆమెకు బ్రాగ్జన్మ సంస్కారము వలన శ్రీ మన్నారాయణుని బెండ్లాడ గోరిక కలిగెను.

కాని, బాల్యము నుండి ఆమె తత్త్వము వేరు. తోటి బాలికలతో గూడియాడుకొనునపుడును, తండ్రితో సంభాషించునపుడును, తాను యేకాంతమున నున్నట్లుగనే భావించి, తనలో తాను మాట్లాడుకొనుట, నగుట, చింతించుట యిట్లు శ్రీ కృష్ణునితో సంశ్లేషించి యానందించు చుండెడిది. చిన్న పాప ఆకారమున నున్న ఒక వేదాంత శిరోమణిగా గన్పడుచుండెను. ఆమె భక్తిభావము అనన్యము. నిజముగా రూపమున అర్భకురాలేగాని, తక్కిన సర్వ విషయములయందును యొక యోగి పుంగవురాలు ఆమె పఠనా కౌశలము మెండు, ఆమె వ్రాత చిత్ర లేఖనము వలె మనోజ్ఞముగా నుండెడిది. సర్వనదులను, ఆకాశము నుండిపడు వర్షమును స్వీకిరంచి, ధరించి, భరించు మహాసాగరమువలె సర్వ జ్ఞానమును పొంది భగవంతురాలుగా గన్పడుచుండెను. గోదాదేవి భూదేవి అంశయనియు, తనకు దైవముచే సంప్రాప్తింపబడినట్టియు, తోడు నీడైనట్టియు కుమార్తెయని విష్ణు చిత్తాళ్వారులు తలంచి, మురిసి పోవుచుండెను. ఆమెను కుమార్తెగా వాత్సల్యమున ప్రేమింపవలయునో, లేక జగజ్జననిగా ఆరాధింపవలయునో తెలియకుండెను. భట్టనాథుల వారి పరమానందమునకు మేరలేదు. ఆ తండ్రి కుమార్తెల సంబంధము, పరస్పర ప్రేమ, భక్తుల మనస్సులకు కూడ అందనట్టివి.

పెరియాళ్వారు తనకు శ్రీమన్నారాయణుడు త్రవ్వి తలబోసికొను నంతటి ధన మొసగినను, మునుపటి మాలా కైంకర్యమును మానక వైష్ణవపురాణములు వినుచు, విష్ణు సేవాతత్పరుడయి ప్రొద్దులుపుచ్చు చుండెను. విష్ణు చిత్తయు దన తండ్రి వటపత్రశాయికి జేయు పుష్ప కైంకర్యమున మిగుల ప్రావీణ్యముతో తోడ్పడుచుండెను. తులసి మొక్కలకు నీరు పోయుటయందు, తులసీదళముల కోయుటయందు, తులసీ మాల కట్టుట యందు సహకరించుచుండెడిది. నిరంతరము దైవ కైంకర్యములలో తండ్రికి నీడవలె నెంబడించి యుండెడిది. కాని, భక్తి పరవశమున సదా పరమానంద భరితముగాగన్పట్టెడిది.

ఇట్లుండ నొకనాడు ఒక విచిత్ర సంఘటన జరిగినది అది సాయం సమయము. శ్రీ భట్టనాథుల వారు వటపత్రశాయి (వడపెరుంగోయిల్

ఉడైయాన్) యను భగవంతునకై తాము నిర్మించిన మాలను స్తంభమునకు తగిల్చి అనుష్ఠానమున కై వెడలగా నంతలో వారి పుత్రికకయగు ఆండాళుతల్లి అటకు వచ్చి యామాలికను తాను ధరించి అద్దములో (కొందరు బావిలో నందురు) తన సౌందర్యమును చూచి మురిసిపోవుచు శ్రీ రంగనాథునకు నేను భార్యగా తగుదునో? యనియోచించి మాలనుయథాస్థానమున నుంచు సమయమున జూచిన తండ్రి విష్ణు చిత్తులవారు ఆశ్చర్యపడి, కొంతకినిసి, - "అమ్మా! ఇదియేమి? ఎంతటి యపరాధము గావించితివమ్మా? స్వామికి సమర్పింపవలసియున్న మాలను నీవు ముందుగా ధరించి, మైలు పరచినావు. వటపత్రశాయికి సమర్పింపక ఏ వస్తువును మనమనుభవింప కూడదమ్మా! సరి తెలియక చేసితివి. ఇక ముందెన్నడు గాని యిట్లు చేయకమ్మా! చూడు! ఇప్పటికే సూర్యాస్తమయ మయినది మరియొక హారమును గట్టుటకు సమయము చాలదు. స్వామి ఆరాధన సమయము వచ్చినది. ఈ నాడు స్వామికి మాలలు సమర్పింప లేక పోయితిని కదా! స్వామి ఏమిగాదలంచువో?" అని వాపోయెను. చేయునదికమేమున్నది? ఆరోజున వటపత్రశాయికి మాలికా ఉపవాసము, మహానివేదనము కన్న విష్ణు చిత్తులవారు సమర్పించు పుష్పమాలికలయందే స్వామికి ప్రీతి. గోదామాత పుష్పాలంకార ప్రియురాలు, తల్లి యుండిన నామె బిడ్డ ముద్దు ముచ్చటలు తీర్చి యుండెడిది. శుద్ధ బ్రహ్మచారి అగు విష్ణు చిత్తులవారికదేమి తెలియును? స్వతః సిద్ధమయిన స్త్రీ స్వభావమే గోదాదేవి పుష్పాలంకారణమునకు హేతువు.

శ్రీ పెరియాళ్వారులు గోదామాతను మందలించిరి కాని, ఆయన మనసునకూరట లేదు. బిడ్డ తెలియక ధరించిన నిర్మాల్యమును భగవంతున కర్పింప మనసు రాక నాడు కోవెలకు పోవుట కూడ ఆయన మానుకొనెను "అయ్యో! ఎంతో నైపుణ్యముతో కట్టియుంచిన పూమాలికలను నా స్వామికి నేడు నర్పింపలేని హతభాగ్యుడనయితిని గదా?" అని మిగుల వనట చెంది శయ్యపై మేనువాల్చెను. కాని, యీ సంఘటన ఆయన మనసును కలవర పరచసాగింది.

విష్ణు సంశ్లేషమును అనుభవించు చుండెడివారు విష్ణు చిత్తాళ్వారులు పెరియాళ్వారు లొకప్పుడు తానే దశరథునిగా భావించి, శ్రీరామునితో సంశ్లేషించి యానందపడుచుండును. మరొక మారు తానే

యశోదనుగా భావించి శ్రీ కృష్ణునితో సంశ్లేషించి సంతోషించుచుండుటను త్రికరణ శుద్ధిగా సఖ్యము నెరపుటలో బిడ్డవలె గూడ దేవునిపై వాత్సల్యము నెరపవచ్చును ఇట్టి వాత్సల్య భావమునకు రసపరిపాకము కల్పించిన వారిలో పెరియాళ్వారులగ్రేసరులు అట్టి విష్ణు సంశ్లేషమును పొంది ఆనందించు తత్త్వము గల పెరియాళ్వారులు తన కుమార్తె గోదాదేవి తత్త్వమును చర్యను సానుభూతిలో నాలోచింపజడగెను "ఆండాళు తల్లి సదా ఏకాకిగా, తనలో తాను మాట్లాడు కొనుచు, తనలో తాను నగుచు నుండడములో, ఆమె శ్రీ కృష్ణునితో సంశ్లేషించి యానందించుచున్న" దనియే శ్రీ భట్టనాధులవారు భావించెను. భక్తుల ఆత్మభవుడు భగవానుడు విష్ణువున లీనమైయున్న భక్తుని మనస్సు గూడ వైష్ణవవమే లక్ష్మీమాత విష్ణువు యొక్క వక్ష స్థల వాసినియగునట్లు, విష్ణువు భక్తుని వక్ష స్థల వాసియేగదా - ఆండాళు తల్లి ఒక బాలికగా స్వామి మాలను ధరించుట అపచారమగునేమోగాని, విష్ణు సంశ్లేషిణి యయిన గోదామాత స్వామిమాలను ధరించుటలో అపచార మేమున్నది?" అని విష్ణు సంశ్లేషానందముననున్న విష్ణు చిత్తుల వారు భావింపదొడగెను. తాను గోదామాత చర్యకు విముఖత్వమును, నిరసనను తెలియజేసినపుడు, గోదామాత కొంతకినుకను బూనియుండవచ్చును విష్ణు సంశ్లేషిణిమైన గోదాదేవికినియుట అనగా విష్ణువు కినుక వహించి నట్లేగదాయని విష్ణు చిత్తులవారు మనసున స్వస్థతను పొందుచుండెను ఈ విధమగు నాలోచనలోబడి, అలసి యున్న వాడగుటచే వెంటనే ఆయనకు కన్నుమూతపడినది. అర్ధనిద్రలోనున్న భట్టనాథుల వారికి తన వైష్ణవోద్రేకమున విష్ణువును గాంచినట్లును, విష్ణువు శ్రీ గోదామాత చర్యకు అంగీకరించినట్లును భ్రాంతికలిగెను. కాని అది భ్రమ కాదు. భక్తి యొక్క వాస్తవకత అంతే. శబరిచే యెంగిలి చేయబడిన ఫలములు యెంగిలిగా భావించలేదు రాముడు. రుచికరమగు పండ్లనేరుటకే యెంగిలిచేయుట జరిగినదిగాన అచట యెంగిలి గావించుట యుక్తమే అయినది.

శ్రీ రాముడు సీతాలక్ష్మణ సమేతుడై యయోధ్యాపురమును వీడిన వారము దినములకు జిత్రకూటమును జేరెను. ఈ చిత్ర కూటము వింధ్య ప్రదేశమున కుత్తరపు పొలిమేరను, ఉత్తర ప్రదేశము దక్షిణ దిక్కునానుకొని మందాకినీ తీరమున నున్నది. ఈ మందాకినీ నదికి "మాల్యవతి" యను పేరున్నట్లు రామయణమున గలదు. శ్రీ రాముడు చిత్రకూటమును

దుందుభినామ సంవత్సర వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు విడిచిపెట్టెను. శబరియున్న ఆశ్రమమునకు యువనామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాటికిచేరెను. దీనిని బట్టి రాముడు చిత్ర కూటము నుండి శబరియున్న ఆశ్రమమునకు చేరుటకు పట్టిన కాలము పదుమూడు సంవత్సరముల ఒకనెల ఒకరోజు అని తెలియుచున్నది. శ్రీ రామచంద్రుని వనవాసము పదునాలుగు సంవత్సరములు. సీతావియోగానంతరము శబరి ఆశ్రమ మునకు ఆమెను వెతకు గొనుచు వచ్చెను. సీతామాతలంకలో నున్నది. పదినెలల కాలము. దీనిని బట్టియు పై కాలనిర్ణయము సమంజసమే యగు చున్నది.

"మయా తు వివిధం వన్యం సఞ్చితం పురషర్షభొ"

రామా! నేననేక వనఫలాదులను నీ కొరకు భద్రపరచి యుంచి యున్నాను అని భావము. శ్రీ రామచంద్రుడు చిత్ర కూటమును విడిచినది మొదలుకొని సంపాదించియున్నదనియు, భద్రముగా కాపాడి పెట్టిన దనియు, ఆయా ఫల జాతిలో నొక్కొక్క ఫలమును తిని చూచిస్థాలీ పులాకన్యాయముగ నీ జాతి పండ్లన్నియు నిట్లేయుండునని గుణ దోషముల దెలిసికొని, గుణవంతమైన పండ్లనే భద్రపరచి యుంచిన దనియును తెలియుచున్నది.

"ఫలాని సుపక్వాని । మూలాని మధురాణిచ ।
స్వయ మాస్వాద్య మాధుర్యం పరీక్ష్య పరిభక్ష్యచ॥
పశ్చాన్ని వేదయామాస రాఘవాభ్యాం దృఢవ్రతా॥
ఫలాన్యాస్వాద్య కాకుత్థ్సః । తస్యై ముక్తింపరాందదౌ॥

బాగుగా పండిన పండ్లను తియ్యని దుంపలను, తాను స్వయముగ తిని రుచినిజూచి దాని మాధుర్యమును పరిశీలించి పిమ్మట రామ లక్ష్మణులకు సమర్పించెను. "దృఢవ్రతా" - అనుటచే ఎంగిలి చేసిపెట్టిన దన్ననుు, సజాతీయములను స్థాలీ పులా కన్యాయముగ పరిశీలించి పెట్టిన నన్నను దోషము లేదు.

శృంగదేశపురాధినాథుడగు గుహుడు ఫలములను స్వీకరించమని ప్రార్థించి నప్పడు శ్రీరాముడు మేము క్షత్రియులము, ఇచ్చెడు వారమే గాని పుచ్చుకొనెడు వారము కామని నిషేధించినవాడు, ఆజాతిదేయైన శబరి

పెట్టిన ఎంగిలి పండ్లను ఆమె చేయిపైన నుండగా తన చేతికి క్రింద నుంచి యేల స్వీకరించెననగా అంతిమోపాయ నిష్ఠాగరిష్ఠురాలీ శబరియగుటయే కారణము. ఆ విశేషమునే "దృఢవ్రతా" యనుపదము సూచించుచున్నది. గుహుడు భగవద్భక్తుడు, శబరి భాగవత భక్తురాలు. "మమ మద్భక్త భక్తేషు ప్రీతిరభ్యధికామతా" యని భగవంతుని ప్రతిజ్ఞ. నాకు నా భక్తుల యందు కన్నను నా భక్తుల భక్తుల యందు ప్రీతి మెండని స్వయముగ సెలవిచ్చి యున్నాడు గదా! అందుచే నాతడుచ్ఛిష్ట దోషమును సరకుగొనలేదు.

"న మాం కర్మాణిలిమ్పన్తి నమే కర్మఫలే స్పృహా ।
ఇతిమాం యో భిజానాతి కర్మభిర్న సబధ్యతే" (భ.గీ.అ.4.శ్లో 14)

అహంకారఫలాపేక్షలతో లోకము నందు గర్మము లాచరింతురు అందుచేత కర్మములు బంధకములగుచున్నవి అవి రెండును నాకు లేవు గావున కర్మములు నాకు బంధనములు గావు. కర్మములు బంధకములుగానప్పుడు వాస్తవమైన కర్తృత్వముండదు. ఈ రహస్య మెరిగినవాడు కర్మబద్ధుడుగాడు. అని గీతలో నాల్గవ అధ్యాయము పదునాల్గవ శ్లోకమున భగవానుడు సెలవిచ్చియున్నాడు. శబరి ఆ పండ్లరుచి తెలిసికొనుట తన కొరకై కొరికినచో నవి ఉచ్ఛిష్టములే యగును. శ్రీ రామచంద్రునకు ఆ పండ్ల అరుచి బాధను కలిగించరాదను దృష్టితో కొరకి ఉమిసినదిగాని బాగున్నవని తినలేదు. ఇట్లే చేదుగనుండుట కవకాశముగల దోస, బీర మొదలగునవి గాని, పుల్లగనుండు పండ్లు వగైరాలుగాని పెద్దలకు, పెరుమాళ్ళకు వినియోగించుటకు ముందుకొంచెము ఎంగిలి కాకుండ నోటనుంచుకొని మ్రింగక, ప్రశంసించక ఉమిసి వినియోగించినను తప్పలేదు. భక్తుని భావమును తెలిసికొనుట ముఖ్యమయిన విషయము.

తెల్లవారి నిద్రలేచి చూచుసరికి తులసి మొక్కల మధ్య వాని చుట్టును పరుగిడుచు, కృష్ణుని వెరకినట్లును, జవిరి పట్టకొనుచున్నట్లును, నడుచు, కీర్తించుచు గోదామాత క్రీడించుచున్నట్లును శ్రీ విష్ణు చిత్తులవారి దృష్టికి గోచరించెను. విష్ణు సంశ్లేషిణియై క్రీడించుచున్న ఆండాళు తల్లిని చూచి, ఆమెను ముద్దిడు కొనవలయునో, లేక ఆమెకు సాష్టాంగ పడవలయునో విష్ణు చిత్తులవారి కేమియు దోచుటలేదు. తలవని తలంపుగా ఆయన దృష్టి కంబమున వ్రేలాడుచున్న మాలపైబడినది. అది క్రొత్తగా కనిపించినది. ఏ సందేహమును లేక నిండు మనసుతో దానిని

గొనిపోయి ఉదయా రాధనముననే శ్రీ రంగనాథాలయములోని మన్నారు దేవున కర్పించెను. ఆ దేవాది దేవుని మెడలో తోమాల ద్విగుణీకృతముగా ప్రకాశించుచున్నట్లు శ్రీ భట్టనాథుల వారు భావించిరి. ఒక విధమైన సంతృప్తితో పర్ణశాల జేరుసరికి గోదామాత యింకను తన కృష్ణ సంశ్లేషముసందే మైమరచి అడుకొనుచుండెను. రసలోకములో నుండి ఆండాళు తల్లి బాహిరజగత్తులోనికి వచ్చినట్లనిపించుటలేదు

కొంతసేపటికి ఆమెకై యామెయే పర్ణశాల ప్రవేశించి, తనను ఆనందముతో తిలకించుచున్న తండ్రిని గాంచి కొంత సిగ్గు న సమీపించునది ఆముగ్ధమనోహర రూపిణిని గాంచినతంతనే విష్ణు చిత్తాళ్వారులు -"ఆహా! నేనెంత ధన్యుడను. ఇంత వరకు అజ్ఞానమున నిజమారయక కన్నతల్లి గోదాదేవిని సామాన్య మానవమాత్రురాలుగా బావించినాను. శ్రీ మహావిష్ణువు ననుగ్రహమునకు పాత్రురాలు కాగల్గిన నా పుత్రికయు, నామెకు తండ్రినైన నేనును ఎంతో భాగ్యశాలురమైతిమి. ఈ నాటికి నాజన్మము తరించినది." అని పట్టలేని తమకముతో యెదుట నున్న గోదాదేవిని ఆలింగనము చేసికొని -"పిన్నైకోల్! నిలమామగళ్‌కోళ్! తిరుమామగళ్‌కోల్! పిరంగాట్టాళ్ - శ్రీ దేవియో! భూదేవియో! నీళాదేవియో! ఈ రూపములో అవతరించినారు లేకున్న నా పట్టిపై నింతటి అనురాగము శ్రీ మహావిష్ణువునకు కలుగుటెక్కడిది? అని పొగడి, "ఎన్నై ఆండాళ్" నన్నేలుట కవతరించిన తల్లీ! అని మిగుల ప్రపత్తిజేసిరి ఈ కారణమున "ఆండాళ్" అనియు తిరునామము కలదు

పూర్వపుణ్య ఫలమో, నేటి పూజా ఫలమో గాని గోదాదేవి కెల్ల విద్యలును జెప్పచుండగనే వచ్చుచుండెడివి వ్రేలు చూపిన జేయిమ్రింగ గలిగిన దామె నిశితబుద్ధి. పండ్రెండు సంవత్సరములకే గోదాదేవి సంస్కృత తమిళ భాషా కోవిదురాలయ్యెను. తండ్రి వద్దనున్న సంస్కృత ద్రావిడ వేదాంత గ్రంథములనన్నిటిని పారబెట్టు (కంఠస్థముజేయు) చుండెను. తండ్రి భక్తుల కుపదేశించుచున్నవాగాంమృతమును గ్రోలుచుండెను. భక్తి గీతములు రచించుచు కొనుచు, వానిని పాడుచు, తండ్రిని, భక్తులను ఆనంద పరవశులనుగా జేయుచుండెను. దినముననేదియో యొక సమయమున తాళపత్ర గ్రంథములను విడువక వ్రాయుచునే యుండెను. "పల్లాండు" పలికిన విష్ణుచిత్తుల వారికే ఆమె రచనలు అద్భుతములుగా కన్పడెను. ఆమె

ధారణాశక్తి తండ్రి కాశ్చర్యము గల్గించినది. ఆమెవాక్శుద్ధి, రచనా పారనములు ఆయనను అద్భుత సాగరమునమునుకలువేయించినవి.

ఆండాళు తల్లి అనిర్దేశ్యవయో రూపలావణ్యాదుల పురుషులకును మోహము కలిగించు త్రిభువన సుందరుడును, సత్య సౌందర్య సుగణరాశియు, జగద్గురువును ఐన శ్రీ రంగనాధుని దివ్య మంగళ విగ్రహముతో నామె సంశ్లేషణమును పొంది యుండుటలో నామె శ్రీ రంగనాధునిలో నైక్యమై యర్థాంగి యైనట్లే - మానసికముగా కాని, యామె యవతార విషయము నెరిగిన విష్ణు చిత్తులవారు వివాహ విషయమై ఆమెను హెచ్చరింప లేక పోయెను. శ్రీ రంగనాధస్వామినే పరిణయ మాడవలయునని భ్రమ పడుచున్న గోదామాత తత్త్వమట్లే నిలిచిపోవునేమో ననియు, ఆమెకు నెట్లో తగిన వరుని జూచి, వివాహము చేసి. బిడ్డను చూచి పెంచిన బాధ్యతను తీర్చుకొని తాను సర్వ సంఘపరిత్యాగియై యుండవలసిన విష్ణు చిత్తాళ్వారులు, పలుమారు గోదాదేవితో - "అమ్మా! నీ కోరిక సరియైనదే కాని మానవ యువతి భగవంతుని వివాహ మాడుటయెట్లు? ఏ ప్రబంధము నందైనను, యేకావ్యమునందైనను చదివియున్నావా?" అని ప్రశ్నించినను, ఆమె చలింపక యొకే పట్టుదలను చూపించుచుండెను. అవి బాలచేష్టలు గావు, భ్రమ అందుమా? అంత కంటెను కాదు. ఆమె మనో నిశ్చయమట్టిదని భట్టనాధులవారు తుదకు నిర్ణయించుకొనిరి. కాని, జరుగవలసిన విషయమెట్లు? అని వ్యాకుల పడుచుండెను. ఎంత ఆలోచించినను పర్యవసానము అంతు పట్టలేదు "ఇది యొక మహాసమస్య. ఈడు వచ్చిన యాడు బిడ్డ యింట నుండగా నెంత యానందమో యంత విచారము. చేతులార పెంచిన పూలచెట్టు ఎదిగి పూచి పరిమళములు చిమ్ముచు నింట నడచుచున్నట్లుండును గాని యా పూలుత్తమ హస్త నిక్షప్తములగు నా - లేదా యని లోపల నేదో దిగులు! అపార దైవబలము గల నాకే పుత్రిక వివాహ మింత కఠిన పరీక్షగా బరిణమించినపుడు సాధారణ గృహస్థులెంత తపింతురో గదా?

ఇది శ్రీ విష్ణు చిత్తాళ్వారుల చింతా ప్రవాహము పర్ణశాలకు ముందున్న రాతి బల్లపై నొరగి యిట్లాలోచించుచున్న యాతని యూహా వాహిని కడ్డు వచ్చి శ్రీ రంగనాధుని ప్రధానార్చకు లిట్లు విన్నవించెను.

"భక్తాగ్రేసరా! మీ కుమార్తె గోదామాత శ్రీ రంగనాధ స్వామినే పరిణయమాడ సంకల్పించినట్లు తెలిసినది. అట్లు తలంచుట సహజమే. ఆమె ప్రీత్యర్థము వివాహకేళి జరుపవలయునని మీరు తలంచినట్లు కూడ నాకు తెళిసినది. గోదామాత భక్తి పారవశ్యమున తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి అను రెండు స్తోత్ర గ్రంథములను రచియించినట్లును, అవి యతి మనోహరములై ప్రకృతి వర్ణనలతో అలంకార రసభరితములై భక్తి ప్రపత్తి పరిమళముల వెదజల్లు పాశురములనియు విని ఆమాత సారస్వత అధ్యాత్మిక ప్రతిభకు అబ్బుర పడినాను. విష్ణు చిత్తయగు మీ కుమార్తె యాశయమును, మీ తలంపును, శ్రీ రంగనాధ స్వామి యాజ్ఞయు మూడును నొకటగా నుండుట మాకానంద దాయకము. అందులకు యాజ్ఞికము జరుపవలసిన నాకు కొంత బాధ్యతపడినది. పర్ణశాలవాసులైన మీకు పట్టు వస్త్రములు, ఆభరణములు, పెండ్లి కుమార్తెకు కావలసిన యితర అవసర ద్రవ్యములు లేవు గదా! దేవాలయమున నున్న లక్ష్మీదేవికిని గోదామాతకును యేలాటి భేదములేదు. విగ్రహాకృతిలోనున్న దేవేరి ఆమె. మానవాకృతిలో నున్న దేవదేవి మీకు కుమార్తె. అందువలన అమ్మవారి పట్టు వస్త్రములు, నగలు యితర ద్రవ్యములు తెచ్చినాను. గోదామాతను శృంగారించి, పెండ్లి కుమార్తె వలె శ్రీ రంగనాథుని సన్నిధికి తీసికొని పోవుదము. ఇది రంగేశుని ఆజ్ఞ" అని బహుప్రీతితో పల్కెను.

"అర్చక మహాశయా! ఇక నింతలో పుత్రికకు వివాహము చేయలేనేమో అను చింతాకుల హృదయముతో ఏది యంసంభవమని తలంచి యుంటినో యాకార్యమింత యశ్రమముగ, ననాయాసముగ ఫలింపజేసి కొన్న నా బిడ్డ యెంతటి యదృష్టజాతకురాలు? కళ్యాణ తారత్రోసికొని రావలయును. అప్పడు దైవమే సర్వ విధములదోడ్పడు నన్న పెద్దల వాక్యము వమ్ముకాదనుట కింతకంటెను నిదర్శనమేమి కావలయును? నా ఆండాళు తల్లి చిరాకాల మనోరథము సిద్ధించినది. ఇక నేను నిర్విచారముగా నా కర్తవ్యమును సంపూర్ణముగ నిర్వహింతును. ఇట్టి వివాహము చరిత్రాత్మకమైనది. ఇది సాధారణ విషయము గాదు. మాయందింత యనుగ్రహము చూపి తమ గుణైక పక్షపాతమును

శ్రీ విల్లపుత్తూరు ప్రజాపక్షమున గృతజ్ఞతలు తెలుపుచున్నాను". అని యుచ్చై

స్స్వరమున బలికి, ఈ సంతోషవార్తను వటపత్రశాయి కెరిగించి ఆ స్వామి యాజ్ఞ దీసికొని శ్రీ రంగమునకు తరలిపోదలచెను ఈ శుభవార్తను తన శిష్యుడగు వల్లభదేవునకు కూడదెల్పి, అతని వెంట దీసికొని రావలసినదని శ్రీ భట్టనాధులన వారు కొంతమంది శిష్యులను మధురకు బంపెను.

పాండ్యరాజగు వల్లభ దేవరాయడు మిగుల సంతసించి, ధన్వినవ్య పురము (శ్రీ విల్లిపుత్తూరు) నుండి శ్రీ రంగము వరకును గల రాజమార్గమంతయు మంచినీరు చల్లి పచ్చని మామిడాకు తోరణములతో నడుమ నడుమ వ్రేలాడు రంగు రంగుల పూల గుత్తులలో, పందిళ్లతో జక్కగానలంకరింపజేసి, అరటి మాకులను కట్టించి, చతురంగ బలముతో ఆళ్వారుల వెంట శ్రీ రంగమునకు బయలుదేరెను. శ్రీ రంగమానాడు కలియుగ వైకుంఠమే యై కన్నులపండువు చేయసాగెను. పునుగు జవ్వాదులతో స్ఫటిక మణి కుండికలలోని హిమాంబు పూరములలో నచ్చటిగాలి పొదరలు ఘుమ ఘుమలాడెను. చోళ చేర పాండ్యాది దేశ ప్రజలందరును ఆ పెండ్లిని కన్నులు కరవుతీర గాంచుట కుతండోప తండములుగా వచ్చి గుమికూడిరి. “గోదామాత వేంచేసిరి, చూడికొడుత్త నాచ్చియార్ వేంచేసిరి· ఆండాళు తల్లి వేంచేరి, తిరుప్పావై పాడిన దేవి వేంచేసిరి. శ్రీ విష్ణు చిత్తులవారి ఆత్మజ వేంచేసిరి, విష్ణు చిత్తయగు ఆముక్తమాల్యద వేంచేసిరి” అని ప్రజలు ఘోషించిరి. శ్రీ రంగము శోభావంతమయినది మార్గమధ్యమున చలువ మంటపములు, వితాన శాలలు మున్నగువానిని శ్రీ రంగనాథుని పరిచారకులు ఏర్పరచిరి. అర్చామూర్తియగు శ్రీ రంగనాథ స్వామి మనుజ కన్య యొక్క పాణిగ్రహణము చేయునట! ఇది బహు చిత్రముగనున్నది. ఏ యుగములోను యిట్టి వింత జరిగినట్లు విన్నది లేదు. ఈపరమాద్భుతమును తిలకింపవలయునని వచ్చిన చోళచేర పాండ్య దేశప్రజలలో శ్రీ రంగము క్రిక్కిరిసినది. అందరు నద్భుతాశ్చర్యముల మునిగిపోయిరి. వారి కన్నులనే వారు నమ్మలేక పోయిరి. ఏమి యదృష్టము! ఎట్టి (ఎట్టి) విష్ణు లీలా విలాసము! శ్రీ రంగము వేలాతి క్రమణ మొనర్చిన మహా సముద్రమయ్యెను.

శ్రీ గోదామాత విష్ణు చిత్తులలో, వల్లభ దేవునితో, చతురంగ బలముతో నిచుళాపురమున (వరమూకు) విడిదిచేసెను. శ్రీ రంగనాథున కది తెలిసి సంతసిల్లెను. రంగని ఆజ్ఞచేత సప్తప్రాకారములును కదళీ క్రముక

స్తంబాదులతో నలంకరింపబడినది. రంగవల్లులచే తీర్చబడినది. ముహూర్త మాసన్నమగు చున్నది. గోదామాతను రంగపుర వైష్ణవాంగన లేసర్వ భూషణ ములచే నలంకరించి పెండ్లికూతురు చేసిరి. రంగనాథుని అర్చక స్వాములలంకరించిరి సాగరతనయను శ్రీ మహావిష్ణువు స్వీకరించిన లగ్నమది. శ్రీ కృష్ణుడు తన్నువలచిన రుక్మిణిని స్వీకరించిన శుభలగ్నమది.

గోదామాత మంగళ దేవతవలె రంగనాథునే మనసార ధ్యానించుచు సువర్ణశిబి కాధిరూఢయై స్వామి సన్నిధికి బయలుదేరెను. భేరి కాహళ మృదంగముల మెరసినవి. వారాంగనలు లాస్యముచేసిరి. శ్రీ వైష్ణవులు భగవత్ప్ర బంధముల నధ్యయనము జేయుచు భక్తి వినమితాంగులై పురోగమింప సాగిరి ఆ వెంట నర్వాలంకృతములగు రెండు భద్రగజములును, రెండశ్వరాజములును నడువ సాగెను. వధువు పల్లకికి రెండు వైపులను భట్టనాథుల వారును, వల్లభ దేవరాయడును భద్రగజముల నెక్కిబయలు దేరిరి. బంగరు పల్లకికి నలువైపుల వేదవేత్తలయిన బ్రహ్మణులు స్వస్తి వాచనము జేయుచుండిరి. గాయకులు గానము జేయుచుండిరి. సంకీర్తన పరులు సంకీర్తనములు జేయుచుండిరి. కొందరు పుణ్యస్త్రీలు ఎత్తైన మేడలుపై నుండి గోదామాతను జూచి పుష్ప వర్షములు వర్షించిరి శ్రీ రంగపట్టణ మంతయు చిత్ర దీపములు, చిత్రద్వారములు, చిత్ర వీధులు, చిత్ర ధ్వజములతో నేత్ర పర్వముగనున్నది. నేలయీనిన లీల నున్నది. శ్రీ గోదారంగనాథుల విచిత్ర వివాహ మహోత్సవమును జూచువేడుకలో కొందరు మేడలెక్కిరి కొందరు ప్రకారముల కెగబ్రాకిరి. కొందరు గోపు రాగ్రములను చోటు చేసికొనిరి.

వాచా మగోచర మహావైభవముతో బయలుదేరిన ఆ యూరేగింపు ప్రధాన ద్వారము ప్రవేశించెను ఆ మహోత్సవము చూడవచ్చిన లలనాజనము అట్టాలికల నెక్కి వధువుపై మంగళలా జలులు కురిపించిరి. ఆవరణ సప్తకమున ప్రదక్షిణ మాచరించి ఆండాళుతల్లి శంతను మంటపము ప్రవేశించెను. శ్రీ రంగపతియు మంగళస్నాన మాచరించి, సర్వాలంకార ధారియై, వధ్వాగమన కతూహలియై సిద్ధముగా నుండెను కల్పోక్త ప్రకారముగా విధిజ్ఞులైన బ్రాహ్మణులు శ్రీ రంగనాథుని కల్యాణమహా సంకల్పము చెప్పిరి. విధి విహితముగా కార్యక్రమమంతయు నిర్విఘ్నముగ జరిగినది. విష్ణుచిత్తులు - "రంగనాథ స్వామిన్ గోదాయాః పాణిం

గృహీష్వపాణినా" - రంగనాథా! గోదాపాణిగ్రహణము చేయవయ్యా! అని ప్రార్థించిరి. శ్రీ రంగనాథుడు అందరును ఆశ్చర్యముతో చూచుచుండగా గోదామాత పాణిగ్రహణము చేసినాడు గోదామాత హర్షపులికిత అయినది. శేషహోమాంతము వరకును కావలసిన వివాహ కల్పమయినది మహదాశీర్వచనము పూర్తిఅయినది గోదామాత సంకల్పము నెరవేరినది అంతః కరణమున ఆనందము వెల్లివిరియగా ఆమె అంజలి బంధముతో అంతఃపురము ప్రవేశించినది. రంగనాథుని అవధిలేని సౌందర్యధుని యందు కొంచెము సేపు ఓలలాడినది. తర్వాత శేషతల్పము నధిరోహించి, జగదాధారములయిన రంగనాథుని పాదారవిందముల సన్నిధి జేరినది. క్రమక్రముగా ఆండాళు తల్లి యొక్క ప్రాకృతమూర్తి కరగికరగి నాథుని అప్రాకృత దివ్యమంగళ విగ్రహమున లీనమైనది

మహావైభవముగా జరిగిన గోదారంగనాథుల పరిణయోత్సవ సందర్శన లాలసులై వేంచేసిన మహాజన సమూహమంతయు నాశ్చర్యమున దిగ్భ్రమ జెందియుండగా శ్రీ విష్ణు చిత్తులవారి చిత్తము ఖేదామోదముల మధ్యలో నూగిసలాడినది. అల్లారుముద్దుగా పెంచి, పెద్దచేసిన ముద్దుబిడ్డ అదృశ్యమయినదేయని ఖేదము. ఆమె చేరవలసిన చోటికిచేరినదని ఆమోదమును రెండును ఏకకాలమున కలిగినవి. ఒక్క క్షణముకాలము పాటు విష్ణుచిత్తాళ్వారుల నేత్రములు సజలపూరితములైనవి. కాని, అది చూచిన ప్రజలు మిగుల నక్కజ పడిరి.

దుఃఖజల పూరితనేత్రుడయిన విష్ణు చిత్తులను బిలిచి శ్రీ రంగనాథు డిట్లనెను. "మామా! మీకీ విచారమేల! ఈ శుభసమయములో కన్నీరు పెట్టుకొనుట యుచితమా? ఇది రసమయమగు సమయమే కాని దుఃఖించు సమయము కాదు నీ గారాబు పట్టి మా సన్నిధిలో సుఖముతో వెలసి యుండగలదు. సముద్రునివలె మీరును నాకు మామయైతిరి. ఇది నాకెంతో ఆనందదాయకము. మీ పుత్రిక మానవావతారము పూర్తియగుటచే నామె మాలో లీనమయినది. కాన, మీరికచింతను వీడి, విల్లి పూరునకు బోయి, యధాపూర్వముగా నా పర్యాయమూర్తి అయినవట పత్రశాయికి మాలా కైంకర్యము జేయుచు సుఖముగా జీవితశేషమును గడపుడు." అని యాజ్ఞ నొసగెను. అర్చకులు శ్రీ రంగని ఆజ్ఞతో విష్ణు చిత్తులవారికి తీర్థప్రసాద, పుష్పమాల, శఠగోపము లర్పించి, జోడు బంగారు

శాలువను కప్పి సత్కరించి, "ఓ భక్తనాథా! అర్ధరాజ్య పట్టాభిషేకమును వలదని స్వామికి పల్లాండు పాడిన భక్తశరోమణీ! గోదాదేవి ఆండాళ్ అయి (అండాళ్ అనగా అమ్మ అని భావము - జగన్మాత) శ్రీ రంగనాయకునిలో ఐక్యమై పోయినది. మీ రెంత ధన్యులు. స్వామికే మామవైతిరి. కావున ఆళ్వారులలో నెల్లమిన్నల్లైనారు. ఇక మీద పెరియాళ్వార్ (పెద్ద ఆళ్వారు) అను బిరుదమున ఆచంద్రార్క తారముగా భక్తుల మానసముల వెలసెదవుగాక!" అని పెరియ పెరుమాళ్ వచనముల వలె బలుకుచు పెరియాళ్వారునకు మంగళాసనము బల్కిరి. భక్తజనులెల్లరు తథాస్తు పల్కిరి. దేవాలయపు గంటలు మ్రోగినవి.

పాండ్యరాజ దంపతుల ఆనందమునకు మేరలేదు. "ఆచార్యవర్యా! ఆనాడు పల్లాండు పల్కినపడు నీవు విష్ణు చిత్తుడవు అని పల్కిన నేను యీ నాడు ఆండాళుతల్లి శ్రీ మహావిష్ణువున ఐక్యమయిన సందర్భమున నీవు పెరియాళ్వార్ అతివయ్యా అని చెప్పగల భాగ్యము నాకు లభించినది. నా జన్మ ధన్యమయినది." భక్త పాండ్య రాజు పరమానంద భరితుడాయెను.

పాండ్య రాజ దంపతులను, ప్రధానార్చకులును చెప్పిన మాటలకు విష్ణుచిత్తులవారి హృదయము కొంత కుదుట పడినది శ్రీ రంగనాధునిచే ఓదార్చబడిన శ్రీ విష్ణు చిత్తులవారిట్లు తలపోసిరి - "శ్రీరంగనాథ స్వామి చెప్పిన హితోక్తుల వలన నా డెందమునకు స్వస్థత చేకూరినది. కాని, యీ యానందములో నా ప్రియ కుమారి నన్ను విడిచి పోయినదనుచింత మిళితమై యున్నది. స్నేహ ప్రవృత్తి యిట్లే లోపింపజేయుచుండును. ఆహా! ఏమి భాగ్యము? నా బిడ్డ ఎంత అదృష్టజాతకురాలు? భగవంతుని పతిగా బడయుట నా పుత్రికకు కాక మరెవ్వరికి సాధ్యము? ఏ పూర్వనోముల ఫలవెూ దేవాది దేవుడు నాకు అల్లుడయినాడు. ఇంత కంటెను భాగ్యమేమున్నది? ఎంతో పుణ్యపురుషులకు గాని సేవా భాగ్యము లభింపదు. నేను భాగ్యవంతులలో భాగ్యవంతుడను. గోదాదేవిని పరంధామున కల్పించితిని ఇప్పడు నేను స్వస్థుడ నైతిని. ఎందుకనగా -

కన్నె యెప్పడు బరుని సొత్తైకాన, ఆమె
నిప్పడు ప్రతి గృహీతకు నప్పగించి,
దాచిన ధనమ్ము స్వామికి దార్చినట్టు
నాదు హృదయమ్ము యతి స్వచ్ఛమయ్యె, నౌర!

అని వ్యాకులము మాని, స్వామి యానతి ప్రకారము విష్ణు చిత్తులు వల్లభరాయని భద్ర గజమునెక్కి విల్లిపుత్తూరు చేరెను ఆయన అజ్ఞ తీసికొని వల్లభదేవుడు మధురచేరెను

అందరు శ్రీ రంగధామమును సేవించి మంగళా శాసనము గావించి తమతమ నెలవులకు బోయిరి

శ్రీ రంగనాథుడు అష్టమావరణమందు గోదామాత కొకరమ్య మయిన ఆలయమును నిర్మింపజేసి అందామెను ప్రతిష్ఠించెను తనలో లీనమయిన గోదామూర్తినే రంగనాథుడు శిలారూపమున ఆవిష్కరించి యిచ్చెను. అంతేకాదు - ఆమెకు గూడ తనవలెనే నిత్యోత్సవ వారోత్సవ పక్షోత్సవమాసోత్సవ వార్షికోత్సవాదులనేర్పాటు గావించెను అది మొదలుకొని నూటయెనిమిది దివ్య తిరుపతులలోనివిష్ణ్వాలయములలో గోదామాత విగ్రహము ప్రతిష్ఠింపబడి అర్చింపబడుచున్నది

ప్రతి జీవియు నెప్పడో యొకప్పడు పంచత్వమందక తప్పదు ఇది ప్రకృతినైజము కాని, తన మనుగడచే నెవ్వడు పదిమందిని జీవింప జేయగలడో వాని జీవితమే ధన్యము. అతడే మహాపురుషుడు, మహాత్ముడు. ఉత్తమ శేముషీ విశిష్టుల నుద్ధరించినట్లే, సామాన్య మనుజుల నుద్ధరించువాడు ఉత్తమాచార్యుడగును శ్రీ గోదామాత భూదేవి యంశమున నవతరించిన కారణజన్మురాలేయయినను, ప్రపంచము నెరిగిన నాటి నుండియు నామె మానవోచిత సాధనలనే చేసినది. ఈ విధముగ తనను తాను ఉద్ధరించుకొనుటయే గాక, సామాన్య ప్రజల రూపు మాపుటకు తీవ్ర తపస్సాధన, త్యాగవైరాగ్యముల అనుష్ఠానము ద్వారా యింద్రియాతీతమైన ఆనంద సంపదను విరివిగా పంచిపెట్టియున్నది. తాను ధరించిన కుసుమ మాలతో మాత్రమే గాక, తాను చరించిన వాఙ్మాలలతో గూడ తన మనోహరుని బంధించి, వశము చేసికొనగలిగిన మహానారీ శిరోమణి ఆండాళు తల్లి! శేష శేషీ భావము నెరిగిన ఆమె యట్లుచేయుట సహజము.

కాబట్టియే పరమపద నాథుని సాక్షాత్కారమును పడయగల్గిన శ్రీ విష్ణుచిత్తులంతటి మహాజ్ఞాన కోవిదునిచే తనే - "అమ్మా! వటపత్ర శాయిని నీ కొప్పన ధరించిన పూలదండలచే వశము గావించు కొనిన నీవు నన్నేలుట కవతరించిన తల్లివే!" యను నర్థమిచ్చు "ఎన్నై ఆండాళ్" యని కొనియాడ బడినది. ఆండాళ్ అను తమిళ పదమునకు తెలుగున రక్షించునది యని భావము.

ఇది ఆండాళు తల్లి దివ్య వైభవము.

గోదామాత తన తండ్రి నొక్కని నేతరింప జేయుటకవతరింపలేదు. దుఃఖోదధి మగ్నులమగు మనవంటి బద్ధజీవులను గూడ తరింపజేయుట కాంఓర్థవించినది. ఆ మహాతల్లి వాఙ్మాలను - కవితా సుమాలను, అర్థాను సంధానములో గళ సీమను ధరింతుమేని తప్పక మనము గూడ మోక్షార్హులమై భగవత్పాదార వింధముల నందగలము. బ్రహ్మానందానుభవ స్వరూపులే గదా లోక కల్యాణమును వాంఛింతురు? అట్టి మహాపురుషుల ఆదర్శము సర్వదా అను సరణీయము!

పరమేశ్వరి నరరూపములో కన్యగా అవతరించి, పరమ వాత్సల్యముతో మనకనుగ్రహించిన వజ్రాల మూట తిరుప్పావు. కావున, అమూల్యమైన యీ గ్రంథమును ఆమూలాగ్రము సావధానముగా చదివి, విషయములను చక్కగా బుద్ధికి పట్టించు కొని యిహపరముల లాభము, పరమలాభమును పొందయత్నింతము గాక!

భారతీయ సంస్కృతీ వైభవమును గ్రహించి, స్మరించి, సంసార రహితమైన ప్రశాంతిని అనుభవమున పొంది, ఆర్ష సంప్రదాయము యొక్క గొప్పదనమును గంభీరముగా, అంధకార బంధురములో బాధల నొందుచున్న లోకసంతారణమున సాధనములను జేసి, ధన్యుల మయ్యెదము గాక!

ప్రాచీనార్షఋషులు చూపిన మార్గమును గ్రహించి, సాధనలను బాగుగ అనుష్ఠించి, ఆత్మాను భూతిని బడసి జన్మసార్థకత నొందుదము గాక!

శ్రీ గోదామాత మనందిరి చేత ఈ సేవను చేయించుకొనుచు ఆనందమును అనుగ్రహించును గాక!

తిరుప్పావై ప్రబంధ భావ సౌరభమును తెలియగోరువారు నాచే రచియింపబడిన "శ్రీభక్తసారము" - అను గ్రంథమును చదివి యానందితురు గాక!

అట్టి సద్బుద్ధిని పాఠకులకు ఆండాళు తల్లి ప్రసాదించుగాక!

శ్రీ ఆండాళ్ దివ్య తిరువడిగళే శరణమ్.

### శ్రీ ఆండాళ్ తల్లి సాయించిన

# తిరుప్పావై

అను

# శ్రీ వ్రతము

(ప్రతిపద టీకా తాత్పర్య విశేషార్థాంధ్ర పద్యహితము)

## మంగళాచరణము :

**అవతారిక:** గ్రంథాదిని మంగళాచరణమును జేయుట కవి సంప్రదాయమయినందున, శ్రీనివాసపురము జ్యోతీ కుమారియను కవయిత్రి శ్రీ అండాళు తల్లి సాయించిన "తిరుప్పావై" - అను గ్రంథమును శ్రీ వ్రతమను పేరనాంధ్రమున రచియింప బూని మొదట జ్ఞానానందమయి యగు ఆ మహామాత కిట్లు నమస్కరించుచున్నది.

"నీల చన్గొండ శిఖరాల నిద్రమున్న
కృష్ణు మేల్కొల్పి, వేద నిర్ణీత తత్వ
రత్వ మెరిగించి, భుక్తహారమున గట్టి
బలిమి భోగించు గోదకు వందనములు."

యశోదాదేవి సోదరుడగు శ్రీ కుంభుని కుమార్తె యైన నీళాదేవి యొక్క ఎత్తైన స్తనములనెడు పర్వత ప్రదేశమున హాయిగా శయనించి యున్న గోప కిశోరమును లేపి, అతనికి తన శేషత్వ పార తంత్ర్యములను విన్నవించి, మేల్కొలిపి, తాను ధరించి విడచిన శేషమాలిక లచే బద్ధుని గావించి, బలాత్కారముగ అనుభవించిన శ్రీ గోదామాతకు అనేక విధములైన దండములు సమర్పించుచున్నది.

బహు కుటుంబియగు వాడు కొంత పరతత్త్వము కొరకు పర్వత సానువుల వనప్రాంతము జేరునట్లు, సర్వలోక కుటుంబియైన సర్వేశ్వరుడు సత్వస్తనములను పర్వత సానువులు జేరెను. సర్వేశ్వరుడు సత్వమునే ఆశ్రయించి యున్నాడు. ఆ సత్వమును భోక్తుడెరుగును. శేషశేషీ భావము

నెరిగిన ఆండాళు సర్వేశ్వరునితో ఐక్యము కావలయునని కోరుట సహజము

మొదటి పాశురము - హేమంతమున తొలిమాసమగు మార్గశీర్షమున అవివాహితలగు గోపకన్యలు కాత్యాయనీ వ్రతమాచరింప బూని ప్రతిదినము ప్రాతః కాలమున ఒక్కొక్క యింటికి బోయి తమ చెలికత్తెలను మేలుకొలిపి, యమునా నదిలో స్నానము చేసి, ఆ నదీతీర మృత్తిక (మట్టి)తో కాత్యాయనీ (దుర్గా) దేవి విగ్రహమును నిర్మించి, పూజించిన విధముగా పరమ భక్తురాలగు గోదామాతయు దనయూరు గొల్లపల్లెగా భావించి, ఒక్కొక్క యింటికిని బోయి చెలులను మేలుకొలిపి, నోమునకు కాలము అను కూలించినదని తెలియజేయుచున్నారు అనగా వ్రతానుష్టానమునకు తోడివారిని పిలుచుచున్నారు అని భావము

## 1. పాశురము

మార్గళిత్తిజ్ఞళ్ మది నిఱైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్, పోదుమినో నేరిలైయీర్
శీర్ మల్గుమ్ ఆయ్ప్పాడి శెల్వ చ్చిరు మీర్కాళ్
కూర్వేల్కొడు న్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్ద కణ్ణి యశోదైయిళజ్ఞ
కార్మేని చ్చజ్ఞణ్ కదిర్మది యంబోల్ ముగత్తాన్
నారాయణనే నమక్కే పఱైతరువాన్
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్.

టీక:- శీర్మల్గుమ్ సంపద పెరుగుచున్న, ఆయ్ప్పాడి వ్రేపల్లెయందు, శెల్వం కైంకర్య సంపత్తుగల, శిఱుమీర్గాళ్, బాలికలారా! నేర్· విలక్షణమైన, ఇళైయీర్. ఆభరణములు గలవారలై, మార్గళి మార్గశీర్షమును, తిజ్ఞళ్: మాసమునందు, నుది· చంద్రునిచేత, నిఱైన్ద: పూర్ణమైన అనగా శుక్ల పక్షమునందు, నన్నాళాల్ (నల్నాళ్అల్) నల్: మంచి, నాళాల్: ముహూర్త దినము గానుండు ఈ శుభదినమందు, కూర్ పదునైన, వేల్: బల్లెముతో, కొడున్దొళిలన్· క్రూరముగ శిక్షించువారు, నన్దగోపన్, శ్రీ నందగోపుని యొక్క, కుమరన్, కుమారుడు, ఏర్: సౌందర్యముచేత, ఆర్న్ద, సంపూర్ణమైన కణ్ణి: కన్నులుగల, యశోదై: యశోదాదేవికి, ఇళమ్: బలపరాక్రమములందు సింగమ్. సింహపు పిల్లవంటివాడు, కార్: మేఘము వంటి నల్లని, మేని:

శరీరము శెమ్: ఎర్రతామరలవంటి, కణ్ నేత్రములు కలవాడు, కదిర్: సూర్యుని వలెను, మడియమ్: చంద్రునివలెను, పోల్: సమానమైన, ముకత్తాన్: ముఖ మండలముగల వాడును నైన, నారాయణనే: సర్వస్వామియైన కృష్ణుడే, నమక్కే, ఇతరములు కోరని మనకే (అనన్య గతికులముగు), పఱై మన కోర్కెలను, తరువాన్ ఇచ్చునట్టివాడుకాన, పారోర్ కృష్ణునితో మనలను చేరనీయని వారుతామే, పుగక్ స్తుతించునట్లు, ఎమ్: మనయొక్క, పావాయ్: నోమునందు, పడిన్దు: పాల్గొని నీరాడ స్నానము చేయుటకు, పోదువీర్: వచ్చు కోరికగలవారు అనగా కృష్ణ సంశ్లేషమున కోర్కెగలవారు, పోడుమినో: రండు, ఏల్: ఇట్లయినచో చెప్పడు ఆ మార్గమును అనుసరింతము రెండును నాకు సమ్మతమే!

**తాత్పర్యము:-** విలక్షణములైన బహు విధములగు ఆభరణములను, ఉల్లిపొరలకంటెను, పాము కుపుసముల కంటెను, సన్ననివై, వెన్నెలమడ తలవలె, మల్లెరేకులవలె, బ్రే యసీదరహాసము వలె ధవళములు, మనోహరములునగు వస్త్రములను ధరించి, సంపన్నమగు గోకులములో నివసించుచు మనోహరమూర్తులతో నానంద తరంగములలో నూగులాడు భాగ్యవతులగు నోకన్యలారా! మాసములలో గొప్పదగు మార్గశీర్షమిది పూర్ణచంద్రునితో గూడిన శుక్ల పక్షము. మనము తలపెట్టిన వ్రతము నాచరించుటకు తగిన శుభసమయము. ఉషఃకాలమున లేచి స్నానమొనర్చ వలయును గదా? త్వరగారండు. వాడియగు బల్లెమును. ఆయుధముగా గొని, మన కృష్ణున కపకారము చేసినవారిని తీవ్రముగా దండించు స్వభావము గల నందగోపుని కుమారుడును, సహజముగనే సుందరము లగు నేత్రములకు మంగళార్థమై కాటుకను పెట్టుకొని అలంకరించుకొని యుండు యశోదాదేవి చేతిలో సింహపు పిల్లవలె పెరుగుచున్నట్టియు, నీలాకాశమును బోలిన శరీరము, ఎర్రదామరల వంటి కన్నులు, అనుకూలురకు చంద్రునివలె ఆహ్లాదకరముగను, ప్రతికూలురకు సూర్యుని వలె తేజస్సు గల ముఖమును గల నారాయణుడే, అనన్యార్హ శేషభూతలమగు మనకు ఈ నోమునకు కావలసిన పరికరముల నొసగుటకు సంసిద్ధుడై యున్నాడు. కాబట్టి జాగుచేయక శ్రీ కృష్ణునితో మనలను చేరనీయకుండ చేసిన వారు తమ తప్పిదమును దెలిసికొని స్తుతించునట్లు ఈ నోమున ప్రవేశించుటకు పూర్ణవిశ్వాసమున్న వారు స్నానమాడుటకు వెంటనే రండు

అని శ్రీ విల్లి పుత్తూరు నివాసినియైన గోదామాత తక్కిన గోపికలను శ్రీ కృష్ణ సంశ్లేషమున కైపిలుచుచున్నారు.

నేను పాశురమును, ప్రతి పదార్థమును, తాత్పర్యమును వ్రాసిన పిమ్మట అనువాద పద్యమును, అనేక వ్యాఖ్యానముల నుండియు, పురాణేతిహాసముల నుండియు కొన్ని అర్థములను "విశేషార్థము" అను పేరుతో వ్రాయుచుందును. పాఠకులీ విషయమును శ్రద్ధతో గమనించవలయును. కొన్ని ముఖ్యమని తోచిన చోట్ల వేదాంతార్థమును గూడా వ్రాయబడినది. వీనిని గ్రహించి ఆనందింతురు గాక!

సిరిసంపదలు నగల్ చెలువమ్ము పరువమ్ము
తనరారు వ్రేపల్లె తరుణులార!
పూర్ణచంద్రుని తోడ బోలుపొందు మార్గశీ
ర్షము నందు వేకువ జామునందు,
వాడిబల్లెము వేడి పనులనందుని పుత్త్ర
కేసరి యా యశోదా సుతుండు,
[1] పుష్పవన్నిభమైన మోము కెందామరల్
మించు కన్నుల కత్తిమేనివాడు,

అఖిల మొసగును మనకు నారాయణుండు,
లోకు లగ్గింప బూని యోలోల నేత్ర
లార! యాతని పూజింపగోరి నీర
మాడ బోదము రండురండతిరయమున!

విశేషార్థము:- ప్రతి సంవత్సరము సూర్యుడు మూలా నక్షత్రము మొదటి పాదములో ప్రవేశించిన నాటినుండి తిరిగి ఉత్తరాషాడ రెండవ పాదములో ప్రవేశించు వరకు అనగా సూర్యుడు ధనుస్సులో ప్రవేశించి మరల మకర రాశిలో ప్రవేశించు వరకు గల నెల దినములను ధనుర్మాసము లేక మార్గశిర మాసము అని అందురు. దీనినే శ్రీ గోదామాత "మార్గళిత్తిజ్గళ్' అని పేర్కొనినారు. సమశీతముగా నుండు కాలము అని భావము. దేవతలకు ఉత్తరాయణము పగలును, దక్షిణాయనము రాత్రియునని పురాణ ప్రసిద్ధము. ఇది ఉత్తరాయణమునకు సన్నిహిత పూర్వ మాసమగుటచే

1 సూర్యచంద్ర సమానమైన

ఉత్తరాయణమునకు బ్రాహ్మీ ముహూర్తము వంటిది. భగవంతుడు గీతలో "మాసానాం మార్గశీర్షోహం" అని సాయించనట్లు ఇది భగవంతుని యుూర్జిత పదార్థములలో నొకటి మగుచున్నది కేశవాది యుప వ్యూహములలో మొదటి వాడగు కేశవుడు అధిష్ఠానముగా గల వైష్ణవ మానము సస్యములన్నియును అంకురించి. పుష్పించి నలించు కాలముగుటచే గోపికల యొక్క వికాసమునకును తగిన కాలము గోపికల స్వేచ్ఛావిహారము నడ్డునట్టి ముదుసలులు ఆమాత్రపు చలికే భయపడి బయటికి రాజాలని కాలము.

పరమపద సౌధము నదిరోహించుటకై "ప్రమేయ శేఖర" మను గ్రంధమున జెప్పబడిన సోపాన పరంపరలో రెండవది అభిముఖ్యము అనగా, భగవద్భాగవతులన్నచో అనుకూల బుద్ధిని కలిగియుండుట ఇది అద్వేషము వలన జనించును అద్వేషమనగా భగవంతుడన్నను, భగవద్భక్తులన్నను గిట్టక పోవుట లేకుండుట ఇట్టి యాభిముఖ్యము జనించుట మానవుని జీవితములో సుప్రభాతము అట్టి సమయ మాసన్నమగుట పెన్నిధి లభించు నటులనే ఇది క్రమముగా పరమ ప్రాప్యమగు అర్చామూర్తి యొక్క కైంకర్య భాగ్యమును ప్రసాదించును ఇట్టి తరిప్రశంసింపవలసినది ముఖ్యముగ కాలమునే దీనికి శ్రీరామాయణము నందలి "చైత్రశ్శ్రీమానయం మాసః పుణ్యః పుష్పతకాననః" అను శ్లోకమే పరమ ప్రమాణము. శ్రీరామ పట్టాభిషేకమును తలపెట్టి నంతనే సిద్ధముగా నమరియున్న మాసమగుటచే వాల్మీకి మహర్షి దీనిని నెంతయో ప్రశంసించెను. ఇది సత్త్వోన్మేష సమయము. గోపాంగన లపేక్షించు నదియును సాత్త్విక ఫలమే! కావున ఫలమున కనుకూలమైన కాలమది యని కాలమును కొనియాడు చున్నారు ఈ శ్రీ వ్రతమునకు మార్గ శీర్ష మాసము ప్రధాన సమయము తిరుప్పావును గూర్చి సమగ్రముగా అవగాహన అగుటకు "మార్గశీర్ష" శబ్దము యొక్క రహస్యము తెలిసికొనవలసియున్నది.

"శీర్ష" మనగా "ఉత్తమాఙ్గం శిరశ్శీర్షమ్" అను అమర కోశమును బట్టి శరీరములోని శిరస్సే ఈ శబ్దమున కర్థమని తెలియుచున్నది "ఉర్"- అనగా శరీరము నందలి పైభాగము. అనగా చేతుల కాధారమైన మొండెము "ఉత్తర" మనగా జ్ఞానేంద్రియముల కాధారమైన ముఖ భాగము, "ఉత్తర" మనగా అంత కంటెను పైదిలేని శిరోభాగము. దీనిని బట్టి "శీర్ష" మనగా

సర్వోత్తమ స్థానమని నిర్ణీతమైనది. ఈ శబ్దము ససంబంధిక శబ్దము. అనగా వేనిలో సర్వోత్తమమైనది? అని ప్రశ్న. ఏది "నిర్ధారణషష్ఠి" యగునో అదియే సర్వోత్తమమని సమాధానము. "మార్గ" శబ్ద మీ యర్థములను తెలుపుచున్నది. నిర్ధారణ షష్ఠి - అనగా మార్గములలో సర్వోతమైనదని యర్థము. దానిని బోధించుటయే యీ ప్రబంధమునకు ప్రధానమగుటచేత నీ మాసము దీనికి ప్రధానముగా పరిగణింపబడినది. ఇది మోక్ష ప్రధాన ప్రబంధమగుటచే ఆ మార్గములు దేనికని ప్రశ్నించుట కవకాశము లేదు. మోక్షమునకేయని స్పష్టమే కదా? చరమ శ్లోక వ్యాఖ్యా నావసరమున శ్రీ పిళ్ళైలోకాచార్యమహాశయులు "ధర్మ" శబ్దముచే మోక్షసాధనముల నన్నింటిని చెప్పియున్నారు. ఆ మార్గము లన్నిటిలోను ఉత్తమమైన మార్గమునీ తిరుప్పావై అను శ్రీవ్రత దివ్యప్రబంధము బోధించుచున్నది. "మార్గ" శబ్దమునకు "ఉపాయ" మర్థము. ఈ విషయమును సవివరముగా విమర్శించి, వానిలోగల కాఠిన్యమును సప్రమాణముగా వివరించితిని. దీనిని బట్టి ఆచార్య నిష్ఠయే అంతియోపాయమని, అదియే "మార్గశీర్ష" మని తేలినది. పల్లాణ్డుక్కు ఆళ్‌కిడక్కలాం, తిరుప్పావైక్కు ఆళ్‌పట్టాతు." అని పూర్వాచార్యుల శ్రీ సూక్తి. అనగా పల్లాండు భగవత్‌స్తుతి పరమనియు, తిరుప్పావై ప్రబందము భాగవత స్తుతి పరమనియు భావము. భగవత్ స్తుతి చేయుటకు కొందరైనను సిద్ధపడుదురు. కాని భాగవత స్తుతికి మనుష్యులు లభించుట దుర్లభము. అట్టి భాగవత స్తుతి పరమైనది. తిరుప్పావై దివ్య ప్రబంధము.

సకల మంత్రమూర్ధన్యమును, సహజ ప్రణవ నమస్సులతో కూడి యున్నట్టిదియు, ఉచ్చారణ క్రమ, అక్షరక్రమ, అనుసంధాన క్రమ, ఫలక్రమములను బోధించు ప్రత్యేక శ్రుతిని కలిగియున్నట్టిదియు, ఇహలౌకిక, పారలౌకిక, మోక్షఫలమైనట్టి శ్రీమదష్టాక్షరీ మంత్రమును, దానికి వ్యాఖ్యాన రూపమై అందిమిడియున్న అర్థవిశేషములను ప్రకాశించ ద్వయమంత్ర, చరమ మంత్రములను సాంగముగను సార్థముగను ఉపదేశించు సామర్థ్యమును గలిగియున్నవాడే ఆచార్య పదవికి తగినవాడు. అతడే ఆచార్య శబ్దవాచ్యుడు. మోక్షమున కుత్తమ సాధనమగు నిట్టి ఆచార్య నిష్ఠనే తిరుప్పావై దివ్య ప్రబంధము బోధించుచున్నదని సిద్ధాంతము.

ఆధ్యాత్మికాది తాపత్రయ సంతప్తులగు ముముక్షవులు సంసార

తాపశాంతికై పరబ్రహ్మానుభవము నందు నిమగ్నులగుటయే సరియగు నీరాట్టము. అనగా స్నానము చేయుటయని భావము

నీరాడప్పోదువీర్ పోదుమినో - స్నానము చేయగోరువారురండు.

"పురుషార్థ మెంత గొప్పదియైనను దానిని పొందుటకు అంతదుష్కర కర్మాను స్థానముచేయవలయునని బయపడుచున్నా"మని గోపికలనగా ఆండాళ్ తల్లి "నిజమే, ఈ పురుషార్థమట్టిది కాదు ఏనికి కావలయునను కోరికయుండుటయే చాలును అనగా వద్దనకుండుటయే యీ పురుషార్థమునకు ముఖ్య సాధనము ఇది చేతనుని పారతంత్ర్య స్వరూపమున కనుకూలమైనది ఇది సాధన కోటిలో చేరదు కావున దీనికి నమః "పదముతో విరోధములేదు" అనుచున్నారు

భౌతిక జగత్తున, కాంచనమే బంధహేతువు. మానసిక ప్రపంచమున, కామమే మనలప్రతిఘటించును ఈ రెంటిని దాటి మన మాత్మలోకమున ప్రవేశింపగనే అహంకారము ముక్తి మార్గమున కడ్డుపడును కామమునకు మించిన శత్రువు అహంకారము ఇది యెంత సూక్ష్మమో, అంత బలవత్తరము మానవుడు తనయందణగియున్న అహంకారము నంతరింపజేసికొనిన గాని భగవద్రక్షణ పొందజాలడు. ఈ విషయమునే "వార్తామాల" యను ప్రబంధము -"భగవత్ప్రవృత్తి ప్రతిబంధక స్వ ప్రవృత్తి నివృత్తి: ప్రపత్తి - "మన ప్రయోజనమునకై మనము చేయు ప్రయత్నము భగవానుడు మనకొరకై చేయు ప్రయత్నమును అడ్డగించును అని చెప్పచున్నది కావున మన ప్రయత్నమును విడువ వలయును. "మనము భక్తులమైనచో భగవంతుడు ప్రపన్నుడగును. మనము ప్రపన్నులమగుచో ఆయన భక్తుడగును. "ప్రసన్నుడనగా ఏ పనిని చేయక యూరకుండువాడు భక్తుడనగా తానే సాధనానుష్టానమే చేయువాడు మనము భక్తులమగుట యనగా మన రక్షణ ప్రయత్నమును మనమే చేసికొనుట. ఆయన ప్రసన్నుడగుట యనగా మన రక్షణ ప్రయత్నమును మాని యూరకుండుట. అనగా మనలను రక్షించుకొనుటకు మనమే ప్రయత్నించుకొనినచో ఆయన మన రక్షణ భారమును విడచి కూర్చొనును అట్లుగాక మన రక్షణ భారమును మనము ఆయనపై నుంచినచో ఆయన మన రక్షణకై చేయవలసిన ప్రయత్నము లన్నియు జేయును. దీనికే ఆళ్వారులు "అత్తమ పత్తినిల్, ఉత్తతువీడుయిర్" - అని సాయించినారు. మన రక్షణ విషయమును గూర్చి మనము ప్రయత్నింప

కుండినచో -"ఉయిర్‌పెత్తతు వీడు". ఆత్మలభించునది పరమపదమే. ద్వయ మంత్రములోని పూర్వ ఖండమున ఉపాయాంతర పరిత్యాగ పూర్వ కశ్రియఃపతి చరణారవింద ఉపా యాథ్యావసాయమును, ఉత్తరఖండమున లక్ష్మీనారాయణుల నిరంతర కైంకర్య ప్రార్థనము తెలుపబడినది. ప్రపత్త్యుపా యమునకు ఫలనియమము లేకుండుటచే మనమే ఫలమునకై ప్రపత్తిని చేసితిమో దాని నాతని కెరిగించుటయే ఉత్తరఖండము యొక్క ప్రయోజనము. దానిని భగవానుడెరుగడా? యన్నచో మనము కోరిలభించిన గాని యది పురుషార్థము (పురుషునిచే కోరబడినది) కానేరదు.

పోదుమినో -

రండు. ఈ శావాస్యోపనిషత్తునందు ప్రపన్నులను సంధించవలసిన మంత్రముగా పేర్కొనబడిన -"అగ్నేనయ....." అను మంత్రములో "అస్మాన్‌నయ' ' అనినన్నే కాదు, నా సంబంధులనందరను అర్చిరాది మార్గము ద్వారా పరమపదమునకు తీసికొని వెళ్ళుమని బహువచన కనిపించు చున్నది. ఇది శ్రుతి సమ్మతమైన యర్థమే. ఆండాళు తల్లి భూదేవి యొక్క అంశగదా! ప్రతి కూలురను కూడ -"తేనమైత్రీ భవతుతేధ "విదితస్సహిదర్మజ్ఞ": శరణాగతవత్సల: - అని యింటిగుట్టును సదస్యమొనర్చిన యిల్లాలు పెరియాళ్వారులు తమ పల్లాణ్డు ప్రబంధములో ఐశ్వర్యార్థులను, కైవల్యార్థులను గూడ ముముక్షువులతో కలిపి ఆహ్వానించి, వారి యందరితో కలసి భగవన్మంగళా శాసనమును గావించినారు. ఇట్లు పరమసమృద్ధిని గోరు ఆండాళు తల్లి ప్రాణసఖురాండ్రను ఎట్లువిడుచును? అందుకే వ్రతమును ఆచరించుట కంగీకరించిన వారి పాదములను పట్టుకొని ప్రార్థించు చున్నారు. శ్రీ శఠకోపులవారును -"అడియార్‌కళ్ కుళ్ఙ్గళుడన్ కూడవ తెన్ఱుకొలో" - భాగవత గోష్ఠితో కూడి భగవదనుభవమును గావించుట యేనాడో గదా? అని ప్రార్థించియున్నారు. శ్రీ భాష్యకారులు (రామనుజలు) ను పరమపదమునకు వేంచేయుటకు ముదు తమ అనుయాయులకు సుకర నిరపాయోపదేశమునుగా -"యద్వా భాగవతాభి మానవసతిః" అనియు, "తత్మాన్నిత్యమతన్ద్రితో భవసతాంతేషాం సమారాధనే" - అనియు భాగవత సమారాధననే యుపదేశించియున్నారు. "పరపరమునిభృత్త్యైరస్తుమే నిత్యయోగః" - అను విధిని ఆండాళు తల్లి

అనుష్ఠాపర్యంతమును గావించుచున్నారు.

వేలిళియూర్ -

విలక్షణములైన ఆభరణములను ధరించిన కన్యలారా! ప్రపన్నాగ్రేసరుల దివ్య మంగళ విగ్రహమునకు

"బద్ధేనాఞ్జలినా నతేన శిరసాగాత్రైస్సరో మార్గమైః,

కణ్ఠేన స్వరగద్గదేన నయనే నోద్గీర్ణ బాష్పామ్బునా."

అంజలిబంధము, నతశిరస్కము, గగుర్పొడిచిన గాత్రము, డగ్గుత్తిక స్వరము, నేత్రముల నుండి ప్రవహించుచున్న ఆనందాశ్రుఝరీ. ఈ మొదలగునవియే ఆభరణములు. అవి లేని కేవల భూషణాలంకారము శవాలంకారము మాత్రమే. ఆభరణములను వ్యత్యాసముగా ధరించుట, కట్టుబట్టను విపరీతముగా ధరించుట, ఒడలంతయు పాలిపోయి కృశించుట - ఇవి యన్నియు భక్తిపారవశ్య కార్యములగుటచే శ్రీకృష్ణుడెంతయో సంతసించును. "భక్త్యాతుష్యతి," "భక్తి ప్రియోమాదవః", "భక్తిక్రీతో జనార్ధనః" గదా?

కుమరన్ - విధేయుడు, అణకువగలవాడు అని భావము.

వీధిబడి యుపాధ్యాయుని చేతిలో బెత్తమును జూచి పిల్లవాడు భయపడినటుల, బల్లెమును చేబూనిన నందుని జూచి శ్రీకృష్ణుడు అత్యంత విధేయుడై యుండెను. కొట్టినను, తిట్టినను పాతకాముడగు తండ్రియేగదా యధికారి! శ్రీకృష్ణుడు పొరిగిండ్లలో చేయగలిగిన పాడుపనులనన్నిటిని చేసి వచ్చి యింట నొక మూల నక్కి యుండును. ఆ యిండ్లవారు వచ్చి నందునితో మొరపెట్టుకొనగా -"ఆ! అంత పనిచేసినాడా? రానిండు. వానిని చక్కగా దండించి, యిక ముందు అట్టి పనులను చేయకుండునట్లు చేసెద' 'నని కోపముతో నందుడు శ్రీకృష్ణుని రాకకై నిరీక్షించుచుండగా శ్రీకృష్ణుడు మెల్లగా వినయముట్టిపడ, నేమియుదెలియని వానివలె తండ్రి గారికి సాష్టాంగముగ నమస్కరించి నిలువంబడును. నందడా వినయమును జూచి - "రా, బాబూ! రా" యని పిలచి తలను దువ్వుచు "అయ్యో! ఈ అమాయకుని పైన నా ఇంతటి నిందలు మోపుట? ఈ యొప్పుల కుప్పనా నేను కొట్టదలచుట? ఇట్టి వినమ్రునిపై చాడీలు చెప్పటకు వారికి నోరెట్లు

వచ్చినదో గదా! అని విలపించి ఆ వచ్చిన వారినే దండించి పంపును. ఇది "కుమరన్" పదములో నున్న హార్దభావము.

కార్మేని - నల్లని దేహముగలవాడు నీలమేఘశ్యాముడు అనగా ఎవరడ్డు పడినను చూడక నుండనీయని తిరుమేని కాంతి అని భావము

శజ్జణ్ - ఎర్రని కన్నులు కలవాడు అని భావము.

అంతర్నిహితమైన (లోని) వాత్సల్యమును బయటికి చూపు కన్నులు కలవాడు. నల్లని మేఘముపై రెండు తామర పూవులు వికసించినట్లుండు కన్నులవి. ఈ గోపాంగనల నింతకాల మెడబాసిన దుఃఖము వారికన్నను తనకే అనేక రెట్లు అధికమని తోపించు కన్నులవి. ఇందులకు సీతామాత లంక నుండి హనుమానునితో -"ఊర్ధ్వం మాసాన్నజీవిషే" - ఒక నెలను మించి బ్రతుకజాలనని సందేశమంపగా విని శ్రీ రామచంద్రుడు - "నజీవేయంక్షణ మపి" - సీతను విడచి నొక్కక్షణకాలమైనను బ్రతుక జాలననెను గదా! ఇంతకెంటెను నిదర్శనమేమి కావలయును?

కతిర్మతి యమ్మొల్ ముగత్తాన్ - సూర్య చంద్రులను పోలిన ముఖము కలవాడు అని యర్థము. నేత్రానందమున కాతని తిరుముఖ మండల సందర్శనమును, ప్రాప్తికి విషయమును ఆతిరు ముఖమే!

నారాయణనే - నారాయణుడే జీవులకు గతి అని భావము.

మనము నారములము. ఆయన మన కాధారమైన నారాయణుడు. ఈ నారాయణ అను పదములో నార అయన అను రెండు పదములు కలవు. ఈ రెండు పదములు సమస్తములై నారాయణ అను పదమేర్పడినది. నరములు నాశనములేనివి అని యర్థము. ప్రపంచములోని సత్పదార్థము లన్నియు నాశములేనివే. అవి మూడు విధములు : 1) అచిత్తు, 2) చిత్తు, 3) పరమాత్మ అని. ఈ మూడు తత్త్వములు నాశములేనివే గాన నరములు. వాని సముదాయము నారము అనగా చిదచి త్వరమాత్మలు నారములు. నారమునకు సర్వవిధ సంబంధములు గలవాడు నారాయణుడు. ఈ యర్థమును గీతలోని క్రింది శ్లోకమెట్లు ధృవీకరించుచున్నదో చూడుడు.

ప్రభుర్భర్తాగతిస్సాక్షీ నివాస శ్శరణంసుహృత్।
పితా హమస్య జగతః మాతాధాతా పితామహః ॥ (గీత)

"నారస్య అయనం" అనిషష్ఠీ తత్పురుషము. "నారం అయనం యస్య' ' అను బహుబ్రీహినారము ఇతనికి ఆశ్రయమని చెప్పచున్నది. అనగా జడాజడములు అన్నిటిలోపల నుండు వాడని యర్థము.

పంచభూతాత్మక శరీరములో జీవుడున్నాడు. జీవుడు శరీరి. దేహము శరీరము. ఈ రెండింటికిని శరీర శరీరిభావము సంబంధము. అట్లే జడాజడములన్నియును పరమాత్మ శరీరములే వానిక దతడాత్మ.

యస్య పృథివీ శరీరం యస్యా పశ్శరీరం యస్యాత్మాశరీరం
యకూత్మాన మంతరో యమయతి యమాత్మా నవేద॥ (శ్రుతి)

జడములకు ఆత్మగా వుండి జీవులు శరీరమును తమ అదుపులో పెట్టుకొన్నట్లు, ఆ జీవుల కంతరాత్మగావుండి పరమాత్మ తనకు శరీరమైన జీవులను, అచిత్తును నియమించుచున్నాడని తాత్పర్యము. అతడే మన కాధారమైన నారాయణుడు. మాణిక్య హారములోని దారమువలె ఆయన మన కాధారభూతుడు. నారాయణాను వాకములో అంతగా పొగడబడిన వాడు అబలల కింత భృత్యుడై వారి కనుసన్నలలో మెలగుచున్నాడో చూడుడు. ఈ పదము ఈ నోమునోచువారు అనుసంధింప వలసిన మంత్రము అష్టాక్షరీ మంత్రరాజమే అని తెలియజేయుచున్నది.

నమక్కే - మనకే అని భావము.

ఈ తిరునామము నను సంధించుటకు భగవంతునితో చేతనున కున్న నవవిధ సంబంధ జ్ఞానమున్న వారే అధికారులు. ఆ సంబంధమును అష్టాక్షరీ మంత్రమిట్లు తెలుపుచున్నది.

"పితారక్షకే శేషీ భర్తాజ్ఞేయో (రమాపతిః) స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా (బాధ్యమనూదితః) ఆద్యమనుః అష్టాక్షరీ మహామంత్రము ఈ నారాయణ మంత్రమును అనుష్ఠించునప్పడా మంత్రముచే ఉద్దేశింపబడిన కేశవ స్వరూపమును మంత్రోపాసకుల మనోనేత్రమునకు దర్శన మిచ్చుచుండవలయును.

నారాయణనే నమక్కే -

ప్రాప్య ప్రాపక వాచకపదములు "ఏవ" కారముతో కూడియున్నవి. మొదటి "ఏవ" కారము ఉపాయనైరపేక్ష్యమును తెలుపును. అనగా -

భగవంతుడు మనలను రక్షించుటలో మనముచేయు సాధనానుష్ఠానములు గాని, తాను రక్షించుటకు వేరొక సహాయమును గాని యపేక్షింపడు అని భావము. ఇక రెండవ "నీవకారము". చేతనుని అకించన్య అనన్య గతిత్వములను తెలుపును. అనగా - ఉపాయాంతరములు గాని, రక్షకాంతరములుగాని లేకుండ నుండవలసిన ప్రాప్యుడగు జీవుని యొక్క స్వరూపమును తెలుపుచున్నది. రక్షకత్వమువలెను, ప్రాప్యత్వమువలెను, ఉపాయత్వము కూడ భగవంతుని స్వరూపములో సహజముగనే అంతర్భూతమై యున్నది. అతని పూర్తిని బట్టి చూచినను ఆతడే ఉపాయభూతుడగును. ఇతర దేవతలపూర్ణులగుటచే నారాయణుని చూచినను ఆతడే ఉపాయభూతుడగును. ఇతర దేవత లపూర్ణులగుటచే నారాయణుని చేతివైపు చూతురు. నారాయణుడొక్కడే ఎప్పుడును తెరచియుండు తలుపులు గల భవనము వంటివాడు. అందుచేతనే కాకాసుని వంటి అసహ్యాపచారకునికిని గతికలిగినది. ప్రతి నిత్యము లెక్కలేకుండా తిట్టినట్టి శిశుపాలుడైనను ప్రతి తిట్టునకు "కృష్ణా! నీవు జారుడవు, కృష్ణా! నీవు చోరుడవు." అని యిట్లు కృష్ణ శబ్దమును జోడించియే తిట్టెను. కావుననే కాకాసుర, శిశుపాలురు విముక్తులైరి. శ్రీ గుణరత్నకోశమున "కాకంతంచ విభీషణం శరణ మిత్యక్తి క్షమౌరక్షతః" అని యిట్లుబయుల శరణాగతియు భగవంతుని క్షమాగుణ ప్రసారము నడ్డినది. ఈ గోపాంగనల కట్టి యడ్డు లేకుండుటచే వీరిపట్ల భగవంతుని క్షమాప్రసార మనర్గళమే. దీనినే "నమక్కే" అను పదము సూచించుచున్నది.

పఱై తరువాన్! నోమున కంగముల నొసగువాడు అని భావము.

"పఱై" - అని పేరు పెట్టుట లోకులకొరకే. తమకు వలయునది "ఉనక్కేనామట్చెయ్‌వోం" - అనగా సర్వదేశ సర్వకాల సర్వావస్థల యందును సర్వేశ్వరుని సర్వ విధకైంకర్యమే. కావుననే ప్రాప్య నిష్కర్షపరమగు 29వ పాశురములో - "ఇత్తైపత్తైకొళ్వా నన్ఱుకాణ్‌గోవిన్దా!" - ఓ కృష్ణా! ప్రయాసయంతయు ఈ పఱైకొరకు కాదని నిషేదించి కావలసినది కైంకర్యమేయని నిష్కర్షించినారు.

పారోర్ పుగళం లోకులు పొగడునట్లుగా అని యర్థము.

సమ్మతించని గోపవృద్ధులుకు సంతోషపడి మమ్ములను పొగడు నటుల మేము మా పురుషార్థమును లభింతుము. స్వరూపజ్ఞానము కలవారి

యాత్రను అది లేనివారు నిందించుట న్యాయమే. మన కులమందలి పెద్దలు స్వరూప జ్ఞానము లేని వారైనను అట్లునిందించరు. ఏమనగా, మననోము వలన వారికి కావలసినంత వర్షము కురియును గదా? అయినప్పుడు వారెందులకు నిందింతురు?

"అధృష్యశ్చాభిగమ్యశ్చ యాదోరత్నైరి వార్ణవ". - సముద్రము తన యందుండు తిమింగలాదులచే ప్రవేశించుట కశక్యముగా నుండు నట్లును, రత్నములతో సేవింపదగినదిగా నుండునటులను, నారాయణుడును తేజస్వియగు సూర్యునివలె భక్తి లేనివారిచే తేరిపార చూచుట కశక్యుడయ్యు, చల్లని చంద్రునివలె భక్తులకు దరిజేరి సేవింపదగియున్నాడని భావము. ఈ విషయమునే నమ్మాళ్వారులు "పత్తుడై యడియనర్కెళియవన్ పిఱర్ గళుక్కరియ విత్తకన్" (1-3-1) అని సాయించిరి.

నారాయణనే నారాయణుడే.

"నారాయణామయనం యః సః" - అను తత్పురుష సమాసముచే సర్వస్వామి యగువాడే మనకు వలయుదాని నన్నింటిని ప్రసాదించువాడని పరత్వము తెలుపుచున్నది. "నరాః అయనం యస్యసః" అను బహువ్రీహి సమాసముచే మనమంగీకరింపక పోయినను మనలను విడువక మన కంతర్యామిగా వేంచేసియుండు వాడని యాతని సౌలభ్యము తెలుపబడినది. మనమాచరించు సాధనానుష్ఠానమును, నారాయణుని కృపయును రెండును కలసి ఫలసిద్ధికాక, భగవంతుడే స్వయముగా గజేంద్రునకువలె ఆపన్నులున్న చోటున కేగి వారి యాపదను బాపి యభీష్టముల నొసంగుటలో నితర సహాయము నపేక్షింపడని తెలియుచున్నది. కార్మేని, శజ్ఞణ్ - అనుటచే చరమ శ్లోకమందలి "మాం" పదము యొక్క సౌలభ్య సూచకమగు అర్థమును, "కతిర్ మదియ మ్మోల్ముకత్తాన్" - అనుటచే "అహం" అను పదము యొక్క పరత్వార్థమును సూచింపబడినది. ఈ విధముగ "నందగోపన్" మొదలు ఇంత వరకు ఆచార్య పరాధీనతయు, వాత్సల్యాది ఆశ్రయణ సౌకర్యా పాదక గుణములును, జ్ఞానశక్త్యాది ఆశ్రిత కార్యాపాదక గుణములును కలిగియున్న శ్రీమన్నారాయణుడే పర్వత సౌలభ్యములతో నిండియుండి సర్వ సమాశ్రయణీయుడై సకల పురుషార్థ ప్రదుడై వేంచేసి యున్నాడని చెప్పబడినది.

నమత్కే - మనకే

సాధనాంతరములను, ఫలాంతరములను, దేవతాంతరములను, తన రక్షణను తానే చేసి కొందునను దురభిమానమును విడచి, నారాయణుడే పురు షార్థప్రదుడని నమ్మియున్న మనకే.

"అనన్యాశ్చిన్తయన్తో మాంయే జనాఃపర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమంవహామ్యహమ్"

అను శ్లోకార్థము నిచ్చట గమనార్హము. ఇచ్చట "మనకే" యని "ప' కారముండుట వలన ఒక చేతితో నితరోపాయముల నాచరించుచు నింకొక చేతితో పరమ పురుషుని పాదముల నాశ్రయించిన ఉభయ కూలస్థులకు సర్వేశ్వరుడు వారుగావించు కర్మాను గుణముగనే ఫలముల నిచ్చును గాని చరము శ్లోకమున చెప్పబడిన యీ యుపాయాంతరముల నన్నింటిని రుచి వాసనలతో విడచి నారాయణునేయపాయముగా నమ్మిన వారివలె తన కృపలో ఫలము నొసగడని భావము. పఱై తరువాన్ పారోర్ పుగళః పురుషార్థము నొసగును. అందువలన భూలోకమునందున్న వారిలో లౌకికులుగాని, వైదికులు గాని, పరమ వైదికులు గాని యందరును పొగడునట్లుగా ఈ వ్రతమున ప్రవేశించి దాని కందముగా స్నానమాచరించుటకు రండు అని అన్వయించవలయును.

**తిరుప్పావై ఫలశ్రుతి** :- ఈ వ్రతము ఫలాపేక్ష కలవారికి ఐహిక, పారలౌకిక ఫలప్రదము. నిష్కాములకు నిత్య కర్మవలె అనుష్ఠింపదగినది. ఇది అందరకును కర్తవ్యము.

# 2 పాశురము

**అవ:-** మొదటి పాశురమున ప్రాప్య (పొందదగినది), ప్రాపక (పొందిం చునది), అధికారి (పొందుచేతనుని) స్వరూపములను తెలియజేసిరి. ఈ పద్యమున అట్టి అధికారి చేయవలిసిన కార్యములను తెలుపుచున్నారు. కర్మ నిష్ఠను ఉపాయముగా జేసికొని, తత్త్వజ్ఞాన నిష్ఠను బొందుటకిది యెంతయో యుపయోగపడగలదు. మోక్షార్థికి జ్ఞాన సంపాదనమునకు గర్మయోగము సాధనమగునని దీని వలన తెలయబడుచున్నది.

# 2వ పాశురము

వైయత్తువాళ్ గాళ్: నాముమ్ నమ్-పావైక్కు,
శైయ్యుమ్ కిరిశైకళ్ కేశీరో, పార్కడబళ్
పై యత్తు యిన్ర పరమన్ అడిపాడి,
నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోం నాట్కాతే నీరాడి,
శెయ్యాతన శెయ్యోం తీక్కుఱళై శెన్టు ఓతోం
మైయిట్టు ఎళుతోం మలరిట్టు నామ్ ముడియోం।
ఐయముం పిచ్చైయుం ఆన్దనయుమ్ కైకాట్టి!
ఉయ్యుమాఱెణ్ణి ఉకన్దుపేల్ ఓర్ ఎమ్‌పావాయ్॥

**టీక:-** వైయత్తు - ఈ భూమియందు, వాళ్‌వీర్‌గాళ్ - సుఖించువారలారా! నాముమ్ - మనము నం-మనయొక్క, పావైక్కు-నోమునకు, శెయ్యుం-చేయవలసిన, కిశైగళ్-చేయవలసిన పనులను, కేళీరో-వినుడు, పార్కడయిళ్-క్షీరసముద్రమునందు, పైయత్తుయిన్ద-హాయిగా నిదురించు చున్న పరమన్-సర్వాధికుడై శ్రీయః పతియొక్క, అడి-శ్రీపాదములను, పాడి-ప్రీతితో గానముచేసి, ఉయ్యుం-ఉజ్జీవించునట్టి, ఆయి-విధమును, ఎణ్ణి-తలంచి, ఐయముం-పేదలకు దానములు, పిచ్చైయుం-పూజ్యులకు భిక్షము, అర్థనైయుం-శక్తి కొలది, కైకాట్టి-చేయిచూపి(ఇచ్చి), నెయ్-నేతిని, ఉణ్ణోం-భుజింపము, పాల్-పాలను, ఉణ్ణోం-త్రాగము, నాట్కాలే-ప్రాతఃకాలమున, వీరాడి-పుష్పములను, ఇట్టు-పెట్టుకొని, నామ్-మేము, ముడియోమ్-కురులను ముడువము, శెయ్యాదవన-పెద్దలు చేయని పనులను, శెయ్యాం-ఆచరించము, తీ-కటువైన, కురళై-మాటలను, (చాడీలను) శెన్టు-ఇతరుల వద్దకు పోయి, ఓదోమ్-చెప్పము.

**తాత్పర్యము:-** భూలోకము లోనిదియగు గోకులమున బుట్టి సుఖించుచున్న యోభాగ్య వతులారా! మనమాచరింపబోవు ధనుర్మాసవ్రతమునకు ముఖ్యముగా చేయవలసిన పనులను వినుడు. క్షీర సాగరమున శేషతల్పమున నెమ్మదిగా పవళించి జగద్రక్షణ చింతను గావించుచున్న పరాత్పరుడగు శ్రీమన్నారాయణుని పాదారవిందములను కీర్తించి, అతడనుగ్రహించు వరకు నేయి భుజింపము. పాలు త్రాగము. ప్రాతః కాలమున మేల్కొంచి స్నానము చేసి కంటికి కాటుక దీర్చము. శాస్త్ర విధియుండినను పుష్పాద్యలంకారములను జేసికొనము. శిష్టాచారమును అతిక్రమించినడువము. పరులకనర్థములైన పొల్లుమాటలు, కొండెములు పలుకము. యాచకులగు జ్ఞానులకును, బ్రహ్మచారులకును, సన్న్యాసులకును వారివారి కనుగుణముగ యాచించు కొలదిని దానము నొసంగి, ఆత్మోజ్జీవన మార్గమును దెలిసికొని, సంతోషముతో దానిని పాటించుచు ఈ నోమును కొనసాగించవలయును. ఇది వ్రతనియమము.

సీ॥ భౌతిక భోగ సౌభాగ్య భూషితలార!
పరమ పదాప్తికి పథముగనుడు,
నీరాడి వేకువ క్షీరోదశాయి ప
న్నీ రేజములను గీర్తించి మేము,
చేసెడి వ్రతనిష్ఠ చెప్పెద చెలులార!
కైకోము పాల్నేయి గాని, మేము,
పూలను గైసేయ బోము కొప్పులయందు,
కాటుక వెట్టము కన్నుగవకు,

చేయగూడని చేతలు చేయబోము,
పరుల బాధించు పలుకులు పలుకబోము,
చేతనయి నంత యిత్తుముచేతులెత్తి
బీదలకు బూజ్య పాదుల కాదరమున.

**విశేషార్థము:-**

వైయత్తు వాళ్వీర్ కాళ్ -

భూమిపై జన్మించి యుండియు సుఖించుచున్న ఓ భాగ్యవతులారా! శ్రీమన్నారాయణుడు తన ఏకవింశత్య వతారములలో లేని సౌలభ్యము

యొక్క కొరతను తీర్చుటకై శ్రీకృష్ణుడై గోకులమున నవతరించి తన గొప్పతనమును కనబరచక అల్పునివలె నుండి ప్రవర్తించుచున్న సమయములో ఆతనితో కలసి సుఖించుటకై పెట్టి పుట్టిన భాగ్యవతులారా! ఈ సుఖమునకు పరమపద సుఖమొక సాటియా! ఆ పరమపదమున కేవలపరత్వాను భవమొక్కటియేగాని యాతని సౌలభ్య సౌశీల్యముల ననుభవించుట కుచితమైన స్థానమీ గోకులమే గదా!

పరమపదము త్రిపాదియగుటచే అక్కడ అనుభవించువారు అసంఖ్యాకములుగ నుందురు. సంసారము పాదపరిమితమగుటచే భోక్తలల్పముగనున్నను ఇక్కడ అనుభావ్యమగు భగవంతుని కల్యాణ గుణములు అసంఖ్యాకములుగ నుండును. ముముక్షువులుగాని, ముక్తులు గాని అనుభవింపగోరునదియు, భగవంతునిచే ననుభవింప జేయబడు నదియు, వారనుభవించునదియు - "సో శ్నుతే సర్వాన్కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి" - అనియు, "తస్మిన్ యదన్తస్తదు పాసితవ్యమ్" - అనియు శ్రుతి వాక్యములచే చెప్పబడు భగవత్కల్యాణ గుణములు చీకటి యందలి దీపము వలె విచ్చలవిడిగా ప్రకాశించునదీ లీలా విభూతి యందే. ఉపనిషత్తుచే అగ్నికి ఎరుపు రంగును, నీటకి తెలుపు రంగును, భూమికి నలుపు రంగును చెప్పబడుచున్నవి. కావున భూమికి తమోగుణము ప్రధానము. ఆ కారణము చేత ఆళ్వారులు భూమికి - "ఇరుళ్ తరుమా ఞాలమ్" - అని బిరుదు నొసగినారు. అనగా అజ్ఞానమును భూరిదాన మొసగు విశాలమైన భూమండలమని దాని కర్థము. ఆ గుణము జ్ఞానమునే పెంపొందించును. దానిచే నిచ్చటనున్న వారు పాపులుగనే ప్రసిద్ధులై యుందురు. ప్రవాహమున కెదురీదు నేర్పరులు లేకుందురా? శ్రియఃపతి అధికారి దోషమును చూడనట్టియు, చూచినను ఇష్టపడునట్లు చేయువాత్సల్యమును, ఒక్కసారి "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" - అన్నచో వారి పాపములను బాపగల ఓర్పును, పాపఫలమగు దుఃఖమును వారనుభవించు చుండగా చూచి సహింపలేనట్లు చేయు కృపయును అవశ్యకములగుచే నవిలీలా విభూతి యందే ప్రకాశించును. పరమపదమున నవి యున్నను వానికి విషయములు లేకుండుటచే పనిలేక పడియుండును. ఆ గుణములను అనుభవించుటకే నిత్య సూరులు తగునట్లు తమ రూపములను మార్చుకొని యిచ్చటికే వచ్చి అనుభవింప జూతురు. ఈ

విషయమునే ఈ క్రింది శ్లోకము ధృవీ కరించుచున్నది.

"అహృత సహజ దాస్యాః సూరయః స్రస్తబన్ధాః,
విమలచరమ దేహా ఇత్యమీ రఙ్గధామ!
మహితమనుజ తిర్యక్ స్థావరత్వాశ్రయన్తే!
సునియత మితి హస్మప్రాహురేభ్యో నమస్తాత్॥"
(రఙ్గరాజస్తవము. శ్లో.33)

ఓ రంగనాథా! నీ అర్చావతార ప్రయుక్తమైన కల్యాణ గుణములను అనుభవించుట కొరకై నిత్య సూరులను, ముముక్షువులును, ముక్తులును అగుప్రసన్నులునీ శ్రీరంగమున పూజనీయులగు భాగవతులుగను, పశుపక్ష్యాదులుగను, తరులతాగుల్మాదులుగను పుట్టి అనుభవించు చుందురని సాయించిన మహానుభావులకు మా నతి సందోహములు అని శ్లోక భావము.

అవతార సౌలభ్యమునకును, దయాది గుణములకును వశీభూతులైన వారు మరియొక స్థానమును ఏవగింతురు. శ్రీ రామచంద్రు డవతారమును చాలించి వానరులతోను, రాక్షసులతోను, కోసలవాసులతోను తన స్థానమగు పరమ పదమునకు పయనించు సమయమున శియతిరువడి (ఆంజనేయులు) శ్రీరామునితో -

"సేహోమే పరమోరాజన్! త్వయి నిత్యం ప్రతిష్ఠితః
భక్తిశ్చ నియతా వీర! భావో నాన్యత్ర గచ్ఛతి॥

అని విన్నవించినాడు. అనగా ఓ వీరాగ్రణీ! రామచంద్రా! నాకు నీయందనన్య భక్తి కలదు. అందుచేత నాకు నీతో పరమపదమునకు రావలయునను ఉద్దేశము కూడ లేదనెనట! ఇచ్చట "రాజన్" అని సంబోధించి "స్నేహః" అనుటయు, "వీర" అని సంబోధించి "భక్తి యనుటలో గల తారతమ్యమును గూర్చి కొంత తెలిసికొందము.

"రాజా ప్రకృతి రఞ్జనాత్" - అనినటుల తన పరిపాలనలో నున్న ప్రజల నానందింప జేయువాడు రాజు. అట్టి దృష్టితో నాకు నీయందు స్నేహము మాత్రమే యున్నదనియు, "వీర" యని సంబోధించుటచే - "వినా ఈరతే" - పక్షియైన గరుత్మంతునితో సంచరించు చున్నాడు గాన "వీర" యని యర్థము. ఇతడు నారాయణున కసాధారణమైన వాహనము గాన ఆ దృష్టితో

(నారాయణత్వ భావనలో) నీయందునాకు అనన్యమైన భక్తి కలదని తాత్పర్యము ధ్వనించుచున్నది. "భక్తి" యనగా శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో - "నాతో రావలదు, ఇంటి యొద్దనే యుండు" - మనగా ఆయన - "జ్వాలాన్మత్స్యా వివోద్ధృతౌ" - అని ప్రాణమే విడుతు ననెను. ఇది భక్తి, స్నేహమనగా విషయము తెలియకున్నను, ఒక వ్యక్తి యెడబాసినచో తెలియకుండగనే దశరధునకు వలెనే ప్రాణములు పోవుట.

ఈ విధముగనే తొండరడిప్పొడి యాళ్వారులును - " ఇన్దిర లోకమాళుం అచ్చువై పెరినుం వేణ్డేన్" (తిరుమాలై. పా.2) ఈ లోకమునందే యుండి భగవంతుని నామాను సంధానరసాను భవము లభించినచో స్వర్గమునకు పోయి దానినేలు నట్టి సుఖము లభించినను నేను కోర" నని సాయించినారు.

తిరుప్పాణి యాళ్వారులును "అమలనాదిపారాన్" అను గ్రంథము లోని 10 వ పాశురములో - "కొణ్డల్వణ్ణనై" - అను చోట శ్రీరంగనాదుని వర్ణించి, "కణ్ణకణ్ణిళ్ మత్తొన్నినైకాణావే" - అనుచోట శ్రీరంగనాధుని సేవించిన నా కన్నులతో పరమ పదవాసు దేవునైనను చూడ" నని సాయించిరి.

**వైయత్తు వాళ్వీర్‌కాళ్ -**

"ధ్యాయతో విషయాన్పుంసః" అనునట్లు సంసారులు భోగచింతన లోనే కాలమును గడుపుచు చివరకు - " బుద్ధినాశాత్ ప్రణశ్యతి" - అనునటుల ఉన్న జ్ఞానమును కూడ పోగొట్టుకొని నశించు ప్రపంచములో నుండియు భగవద్ధ్యానముతో కాలమును గడుపుచు చివరకు చరమ పురుషార్థమైన నిత్య నిరవచ్ఛిన్న భగవత్కైంకర్యమును బడయగల వారింతమంది యొకచో నుండటయేమి యాశ్చర్యమో! ఇది కుంపటిలో తామర పూవు వికసించినట్లున్నదని ఆండాళు తల్లి పరవశించుచున్నారు. "వైయత్తు వాళ్వీర్‌కాళ్" - అనుటచే పరమ పదము నందున్న వారు క్లేశపడుచున్నారని ధ్వనించుచున్నది. పరమ పదముననెన్నడును గాని అనుభవించని భగవంతుని కొన్ని కల్యాణ గుణములు గోకులమున కొల్లలుగ చూరగొనబడుచుండ పరమ పద వాసులగునా నిత్యముక్తులకు శ్రీరామ చంద్రుడు అడవికేగినపుడయోధ్యా వాసమువలెనున్నది. సుమిత్ర లక్ష్మణునితో "అయోధ్య నడవిగను, అడవినయోధ్యగను భావింపు" మని చెప్పినుటలున్నది

గదా! అయోధ్యా నామపూః" - అని ఛాందోగ్యశ్రుతి పరమ పదమునకు "అయోధ్య" అని పేరిడినది. వస్తువున కతిశయము గుణములను బట్టియే గదా! అని భగవంతునకు పరమ పదములో నున్నప్పటి కన్న లీలా విభూతిలోనే అధికముగా ప్రకాశించుటచే లీలా విభూతియే గొప్పది. ఇచ్చటనున్న వారందరును యోగ్యతను సంపాదించుకొని అచ్చటికి పోవలయునే గాని - " నచపునరావర్తతే - "అనావృత్తిశ్శబ్దాత్" అనుశ్రుతి, సూత్రములలో చెప్పినటుల అచ్చటివారు ఇచ్చటికి వచ్చి యీ సౌలభ్య, సౌశీల్య, వాత్సల్య, క్షాంతి, కృపాది గుణములననుభవించుట కెన్నడును నోచుకొలేదు గదా! అందుచేతనే ఆళ్వారులు ఇచ్చట నున్న భక్తులగు సంసారులను - "విణ్ణులారిలుం శీరియర్" - పరమ పద వాసులకంటె శ్రేష్ఠులని కొనియాడినారు.

పాఱ్కడలుళ్ పైయత్తుయిన్ద

నారాయణుడు ఆర్తులను రక్షించుటకై పరమపదము వారి కందరాకయున్నదని అచ్చటనుండి పాల సముద్రము వరకును పయనించి జగత్తును రక్షించు నుపాయము ఏదా అనునాలోచనలో నిమగ్నుడై ఆర్తులెవరైనను పిలుతురేమో యని చెవియొగ్గి శేష తల్పముపై పవళించి యున్నాడు. తాను "అ" కారవాచ్యుడగుటచే (అవ-రక్షణే) రక్షణ భారము తనదే గాన - "రక్ష్యాపేక్షాంప్రతీక్షతే" - అనునటుల నెవరైనను రక్షింపుమని తనను ప్రార్థింతురో అనియెదురు చూచుచుండునట. సర్వముక్తి ప్రసంగమును పరిహరించుటకు, పురుషార్థమగుటకును (పురుషునిచే కోరబడునది పురుషార్థము) అజీర్ణవ్యాధి గ్రస్తునకు విందువలె గాకుండుటకై ఆ మాత్రము ప్రార్థనను సర్వేశ్వరుడపేంచును.

పైయత్తు యిన్ద -

"తెల్లని పాల ప్రవాహము మీద నద్వితీయమైన శేషుని పక్కగా పరచుకొని దానిపై దొంగనిద్రను (త్రిజగద్రోణ చింతను) అనుభవించుచున్న" - అనుచున్నారు. ఈ నిద్రలోని తత్త్వమెరిగిన ఆళ్వారులు దీనిని దొంగనిద్ర అందురు. నిజముగ దేవతలు అస్వప్నులు గదా?

పాఱ్కడలుళ్ పైయత్తుయన్ద -

"నాగపర్యఙ్కముత్సృజ్య హ్యాగతో మధురాంపురీం" - అని యింతకు మునుపు చెప్పినట్లుగ శ్రీకృష్ణావతారమునకు మూలకారణమైన పాడదొడిగిరి.

**ఆడిపాడి -**

చేతనులైనచో శేషత్వమందరకును సమానమే. "దాసభూతాస్స్వతస్సర్వేహ్యాత్మానః పరమాత్మనః" అని కదా సిద్ధాంతము! ఆ మర్యాదచే "ఆడిపాడి" అనుట సమంజమే.

పాడినెయ్యుణ్ణోంపాలుణ్ణోమ్ -

ఇట్లు మహాపూరుషుని దివ్య నామసంకీర్తనమును చేసినేతినిగాని పాలను గాని సేవింపము. అనుటచే కేవలము నేతిని, పాలను మాత్రమే స్వీకరింపమని అర్థము కాదు. ఇట్టి భోగ్యపదార్థములను వేనిని కూడవాడమని భావము. "పాడి నెయ్యుణ్ణోం" అనుటచేత ఆ కంఠము గతివిన్న వారికి మరల తినపనిలేదని తాత్పర్యము. వీరు తినినారా? అన్నచో వినుడు పెరియాళ్వారుల శ్రీసూక్తి" - ఉణ్ణానాళ్ పసియావదొన్నుమిల్లై, నమో నారాయణావెన్ను ఉనపాదమ్ నన్నాదాళ్ అవై పట్టినివాళ్" - "ఎన్ని దినములు భౌతికాహారమును తినకున్నను ఆకలియనునదిసుమంతయును లేదు. కాని, నమో నారాయణా! అని నీ పాదారవిందములను సేవించని దినములే నాకు ఉపవాసదినములు". అనినారు. అట్టియుపవాసము ఈ గోపికలకు కలనైనను ఉండదు కదా! వీరికి ధారకపోషక భోగ్యములు కృష్ణుడే కదా!

ద్రావిడ భాషలో నమలి తినవలసినచో "ఉణ్ణ" అనియు, త్రాగ వలసినచో "కుడి" అనియు వాడవలయును. కాని, వీరు అట్లుగాక, "నెయ్యుణ్ణోమ్, పాలుణ్ణోమ్" అని రెండింటికిని తినుటయను అర్థముగల శబ్దమునే వాడినారు. గొల్లలంత చదువరులు కారు గదా? కావున శ్రీకృష్ణునికి" నెయ్యుణ్ణాన్, పాలుణ్ణాన్" అని వాడుక పేరైయుండెను. పెరియాళ్వారులు నీరాట్టములో యశోదాదేవి భావనలో - "కఱన్ద నల్పాలుంతయిరుంకడై న్దురిమేల్ వైత్త వెణ్ణెమ్, నీ పిఱన్దతువే ముతలాక సెత్తఱియేన్" అని సాయించిరి. పితికిన మంచి గుమ్మ పాలును, కమ్మని గట్టిమీగడ పెరుగును, తరచి యుట్టిలో పెట్టిన వెన్నను నీవు పుట్టినది మొదలు యెరుగవని యర్థము. ఈ గోపాంగన లందరును. అట్టివారే అందుచే వీరు తినదగినది, త్రాగదగినది అనుభేదమునే మరచిరి. దీని సారాంశ మేమనగా "మన మా శ్రీకృష్ణునితో సంశ్లేషించు వరకు ఉపవాసముతో శుష్కింపజేసి కొందమని వీరు నిశ్చయించుకొనినారు.

యోగ్యుడైన భక్తుడుపవసించుట వారి శత్రువుల కనర్థదాయకము. కఠోపనిషత్తునందు - "ఆశాప్రతీక్షే సంతంగ్ సూన్యతం చేష్టా పూర్తే పుత్ర పశూగ్ంశ్చ సర్వాన్, ఏతద్వృజ్తే పురుషస్యాల్పమేధసః యస్యా నశ్నన్వసతి బ్రాహ్మణో గృహే". అను మంత్రమున "ఎవని యింట బ్రాహ్మజ్ఞాని యగునొకడు ఉపవసించునో ఆ గృహయజమాని యొక్క సర్వస్వమును కూడ ఈ పాపము భస్మము గావించును." - అని యున్నది. అట్లే వీరుప తసించుట యెవరి యనర్థముల కొరకన్నచో వీరు తినినచో తృప్తి చెందువాడును, తినకున్నచో నుపవసించువాడును శ్రీకృష్ణుడే కావచ్చుననునట్లున్నది. "యస్యాత్మాశరీరం" అను నట్లుగా చేతనులు పరమాత్మకు శరీర భూతులు గదా! అందులకే వీరిట్లు చెప్పచున్నారు. "మద్భక్తం శ్వపచం వాపి నిందాం కుర్వన్తియేనరాః పద్మకోటిశతేనాపి నక్షమామి వసుంధరే!" అని తన భక్తుల నొక్క నిందావాక్యము పలికిననే సహించనివాడు వారు పవసించిన సహింపగలడా? తాను భుజింప వలెననిన వారిని భుజింపజేయవలయును గాన వెంటనే వారియభీష్టముల దీర్చును. నాట్కాలేనీరాడి - మిక్కిలి వేకువనే పోయి స్నానమొనరింతము.

ఆ శ్రీకృష్ణుడు వచ్చు సమయమునకు ముందుగానే మనము స్నానానుష్ఠానములన్నియు బూర్తిచేసికొని యుండవలయును. లేకున్నచో నాతడు మూడ చేతనులను రక్షించుటకు మంచియవకాశ ముండునని పాలసముద్రమును విడచి గోకులమునకు వచ్చుట వ్యర్థమని తలంచును. "ఆర్తార్తే, ముదితేహృష్టా, ప్రోషితే మలినాకృశా". అన్నట్లు తన భర్తనెడబాసిన స్త్రీ స్నానపానాదులను చేయక కృశించునట్లుగా శేషియగు సర్వేశ్వరుడును తన శేష భూతుల నెడబాసినచో తానును స్నానపానముల విడచి కృశించును. చేత నేశ్వరులను భార్యా భర్తృ సంబంధము సహజమే కదా! దీనికి దృష్టాంతము -" న మే స్నాం బహుమతం వస్త్రాంణ్యా భరణానిచ, తంవినా కయీా పుత్రం భరతం ధర్మ చారిణమ్" - విభీషణుడు పట్టాభిషిక్తుడైన పిమ్మట శ్రీరామచంద్రుని అభ్యంగన మొనర్చి నూతన వస్త్రాభరణముల ధరింపుమని ప్రార్థించు సందర్భములోనిదీ శ్లోకము. "నన్నెడబాసి భరతుడున్న రీతిగా ఆతని నెడ బాసిన నేనుండుట ధర్మము గదా!" అని తాత్పర్యము. దీనికి యింకొక తాత్పర్యము కూడ నున్నది. అది ఏమనగా - వీరు భరతునివలె తమ విరహతాపమును నివారింపజేసికొనుటకై "నోము" అని యొక మిషను

కల్పించుకొని స్నానము చేయగోరుచున్నారు. శ్రీరామాయణమున అరణ్య కాండలో శ్రీరామచంద్రుడు భరతుని గూర్చియిట్లను చున్నాడు. -

"అత్యన్తసుఖ సంవృద్ధః సుకుమార స్సుఖోచితః
కథన్వ పరరాత్రేషు సరయూ మవగాహతే."

పాపము మన భరతుడు మిక్కిలి సుఖ సాధనములతో పోషింప బడినవాడు. మిక్కిలి సుకుమారుడు. అట్టివాడు నీరు సూర్య కిరణములచే వేడి యెక్కక మునుపే అపరరాత్రులలో మేల్కాంచి తన రామ విరహ తాపమును చల్లార్చుకొనుటకై సరయూనది యొద్దకేగి యెట్లు స్నానమొనర్చు చున్నాడో గదా అని మిక్కిలి విచారించినాడు. అట్లే యీ గోపికలును సూర్యోదయమునకు ముందుగనే తాపోపశాంతికై చల్లని నీటిలో స్నానమును జేయనుద్య మించుచున్నారు.

ఈ పదము తత్తద్వర్ణాశ్రయోచిత మగు స్నానాది కర్మలన్నటికి నుపలక్షణము. దీనిచే ప్రపన్నాధి కారికి ఫలమును కోరక తన వర్ణాశ్రమములకు తగిన కర్మలు" కర్మకైంకర్యత్తిలే పుగుం". అన్నట్లు కైంకర్య బుద్ధితో చేయదగినవని సూచింపబడుచున్నది.

అన్దనైయుం - వారుతీసికొనగలిగినంత.

మనలనెంత మంది అడిగినను, వారెంత తీసికున్నను మన కంత సంతసము. వీరికి శ్రీకృష్ణ పరిచయముచే సంక్రమించిన గుణమిది. ఆయన పాత్రల గొనియాడు వాడు. "ఉదారాస్సర్వ ఏవైతే" - అనెనుగదా! "ఔదార్య" మనగా ఇచ్చినగాని యుండలేనట్టియు, అడిగిన దానికంటె అధికముగా నిచ్చునట్టియు స్వభావము. ఇది యిచ్చువాని ధర్మము. కాని, శ్రీకృష్ణుడీ ధర్మమును పుచ్చుకొనువారి కారోపించుచున్నారు. ఎవరైనను, "ఇదేమయ్యా అని అడిగిన "మేమతమ్" - నా యిష్ట "మనుచు", చతుర్థాం పురుషార్థాదా తాదేవశ్చతుర్భుజః "అనునట్లు నాలుగు భుజములను, నాలు పురుషార్థంముల నిచ్చుటకు చాచుకొని కూర్చుండును. అడుగువారు లేనిచో నాతని కెంతయో బాధ కదా! అందుచే" మత్తో యత్కిఞ్చినన గృహ్ణన్తి తేహి మమ సర్వస్వదాయినః" అని - నానుండి యే మాత్రము గైకొన్నను నాకు సర్వస్వము నొసంగువారే. "తీసి కొన్నవారు సర్వస్వము నిచ్చు వారెట్ల గుదురు.?" అని ప్రశ్న. "అశ్రిత సకల ఫలప్రదత్వం హిమమ సర్వస్వం" - అడుగువారు దేని నడిగినను ఇచ్చుట నాకు సర్వస్వమైన గుణము. అది

తీసికొను వారున్ననే గదా ప్రకాశించునది? కాబట్టి నానుండియే మాత్రమునైనను అర్థించి తీసి కొనువారు నాకు సర్వస్వము. నా సకల ఫలప్రదత్వమనెడు ప్రధాన ధనమును బ్రతికించినవారు అగుదురు. ఇది "మే మతం". అని సమాధానము.

ఎణ్ణి ఉగన్దు - ఈ తలంపు పుట్టి నది మొదలు కొనియే రుచించును.

"ప్రత్యక్షావగమనం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్." అను గీతలోని 9వ అధ్యాయారంభ శ్లోకమున భక్తి యోగమును ప్రశంసించుచు "సుసుఖంకర్తుం" - అని భగవాను డానతిచ్చెను. ధ్యానమునకు విషయమైన భగవంతుడు అన్ని విధముల సకల ప్రాణి మనోహరుడగుటచే అతనిని ధ్యానించుటయు మహదానందదాయకమగును. "కృష్ణేత్యక్షర యోరయం మధురిమో ధార: క్వచిల్లక్షిత:" - "కృష్ణా!" అను రెండక్షరముల నుచ్చరించు నపుడు ఉద్భవించు మాధుర్య రస్వాద మెందైన గలదే? అను నట్లాతని నామమే యింత యానందసంధాయకమై యుండనాతని రూపము, చేష్టలు, సూక్తులు మొదలగు వానిని తలంచుటచే కలుగు ఆనంద రసనిష్యంద మెందైన నుండునా? కాబట్టి వ్రతానుష్ఠానమునకు సంకల్పించి సంతోషముతో చేయవలసిన కార్యములను శ్రద్ధగా వినుడని అన్వయము.

ఈ పాశురమున "ఏలోరెమ్బావాయ్" - అను పాశుర శేషము పాద పూరణార్థమే, దానికి ప్రత్యేకార్థములేదు. ఇది యొక త్రింశద్దివస వ్రతము. దీనిని "యజ్ఞ" మన వచ్చును. ఇది దైవయజ్ఞము. భగవద్గీతలో భగవానుడు "అహం క్రతురహంయజ్ఞః" "నేనే క్రతువును, నేనే యజ్ఞములనియు వివరించియున్నారు. ఈ వ్రతము ఫలాపేక్షలేని నిత్యకర్మవంటిదే గాన దీనిని "యజ్ఞ" మనవచ్చును. "హతో యజ్ఞస్త్వ దక్షిణః" దక్షిణలేని యజ్ఞము నిష్ప్రయోజనము. ఆ దక్షిణయైనను సాత్త్వికమైనది కావలయును. దానికి లక్షణము గీతలో -

"దాతవ్యమితి యద్దానం దీయతే నుపకారిణే,
దేశేకాలే చపాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతమ్."
(భగీ. అధ్యా.17. శ్లో. 20)

సాత్త్వికములగు దేశకాల పాత్రలనారసి ప్రత్యుపకార కటాక్ష గంధము లేకుండగనే - "ఇచ్చుట నాధర్మ" మని శ్రద్ధా భక్తులతో నీయబడిన సాత్త్విక ధానము కావున నీ పాశురమున నట్టి దానమునే యీ వ్రతమున కంగముగా చేయవలయునని విధింపబడుచున్నది. వైదిక గ్రంథములందు

ఆధ్యాత్మిక క్రియలలో నియుక్తుడైన వ్యక్తికి ధానముచేయవలయునని ఉపదేశింపబడినది. విచక్షణ లేకుండ చేయబడు దానము అందుచెప్పబడి యుండలేదు. ఆధ్యాత్మిక పరిపూర్ణత కలవాడే ఎప్పుడు దానమునకు తగినవాడు. యాత్రాస్థలము నందు గాని, సూర్య చంద్ర గ్రహణముల సమయము నందు గాని, మాసాంతము నందుగాని, దేవాలయములందు కాని, అర్హుడైన బ్రాహ్మణునకో, శ్రీ వైష్ణవ భక్తునకో దానము చేయవలయునని ఉపదేశింపబడినది. ప్రతిఫలేచ్ఛ లేకుండనే అట్టి దానములను చేయుచుండ వలయును. ఒక్కొక్కప్పడు జాలిగా పేదవారికి దానము చేయబడు చుండును. కాని పేదవాడు కూడ దానమునకు పాత్రుడు కానిచో ఆ దానమునందు ఆధ్యాత్మికాభ్యుదయ ముండదు. పాత్రా పాత్రతలు చూడకుండ దానము చేయరాదని వైదిక గ్రంథముల అభిప్రాయము. దానములో సమానమైన సత్కార్యము మరియొకటి లేదు. "దానం యజ్ఞానాం వరూధం" - అని శ్రుతినుడువుచున్నది. ఒకరి కొక వస్తువు నిచ్చుటయే బంధ విమోచనమునకు మార్గము. ఒకరి వలన నొక వస్తువును దీసి కొనుటయే బంధహేతువు. రాజస, తామస, సాత్త్వికములని ఈ దానము మూడు విధములు. ఈయ వలయునను నిశ్చయముతో ఫలాభిసంధిలేక, ప్రత్యుపకార మపేక్షింపక పూర్వరచితోపకారమునకు బ్రతిఫలము గాక కాశీప్రయాగాది పుణ్యక్షేత్రములందు, సూర్య చంద్ర గ్రహణాది పుణ్యకాలములలో శాస్త్రోక్త లక్షణములు గల పాత్రకు బ్రతి గ్రహణమునకు యోగ్యుడైనవానికి నిచ్చునట్టి స్వర్ణ భూమ్యాది రూపమైన దానము సాత్త్విక దానమగును. ప్రత్యుప కారమును గోరిగాని, పుణ్యకాలము గాక పోయినను నా వలన నితడుపకరింప బడుగాక అను తలంపుతో గాని, స్వర్గాది ఫలము నపేక్షించి గాని, పశ్చాత్తాప యుక్తముగానీయబడునది. జసదానమగును. స్వభావము వలన గాని, సంసర్గము వలన గాని, దుష్టమగుటచేసి యోగ్యముగాని ప్రదేశము నందు అశుచిసమయమున యోగ్యుడుగాని వానికి నీయబడు నట్టిదియు, దేశకాల పాత్రములు మంచివి సమకూడినను బ్రియభాషణ పాదప్రక్షాళనాది పూజాత్మక సత్కారములు లేక పుచ్చుకొను వానికి బరిభవమగునట్లుగా నిచ్చునదియు దామస దానమగును. ఈ చెప్పిన లక్షణములను బట్టి పరిశీలించినచో యజ్ఞదానాదులు లెల్ల రాజసములో, తామసికములో యగుననియు, రాజసతామసికములు వర్జ్యములు కావున నట్టి దానాదులు నొనర్చుటేయల యనియు శంక కలుగ వచ్చును. అట్టి శంక నిరాధారముగాదు. ఎట్లన? రాజసతామసిక కర్మములను సాత్త్వికముగా

మార్చవచ్చును. ఏకర్మముగాని సంకల్పమును బట్టి సాత్త్వికమో రాజసమో తామసికమో యగును. సంకల్ప రహితముగా జేసినచో నెట్టిదియు సాత్త్వికమేయగును. సంకల్ప రహితముగా చేయజాలనిచో మనము చేయునది యెల్లబ్రహ్మార్పణముగా జేయవలయును. అట్లు చేయునపుడు మన సంకల్పము పదార్థమగును. సంకల్పము స్వార్థమైనప్పడే రాజసతా మసికములు దాని నంటియుండును. అది పదార్థమైనప్పదట్టి వాని కవకాశములేదు. ఈ యర్థమునే పైను దాహృత శ్లోకము తెలుపు చున్నది. ఎట్టి కర్మమైనను అనుట వలన నిషిద్ధ కర్మములు త్యాజ్యమని భావము.

చరాచరాత్మకమైన సమస్త సృష్టికి మూలభూతమైన తత్త్వమొకటి కలదు. దానిని బరమాత్మయని, పరబ్రహ్మమని అందురు. ఆ పరబ్రహ్మమునకు ఓమ్ అనియు, తత్ అనియు, సత్ అనియు మూడు పేర్లు వేదాంతవేత్తలైన ప్రాచీన ఋషులు నిర్దేశించియున్నారు. ఇప్పటి వారును ఆ పేర్లనే గ్రహించుచున్నారు. ఓమ్ అనునది బ్రాహ్మణాది కర్తలను, తత్ అనునది వేదాది కరణములను, సత్ అనునది యజ్ఞాది కర్మములను సూచించుననియు, కర్తృకరణ కార్యములను దత్కారణమైన మూలమునకు సమర్పించుటయే బ్రహ్మార్పణమనియు, బ్రహ్మార్పణమస్తు అనుటకు మారుణా ఓం తత్సత్ అన్నచో నదే భావమగునియు అట్లు చేసినచో ఆయా క్రియలలోనే దేని కాలుష్యమున్నను నశించుననియు గ్రహింపవలయును. అనగా ఓం తత్సత్ అనునది బ్రహ్మార్పణమస్తు అనుటకు బర్యాయపదమని భావము. ఓం అనునది వ్యక్తా వ్యక్తములకు బరముననున్న మూల తత్త్వమనియు, తత్ అనునది దాని అనిర్వచనీయత్వమును దెలుపుననియు, సత్ అనునది అపర తత్త్వము. త్రికాలాబాధితము, నిర్వకార నిర్వికల్ప నిత్యము నైయేకరాశిగా నుండుటను తెలుపు ననియు నందురు. పరబ్రహ్మ నామధేయమైన ఓం తత్సత్ అను దానిలో ఓంకార మొక యవయము. శాస్త్ర విహితములైన యజ్ఞదాన తపఃక్రియలు ఓంకారోచ్చారణ పూర్వకముగా నొనర్చినచో ఆ క్రియలలో ఏదైనను వైగుణ్యమున్నను రహితమగును. ఓం తత్సత్ అనుమూడింటిలో నొక్కటైన ఓంకారము నుచ్చరించి చేసిననే అంత నిర్దుష్టములగు చుండగా మూడింటి నుత్సరించి చేసినప్పడిక జెప్పనదేమున్నది?

# మూడవ పాశురము

# "ఓజ్గి యులగళన్ద"

## -అవతారిక-

మన ప్రాచీనాచార్యులకు "నారాయణ" పదమును ముందుగా ప్రయోగించినచో వెనువెంటనే దానికి ముందుండు గ్రంథములో దాని అర్థమును చెప్పటయును, ముందుగా నర్థమును జెప్పినచో వెంటనే శబ్దమును జెప్పటయునను నాచారము కలదు. మొదటి పాశురమున "నారాయణనే నమక్కే పఱైతరువాన్" అని నారాయణ పదమును ప్రయోగించినారు. పిమ్మట రెండవ పాశురములో "పాఱ్కడలుళ్ పైయత్తు యిన్ఱ" - అనుటచే రక్షణాధ్యవసాయమును, దానికి కావలసిన సర్వశక్తిత్వ స్వామిత్వ, వాత్సల్య ప్రభృతి గుణ జాతమును చెప్పబడినవి. ఈ పాశురమున ఉభయ విభూతి యోగమును, అంతర్బహిర్వ్యాప్తి మొదలగు అర్థములును చెప్పబడుచున్నవి.

"నార" అను పదమునకు నిత్య పదార్థసమూహ మని అర్థము. ఆ పదార్థములు స్వరూపమును బట్టి స్వరూపముతో నిత్యమైనవియు, ప్రవాహరూపముతో నిత్యమైనవియు అని రెండు విధములుగ నుండును. స్వరూపముతో నిత్యమైనవి అనగా సహజముగా ఉత్పత్తి వినాశములు లేని పరమ పదమున నుండు పదార్థములు. ప్రవాహ రూపముతో నిత్యములైనవి అనగా నదీ ప్రవాహమున మనము చూచుచున్న నీరు ఉత్తరక్షణమున నచ్చటలేకున్నను, మరియొక నీరు ఆ స్థానము నాక్రమించి ప్రవాహమును సాగించుచుండును. అట్లే యొకే రూపముతోనే వస్తువును కాన్పించకున్నను వస్తువు నశించక మరియొక రూపముతో కాన్పించుచునే యుండును. కుండపగిలి పెంకులును, అవి చితికి చూర్ణమును అగును. మన్ను లేకపోలేదు గదా! ఆ మన్ను నిత్యమైనదే. ఇదియే చాందోగ్యోపనిషత్తులోని సద్విద్యా ప్రకరణమున "మృత్తికేత్యేవ సత్యమ్" అని చెప్పబడియున్నది. ఈ రెండు విధములగు నిత్య పదార్థములకును నారములని పేరు. కావున నీ పదముచే లీలా విభూతి యనబడు భగవంతుని క్రీడకు పరికరమైన బ్రహ్మాండములును భోగవిభూతి అనబడును -

"వైకుణ్ఠే తు పరేలోకే శ్రీ సహాయోజనార్ధనః,
అస్తే విష్ణు రచిన్త్యాత్మా భక్తైర్భాగవతైస్సహా॥

అనునట్లు శ్రీమన్నారాయణుడు శ్రీ, భూ, నీలాదేవులతోను, నిత్య ముక్త బృందముతోను నిరంతరమును భోగములననుభవించుచుండు శ్రీ వైకుంఠ లోకమును, తెలుపబడుచున్నవి. కావున నారాయణ పదముచే ఉభయ విభూతి యోగము చెప్పబడుచున్నది. ఈ పాశురమున నా యర్థము త్రైవిక్రమ వృత్తాంతముచే సూచింపబడుచున్నది. ఈ యవతారమున నొక పాదముతో క్రింది లోకములను, పైకి జూపిన పాదముతో పై లోకములను కొలచి వానిని తనవిగ స్వాధీనము చేసికొనుట సూచింపబడుచున్నది.

శ్రీవ్రతమును అనుష్ఠించుచున్న గోపాంగనలకు ఫలాపేక్ష లేకున్నను, తమను నోము నోచుటకై అనుమతి నొసంగిన వారికి కృతజ్ఞతా సూచకముగ పాడియును, పంటయును సమృద్ధిగా నుండవలయునని కోరుచున్నారు. ఈ పాశురమును మనవారు బ్రాహ్మణేతరుల శుభ కార్యములలో వారి కాశీర్వచనముగా అనుసంధించి అక్షతలు ఉంచుట ఆచారములో నుండుట అందరెరిగిన విషయమే!

భగవానుడు అర్జునునకు భగవద్గీత నుపదేశించుచు, వేదాధ్యయనమువలనను, వివిధ వేదాంత గ్రంథములవలనను పొందదగిన జ్ఞానమున కంతటికిని సారభూతమైన తొమ్మిదవ అధ్యాయారంభమున ఉపాసనము ముఖ్యమగు ఉపాస్యుని కల్యాణగుణముల నెరిగిన నాతనికి తనయందు ప్రీతి యతిశయించునని తెలుపుటకు ముందు - "ప్రవక్ష్యామ్యన సూయవే" - నీకు అసూయ లేక పోవుటచే నీవు నా గుణములయందు దోషారోపణ చేయవుగాన నీకీ రహస్యమును చెప్పచున్నాననెను. ఇది రహస్యములలో నెల్ల పరమ రహస్యమైనది. ఇందు జ్ఞాన విజ్ఞానములు రెండును జేరియున్నవి. విద్యల లోపల నుత్తమ విద్య, రహస్యములలో నుత్తమ రహస్యము, పవిత్రమైనది, ఉత్తమమైనది, ప్రత్యక్షముగ బొందదగినది, ధర్మమైనది. ఆచరించుటకు సులభమైనది. నాశములేనిది. దీనిందెలిసి కొనగలిగినచో అశుభమగు సంసారము నుండి తప్పించుకొన వీలున్నది. అసూయ అనగా సత్పురుషుని సద్గుణముల యందు దోషము నారోపించు దుర్జనుని దుర్గుణము." అది నీకు లేదుగాన అట్టి యమోఘ విషయములను నీకు తెలుపుచున్నా" ననెను. "అక్షాన్తి రీర్ష్యా అసూయా తుదోషా రోపోగు

తేష్వపి" అసూయ ఈర్ష్య వంటిది కాదు. అది యెట్టి దనగా -

"జాడ్యం హ్రీమతి గణ్యతే, వ్రతరతే దమ్భ, శ్శుచే కైతవం,
శూరే నిర్ఘృణతా, మునౌవిమతితా, దైన్యంప్రియాలాపిని,
తేజస్వి న్యవలిప్తతా, ముఖరతా వక్తరి, అశక్తిస్థిరే,
తత్కోనామ భవేత్సుగుణినాంయో దుర్జనైర్నాఙ్కితః".

యథేష్టముగా సంచరించక పెద్దల యెడల సంకోచముతో వర్తించు సజ్జనుని దుర్జనుడు జడుడనును, నియమ నిష్ఠలు కలవానిని దాంభికుడనును, సదాచార సంపన్నుని నటనయనును, శూరుని దయా విహీనుడనును, సత్యమునకై మితముగా మాటాడు వానిని మతి హీనుడనును, అందరకును ప్రియముగా మాటలాడు వానిని దీనుడనును, తేజోవంతుని గర్విష్ఠియనును, నేర్పుగా మాట్లాడు వానిని వదరబోతనును, దీర్ఘాలోచన పరుని శక్తి విహీనుడనును, దీనిని బట్టి చూడగా దుర్జనుడు పేరుపెట్టి యాక్షేపించని సజ్జనుని గుణమొక్కటి యైనను కలదా? అని పించును. దీనినే "అసూయ" అందురు. పై శ్లోకములోని భావమిది. సజ్జనుని గూర్చి ఎరుగ కుండగనే ఆతని శీలమును విమర్శించువాడు అజ్ఞానుడు. అందుచే అట్టి వాని మాటలను పరిహరించుట యందు మిక్కిలి జాగరూకత వహించవలయును.

గీతోపదేశమును ముగించుచు భగవానుడు ఫలశ్రుతిలో దీనిని భక్తుల గోష్ఠిలో అర్థవిశేషములతో నుపన్యసించువానికి ముఖ్యమైన మోక్షమునే ఫలముగా జెప్పెను. అంతేకాదు - ఆచార్యుల ద్వారా గీతార్థముల నధిగమించిన వానికిని, దీని కర్థము నెరుగకున్నను ఆచార్యుల యుపదేశము ద్వారా మూల శ్లోకముల నెరిగి కంఠస్థ పరచువానికిని, కంఠస్థపరచలేకున్నను మిగుల ఆసక్తితో ఆచార్యుల ద్వారా వినిన వారికిని, ఆ విధముగ వినుటకైనను అవకాశము లేనివారు పైన జెప్పబడిన యోగ్యతలు కలవారిని జూచి అసూయ పడనివారికిని ఫలములను జెప్పచు, అట్టివారు భగవద్భక్తికి ఆటంకములైన పాపములను బాపుకొని క్రమముగా ముక్తిని బడయగలుగుదురని సెలవిచ్చి యుపదేశమును పూర్తిచేసెను.

ఆ విధముగనే యీ వ్రతము ననుష్ఠించు గోపాంగనలను జూచి అసూయను జెందక అనుమతించి, ఆనందించువారి కొరకై పాడిపంటలను, ఫలముగా జెప్పచున్నారు.

# మూడవ పాశురము

ఓఙ్గి యులకళన్ద వుత్తమన్ పేర్ పాడి,
నాఙ్గళ్ నమ్బావైక్కు చ్చాత్తి నీరాడినాల్,
తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు,
ఓఙ్గు పెరుఞ్శెన్నె లూడు కయలు కళ,
పూఙ్గువళై ప్పోతిల్ ప్పొఱివణ్డు కణ్పడుప్ప,
తేఙ్గాతే పుక్కిరున్దు శీర్తములై పత్తి
వాఙ్గ, క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళ ప్పెరుమ్బ శుక్కళ్,
నీ ఙ్గాద శెల్వమ్ నిఱైన్దేలో రెమ్బావాయ్.

ఓక:- నాఙ్గళ్-మనము, నమ్-మనయొుక్క, పావైక్కు-వ్రతము (నోము) కొరకు, ఓఙ్గి-బాగుగా పెరిగిపోయి, ఉలగు-లోకములను, అళన్ద-కొలచిన, ఉత్తమన్-పురుషోత్తముని, పేర్-తిరునామమును, పాడి-అను సంధించి (గానముచేసి), చాత్తి-నోము నెపము చెప్పి, నీరాడినాల్-స్నానము చేసినట్లైన, తీఙ్గు-దుర్భిక్షము, (అతివృష్టి, అనావృష్టి దోషములు), ఇన్ఱి-లేక, నాడెల్లామ్-దేశమంతట, తిఙ్గళ్-మాసమునకు, ముమ్మారి-మూడు వానలు, పెయ్దు-వర్షించి, ఓఙ్గ్-ఉన్నతమైన, పెరుంశెన్నెల్-చక్కని పాడి పంటలతో, ఊడు-మధ్యప్రదేశమందు, కయల్-మత్స్యములు, ఉగళ-త్రుళ్ళుచుండగా, పూమ్-మనోహరమైన, కువళై-కలువలు అను, పోదిల్-పుష్పము లందు, పొతి-కాంతి గల, వణ్డుం తుమ్మెదలు, కణ్‌పడుప్ప-నిదురించగ, పుక్కు-గోశాలప్రవేశించి, తేఙ్గాదే-చలించక, ఇరున్దు-కూర్చుండి, శీర్త-బలసిన, ములై-పశువుల పొదుగులను, పత్తి-పట్టుకొని, వాఙ్గ-పిండగా, వళ్ళల్-ఔదార్యము గల, పెరుమ్-గొప్పవైన, పశుక్కల్-పశువులు, నీఙ్గాద-ఎడతెగని, శల్వమ్-ఐశ్వర్యము, నిఱైన్దు-సంపూర్ణమగునట్లు కుడమ్-కుండలకు, నిరైక్కుమ్-నింపును, ఏల్-ఇట్టైనచో, ఎంపావాయ్-మా అభిప్రాయమును అనుసరించుటకు, ఓర్-యోజింపుము.

తా:- తమ కీవ్రతానుష్ఠాన ప్రధాన ఫలము శ్రీకృష్ణ సంశ్లేషమే యైనను దీనికి అనుమతించినవా వారికి కలుగు ఐహిక ఫలములను కూడ నిందు చెప్పచున్నారు. బలిచక్రవర్తి నుండి దానము పొందగలిగిన సంతోషముతో త్రివిక్రముడై లోకములను కొలిచి, స్వాధీనము గావించుకొనిన తిరునామమును గానము చేయుచు, మనము మన సాధనమునకు

శ్రీవ్రతమను పేరుపెట్టి దానికి అంగముగా స్నానమును గావించినచో భూమిలో నెవ్వరికిని ఏ విధములగు నుపద్రవములు నుండవు. ప్రతినెలలోను పది దినముల కొక వర్షము చొప్పన మూడు వానలు కురియును. వరి పొలములున్నతముగా పెరుగును. నీటి కొరత లేకుండుటచే వరిమళ్లలో చేలమధ్య చేపలు త్రుళ్ళుచుండును. ఆ మళ్లలో నీటి సమృద్ధిచే పుట్టిన కలువ పువ్వులలో నందమైన తుమ్మెద దంపతులు మకరందమును త్రాగుచు నిదురించును. ముంజేతి బలముకలవారు సాహసముతో పాలను పితుకుట కుద్యమించి, పాలిచ్చునంత వరకును కదలకుండ నోపికతో కూర్చొనియుండి పొదుగు పై చేతినుంచి, లాగినంతనే ఆయుదారములగు గొప్ప ఆవులు పాలకై పెట్టిన కుండల నన్నింటిని నింపివేయును. ఎంత అనుభవించినను తరగని ఐశ్వర్యము లభించును. కనుక, ఈ వ్రతమును అందరము ఆచరింతము.

తెలుగుసేత-

మెల్లమెల్ల మినుమించి, మెయి పెంచి లోకాల
గొలిచన వామను, గొలిచిమేము
నోము దానముచేయ బాము లెల్లను బాయు
నెలమూడు వానలు నెమ్మి గురియు,
వెన్ను వంగిన మళ్ల జెన్నొందు కలువపూ
పొదలతో మించు తుమ్మెదలు మొదలు,
కయ్యల నీటిలో గాడలు కదలంగ
దుడుకు బేడిపలు దుందుడుకు సేయు

కుండ పొదుగుల పశువుల గోష్ఠములను
పిడికిలికి వెక్కసంబగు కొడులిబట్టి,
పిండ గురియును కడవల నిండబాలు,
సంపదలు వెల్లవలు గట్టి పెంపుదనర.

విశేషార్థము:-

ఓజ్జి - పెరిగి.

వామనమూర్తి తన కోరిక సఫలమగు వరకును సంకుచిత స్వరూపుడై యుండుటయును, అది సిద్ధించిన సంతోషముతో పెరిగి

త్రివిక్రముడగుటయును "అవికారాయ శుద్ధాయ", "సదైక రూప రూపాయ" - అను ప్రమాణములను బట్టి నిర్వికారుడగు శ్రియః పతికి తగునా? అన్నచో - ఆ వికారములు సంసార చేతనులకు వలె కర్మమూలకము లైనను, స్వార్థములైనను దోషములుగా లెక్కింపబడును. కాని, పరమాత్మ కృత్యములు పరులకొరకు కృపతే చేయబడునవి గాన గుణావహములే యగును. "కృప" - అనగా పరుల దుఃఖముల జూచి సహించలేక పోవుటయు, వానిని తొలగించవలయునని యిచ్ఛగించుటయును, వారిని జూచి దుఃఖించుట యును పరమాత్మకు కృపయని చెప్పదురు". అవాప్త సమస్తకాముడును, నిరతిశయా నందయుక్తుడునునగు శ్రియః పతికిని దుఃఖముండునా? అని శ్రీ భట్టరు వారి నొకరు ప్రశ్నింపగా - వాల్మీకి రామాయణమున "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" - తన రాష్ట్రము నందలి ప్రజల కొక దుఃఖము దాపురించినచో రాముడు వారికంటె నెక్కువగా దుఃఖించునని వర్ణించెను గదా? అని చెప్పగా, ఆ స్వామి "స్వామీ! అది అవతార ప్రసంగము గదా! నా ప్రశ్న పరమ పదవాసుని గురించి" అనిరి. దానిని విని భట్టరు వారు - "అది గుణప్రకరణమా? దోష ప్రకరణమా?" ' అని ప్రశ్నించిరి. శ్రీరామచంద్రుని యౌవరాజ్య పట్టాభిషేక సందర్భములో ప్రజలు దశరథుని మ్రోల శ్రీరామచంద్రుని కల్యాణ గుణముల వర్ణించు ఘట్టమిది. ఈ గుణములలో నిది యొక సద్గుణమే యైనపుడు ఇది దోషమెట్లగును? ఆతడెచ్చట నున్నను అది యాతనికి గుణమే యగును. సాంస్పర్శికములను, సాంకల్పికములును నగుచో నొక దేశ విశేషమున బట్టియు, నొక కాల విశేషమును బట్టియు, ఒక యవస్థా విశేషమును బట్టియు మారుచుండును. ఇది స్వాభావిక సహజ గుణమగుటచే నెచ్చటనే యస్థలో నున్నను గుణము గుణమే, దోషము కానేరదని సాయించిరి.

ఈ శ్లోకమున "భృశం", "మనుష్యాణాం", - అనుటచే తన అంతఃపుర పరివార విషయమే కాదు. ఈ దయ, సకల మానవ విషయమైన దనియు, "రాజారాష్ట్ర కృతం పాపం" - అనునటుల నా రక్షణలోని యేమరుపాటు వలననే గదా వీరికీ దుఃఖ మీతనికి రెట్టింపుగా నుండును. ఈ దయకు పాత్రా పాత్ర విభాగము లేదు. ఎట్టి వాడైనను సరియే, ఆపదలో నున్నచో నీ కృప ప్రసరించును.

మాఱు నేరను నొక చిఱుపల్లెయందొక చండాలుడు గొప్ప ఆపదలో

నుండి యెదురుగా వచ్చుచుండగా వానిని జూచి యొక శ్రోత్రియస్వామి కలత చెందిన మనస్సుతో "వెళ్ళు ... దూరముగా వెళ్ళు" - అని గర్జించినాడు. ఆ మాటలను అచ్చటనేయున్న రామానుజ దాసుడను నొక భాగవత శ్రేష్ఠుడు" - అదేమి స్వామీ? ఆతనెంత ఆపదలో వచ్చుచున్నాడో గమనించితిరా? ఆతనిని గద్దించుట తగునా? మీకు గిట్టనిచో తప్పకొని పోవచ్చు గదా! అది సరికాదని పించినచో నింటికి పోయి సచేల స్నానమాచరింప వచ్చును గదా?" అనినాడు. "అదేమండి, శాస్త్ర విరుద్ధములగు మాటలను చెప్పుచున్నారు? ఆతడాపదలో నున్నచో నితరులైనచో ప్రక్కకు తొలగి పోవుదురు. కాని, బ్రాహ్మణుల విషయమట్లు కాదు. ఆతడే తొలగి పోవలయును. ఇది శాస్త్ర నిర్ణయము. ఈ విషయమునైనను మీరు ఎరుగుదురా?" అని శ్రోత్రియుడెదురు ప్రశ్న వేసినాడు. అందులకా దాసుడు - "ఓ దయా విహీనుడా! దయకొక శాస్త్రమును, కట్టుబాటును కూడనా? అది సరియేగాని, నీవు శరీరము నుండి శరీరమును దూరము చేయగోరితివా? లేక చైతన్యము నుండి చైతన్యమును దూర మొనర్ప గోరితివా?" అని ప్రశ్నించెను.

ఈ ప్రశ్న ఆశ్రోత్రియునికి దిగ్భ్రాంతి గొల్పినది. తన హృదయా కాశములో క్రమ్మియున్న భేదభావ మేఘములను ఈ ప్రశ్న ఝంఝా మారుతమువలె చెదరగొట్టినది. శాస్త్రజ్ఞుడు గావున తన తప్పను గ్రహించు కొనగలిగినాడు. తనలో తానిట్లు వితర్కించుకొనినాడు. - "అహో! నే నెంతటి అజ్ఞానిని. అశాశ్వతమైనట్టి శరీరమునకు సంబంధించిన ఆచారము. మడి అను మూఢనమ్మకములకు లోనై పురుగువలె యీ మురికి కూపములో బడి ప్రగ్గుచున్నాను. నేను ఆత్మను మరచినాను. ఆత్మ పరమాత్మ స్వరూపమని తెలిసికొనలేక పోయినాను. ఆత్మవత్సర్వ భూతాని అను భగవానుని ఆశయమును గ్రహింపలేక పోయితిని. అస్పృశ్యుడీ చండాలుడు కాదు. ఆతనిని అస్పృశ్యునిగా భావించిన నేను అస్పృశ్యుడను. అజ్ఞాన మనెడి గాఢ నిద్రలోనున్న నన్ను మేల్కొల్ప వచ్చిన మహాత్ముడు గాని సామాన్యుడు గాడు. అయ్యో, నా పాండిత్య మెందులకు?" అని ఆ చండాలునికి శిరమోడ్చి నమస్కరించినాడు. చండాలుడైనను సమ దర్శనము కలిగియున్నచో అతడే జ్ఞాని. శుద్ధచైతన్య స్వరూపములో భేదము అవాంఛనీయమనియు, దీనిని చక్కగా తెలిసినవాడు మనీషులుగా మారి, భేద భావములు విస్మరించి,

సమదర్శన వీక్షణముతో మహాత్ములు కాగలరను పరమ విశ్వాసముతో వారికి అనంతకోటి పాద ప్రణామములర్పించి వీడ్కొని వెళ్లెను.

శ్రీమద్భగవద్రామానుజుల ప్రియ శిష్యుడగు శ్రీ కూరేశుల తిరువధ్యయనము నాడొక అరటియాకును కోసి దాని నుండి కారుచున్న సొనజూచి, "అయ్యో! ఈ చెట్టున కెంత బాధను కలిగించితిని!" అని యచ్చటనే సొమ్మసిల్లిచాల సేపుండిపోయిరట! అహో! ఆతని భూతదయ యెంత స్పృహణీయము! రాజ్య సుఖమును, సంసార సుఖమును పోగొట్టుకొని చెట్టును, పుట్టను పట్టి తనవలెనే అలమటించుచున్న సుగ్రీవుని, వానరుడైనను, శ్రీరామచంద్రు డాతని యందు జాలితో నాతని శత్రువగు వాలిని జంపి, రాజ్యమున నిలిపెను. కర్తవ్య ధర్మమునుపదేశించి నంత మాత్రముననే విభీషణుని రావణుడవమానించి లంక నుండి వెడల గొట్టగా శ్రీరాముడాతని యందలి కృపతో రావణుని జంపియా విభీష్షణునకు లంకా రాజ్యాభిషేకమును గావించి, "విజ్వర: ప్రముమోదహ:" అనునట్లు తన మనస్తాపమును తొలగించుకొని సంతోషించుట - అనునవి అధికారులను బటిట్టయా? తన కృపా గుణమును బట్టియా?

"యావన్న చరణౌ భ్రాతు: పార్థివవ్యఞ్జ నాన్వితే,
శిరసా ధారయిష్యామి నమే శాన్తిర్భవిష్యతి."

నా ప్రియ సోదరుడగు శ్రీరామచంద్రుని చక్రవర్తి చిహ్నములతో నలరారు శ్రీ పాదములను నాతలపై దాల్చినగాని నా మనస్తాపము చల్లారదని భరతు డాశించిన పాదములతో గదా భూ భాగము నంతటిని కొలచినది! కొన్ని యుగముల వరకును విమోచనను గాంచని అహల్యా శాపమును బాపిన చరణారవిందములతో గదా కఠినమైన భూతలమంతను కొలచినది! సృష్టి కర్తయైన ప్రథమ బ్రహ్మ యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగుటకై కడగిన దివ్య మంగళ పాదములతో కదా త్రిభువనములను కొలచినది!

**ఓజ్జయుల గళస్థ-**

దీనికి మొదటి వ్యాఖ్యానములో - "యాచన లభించుటకు పూర్వము పొట్టివాడై" - అనుచోట యాచనలోని నీచతను గమనించి - "భక్షితే పిలశునే నారిష్ట శాన్తి". - ఉల్లి తినినను రోగము కుదుర లేదు - అనునట్లు - నీచ వృత్తికి పాల్పడినను ఫలము సిద్ధించునో లేదో యని పొట్టిగా

నయ్యెనట! ఇచ్చట యాచనలోని నీచతకు శ్రీ వేదాంత దేశికులవారి "వైరాగ్య పంచకము" లోని క్రింది శ్లోకమును (చదువ వలయును) మిక్కిలి గమనింపదగినది.

ఓజ్జి -

సంస్కృత భాగవతము నందలి వామనచరిత్రలో క్రింది శ్లోకమును చూడుడు-

బలివామన సంవాదము-

కస్త్వం బ్రహ్మ?న్నపూర్వః, క్వచతవ వసతిః?యాఖిలాబ్రహ్మసృష్టిః,
కస్తేత్రాతా? హ్యనాథః, క్వచతవపితరౌ? నైవతాంతంచజానే।
కస్తేభీష్టం దదాని? త్రిపద పరిమితాభూమిః, అత్యల్పమేతత్
త్రైలోక్యం, భావగర్భం బలిమితి చవదన్ వామనో నస్సపాయాత్॥

టీకః -

బలిః- బ్రహ్మన్త్వంకః? = పూజ్యుడవగు నో బ్రాహ్మణుడా నీవెవరవు? వామనః అపూర్వః నేను = క్రొత్తవాడను, నాకు వెనుక నెవ్వరును లేరు (నేనాది పురుషుడను)

ఎట్టివారు ఉత్తములు?

ఉత్తర రామాయణ నాటకములో భవభూతి శ్రీరామభద్రుని ప్రభుత్వ భారవిషయమైన యుత్కర్షాతిశయమును ఎట్లు వెల్లడించెనో చూడుడు. అష్టావక్ర మహర్షి వసిష్ఠుని సందేశము రామున కీవిధముగ జెప్పెను-

"జామాతృ యజ్ఞేన వయం నిరుద్ధా
స్త్వం బాల ఏవాసి నవం చరాజ్యమ్।
యుక్తః ప్రజానామనురంజనేస్యాః
స్వస్మాద్యశో యత్పరమం ధనంవః॥"

దీనికి తెలుగు సేతః-

అల్లుడొనరించు క్రతువున నాగినాము,
బాలుడవు నీవు నూత్నంబు పాలనంబు,
ప్రజల యనురంజనంబె కార్యంబుమీకు
దనువుకంటెను గీర్తి యుత్తమధనంబు.

శ్రీరాముడు గురువు లాజ్ఞాపించినట్లే చేసెదని చెప్పి, గురు సందేశమునకు బ్రత్యుత్తరముగ దన యభిప్రాయమెంత గంభీరముగ జెప్పెనో తిలకింపుడు-

"స్నేహం దయాంచ సౌఖ్యంచ యదివాజానకీ మపి।
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తిమే వ్యథా॥"

తెలుగు అనువాదము :-

ప్రజల యారాధనంబె నా ప్రాణపదము
దానికై స్నేహమునుగాని, దయనుగాని,
సౌఖ్యమునుగాని, తుదకు నీ జనకతనయ
గాని, విడిచెద బాధయింతేని లేక.

శ్రీరామచంద్రుడు ప్రజలను రక్షించుటకై అవసరమైనచో తన ప్రాణమునైనను, అంతకంటె ప్రియమైన సీతామాతను, అంతకన్నను పుట్టినది మొదలు ఒక్క క్షణకాలమైనను విడువక కూడనుండు లక్ష్మణుని సైతము విడచుటకు వెనుకాడనని ప్రతిజ్ఞ గావించినాడు.

తమ ప్రయోజనమున కంతరాయము లేకుండగా నితరుల కొరకై పాటుపడువారు మధ్యములు. స్వార్థమునకై పరులను పీడించి పొట్టను నింపుకొనువారు అధములును, మానుష రాక్షసులునునట! ఇక, తమకు లేకున్నమానె, ఇతరులకు ఉండనేల? అను నీర్ష్యతో పరులను పీడించు దుర్యోధనాలుల వంటివారికి భాషలో పేరేలేదట!

ఉత్తమన్ పేర్పాడి-

లోకమున బద్ధులనియు, ముక్తులనియు జీవులు రెండు విధములు. "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః" - వారిద్దరికన్నను విలక్షణుడగుటచే పరమపురుషుడు "ఉత్తమ పురుషుడు"- అనబడు చున్నాడు. ఇది శ్రుతి, స్మృతి సిద్ధాంతము. అట్టివాని "పేర్పాడి"- అనగా తిరునామాను సంధానమును చేయుదము.

గోదామాత పుడమిపై నవతరించుటకు బూర్వమే చేతనుల నందరను ఎట్లు ఉద్ధరింతునా యని చాలకాల మాలోచించి యేమియుం దోపక విచారవదనై యుండెను. అది గాంచిన భగవానుడు- "దేవీ! విచారింపకుము. నీ శంకకు సమాధానమును నేను సృష్టి ప్రారంభమునందే

నిశ్చయించి యున్నాను. నా నిర్ణయమును నీకు చెప్పెదను వినుము (1) భగవానుడనగు నన్ను శరణుబొందుట, (2) పుష్పమాలా కైంకర్యము, (3) నాకల్యాణ గుణములను పాడుట యనునవి సర్వసాధారణములును, సర్వోత్తములునగు ఈ మూడింటిని భక్తిశ్రద్ధలతో పాటించు సమస్త చేతనులకును మోక్షము కరతలామలకమగును" అని ఆనతిచ్చినాడు ఈ మూడు సాధనములను తాను నిత్యానుష్ఠానముగా నుంచుకొని, సంసారి చేతనులకు నేర్పుట కొరకై శ్రీ విల్లిబుత్తూరు నందు శ్రీ విష్ణుచిత్తులవారి కుమార్తెగా నవతరించినదని గోదాచతుశ్శ్లోకిలోని "కల్పాదౌ" అను మూడవ శ్లోకము తెలియజేయుచున్నది. అది సుపరిచితమేయైనను, దాని నుదాహరించినగాని భగవదాశయము, కవితారీతి బోధ్యమానములు గావు.

> కల్పాదౌ హరిణాస్స్వయం జనహితం దృష్ట్వేన సర్వాత్మనాం
> ప్రోక్తం స్వస్య చకీర్తనం పరదనం స్వస్మై ప్రసూనార్పణం।
> సర్వేషాం ప్రకటం విధాతుమనిశం శ్రీధన్వినవ్యేస్తరే।
> జాతాంవైదిక విష్ణుచిత్త తనయాం గోదాయుదారాంస్తుమః॥

ఆండాళుతల్లి అవతారమునకు ముఖ్య ప్రయోజనమైనది భగవద్గుణ కీర్తనమే అగుటచే అది తిరుప్పావై ప్రబంధమున అనేకావృత్తులుగ నుపదేశింపబడినది. పేర్‌పాడి-

ఆ పేరు అష్టాక్షరీ మంత్రములోని "నారాయణ" - అనునదియే ఈ తిరునామ మితరులెవ్వరికిని చెందకుండునట్లు వ్యాకరణ సూత్రకారులు- "పూర్వపదాత్సంజ్ఞాయామదః"- అను సూత్రముచే నారాయణ అనుపదము ఒకరికి రూఢియగు పేరు అయినచో "ణ" కారము వచ్చును అనినారు. అనన్యపరమైన అనగా కేవలము నారాయణునే చెప్పుటకైన, నారాయ ణోపనిషత్తులోను, ఇతరత్రను వేదములాచరించిననీ నారాయణ పదమునే ఋషులు తమ పురాణేతిహాసములలో అధికముగావాడినదీ పదమునే. ఆళ్వారులును, ఆచార్యులును ఆదరించినదీ పదమునే. ఈ పదము విష్ణువాసుదేవ పదములవలెగాక భగవంతుని బాహ్యాభ్యంతర వ్యాప్తితోబాటు, ఆ వ్యాప్తిరీతిని, ఫలమును, వ్యాపింపబడు పదార్థములను, భగవంతుని కల్యాణ గుణములను మొదలగు నర్థములనెల్లను స్పష్టముగా బోధించును. దీనికర్థమైన శ్రియఃపతికన్నను ఈ పదముయొక్క వైభవ మధికము. శ్రీకృష్ణుడెచ్చటనో ద్వారకలోనున్నను ఈ పదము ద్రౌపదికి నోటియందే

యుండి ఆమెకు మానరక్షణ గావించెను. పరత్వ, సౌలభ్యములను ఈ శబ్దము బహువ్రీహి, తత్పురుష సమాసములతో స్పష్టముగా బోధించును. బహువ్రీహి వలన అన్నింటిలో నంతర్యామిగా నుండువాడని సౌలభ్యమును, తత్పురుషవలన తనకంటె వేరైన సమస్తమునకు ఆధారభూతుడను పరత్వమును బోధించుగదా! ఇందలి యేకదేశమైన "ఆయన" పదము "ఈయతే", "ఇత్యయం" అని ప్రాప్యత్వమును, "ఈయతే అనేనే త్యయనం" - అని ప్రాపకత్వమును తెలుపును. మనకీ నారాయణుడు తల్లి, తండ్రి, తోడు, నీడ మొదలగు సకల విధబంధువని తెలుపును. మనమాయన నాదరింప కున్నను ఆయన అందరి హృదయములలో నుండి మనసత్తనే కాపాడు చుండును.

ఈ తిరునామమును కీర్తించి మనమీ నోమును ప్రారంభించినచో మనకును, మవారికిని కావలసిన ఫలములన్నియును సిద్ధించును. ఇది కర్మ, జ్ఞాన, భక్తి ప్రపత్తి నిష్ఠులందరకును అవలంబనీయమై ఆ సాధనములను సార్థకపరచును. దీని నుచ్చరించుట భగవంతుడు ప్రసాదించిన నాలుకను సార్థకపరచుకొనుటకే. కులశేఖరులు ఈ నామమునుచ్చరించిన మోక్షము సిద్ధించునను విశ్వాసముతో-

శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యం।
కేనప్రాపుర్వాఞ్ఛతం పాపినోపి।
హా! నఃపూర్వం వాక్ప్రవృత్తా న తస్మిన్।
తేనప్రాప్తం గర్భవాసాది దుఃఖమ్॥ (ము.కుం. శ్లో. 27)

"ఆహా! ఎంతటి పాపాత్ములయినను శ్రీమన్నారాయణ అను నామము నుచ్చరించి తమ కోర్కెలను ఈడేర్చుకొనిరిగదా! అయ్యో! నా పూర్వజన్మలో నా వాక్కు ఆ నామమును ఉచ్చరించినది కాదు. ఇది సత్యము. అట్లుచ్చరించియే యున్నచో నాకీ జన్మము వచ్చియుండెడిది కాదు. ఈ గర్భవాసము మున్నగు దుఃఖములు కూడ సంభవించి యుండెడివి కావు' ' అని పశ్చాత్తప్తచిత్తులై యీ జన్మలో నైనను ఆ తిరునామమును ఉచ్చరించి తరింతునని దానికి ముఖ్య కరణమైన తమ నాలుకను- "ప్రావర్తయ ప్రాఞ్జలి రస్మిజిహ్వేనాని నారాయణగోచరాణి"- ఓ నాలుకా! నీకు నమస్కరింతునే. నారాయణ నామానుసంధానము చేయవే" - అని ప్రార్థించిరి.

అన్ని నామములలో నారాయణ నామము విశిష్టమైనది. నామములన్నియు భగవత్స్వరూపమును గుణములను ప్రతిపాదించునవే యయినను, వానిని భగవానుని సర్వవ్యాపకత్వము తెలియజేయు నామములు మిక్కిలి గొప్పవి. అవి మూడు- (1) విష్ణు, (2) వాసుదేవ, (3) నారాయణ అనునవి. ఈ మూడింటిలోను నారాయణ నామము సర్వేశ్వరుని వ్యాపకత్వమును పూర్ణముగా వివరించినది. నారములు = సర్వపదార్థములు, అయన = ఆధారముగా కలవాడు నారాయణుడు. నారములకు అయనము-ఆధారమైనవాడు నారాయణుడు. ఈ విధముగ సర్వపదార్థములయందు బహిరంతర్వ్యాప్తిని పొందిన పరతత్త్వమును తెలియజేయు నారాయణ శబ్దము భగవానునికి ప్రధానమైన నామము. కఠోపనిషత్తులోను, ముండకోపనిషత్తులోను కూడ "నాయమాత్మాప్రవచనే లభ్యః నమేధయాన బహుదా శ్రుతేన యమేషవృతే లేనలభ్యః తస్యైష ఆత్మా విపృణుతే తనూం స్వామ్". అను మంత్రముచే పరమాత్మ ప్రాప్తికి పరమాత్మయే ఉపాయమని చెప్పబడియున్నది. శ్రవణ మనన నిధిధ్యానములు భక్తిరహితముగ చేసినను ప్రయోజనములేదు. అట్లే భగవద్గీతలో "నాహం వేదైరత్నతపసా నదానేన చేజ్యమా శక్యఏవం విధో ద్రష్టుం దృష్టవానసి మాంయధా." అని వేదాధ్యయనము కాని, తపస్సుకాని, దానముకాని, యాగముకాని ఎంతచేసినను భక్తిలేనివాడు భగవద్దర్శనము కలుగదు అని చెప్పబడినది. (భగీ. అధ్యా॥ శ్లో.53) "నిక్కమైన నీలమొక్కటి చాలును, తళుకు బెళుకు రాలు తట్టె డేల?" అన వినమా?

అందుచే వ్యాకరణ జ్ఞాన పూర్వకముగా వైదిక గ్రంథులను పఠించిన పండితులకు గాని, కేవల విద్యాయోగ్యతలు గల విద్వాంసులు గాని, భగవంతుని అవగాహనము చేసికొనుటకు సాధ్యముకాదు. అట్లే పూజ చేయుటకు దేవాలయములకు సాధికారికముగా పోవువారికి కూడ ఆతని నవగాహన చేసికొనుట కష్టమే. వారు దేవాలయమున కేగుదురు కాని యథాతథముగా భగవంతుని అర్థము చేసి కనజాలరు. అనన్యమైన భక్తియుక్త సేవా విధానముచే మాత్రము ఆతని నవగాహనము చేసికొనవచ్చునని శ్రీకులశేఖరులు చెప్పచున్నారు. ఉపనిషత్తులలో "నారాయణ" పరబ్రహ్మాత్తత్వము "నారాయణః పరః" - అని పరబ్రహ్మ, పరంజ్యోతి, పరమాత్మ మొదలగునవన్నియు నారాయణుడే.

"నారాయణేతి నామాస్తి వాగస్తి వశవర్తినీ
తథాపి నరకే ఘోరే పతంతీతి కి మద్భుతమ్."

"ఉచ్చరించుటకు తగిన నాలుక యున్నది. సులభముగ ఉచ్చరింపదగిన "నారాయణ" నామమున్నది. ఇన్ని సౌకర్యములున్నను అందరును దీనిని సద్వినియోగ పరచుకొని, పరమ పదమును బడయక ఘోరనరక యాతనలకు గురియగుచున్నారు. చూడుడెంత వింతయో!" అని వ్యాస మహర్షి బాధపడినారు. సంపూర్ణ భారతమును, వేదాంత దర్శనమును రచించినట్టి మహర్షి బుద్ధిబలము నెవరు అంచనా వేయగలరు?

భగవద్భక్తికి పరమావధియైనది భాగవత భక్తి యనుభావము మెండుగాగలిగిన కులశేఖరులు తాము రచించిన ముకుందమాలలో

"జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్."

"భక్తులందరును శ్రేష్ఠులే. అయినను, జ్ఞాన భక్తుడు సర్వోత్కృష్టుడు. అతడే నేను. నేనే అతడు" అని అనుచు -

"యే భజంతి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్."

"ఎవరు నన్ను అనన్య భక్తితో నారాధింతురో వారియందు నేనును నాయందు వారును నుందురు." - అనుటచే భగవంతుడును జ్ఞాన భక్తుడును ఒకరే అగుదురు. అట్లు వారిద్దరు ఒక్కరే కావున ప్రత్యక్ష దైవముగానున్న జ్ఞాన భక్తుని సేవించినవాడు, భగవంతుని సేవించిన వాడుగనే అగుచున్నాడు.

పాడి -

పాడుట అనగా "ప్రేమతోడే పేణి యను సన్దిక్కవేణుమ్." ప్రేమతో ఆర్ద్ర హృదయులై ఆదరించి యుచ్చరించవలయును. ఆ ప్రేమ, ఆ యార్ద్రత యెట్లు కలుగుననగా దాని యర్థమును భావించిన కలుగును. ఆర్ద్రహృదయముతో ననగా -

"బద్ధేనా ఞ్జలి నా నతేన శిరసా గాత్రైస్సరో మోద్గమైః।
కణ్ఠేన స్వరగద్గదేవ నయనే నోద్గీర్ణ బాష్పామ్బు నా॥"

రెండుచేతులను జోడించి, శిరస్సును బాగుగా వంచి, భగవంతుని గుణచేష్టలను తలచుకొనుటచే కలుగు సర్వాఙ్గీణ రోమాంచము (గగుర్పాటు) తో, డగ్గుత్తికతో, నేత్రముల నుండి ఆనంద బాష్పధారలు ప్రవహించుచుండ అను సంధించవలయును. ఇట్టి మహనీయుని దర్శించుటయే జన్మసాఫల్యము.

"ఆహ్లాద శీత నేత్రామ్బు: పులకీ కృతగాత్రవాన్।
సదా పరగుణావిష్ట: ద్రష్టవ్య స్సర్వదేహి భి:॥"

భగవదను భవము వలన కలుగు ఆనంద పారవశ్యమున చల్లని కన్నీరు మున్నీరుగా కారుచుండగా, ఒడలంతయు గగుర్పాటుతో నిండి యుండగా భగవద్గుణామృత ఝురులయందోలలాడు భక్తుని దేహదారు లందరును సేవించిన చాలును. అందువలననే తరించవచ్చును.

అట్లు పాడుదమని ఆండాళు తల్లి ఆదేశించుచున్నారు. ఇచ్చట నంజీయరు శ్రీ భట్టనాధులవారిని అడిగిన ప్రశ్నను, దానికి వారొసంగిన సమాధానమును ఒక్కసారి స్మరించుకొనవలయును.

"స్వామీ! నామ సంకీర్తనకు అందరును, అన్ని వేళలయందును అన్ని విధముల చేతను అధికారులేనా? దీనికి దేశ, కాల, అధికారి, ప్రకార, ఫలనియమములు ఏవియును లేవా?" అని ప్రశ్నించిరి.

నమ్బావైకు - మననోమునకు.

శ్రీమద్భగవద్గీత 9వ అధ్యాయము 16వ శ్లోకమున భగవానుడు - "అహం క్రతు రహం యజ్ఞ:" - అని సెలవిచ్చెను. క్రతువనగా ఫలమును కోరిచేయు జ్యోతిష్టో మాదికమనియు, యజ్ఞమనగా నిష్కామముగా చేయు నిత్యనైమిత్తికములగు పంచ మహాయజ్ఞములు అని శ్రీభాష్యకారులు వివరించియున్నారు. మన సంప్రదాయమున ఫలాపేక్షతో చేయు క్రతువులు లేవు. వేదము యొక్క పూర్వభాగము, ఉత్తర భాగము వలె మనకు ప్రమాణ మూర్ధన్యమైనను అందు పేర్కొనిన కర్మలన్నియు ఫలసంగ కర్తృత్వములను విడచి భగవత్ప్రీతికై కైంకర్య బుద్ధితో చేయవలసినవియే. ఈ గోపిక లాచరించునది క్రతువా? యజ్ఞమా? వీరి దృష్టిలో నిత్య కర్మలవంటి యజ్ఞమే. వీరి పెద్దల దృష్టిలో నిది జ్యోతిష్టోమాది శ్రౌత క్రతువుల వలె పాడిపంటల కొరకు చేయు క్రతువే. "ఏమైన నేమి? మనకు కృష్ణుని సాన్నిధ్యము, నోరార

నామమహనీయుని నామోచ్చారణము, ఆ పురుషోత్తముని కైంకర్య పురుషార్థము మొదలగు మన అభీష్టములు సిద్ధించు నెపముగావున మనము దీని నాచరింతము. అని గోపాంగనల అభిప్రాయము. ఆళ్వారులు గావించిన - "మడల్ గ్రహణము" - కన్నను, ఆండాళుతల్లి చేసిన కామదేవారాధనము కన్నను చెడిపోయినదా? అని సంతోషముతో ప్రారంభించిరి! ఇది కామ, సకామములుగా అన్వయించునదగుటచే దీనికి స్నానాదులు, కొన్ని విధులు తప్పవు. కావున

ఈ శ్లోకము అష్టాక్షరీ మహామంత్రము అర్థశక్తిచే మనలను రక్షించు విధానమును బోధించుచున్నది. శాస్త్రోక్తరీతిగా అష్టాక్షరీ మంత్రమును పురశ్చరణ గావించి సిద్ధిని బడసిన పురుషుడొక్క డొక్కచోట పూజింప బడునేని అచ్చట వ్యాధులు గాని, కఱవులు గాని, దొంగలు గాని యుండుటకు వీలులేదు.

రాజా సత్యంచ ధర్మశ్చ రాజాకులవతాం కులమ్ ।
రాజా మాతా పితాచైవ రాజాహిత కరోన్నృణామ్ ॥
అయోధ్యా కాండము. సర్గ 67. శ్లో.34

ధర్మార్థ కామములకు సుకర్మపరుడైన రాజేనిధి. పాపపుణ్యముల కాతడే మూలము. దీనికి నిదర్శనమీ క్రింది శ్లోకము.

రాజా ధర్మశ్చ కామశ్చ ద్రవ్యాణాం చోత్తమో నధిః ।
ధర్మః శుభంవా పాపంవా రాజమూలం ప్రవర్తతే.
అరణ్యకాండము. సర్గ 50. శ్లో. 9

ప్రాచీన రాజ్యవృత్త మెప్పుడును సత్యధర్మ రూపకమైనది. జగత్తెప్పుడును సత్యముపై నాధారపడియున్నది. ఇందుకుదాహరణము -

సత్యమేవా నృశంసం చరాజవృత్తం సనాతనమ్ ।
తస్మోత్సత్యాకం రాజ్యం సత్యేలోకః ప్రతిష్ఠితః ॥
అయోధ్యకాండము. సర్గ 109. శ్లో.10

శ్రీరాముడు ఇక్ష్వాకు కులవర్ధనుడు. రఘుకుల తిలకము. సమ్యగ్విద్యా వ్రతస్నాతుడు. ధర్మతత్పరులగు వృద్ధద్విజ శ్రేష్ఠులచే సుశిక్షితుడు. కులోచితమతి. మానవ జీవిత సంస్కారమునకు సంసారమే మూల

స్కందము. పవిత్రమైన వంశము, పావనమైన కుటుంబము సకల శ్రేయములకును మూలము. మాతా పితృ సుతస్నుషాతిథి నికురమే కుటుంబము. రాముడెట్టి కుటుంబములో జన్మించెను? జనకుడగు దశరథుడు ధర్మపరుడు, మహర్షి కల్పుడు. జననియగు కౌసల్య మహాకులీన వసిష్ఠుడు కులగురువు విశ్వామిత్రుడు అస్త్రదేశికుడు. ఇట్టి ఆదర్శ కుటుంబమునందు జన్మించి క్రమశిక్షను బొందుటచే తనే రాముడాదర్శ పురుషుడాయెను. కావుననే యిట్టి ధర్మమూర్తి, సత్యసంధుడు పాలించిన రాజ్యలక్షణమునకు రామరాజ్యమని పేరు వచ్చెను. ఆ రామరాజ్యమున బ్రజలు ప్రహృష్టులు, తుష్టులు, పుష్టులు, ఆధివ్యాధి వర్జితులు, ధనధాన్యయుతులు, స్త్రీలు పతివ్రతలు, క్షుద్భయము, తస్కర భయములేదు. (బాలకాండ. సర్గము 1 శ్లోకములు. 90-93) అదియే రామరాజ్య తత్త్వము.

ఇట్టి రామ రాజ్యమువలె సర్వ సమృద్ధులతో తలతూగును. సకలాపదలును సమసిపోవును. అనిపై వాక్యమున కర్థము.

"నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయు తాని చ" - అనునట్లుండును. ఈ సమృద్ధి మన మార్జించిన పుణ్య ఫలమా? కాదు. అది శ్రీరామచంద్రుని పాలనముచే వచ్చినది. ఈ సంపదయు నట్టిదే?

**తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు - నెలకు మూడు మారులు వర్షించి,**

ఒరుపులు, వరదలు లేకుండగా తల్లి చంటి బిడ్డ తలపై ఆరారగా నూనె పెట్టినట్లుండుట. తొమ్మిది రోజులు ఎండయు, నొక రోజు వర్షమునై - "నికామే నికామే వర్జన్య: ప్రవర్షతి" అవసరమైన సమయములలో కావలసినంత వర్షము కురియును. ఓఙ్గు పెరుంశెన్నె

ఊడుకయలు కళ - పెరిగిన పెద్ద సస్యముల మధ్యచేపలు త్రుళ్ళుగా -

వామనునివలె పెరుగుట. మారీచుడు శ్రీరాముని - "వృక్షే వృక్షేచ పశ్యామి" - అనునట్లున్నది. ఒక దుబ్బు ఒక మని కబళీకరించుకొని, అచ్చటనిక తనపెరుగుదల కవకాశము లేకపోవుటచే ఆకాశమున చోటున్నంత వరకు పెరిగియుండును.

ఊడకయలు కళ - మధ్య చేపలు ఎగురగా -

ఏనుగు గున్నలవలె పెరిగిన చేపలు చేలకు లోపలనుండి పైకి

పోవుటకు స్థానములేక గర్వముచే త్రుళ్ళుచుండును. ఇది చేపలు అనుభవించుచున్న ఆనందము తెలియజేయును.

పూజువళైప్పోతి త్వోతివన్డు కణ్ణదుప్ప -

పూచిన కలువ పూవులలో సుందరమైన తుమ్మెదలు నిద్రించగా-

మకరందము పానముచేయుటచే గాని, పరస్పరము కలియుటచే గాని తుమ్మెదల కాంతి యంతయు శరీరమున ఊర్చితీసికొనవచ్చు నన్నట్లున్నది. ఆభ్రమరమిధునము ఆ పువ్వు నందలి స్పర్శ సుఖముచే మత్తుపదార్థమును పానముజేసిన వారివలె పరుండి యొడ లెరుంగక నిద్రించినది. లేచి నపుడు - "నన్ను నీవు లేప లేదు, నీవు నన్ను లేపలేదు." అని యొకదానితో నొకటి చిర్రుబుర్రుమనుచుండును. ఊడుకయులు గళ,

పూఝ్గవళైప్పోతి త్వోతివణ్ణు కణ్ణడుప్ప -

అందమైన కలువ పువ్వులలో అందమైన తుమ్మెదలు నిద్రింపగా చేపలు క్రింద త్రుళ్ళుచుండుటచే సస్యములును, కలువపువ్వులును ఒకే సారి కదలుటచే హంసతూలికా తల్పమున నిద్రించు రాజపుత్రిని దాసీజనము చామరములతో వీచుచున్నట్లుగా ఆ తుమ్మెదలు నిద్రించుచున్నవి. ఈ సందర్భమున శ్రీభట్టనాథుల వారు సాయించిన యొక కథ స్మరణీయము.

శ్రీవిల్లి బుత్తూరులో నొక తుమ్మెదల మిథున ముండెను. అందు ఆడ తుమ్మెద గర్భమును ధరించి కదలను, మెదలను శక్తిలేక ఆండాళు తల్లి సన్నిధిలోని యొక పుష్కరిణిలోని యొక కలువపువ్వులో విశ్రమించెను. మగతుమ్మెద యెచ్చటికైన నేగి ఆహారమును గొనితెచ్చి భార్యను సంతోషపెట్ట వలయునని యెగిరి పోయి, కమల సరోవర మందలి కమలమునందు ప్రవేశించి మకరందము నాస్వాదించుచుండెను. సాయంత్రము ఆరుగంటలు దాటినది. సూర్య భగవానుడు అస్తమించెను. కమలము ముడుచుకొనెను. తుమ్మెద ఆకమలములో చిక్కుకొనిపోయెను. బయటకు వెడలుటకు దారిలేదు. ఆ పుష్పములోపలనే తిరుగుచు తిరుగుచు విసుగెత్తి అది తనలో తానిట్లనుకొనెను.

రాత్రిర్గమిష్యతి భవిష్యతి సుప్రభాతం
భాస్వానుదేష్యతి హసిష్యతి పంకజ శ్రీః
ఇత్థం విచిన్తయతి కోశ గతే ద్విరఫే,
హా హన్తహన్త నలినీం గజ ఉజ్జహార.

"ఇక కొద్ది సేపటిలో రాత్రిగడచి పోవును. తెల్లవారును. సూర్యుడుదయించును. కమలము వికసించును. అపుడు నేను బయటకు ఎగిరిపోవుదును". - ఈ ప్రకారము తుమ్మెద తనలో తాను భావికాలమును గూర్చి చింతించుచుండ, నింతలో ఒక ఏనుగు ఆ కొలనులో ప్రవేశించి, తొండముతో ఆ కమలమును పెరికివైచి, కాలిక్రింద పడవేచి త్రొక్కి నాశనము చేసెను. తుమ్మెద చనిపోయెను.

ఏనుగు వచ్చునని తుమ్మెద కలలోనైన ఊహించలేదు. అది గాలిలో మేడలు కట్ట ప్రారంభించినది. ఏమేమో ఊహలు చేసికొనినది. కాని ఒక్కతృటిలో పరిస్థితి అంతయు తారుమారైపోయినది. చివరకు ప్రాణమును కూడ తుమ్మెద దక్కించుకొనలేక పోయినది. లోకస్థితి యిట్లేయుండును. భవిష్యత్తులో ఏమి జరుగబోవునో ఎవరికిని తెలియదు. ఎవరికి మరుక్షణమున ఏ ప్రమాదము వాటిల్లగలదో ఎవరును చెప్పలేదు. ఇంత వరకు సస్యముల యొక్క అభివృద్ధిని గురించి వ్రాయబడినది. ఇకపైన పశువుల యొక్క అభివృద్ధి జెందు విషయమును గూర్చి చెప్పబడుచున్నది.

తేజ్ఞాతే పుక్కిరున్దు - భయపడి వెనుదీయక ప్రవేశించి యుండి,

మిక్కిలిగ ముంజేతి బలము కలవారై యున్నవారు పాలుపితుకుటకు సిద్ధపడి యుండవలయును. ఇందులకు కారణము పాలధార నూరకపోవుటచే విడిచిపోవుటకు వీలులేకపోవుట. కావున ప్రతివారును పాలను పితుకుటకు సిద్ధపడరు.

ఇరున్దు - కదలక యుండి.

పాలధార మారిన గదా వేచియుండదగినది. శీర్తములై = బలసియున్న చనుకట్టు, వ్రేలును చుట్టి పట్టుకొనశక్యము కాదు. రెండు చేతులతోను గట్టిగ బిగియబట్టి పితుకవలయును.

పత్తివాఙ్గికుడం నిఱైక్కుమ్ - పట్టిలాగగా కుండనిండును. అనగా చనుకట్టును పట్టుకొని చేతిని తీసివేసినను తనంతనే పాలను కార్చుచుండును. పెట్టిన కుండలన్నియును నిండుచునే యుండును. కుండలను పెట్టకుండుట యజమాని దోషముకాని పశువు దోషము కాదు.

"అధరే వినివేశ్య వంశనాళం వివరాణ్య స్య సలీల మఙ్గళీభిః।

ముహురన్తరయన్ ముహుర్వివృణ్వన్, మధురం గాయతి తిమాధవో వనాన్తే ॥"

తన పిల్లనగ్రోవిని పెదవిపై నుంచుకొని దాని రంధ్రములను తన వ్రేళ్లతో మాటిమాటికిని విలాసముగా నొకమారు మూయుచు, నొకమారు తెరచుచు మధురముగా పాడుచుండగా నా మేయుచున్న ఆవులు

మమతన్ మోములు మీది కెత్తుకొని రోమంథంబు చాలించి, హృ
త్కమాలాగ్రంబున దృష్టి నిల్పి మురళీ గానామృత శ్రేణిక
ర్ణములంగ్రోలుచు మేతమాని గళితానందాశ్రులై చిత్రతో
పములై గోవులు చూచుచున్న నవిగో పద్మాక్షి! వీక్షించితే.

అనునట్లు మేతలేక నిలిచిపోవును. ఇది గుణములే ధారకము లగుటకు ఉపపత్తి. మురళీ శ్రీకృష్ణునికి ప్రియమైన సాధనము. దివ్యమైన ఆతని మురళియొక్క ధ్వనిచే గోపికలే కాక పశువులు కూడ తమ శరీర స్మృతిని కోల్పోవుచుండిరి. కాని ఈ స్పష్టమైన సామాన్యమగు అంశము నందొక పవిత్రమైన ఆధ్యాత్మిక సత్యము దాగి యున్నది. మురళి ప్రణవమునకు చిహ్నము. శ్రవణ రంధ్రముల ద్వారా మురళీ నాదము హృదయమునందు ప్రవేశించి నప్పడది శ్రోతలను ప్రపంచమునే కాక, తమ్ముతామే మరచు నట్లొనర్చును. అంతేకాదు - ఆతని హృదయమును పరిశుద్ధమైన ప్రేమ చేనింపివేయును. దానిచే శ్రోత హృదయము మహదానందపూరితమై నూతన జీవితోత్సాహము నొసంగును. ఆ మురళీ ధ్వని సర్వజీవుల యందు దైవోన్మాదమును కలుగజేసి, అచేతన పదార్థములందును చైతన్యమును కలుగజేయును. సంగీతము యొక్క మాధుర్యము అపారమైనది. ఆ మురళీ ధ్వనిని ఒకమారు విన్నవారు స్వర్గలోకములోని అమృతమునుగాని, లేక మోక్షానందమును గాని లెక్కచేయరు. మురళీ ధ్వనిచే ఆవుల ఆత్మ ఆనందపూరితమయ్యెను. అవి ఆ సంగీత ధ్వని యందు తమ్ముతాము కోల్పోయి, మేతమాని ఆనందాశ్రులై చిత్రములట్లు నిలువబడి తదేకముగా శ్రీకృష్ణుని చూడసాగినవి. ఎంత చిత్రము!

# వేదాంతార్థము

ఓజ్జియులగళన్ద-

శ్రియఃపతి వామనుడై బలిచక్రవర్తి స్వాధీనములోనున్న తన సొత్తును తన పాదములతో కొలిచి తనకు స్వాధీనము చేసి కొనునటుల "దాసభూతా! స్వతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః" - అను రీతిగా వాస్తవముగా తన సొత్తగు నాత్మలు ప్రకృతి సంబంధముచే అహంకారగ్రస్తులై పెడదారి త్రొక్కుచుండగా వారిని కటాక్షించి తనకు దాసులనుగా చేసికొనెను.

దేవాసుర యుద్ధమున భగవదనుగ్రహముచే విజయమును గాంచిన యింద్రాది దేవతలు ఆ సామర్థ్యమంతయు తమదే అని గర్వించి అహంకరించు చుండగా వారి అహంకారమును మానుపదలచి భగవానుడు వారి యెదుట అనలస్తంభము రూపమున ప్రత్యక్షమయ్యెను. తుది మొదలు కానరాక తమ మ్రోలనిలిచిన ఆ అగ్నిస్తంభమును జూచి వెరగుపడి, సిగ్గుతో తమ ఓటమిని తెలిసికొని పరమేశ్వరుని అనేక విధములుగా స్తోత్రము చేసినారు. స్తంభాకృతిలో వున్న అనలస్తంభమున కోటిసూర్య ప్రకాశముతో భగవానుడు కానవచ్చి, వారిని ఆదరించి, తత్త్వమును బోధించి అహంకారమును పరిహరించి తన విభూతిలో చేర్చుకొనెనని కేనోపనిషత్తు చెప్పుచున్నది. అదేవిధముగ అర్జునుడు తానే కర్తననియు, తన ప్రవృత్తి నివృత్తులు (ప్రవృతి - బాహ్యచైతన్యమునకు, నివృత్తి - ఆత్మచైతన్యమునకు ప్రతీకలు) తన ఆధీనమే అనియు భ్రమించి, తనకు కర్తవ్యమగు యుద్ధమును చేయనని ధర్మసంస్థాపకుని సన్నిధిలోనే ధనుర్బాణములను సన్న్యసింప - నాతనితో - "అర్జునా! సాంఘిక పరిపాలనము నందలి నాలుగు తరగతులలో సత్పరిపాలనకు సంబంధించిన రెండవ జాతి క్షత్రియ జాతి అనబడును. క్షత్ (క్షతము) అనగా హాని అని భావము. హాని నుండి రక్షించువాడు కావున క్షత్రియుడన బడుచున్నాడు. (త్రాయతే : రక్షించును) ధర్మ శాస్త్రమును బట్టియేకాక, శిష్టాచారమును బట్టి కూడ నీకు యుద్ధము కర్తవ్యము. యుద్ధము నీ గురువులగు భీష్మద్రోణాదుల కొరకు వచ్చినది కాదు, దుర్యోధనాదుల నుద్దేశించి వచ్చినది. సుయోధ నాదులు ఆతాతయులు. ఆతతాయులు వధ్యులు, అట్టి వారితో భీష్ముడు, ద్రోణుడు చేరినారు. సర్వ శాస్త్రముల నెరిగియునిట్లు చేయుట వలన

భీష్మద్రోణులు ధర్మము నతిక్రమించినవారైనారు. ధర్మమును ఎవరు ఉల్లంఘించినను వారు వీరనక శిక్షించుట రాజధర్మము. ఇదియును గాక ధర్మమైన యుద్ధము క్షత్రియులకు తలుపులు తెరచిన స్వర్గద్వారమునంటిది. ఇట్టి యుద్ధము ఎంతటి పుణాత్ములకో కాని లభింపదు. కనుక, ధర్మమైన ఈ యుద్ధమును నీవు చేయకున్నచో ధర్మమును ఉల్లంఘించిన వాడవగుదువు, అది నీకు పాతకమగును." అని యిట్లు అనేక విధములుగ బోధించి, "కరిషే వచనం తవ" అని అనిపించుకొని అతనిచే కర్తవ్యమును కొనసాగించెను. ఈ పాశురములో "కొలుచుట" అనగా తన చరణ స్పర్శచే పవిత్ర మొనర్చుట. కొన్నివేల సంవత్సరముల తరువాత శాపాహతి వలన తేజము గోల్పోయి, పశ్చాత్తప్త హృదయముతో కృంగి, కృశించుచున్న అహల్య దివ్య చరణారవింద పరాగలేశము స్పృశించినది. అంతవరకు జడమైన మనస్సు చైతన్యవంతమైనది. పోయిన ఆత్మశక్తి పునఃప్రవేశము చేసినది. గతము దీర్ఘ విస్మృతి అయినది. అగ్నితప్తమై పునరాకారము పొంది జాకువా (అపరంజి) పసిడి (బంగారు) వలె భాసిల్లినది. పలుకలేని ప్రకృతి ప్రదర్శించిన భక్తి భావములకు పరవశము చెందిన హృదయముతో రామలక్ష్మణులను ఆశీర్వదించినది. పులకరించిన స్వామి మనస్సును ఆవరించినది అహల్యాసాధ్వి అలౌకిక, అనిర్వచనీయమైన ఆరాధన. అహల్య పాపరాశిని పరిహరించిన పాదములు కలవాడు గదా రాముడు. "శిలా బాలా జాతా చరణ రజసా యత్కులశితోః" - అనికదా అభియుక్తోక్తి. సాంకర్య దోషముతో చాలకాలముగ వేరొకరి అధీనమున పడియున్న భూమిని తిరిగి కొలతలు కొలిచి, ఎవరి భూమిని వారికి అప్పగించినట్లు, బలిచక్రవర్తిచే నాక్రమించ బడిన భూమిని స్వాధీన పరచుకొని తిరిగి యొకసారి అంతయు నున్నదోలేదో అని కొలిచి చూచుకొనుట. లేక, "నాయడుగు పడిన పర్యంతము గల భూమినాదే." - అని త్రొక్కి నడచి ప్రమాణము చేయుటయే యీ త్రివిక్రముని కృత్యము.

వ్రతము నాచరించు వారును, దాని కంగముగ భగవంతుని కల్యాణ గుణసారమునగు వారును, దాని సాద్గుణ్యమునకై తిరుమంత్రార్థము ననుసంధించు వారును ప్రాదేశికులేయైనను వారి మూలముగ దేశమున కంతకును ఈ ఫలము సంక్రమించుట భగవంతుని కృపాస్వభావము. "నెడు మార్కడిమై" - అను శబ్దమునకు "భగవంతుని అవ్యాజమైన కరుణ తదీ

యులవరకు పర్యవసించుట - "పారిభాషికమైన అర్థవిశేషము. ఇది రెండు విధములు. భక్తుని పైగల భగవదనుగ్రహము తదీయ సంబంధిసంబంధుల వరకును ప్రసరించుట యొకటి. భాగవతులకు గల భగవత్ప్రీతి భగవంతునితో నిలిచిపోక తదీయుల వరకును పర్యవసించుట రెండవది. మొదటి దానికి "కేశవన్ తమర్" అను తిరువాయ్ మొళి ప్రమాణము. రెండవ దానికి "నెడు మార్కడియై" - అను తిరువాయ్ మొళి ప్రమాణము. ఇక్కడ మొదటి - "నెడు మార్కడియై" - ప్రసంగము అనగా భగవంతునకు ప్రసన్నుల వ్రతదీక్షవలనను, వారు గావించు సార్థ యంత్రాను సంధానము వలనను, భగవత్కల్యాన గునావగాహనము వలనను కలుగు అనుగ్రహము వారివరకు మాత్రమేకాక, వారున్న ఊరువరకు మాత్రమే కాక, ఆ యూరున్న రాష్ట్రము వరకే కాక, ఆ రాష్ట్రమున్న దేశము వరకు పర్యవసించును.

> ఆస్ఫోటయన్తి పితరః ప్రవృత్యన్తి పితామహాః,
> వైష్ణవోనః కులేజాతః సనస్సన్తారయిష్యతి ॥

అనగా నొకవంశమున నొక్క వైష్ణవదీక్షగల పురుషుం డవతరించినచో ఊర్ధ్వలోకములలో నున్న యాతని పితరులును, పితామహులును - "ఆహా! మన వంశమున పరమ భాగవతుడుదయించెను. ఆతడు మనలను తరింపజేసి మనకు పరమ పదమును బడయజేయు" నని యానందముతో భుజములు తట్టుకొనుచు నాట్యమును గావింతురు అని శ్లోకార్థము.

ఆయనుగ్రహమునకు ఫలమును చెప్పచున్నారు. -

తీజ్గిన్ఱి -

"తీజ్గు" అనగా రోగము. శారీరక రోగములు అపారములు. వానికి చికిత్సలును అంతియే. ఆ రోగములీ శరీరముతోనే పోవును గాన అంత ప్రమాదకరములు కావు కాని నిత్యమగు ఆత్మవస్తువునే నాశమొనరించు ప్రమాదకరములగు కొన్ని రోగములు కలవు. వానిని గురించి "తీజ్గిన్ఱి" కి విశేషార్థమును వ్రాయు సందర్భమున వ్రాయుట జరిగినది. అవి వీరిని భగవంతుని నిగ్రహమునకే పాలు గావించును. వీరినే అసురులు అందురు. అసురు లనగా భగవదాజ్ఞయగు శ్రుతిస్మృతులను ఉల్లంఘించి చరించుటయే జీవ యాత్రగాగలవారు. వారు భగవంతునే ద్వేషింతురు.

మహాక్రూరులు, మహాబలులు, మదోద్ధతులు, బలదర్పితులు. ఇట్టి నిశాటులను భగవంతుడు జన్మపరంపరల నెత్తించి చివరకు పంది, కుక్క మొదలగు నీచాతినీచములై, అమంగళకరములైన జన్మలలో పడవైచును. ఈ విధముగ వారు ప్రతి జన్మయందును ఇట్టి జన్మలనే పొందుచు క్రమముగ తరుగుల్మ, లతా, పాషాణాది జన్మలవరకును పొందుదురు. స్థిరమైన ఆత్మనిట్ల నర్థముల పాల్జేయు రోగములు ఆరుమాత్రము కలవు. ఆ ఆరింటికిని మందు అష్టాక్షరీ మహామంత్ర మొక్కటి మాత్రమే. వాని నన్నింటిని ఈ మంత్రము నిర్మూలింపజేయును. ఆ యర్థమును శ్రీపరాశర భట్టువారు అష్టశ్లోకి యందలి "సక్తాత్మ ........." అను నాలుగవ శ్లోకమున నిట్లు సాయించినారు.

> "దేహే సక్తాత్మ బుద్ధిర్యది భవతి పదం సాధు విద్యాత్తృతీయం
> స్వాతంత్ర్యాన్ధో యదిస్యాత్ప్రథమ మితర శేషత్వ ధీశ్చేద్ద్వితీయమ్ ।
> ఆత్మత్రాణోన్ముఖశ్చేన్నమ ఇతిచ పదం చాన్ధవా భాసలోలః
> శబ్దం నరాయనాఖ్యం విషయ చపల ధీశ్చేచ్చతుర్థీం ప్రసన్నః ॥

తృతీయ మనగా ప్రణవములోని "మ" కారము. ప్రథమ మనగా లుప్తచతుర్థిలో గూడిన "అ" కారము. ద్వితీయ పదమనగా ప్రణవమునకు మధ్యముననున్న "ఉ" కారము అని భావము. ఇందు దేహాత్మ భ్రాంతి మొదలగు రోగములుగా పరిగణింపబడు నీయారును ఈ అష్టాక్షరీ మంత్రాను సంధానముచే నివర్తించును. ఈ విధము ఈ శ్లోకమున సంగ్రహముగా చెప్పబడియున్నది. ఈ రోగములు ఈ వ్రతానుష్ఠానపరులగు ప్రపన్నుల కుండకుండుటయే గాక, వారి సంబంధమున్నచోట కూడ నుండవు.

"స్వామీ! నా యందలి ప్రేమచే పరమభోగ్యమైన పాలసముద్రము నందలి శేషశయ్యను గూడ విడచి పరుగునవచ్చి, నా హృదయమను మహాసముద్రమున సుఖించుటకై దానిని నిత్యవాసముగా కల్పించుకున్న స్వామీ! నీకు పాలసముద్రము, సూర్యమండలము, పరమపదము మొదలగు భోగ స్థానములుండగా వానిని అన్నింటిని వదలుకొని, స్వరూపజ్ఞాన శూన్యుడనగు నన్ను సర్వవిధ పరిపూర్ణుడవగు నీవు పరమ నివాసముగా (స్థానముగా) జేసికొంటివే! ఆహా! ఏమినీ సౌశీల్యము! ఏమి నీ వాత్సల్యము! ఏమినీ దయ! అనిస్తుతించిరి. అందువలననే వీరు "ఈశ్వరస్సర్వభూతానాం హృదేశే ర్జున చిత్తులుగా వ్యవహరింపబడినారు - విష్ఠతిష్ఠతి" అను గీతా

వచనము చొప్పున అందరి హృదయ కుహరములలో పరమాత్మ వేంచేసియున్నను అందరును విష్ణు చిత్తులగుదురా?

తేజ్గాదే పుక్కిరున్దు -

"పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్। నాస్త్యకృత: కృతేన। తద్వి జ్ఞానార్థం సగురుమే నాభిగచ్ఛేత్ సమిత్పాణిశ్శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠమ్................"

కృషిచే సాధించబడిన పంట స్థిరముగా నుండక తరిగిపోవునట్లు వేదోక్తములైన కామ్యకర్మల నాచరించి సంపాదించిన ఐహికాముష్మిక కర్మలును అట్లస్థిరములని గ్రహించి, వాని యందు నిష్పలత్వ బుద్ధి కలవాడై నిత్యమైన ఫలసాధనమును తెలిసికొనగోరి ఆచార్యుల అనుష్ఠానమున కుపయోగపడు సమిధలు, తులసి, పూవులు, మొదలు గాగల పదార్థములతో (లేక రెండు చేతులను జోడించి అంజలి ముద్రతో - సమిత్పాణి:), ఆచార్యుల నాశ్రయించవలయును. ఆ ఆచార్యులు వేదాంత అధ్యయనమును గావించినవారై, పరమాత్మయందు నిష్ఠగలవారై యుండవలయును. వారి శిష్యునకు ఉపదేశ యోగ్యత యున్నదా? లేదా? అని సంవత్సరమో ఆరు మాసములో పరీక్షించవలయును. ఆ యోగ్యతలో ముఖ్యమైనది మదత్రయ రాహిత్యము. మదత్రయ మనగా మహాశాస్త్రజ్ఞుడననెడి గర్వము, ధనవంతుడనెడి గర్వము, గొప్పవంశమున పట్టితి ననెడి గర్వము. అంతశ్శత్రువులలో నయిదవదగు మదము రజో గుణము నుండి జనించి పురుషార్థమును నశింపజేయును. ఈ విషయమున క్రింది శ్లోకము తెలియజేయుచున్నది.

అహం మహాత్మా ధనవాన్ మత్తుల్య: కోస్తి భూతలే,
ఇతి యజ్జాయతే చిత్తం మద: ప్రోక్తస్స కోవిదై:
(పాద్మే క్రియాయోగసారే 16 అధ్యాయం)

ఇది అహంకారము వలన జనించెడు గర్వము. ఈ మదము పలు తెఅంగులుగా నుండునని తత్త్వజ్ఞులు నిరూపించినారు.

విత్తం బంధుర్వయ: కర్మవిద్యా భవతి పంచమీ,
ఏతాని మానస్థానాని గరీయో యద్యదుత్తరమ్.
(మనుస్మృతి. 2 అధ్యాయ. శ్లో. 130)

బుద్ధిని ధనమదము నాశముజేసినట్లు తక్కిన వయోరూప గుణసత్కుల శౌర్య దాన తపోవిద్యారుల వలన గలిగిన మదము నశింపజేయ జాలదని శ్రీ భాగవతములో నిట్లు చెప్పబడినది.

నహ్యన్యో జుషతో జోష్యాన్ బుద్ధి భ్రంశో రజో గుణః,
శ్రీ మదాదాన్ భిజాత్యా దిర్యత్ర స్త్రీద్యూత్తమాసవః

(శ్రీ భాగవత, తృతీయ స్కంధ)

ఉత్తమకులము, ప్రభుత్వాధికారము, విద్యాధనము వీని వలన గలిగిన మదముచే మనుజుడు రజోగుణాధికుడై, బుద్ధి భ్రంశమును బొంది, దీనులకు, అనాధులకు, ఆర్తులకు, దరిద్రులకు గోచరుడవగు నిన్ను ధ్యానించుటకు గాని, కీర్తించుటకు గాని, అనర్హుడని కుంతీదేవి శ్రీకృష్ణుని స్తుతించినట్లీ శ్లోకము చెప్పుచున్నది.

జన్మైశ్వర్య శ్రుత శ్రీభిర్యేధమా నమదః పుమాన్,
నచార్హత్యభిధాతుం వైత్వామకించన గోచరమ్.

- శ్రీ భాగవత, దశమస్కంధ.

కాబట్టి ఐశ్వర్యమును మదము ఉత్తమపురుషార్థమునకు ప్రతి బంధకమమైనది. శ్రీ మదాంధ్యము శుకవాస నీతి యందును, శ్రీ భాగవతాది గ్రంథములందును విస్తరముగ వివరింపబడియున్నది. మణిగ్రీవనలకూబరుల శాపకారణము లిందుకు ప్రబల తార్కాణములు. మదము పదునెనిమిది దోషములు గలది అని సనత్సు జాతీయుల వారు ధృతరాష్ట్రునకు పదేశించినట్లు మహాభారతము నుడువుచున్నది. శమాది షట్కసంపత్తి ద్వారా మదదమనము కలిగియుండుట. ఇందుకు ప్రబల ఉదాహరణము దాశరధులు. ఇన్ని పరీక్షలలో నెగ్గి ఆచార్య కులమున స్థిరముగ నెలకొని యుండవలయును.

కుడం నిరైక్కుమ్ - జ్ఞానార్థియైన శిష్యుడు తత్త్వదర్శియు ఉపదేశించుటకు తగినంత అనుభవ సంపన్నుడు అయిన గురువు నొద్దదకుజనీ దీర్ఘ నమస్కారము చేసి అవసరమును చూచి విద్య అనగానేమి? మోక్షమనగా నేమి? బంధమనగా నేమి? అవిద్య అనగా నేమి? అని వినయముతో అడిగిన ఆయన అనుగ్రహించి, శిష్యుని హృదయమను కుండను జ్ఞానమను పాలతో నింపివైచును. జ్ఞానము చేతనే మనుజునకు

సర్వసంశయములు నివృత్తియగును. జ్ఞానముచేతనే అనాదియగు నజ్ఞానము నశించును. జ్ఞానము చేతనే మోక్షము లభించును. జ్ఞానముతో సమానమగు పవిత్ర వస్తువు మరియొకటి లేదు.

పరోక్షము, అపరోక్షమునని జ్ఞానము రెండు విధములు. పరోక్ష జ్ఞానము పాండిత్యము చేతను, బుద్ధికుశలతను సాధింపవచ్చును. దీనికి అధికారి తారతమ్యము లేదు. సుగుణ సంపత్తియు నక్కరలేదు. శాస్త్ర విచారమును పెద్దలవలన శ్రవణమును దానికి సాధనములు. అయినను, దానితో బురుషార్థ సిద్ధి గానేరదు. పరోక్ష జ్ఞానము చక్కగ బట్టు వడిన పిమ్మట నపరోక్షజ్ఞానము సాధింపవలయును. ఇది అందరికి అబ్బునదిగాదు. దీనికి సాధన చతుష్టయ సంపత్తి గలవాడే అధికారి. సాధన చతుష్టయ మనగా వివేకము, వైరాగ్యము, శమదమాది సద్గుణ సంపత్తి, ముముక్షుత్వము ననునవి. ఇవి లేనివాడు అపరోక్ష జ్ఞానాభ్యాసమునకు సమర్థుడుగా నేరడు సాధన చతుష్టయ సంపత్తిగల వాడైనను అన్య సహాయము లేక స్వశక్తి చేత అపరోక్ష జ్ఞానమును సాధింప శక్తుడు గాడు. తత్త్వమును సాక్షాత్తుగా జూచినట్టి గురువు కడకు పోయి నమస్కారము చేసి, ప్రశ్నచేసి, శుశ్రూష చేసి అట్టి జ్ఞానమును తెలిసికొనవలయును.

వళ్లల్ పెరుంపశుక్కళ్ -

ఉదారమైట్టియు, పూజనీయమైనట్టియు గోవులు. అనగా శిష్యులకు విధేయులలై వారిని జ్ఞానముతో తమతో సమానులుగా జేయు క్షమాదిగుణ సంపన్నులై గోవులవలె నిరంతరము పూజనీయులైన, భగవంతుని కన్న మిన్నగా భావించతగిన ఆచార్య సంపదయును, వారొసగు జ్ఞాన పరిపాకముచే లభించునిత్య నిరవచ్ఛిన్నమైన భక్తి సంపన్నులగు శిష్య సంపదయు నిండియుండును.

వేదాంతార్థ తాత్పర్య సంగ్రహము.

అహంకార, మమకారగ్రస్తమైన ఆత్మవర్గమును వారి నుండి విడిపించి, తన పాదస్పర్శచే పవిత్రమొనరించి, తనకు వశపరచుకొనువాడు సర్వేశ్వరుడు ఆతని వాత్సల్య, స్వామిత్వ సౌలభ్యాది గుణములను తెలుపు అష్టాక్షరీ మహామంత్రమును మనము అర్థసహితముగా ననుసంధించుచు భగవత్కల్యాణ గుణానుభవమున నవగాహించి యుండవలయును.

అట్లున్నచో ఆత్మవినాశకరములగు ఆరురోగములు పోవును. దేశమంతయు ఆకారత్రయ సంపన్నమగును. ఒక యూరును దిద్దుబాటు చేయుట కొక్కరే చాలునంత యోగ్యతతో పెరిగి గొప్పవారుగా సమ్మానింపబడు ఆచార్య గోష్ఠిలో వారి మధ్య వారి పాదములను ఆశ్రయించి శిష్య వర్గము సంతోషముతో త్రుళ్ళుచుండును. అట్టి ఆచార్యుల హృదయాను సారముగ వారి పాదారవిందముల నాశ్రయించి పాదసంవాహనాది సేవలు చేయగా వారనుగ్రహించి వీరి హృదయములు నిండునట్లు జ్ఞానోపదేశమును చేయుదురు.

ఈ వ్రతము నాచరించుటకు ఫలముగ ఆచార్య సమృద్ధియును శిష్య సమృద్ధియును, జ్ఞాన సమృద్ధియును సంపూర్ణమై యెడతెగక యుండును.

సందర్భాను సారముగ ననుసంధించుకొన దగిన పాశురములు -

మేలాత్తేవర్ కళుం నిలత్తేవరుమ్ మేవిత్తొళుమ్,
మాలార్ తన్దినాళ్ అడియేన్ మనత్తే మన్నినార్,
శేలేయ్ కన్నియరుమ్ నెరుంశెల్వముమ్ నమ్మక్కళుమ్,
మేలాయ్ తాయ్‌తన్దెయు మవరేయిని యావారే.
(తిరువాయ్ మొళి 51.8)

పరమపద వాసులైన నిత్య సూరులును, భూమిపై నుండు శ్రీ వైష్ణవులును, ఆశపడి ఆశ్రయింపదగిన సర్వేశ్వరుడు ఇప్పుడు వచ్చి నామనస్సు నందు స్థిరముగ వేంచేసి యున్నాడు. చేపల కన్నులు గల స్త్రీలును, గొప్ప ఐశ్వర్యమును, గుణవంతులగు బిడ్డలును, పూజ్యులగు తల్లిదండ్రులును, ఇక మీద నాకాసర్వేశ్వరుడే యనుచున్నారు.

# నాలుగవ పాశురము

"ఆళిమళైక్కణ్ణా"

## అవతారిక :-

నిత్య విభూతితోను, లీలా విభూతితోను కూడియుండు నారాయణుడు శ్రీకృష్ణుడై గోకులమునకు వచ్చి తనను తక్కువగా జేసికొని ఆడపిల్లలు చెప్పినట్లు చేయు చేతిలోని మనిషియై వర్తించుచున్న విధమును చూచినచో నితరదేవతలు వారికి సేవలు చేయుదురని వేరుగ జెప్పవలయునా? భగవంతు నాశ్రయించిన వారిని జూచి - "రాక్షసులు దూరముగా పారిపోవుదురు. దేవతలు దగ్గరగా జేరి నవస్కరింతు" రన్నట్లు దేవతలు తమంతనే వచ్చి సన్నిహితులైయుందురు. క్రూరముగా దండించు యమధర్మరాజు కూడ తన కింకరులతో - "ప్రభురహ మన్యనృణాం నవైష్ణవానాం" - "నేను లోకమున కంతకును ప్రభువునే గాని వైష్ణవులకు దాసుడ" ననెను. ఈ పాశురమున వర్షమునకు ప్రభవగు మేఘుడు - నేనీ గోష్ఠియందు కైంకర్యమును సలిపి నాస్వరూపమును చూపింప వలయునను ఆశతో వచ్చితిని. ఈ గోష్ఠికి చేయవలసిన కైంకర్యమును ఆజ్ఞాపింపు" డని ప్రార్థించుచున్నాడు. "భీషాస్మాద్వాతః సవతే" - "ఆయన దివ్య శక్తికి జంకియే గాలివీచును" - అనంత శక్తులచేతనే ఆతడు జగములను అనుశాసింప గలుచుచున్నాడు అని శ్రుతి తెలిపినట్లుగా తమతమ యధికారములను స్థిరముగా సంరక్షించు కొనుటకై సర్వేశ్వరునకును, ఆతని ప్రియపరికరమునకును, యథోచితసేవల నొనరించు నాచారము దేవతలకు కలదు. శ్రీకృష్ణుడవతరించిన సందర్భమున నెలకొన్న గ్రహస్థితి రమణీయముగ "ఖమాణిక్యమ్" అను జ్యోతిర్గ్రంథమున చక్కగా వర్ణింపబడియున్నది. ఆ శుభముహూర్తమున జన్మించిన శిశువు పరబ్రహ్మము, పరతత్త్వము అయి ఉండవలయునని ఆ గ్రంథము ధ్రువీకరించుచున్నది. చైతన్య చరితామృతమున కృష్ణుడు సూర్యుని కాంతివంటి వాడని చెప్పబడినది. కృష్ణుడున్న చోట తమోరూపమైన మాయాశక్తి ఉండజాలదు.

"మన్దం మన్దం జలధరాః, జగర్జురను సాగరమ్" అనియు, "నన్నృతు శ్చాప్సరోగణాః" అనియు నిట్లే తమ తమ స్వరూప లాభమునకై వరుణుడు

మొదలగు వారు యథోచిత కైంకర్యమును జేసిరిగదా? ఇప్పుడు తమతమ కైంకర్యములకై పూనుకొనిరి. భగవద్విషయమున కైంకర్యమును జేసినవారికిని ఫలప్రాప్తి పురుషకారులగు వారి మూలముననేఅన్నచో నికవారికే కైంకర్యమొనర్చు వారిని గురించి చెప్పవలయునా?

"సిద్ధిర్భవతి నా నేతి సంశయోఽచ్యుత సేవినామ్,
న సంశయోస్తి తద్భక్త పరిచర్యారతాతనామ్ ॥

భగవంతు నాశ్రయించి ఫలమును బడయగోరు వారికి ఫలప్రాప్తిలో సంశయమున్న నుండవచ్చును. ఆతడు స్వతంత్రుడు గదా? ఆళ్వారులకు కోరగనే ఫలము లభించినదా? "కూవిక్కొళ్ళుం కాలమ్ ఇన్నుంకుఱుకాదో?' ' - అని యెంతయో మొరలిడినారు. కాని, వారి సేవను గావించిన వారికిక ఫలప్రాప్తిలో సంశయము లేదు.

"తన్ గురువిన్ తాళిణైగళ్ తన్నిల న్బొన్నిల్లాదార్,
అన్బు తన్నాల్ శెమెదాలు మమ్ముమైకోన్ ఇన్నమిగు
నిణ్ణాడు తానళిక్క వేణ్డియిరాన్..............................
................................................................................"

ఆచార్యుల శ్రీపాదముల యందు ప్రేమ లేశమాత్రము లేక, పురుషార్థ ప్రదుడు శ్రీపతియేగదా అని ఆతని యందెంత ప్రేమను కనబరిచినను ఆతడు వారికి పరమ పదము నీయజాలడు. కాబట్టి ఆచార్య భక్తిలేని భగవద్భక్తులకు వైకుంఠమున స్థానముండనేరదు. శ్రీవచన భూషణమున 3వ ప్రకరణములో 308వ సూత్రము మొదలు 321వ సూత్రము వరకు గల 14 సూత్రములలో సదాచార్య లక్షణములు పేర్కొనబడినవి. ఈ ఆచార్యాభిమాన నిష్ఠ అన్ని సంప్రదాయములలోను గాన్పించుచున్నది. ఇది శ్రీవైష్ణవులకు ముఖ్యతమ ప్రమాణము కూడ. ఈ ఆచార్యులు ఉత్తారకులు, ఉపకారకులు అని రెండు విధములుగా నుందురు. ఉత్తారకులనగా పంచస్కారములను ప్రసాదించినవారు. (తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము. ఇవి పంచ సంస్కారములు.) సంస్కరించుట, శుద్ధిచేయుట, పుట్టిన వానిని వేదాధ్యయనమునకు అర్హుని చేయునది ఉపనయన సంస్కారము. అట్లే విష్ణు దాసత్వమునకు అర్హుని చేయునది పంచసంస్కారములు. అవి లేని ద్విజుడు వైష్ణవు లిండ్లహవ్య కవ్యాదుల

కనర్హుడు. ఉపకారకులనగా మంత్రార్థముల నెరిగించి అనుష్ఠింప జేయునారు.

సర్వజ్ఞ శిఖామణియగు శ్రీకృష్ణుడర్జునకునితరులెవ్వరును ఎరుగని అధ్యాత్మిక తత్త్వము నుపదేశించుచు - "అర్జునా! నా యుపదేశముతోనే సంతృప్తి పడియుండక, తత్త్వ వేత్తలగు సదాచార్యుల సన్నిధికి సాష్టాంగ నమస్కార పురస్సరముగ వెళ్ళి ప్రశ్నకాలమును గమనించి నీవు తెలియగోరిన విషయమును వారు గ్రహించి, చెప్పవలసిన విషయమును నీయందు ప్రేమగలిగి యుపదేశించునట్లు సేవలను చేసి విషయమును గ్రహింపుమని చెప్పెను. అహో! ఆచార్య శుశ్రూష కెంతటి ప్రభావమున్నదో కదా?

ఈ యాచార్యోత్కర్షకు శ్రుత్యాది ప్రమాణముల కన్న మిన్నయగు శ్రీరాముని శ్రీసూక్తియే గమనింపవలసినది.

శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై అయోధ్యా పురమును వీడి సరయూనదిని దాటి మరునాడు మాపటికి గంగానదిని జేరి అచ్చట విశ్రాంతి నొంది, అరుణోదయమైన పిమ్మట శృంగదేశపురాధి నాథుడగు గుహుని యాతిథ్యము వడసి అతని వీడ్కొని, గంగా యమునా సంగముననున్న ప్రయాగను జేరెను. ఇది వత్సదేశ ప్రాంతము. ఆనాటి రాత్రి అచ్చటనున్న నొకచెట్టు క్రిందకు ముప్పురును చేరి కూర్చుండిరి. లక్ష్మణుని హృదయమును పరిశీలించుట కొరకై కొన్ని కైకేయీ నిందోక్తుల నాతనికి వినిపించి శ్రీరాముడు తన తల్లియగు కౌసలను గురించి విలపించు ప్రసంగములో

"మన్యే ప్రీతి విశిష్టాసా మత్తో లక్షణ శారికా,

యస్యాః తచ్ఛ్రూయతే వాక్యం శుకపాదమరేర్దశ ॥

కౌసల్య శుకశారికలను (చిలుకను, గోరింకను) ప్రేమతో పెంచుచుండెనట. ఇట్లుండ ఒకనాడు ఆపక్షులున్న స్థలమునకు పిల్లి యొకటి వచ్చెను. దానిని చూచి గోరింక చిలుకతో - "హేశుక! అరేః పాదందశ" అని అరచెను. ఓ చిలుకా!.చూచి ఊరకుందుమేమి? మనకు శత్రువగు ఆ పిల్లికాలిని కరచివేయుము అనినదట!

ఆమాట జ్ఞాపకమునకు వచ్చి శ్రీరాముడు లక్ష్మణునితో నిట్లనుచున్నాడు. లక్ష్మణా! చూచితివా మన అమ్మ పెంచిన గోరింక కున్నంత

అమ్మ మీద ప్రేమ నాకు లేదుకదా? చూడుము అది ఆమె ప్రీతికై ఎట్లు పలుకుచున్నదో! నాకన్నను అమ్మకు గోరింకయే అధికమయిన ప్రీతిని పుట్టించుచున్నది. దీనిని బట్టి చూడగా ఆ పక్షికే అమ్మయందు నాకంటే అధికమయిన ప్రేమయున్నట్లు తోచుచున్నది. ఈ మాటను విని మన అమ్మ ఎంతో సంతోషించినది అమ్మ నన్నును పెంచినది. గోరింకను పెంచినది. దానివల్ల నేను అమ్మకు ప్రియమగునట్లు కైకేయీ నిందోక్తిని ఒక్కదానినైనను పలుకక పోయితిని గదా ఛీ! నా జన్మ వ్యర్థము.

దీని వలన దేలిన దేమనగా భగవద్భజన కంటెను ఆచార్య సమాశ్రయణము సుకరోపాయమని ధ్వనించుచున్నది.

"నహ్యమ్మయాని తీర్థాని న దేవామృచ్ఛిలామయాః,
తౌ పునన్త్యురు కాలేన దర్శనాదేవ సాధవః॥"

పవిత్ర జలభరితములగు కావేరీ గంగాయమునా నదులు గాని, మన్ను సుద్ధరాళ్లతో చేయబడిన దేవతా విగ్రహములు కాని ఆశ్రయించి ఆరాధించిన వారిని వెంటనే పవిత్రవంతులను గావింపనేరవు. దీర్ఘకాలము వానిని సేవించిన ఎప్పటికో పవిత్రులను గావించును. కాని, సజ్జనలట్లు గాక దర్శించిన వెంటనే మనలను పవిత్రులను గావింతురు.

ఇచ్చట శారిక అనగా జ్ఞాన కర్మలనెడు రెండు రెక్కలుగల ఆచార్యులు అని అర్థము.

'ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః,
తథైవ జ్ఞాన కర్మాభ్యాం లభతే పురుషోత్తమః॥"

పక్షి రెండు రెక్కలలో నాకసమున సంచరించునట్లు సదాచార్యులు అర్థపంచక జ్ఞానము దానికి వర్ణాశ్రమ ధర్మానుష్ఠానములతో (ఆ-అంతటను, కాశతే-ప్రకాశించు వాడునగు) భగవంతుని యందు సంచరించు చుందురు. ఇది స్త్రీలింగ శబ్దమగుటచే నీ ఆచార్యులు భగవంతునికి పరతంత్రులని తోచుచున్నది. "స్త్రీ ప్రాయమితరత్సర్వం" అనునట్లు భగవద్వ్యతి రిక్తమగు సర్వమును స్త్రీవలె భగవంతునకు పరతంత్రమే కదా!" న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని కదా ఆర్యోక్తి! దీనిని బట్టి శ్రీరాముడే ఆచార్యులను "మత్తో ప్రీతి విశిష్టా మన్యే" - అగుటచే ఆచార్యులే భగవంతుని కన్నను మోక్షా నందము నొసంగుటలో నధిక సుకరోపాయులని తెలియుచున్నది.

ఆచార్యు లెవ్వరనగా -

"యస్మాన్త చ్ఛాయతే శబ్ధః శుకః పాదం అరేః దశ" ఎవనిచే గురూపదేశ పరంపరగా మంత్రత్రయము లభింపబడుచున్నదో ఆతడే ఆచార్యుడు.

ఆ వినబడిన వాక్యమెట్టిది. అనగా - "శుక! పాదం అరేర్దశ" - హేశుక! చిలుకవంటి ఆకర్షమైన శరీర కాంతిగల ఓ శ్రీనివాసా! (ఆళ్వారులు శ్రీమన్నారాయణుని చిలుకతో పోల్చిరి) అరేః నా శిష్యునికి విరోధియైన సంసారము యొక్క, పాదం నిలబడుట కాధారమైన సంసార బీజములగు అహంకార, మమకారములను, దశంపోగొట్టుము. ఓ భగవంతుడా! నన్నాశ్రయించిన యీ శిష్యునకు సంసార వర్ధకములగు అహంకార మమకారములను తొలగింపుము" అని ప్రార్థించుట.

ఇట్టి వాక్యమే ఆచార్యుని ముఖారవిందము నుండి వెలువడుచున్నదో ఆ యాచార్యులు నాకన్నను, భగవంతుని కన్నను గొప్పవారని శ్రీరాముని హార్దాభిప్రాయము.

ఇట్టి విషయములను లోకు లెరుగక పోవుట చేతనే కదా వానిని తెలియజేయు నిమిత్తమే నారాయణుడు - "తానే శిష్యను మాయ్ ఆచార్యను మాయ్‌నిన్ఱు తిరుమంత్రత్తై వెళియిట్టరుళినాన్" - స్వయముగనరుడై శిష్యునిగాను, నారాయణుడై ఆచార్యుడుగాను బదరికాశ్రమములో నవతరించి తిరువష్టాక్షరీ మహామంత్రము నుపదేశించి తన్మూలముగా లోకమును నుద్ధరించెను. ఈ విషయము భారద్వాజ సంహితలో పరమ పురుషుని ముఖారవిందము నుండియే - "చరమస్యా వతారస్య గురురూపస్య మేసదా" అని వెలువడినది. పరవ్యూహ, విభవ, అంతర్యామి, అర్చలనెడు అయిదు అవతారములేక, తక్కినవన్నియు నిష్ఫలములగుటచే చివరి అవతారముగా గురువుగా నవతరించుచున్నానని శ్లోక పాద భావము. ఆచార్యావతారము భగవంతుని చివరి యవతారము.

"సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీంతనుమ్,
మగ్నా నుద్ధరతే లోకాత్ కారుణ్యా చ్ఛాస్త్ర పాణి నా॥

నారాయణుడే స్వయముగ మనుష్యుల కాశ్రయించుట కుపయోగించునట్లు మనుష్యుడుగా (ఆచార్య రూపముగా) అవతరించి,

సంసార సాగరాన్తర్నిమగ్నులగు చేతనులను దయతో శాస్త్ర జ్ఞానమనెడు చేయూత నొసగి పరమ పదమునకు ఉద్ధరించుచున్నాడని శ్లోకార్థము. ఇంకను విపుల వివరములు తెలియగోరువారు ఉపదేశరత్నమాలను చదువగలరు.

నాలుగవ పాశురము.

ఆళిమళైక్కణ్ణా! ఒన్రు నీ కైకర వేల్,
ఆళియుళ్ పుక్కు ముగన్దు కొడార్తేఱి,
ఊళి ముతల్వ నురువమ్బోల్ మెయ్ కఱుత్తు,
పాళియన్తోళుడై ప్పత్మనాబన్ కైయిల్,
ఆళిపోల్ మిన్ని వలమ్బురి పోల్ నిన్ఱతిర్న్దు,
తాళాతే శార్ఙ్గము దైత్తశరమళైపోల్,
వాళవులకినిల్ పెయ్దిడాయ్, నాఙ్గళుమ్.
మార్గళి నీరాడ మకిళన్దేలో రెమ్బావాయ్.

టీక:- ఆళి-గంభీరమైన, మళై-వర్షమునకు, కణ్ణా-నిర్వాహకుడవైన వర్జన్యుడా!, నీ-నీవు, కై-నీయొక్క పరిపాలనలో, ఒన్రు-ఒకటియు, కరవేల్-దాచగూడదు. ఆళియుళ్-సముద్రములో, పుక్కు-ప్రవేశించి, ముగన్దుకొడు-జలము నంతయు త్రాగి, ఆర్తు-గర్జనచేసి, ఏఱి-ఆకాశమున కెగసి, ఆకాశము నంతయు వ్యాపించి, ఊళి-కాలము మొదలగు వాని కన్నిటికి, ముదల్వన్-మూల కారణభూతుడగు వాని యొక్క, ఉరువమ్బోల్-తిరుమేనివలె, మెమ్-దేహమును, కఱుత్తు-నలుపు చేసికొని, పాళి-విశాలమైన, అమ్-అందమైన, తోళ్-భుజములు, ఉడై-గల, పత్మనాబన్-పద్మనాభుని యొక్క, కైయిల్-కుడి హస్తమందుండెడి, ఆళిపోల్-చక్రాయుధము వలె, మిన్ని-ప్రకాశవంతముగా మెరసి, వలంపురిపోల్-ఎడమ చేయి యందు గల శంఖమువలె, నిన్రు-చక్కగా నిలిచి, అదిర్న్దు-గట్టిగా ఉరిమి, శార్ఙ్గమ్-కోదండము చేత, ఉదైత్త-విడువ బడిన లేక త్రోయబడిన, శరమళైపోల్-బాణ పరంపరల వలె, ఉలకినిల్-లోకమునందుండు వారు, వాళ-సుఖించునటుల, నాఙ్గళుమ్-మేమును, మగిళ్న్దు-సంతోషించి, మార్గళి-మార్గళిమాసన మందు, నీరాడ-స్నానము చేయుటకు, తాళాదే-ఆలస్యము చేయక, వెంటనే, పెయ్దిడాయ్, వర్షింపవలయును, ఏల్ ఓర్ ఎంపావాయ్-ఇట్లయినచో యోజించుము. మా అభిప్రాయము ననుసరించుము. ఆలస్యము చేయకుము.

తా:- జలములలోని నిధులన్నిటికిని యజమానుడవైన ఓ వరుణుడా! నీకు సహజమైన జలప్రవాహమున నొకింతయును సంకోచింపవలదు. నీవు సముద్రములోని అంతర్భాగమున ప్రవేశించి, అందున్న నీటి నంతను కడుపారద్రావి, గట్టిగాత్రేల్చి (ఉరిమి), ఆకసము పైకెక్కి అంతటను వ్యాపించి, కాలము మొదలు సమస్త పదార్థముల సృష్టించు శ్రీమన్నారాయణుని శరీరమువలె నీ శరీరమును నల్లబరచుకొని, విశాలమై సుందరమైన భుజములు గల నారాయణుని కుడిచేతి యందున్న చక్రమువలె మెరసి, ఆయన యెడమచేతి యందున్న శంఖమువలె గర్జించి, ఆతని ధనుస్సు నుండి వెలువడు బాణములవలె వర్షమును ధారలగా కురిపింపుము. అట్లుచేసిన లోకులు సుఖించునట్లుగను, మేమును మా వ్రతమున కంగమగు స్నానమును ఆనందముతో సాగించు కొనునట్లుగను అగును. కనుక, ఆలసింపక వర్షించమని ఆండాళు తల్లి గోపికలతో గూడి వరుణుని నియమించుచున్నారు.

కుంచించు కొనబోకు కొంచెమేనియు దాన
హస్తమోయన్న, వర్షాధినాథ!
కడలిలోనికి జొచ్చి కడుపారగా ద్రావి
త్రేచి, నింగికి నెక్కి రేగిసాగి,
జగదాది కారణ శ్యామల విగ్రహా!
పద్మనాభుని దీర్ఘ బాహుయుగళి
(1) సరియుట్లు మెరపుల బరపుచు, (2) వలముని
కైవడి గంభీరగర్జ లెసగ

పైరు పచ్చల జగతి సంపదలు పొదల
(3) నాగ్రహాయణి మేము నీరాడ మురియ
శార్ఙ్గ కార్ముక నిర్గత శరవిధాన
వాన గురియింపు మావేగ వరుణదేవ!

విశే: ఉభయ విభూతి నాయకుడగు పరాత్పరుడు భూమండలమున సౌలభ్య వరాకాష్ఠయగు శ్రీకృష్ణుడై అవతరించెను. మత్స్య కూర్మాద్యే కవింశత్యవతారములలో కొన్ని బ్రహ్మాది దేవతల కొరకును, కొన్ని వ్యక్తిగత సంరక్షణకును ఐనవేగాని సమస్త చేతన సంరక్షణ కొక్కటియును కాలేదు.

---

(1) చక్రము (2) శంఖము (3) మార్గశిరము

శ్రీ రామావతార మొకింత ప్రాదేశిక ప్రజా సంరక్షణోపయోగియైనను, తానొక చక్రవర్తికి బిడ్డడై, స్వయముగా చక్రవర్తియై యుండుటచే ప్రజలకంత అందుబాటులో లేకుండెను. ఆలోటును తీర్చుకొనుటకును, సర్వ సమాశ్రమణీయుడగుటకును శ్రీ విష్ణుదేవుడు శ్రీకృష్ణుడై అవతరించెను.

"సమో హం సర్వభూతేషునమే ద్వేష్యోస్తి నప్రియః" - అనునట్లు తన నాశ్రయించిన వారిలో జాతినిబట్టిగాని, ఆశ్రయమును బట్టిగాని, విద్యాధన, అభిజనములను బట్టి గాని, లింగమును బట్టిగాని, సమర్పించు వస్తువుల తారతమ్యమును బట్టిగాని, వైషమ్యములేక (కొందరిని చేరదీసి కొందరిని విడుటలేక) అందరును సమముగా తననాశ్రయించుటకు వీలుగా వేంచేసి యుండెను.

మాంహి పార్థ! వ్యపాశ్రిత్యయేపి స్యుః పాపయోనయః, స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తే పి యాన్తిపరాంగతిమ్ ॥ (భ.అ.9. శ్లో 34.)

అర్జునా! పాప జన్మముగల తిర్యగాదులు, నిషాదాదులు, వేదాధ్యయనా శూద్రులు వీరుగూడ నన్నాశ్రయించి ముక్తిబొందురు. జటాయువు, గుహుడు శబరి గోపికలు, సంజయుడు మొదలు వారు ఇందులకు నిదర్శనము గదా! సామాధియను వైశ్యుడు ముక్తినందుట దేవీ సప్తశతి యందు చూడనగును. ఇట్లు భగవానుడు మోక్షమును నిరాఘాటముగ బడయుటకు వలయు మార్గములను సువిదిత మొనరించెను. అంతేకాదు తన యనుష్ఠానము నందును కుడియెడమ లెరుంగని గోపబాలకులు -

"ఎన్నడు నైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయున్
కన్నుల గానరట్టిహరి గౌగిలి జేర్చుచు జెట్టపట్టుచున్
తన్నుచు గ్రుద్దుచున్ నగుచు తద్దయు పైబడి కూడియాడుచున్..
......................................................................"

అనునంతటి సులభుడయ్యెను.

సుదాముడను బాల్య స్నేహితుడు దుర్భర దారిద్ర్యముతో బాధపడుచు, తన భార్య అభ్యర్థన వలన ఆయన తన వద్దకు వచ్చినప్పుడు భగవాడు సుదామ విప్రునితో - "ప్రియమైన చెలికాడా! నీవు భావించినట్లు నాకు

ఏదియు ఆవశ్యకము లేదనుమాట నిజమే! అయినను, నా భక్తులు ప్రేమతో ఏదైన కానుకను తెచ్చినచో అది ఎంత సామాన్యమైనదైనను పరమానందముతో నేను దానిని స్వీకరింతును. కాని, నాకు భక్తుడు కానివాడెంతటి విలువైన కానుకను తెచ్చినను దానిని నేనంగీకరింపనొల్లను. నా శుద్ధభక్తుడు ప్రేమతో పుష్పమునో, పత్రమునో, ఫలమునో, తోయము (జలము)నో అర్పించినను దానిని సంతోషముతో స్వీకరించుటయే గాక పరమానందముతో ఉపయోగింతును." అని చెప్పుచునే ఆ నిరుపేద బ్రాహ్మణుని భుజము నుండి వ్రేలాడుచున్న అటుకులమూటను తానే స్వయముగ గ్రహించి, ఒక గుప్పెడు అటుకులను నోటిలో పోసికొని నమలి -

"నన్వేత దుషనీ తంమే సరమ ప్రీణనం సఖే!
తర్పయన్త్యఙ్గ! మాం విశ్! మేతే పృథుక తణ్డులాః॥

"చెలికాడా! నీవు నా కొరకై మంచిరుచికరమైన అటుకులను తెచ్చితివో యీ! ఇట్టి అటుకులు నన్ను సంతుష్టిపరచుటయే కాదు, సమస్త విశ్వమును సంతోషపరుపగలవు." అని ప్రశంసించి చివరకు సమస్త సంపదలను చేతికీయక - "యోగక్షేమం వహామ్యహం" అను మాటను అక్షరశః అమలు జరిపెను. భగవంతుని ఆ మాటలవలన సమస్త విశ్వమునకు ఆయనయే మూల కారణమని విదితమగుచున్నది. ఒక చెట్టు మూలమునకు నీరుపోసినచో ఆ నీరు చెట్టులోని వివిధ భాగములకు ఎట్లు పుష్టిని చేకూర్చునో అట్లే భగవంతునికి అర్పించు ప్రతికానుకయు, ఆయనకు చేయు ప్రతి సేవయు సర్వజగత్కల్యాణ కరమైనదిగా పరిణమించును. భగవానుని యెడల చూపు మనప్రేమ సమస్త జీవుల పట్ల సమముగా విభక్తమగును.

వరుణుడు శ్రీకృష్ణుడు గోపాంగనలతో నున్నచోట ఆ గోష్ఠికేదైనను సేవను చేసిదాని మూలముగ తన స్వరూపమును బడయవచ్చునను భావముతో అచటికి వచ్చెను.

మిథున కైంకర్య వైభవము నెరింగిన లక్ష్మణుడు, శ్రీరామచంద్రుడు సీతామాతతో నడవికి వయనించుచుండగా నీ తరుణమును జారవిడువరాదని -

"స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః,
సీతా మువాచాతి యశాః రాఘవంచ మహావ్రతమ్॥"

శ్రీరాముని పాదారవిందములను గట్టిగా పట్టుకొని సీతా మాత పురుషకారముగా నాతని నిట్లు ప్రార్థించెను.

"అహం సర్వం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్శతే,
భవాంస్తు సహవైదేహ్యా గిరిసానుషు రంస్యతే॥"

"శ్రీరామ! నీవు సీతామాతతో నితర సహాయములేక పర్వత చరితుల యందు సంచరించు చుండు సమయమున నేనే నీకు నిద్రించుచున్నప్పటి సేవకై యీధనుర్బాణములను, మేలుకొని యున్నప్పటి సేవకై యీ తట్ట, త్రవుగోల పరికరములను బూనిసేవల నొనర్తు" నని యువ్విళ్ళూరుచు శ్రీరామచంద్రుడు వలదన్నను వినక పాదద్వంద్వములను బంధించెను. ఇట్టి వారిని విడువనని గదా శ్రీరామభద్రుని మతము".

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,
అభయం సర్వ భూతేభ్యో దనాయ్యేత ద్వ్రతం మమ॥"
శ్రీరాఘవుని యీ స్వభావము లక్ష్మణుడెరుంగనిది కాదు.

ప్రణవార్థ మిదియే కదా! మాతతో కూడియున్న సకల గుణాభి రాముడగు నారాయణునకు సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలలోను సర్వవిధకైంకర్యములను చేయవలయునని గదా! మనకా ప్రణవము విధించుచున్నది. దానినే కదా! మన ఆళ్వారులు - "ఒళివిల్ కాలమెల్లా ముడవాయ్ మన్ని - వళువిలా వడియై శెయ్య వేణ్డుమ్ నామ్" - అని బోధించిరి.

ఆళిమళైక్కణ్ణా! ఒన్రునీ కైకరవేల్ -

వరుణ దేవుడా! నీవు భగవంతునితో సమానుడవు. నీవును ఆయన వలె తారతమ్యము చూడక అంతటను సమముగా వర్షింపుము. అనగా ఆ వరుణుడు "తల్లులారా! పుణ్యాత్ములున్నచోట కురియు మనియును, పాపాత్మలున్న చోట కురయవలదనియు కదా! భగవానుడు నాకానతిచ్చెను. నేను దాని నుల్లంఘించగలనా?" అని ప్రశ్నించగా, గోపాంగనలు భగవంతుడు చేయు రక్షణకార్యము విలక్షనమైనది. అందు సంకోచమున్న నుండనిమ్ము. ఇది సీతామాత గోష్ఠి యెరుగుదువా? తనకు అపారమగు దుఃఖమును కలిగించిన రావణునకును -

"మిత్ర మౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా"
"తేన మైత్రీ భవతుతే యది జీవితు మిచ్ఛసి"
"విదితస్సహి ధర్మాత్మా శరణాగత వత్సలః"

"ఓ రావణా! శ్రీరామునితో స్నేహమును నెరపుట నీకు మేలు. మంచిచావు చావదలంచినను అదియే యుక్తము. ఆతడు శరణాగత ధర్మమును లెస్సగ నెరింగినవాడు" - అని యింటి గుట్టును గూడ నాతని కెరింగించెను గదా! కావున మా గోష్ఠికి తగినట్లు సేవ నొనర్చుమని యాదేశించిరి.

ఆళిమళైక్కణ్ణా! -

మండల వర్షము (దుక్కువాన వెయి॥లగు కొలత) నకు నిర్వాహకుడనైన ఓవరుణ దేవుడా! నీవు గంభీరమైన స్వభావము గలవాడవు. వర్షమునకు నిర్వాహకుడవు. భగవంతుడు సృష్టి సంహార, వ్యాపారములను బ్రహ్మారుద్రుల తలపైనుంచి చల్లని రక్షన వ్యాపారమును తాను సాగించినట్లుగా తనవలెనే చల్లని చేతితో తాకి రక్షించగలవాడవని సర్వేశ్వరునిచే ఆదరింపబడదగిన వాడవు గదా! నీవు పుణ్యముచేసిన వారున్నచోట కురియుట, పాపము చేసిన వారున్నచోట కురియక పోవుట నీ స్వభావము. అట్లు చేయుక మా పుణ్యమునే తలంచి దానికి తగినట్లుగా వర్షింపుము. మాది సీతామాత గోష్ఠి సుమా! ఆమె భగవంతునితో - పుణ్యాత్ముని యాతని పుణ్యమే రక్షించును. పాపాత్ముని రక్షించు వార్వెరుందురు? అందుచే మన మట్టివారిని రక్షించుటయే ధర్మము. ఆయుపపత్తి రామునకు తగినదని తోచుటచేతనే - "దోషోయద్యపి తస్యస్యాత్" - అని విభీషణుని రక్షించటులో - "దోషః తస్యస్యా దేవ" - వానికి దోషముండవలయును. అని అభిలషించెను. సుప్రసిద్ధుడగు వైద్యుడు ఇతర వైద్యులెవరును కుదర్చని రోగమును కుదిర్చిననే తన పేరు ప్రతిష్ఠితమగునని తలంచునట్లు భగవంతుడును - "దోషఃతస్యస్యా స్యాధేవ" - అని అభిలషించెను.

శ్రీ భట్టరు వారు శ్రీగుణరత్నకోశమున -
"మాతర్మైథిలి! రాక్షసీ స్త్వయి తథైవార్ద్రా పరాధా స్త్వయా,
రక్షన్త్యా పవనాత్మజా ల్లఘుతరా రామస్య గోష్ఠీకృతా,

కాకం తంచ విభీషణం శరణ మిత్యుక్తి క్షమౌ రక్షతః,
సాన స్సాన్ద్ర మహాగస స్సుఖయతు క్షానిస్తవా కస్మికీ॥

"అమ్మా! సీతామాతా! శ్రీరామజయ వృత్తాంతమును నీకు వినిపించిన హనుమంతునికి నీవు "ఏమి బహూకరింతునా" యని ఆలోచించుచుండగా ఆతడే అచ్చట నున్న రాక్షస స్త్రీ వధకు తన కనుజ్ఞ నిమ్మని ప్రార్థించెను. పదిమాసములు రాత్రింబవళ్ళు తనను పీడించి పీడించి అప్పటికిని వారు మానక తర్జన భర్జనలను చేయుచున్నను వారు బాధింపబడకుండ కాపాడితివే తల్లీ! శ్రీరామచంద్రుడు కాకాసురుని, విభీషణుని తన కాళ్ళపై పడినపుడు గదా రక్షించెను. అది యేమి గొప్పపని యమ్మా! నీదయ కాయన దయ తక్కువే గదా? నీ కృపకును ఆయన కృపకును ఎంత తారతమ్యము? మే మెంత పాపాత్ములమైనను నీ క్షమా గుణమును నమ్మి నిశ్చింతగా నున్నామమ్మా" - అనిరి.

"పితేన త్త్వత్ప్రేయాన్ జనని! పరిపూర్ణాగసి జనే,
హితస్రోతో వృత్త్యా భవతి చకదాచి త్కలుషధీః,
కిమేంత న్నిర్దోషః క ఇహ జగతీ తిత్వము చితై,
రుపాయై ర్విస్మార్య స్వజనయసి మాతా తదసి నః॥"

"అమ్మా! నీ భర్త (మా హితమునకే అనుకొనుము) మా పాపములకు క్రుద్ధుడై మమ్ములను శిక్షించుటకు ఒకసారి నృసింహావతారమును ధరించును. ఆ సమయములో నీవు "అదేమండీ? ఈ సంసారమున తప్పులు చేయని వారుందురా? వీనినిన దండించిన మీరాయ అవతారములలో ననేక శ్రమలతో సంపాదించిన యుపాదులు పోవునగదా? వీనిని విడచిన నరకాది శిక్షాశాఖ యేమగును. నందురా - ఎంత పాపాత్ముడైనను పశ్చాత్తప్తుడై - "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" - అని మీ శ్రీపాదముల నాశ్రయించిన క్షమింపడు. అట్లుగాక యింకను పాపాభిముఖుడే యైనవానిని దండింపుడని యుపాయముల నుపదేశించి, మమ్ములను రక్షించి మాకు తల్లివైతివి కదమ్మా!! అని సాయించిరి.

ఒన్ఱు నీ కైకరవేల్ -

కరుణాళువగు తండ్రి తనను లక్ష్య పెట్టకయిలు విడచి పోయిని తన బిడ్డకు తానే రహస్యముగా డబ్బిచ్చి వేరొకరిచే అన్నమును పెట్టించునట్లు,

భగవంతుడును తనను లక్ష్యపెట్టక దేవతాంతరులను గొలుచు పామరుల పట్ల కినియక, వారారాధించు దేవతలకే వారి భక్తులకు ఫలము నిచ్చు శక్తినిచ్చి యా దేవతల ద్వారా వారి అభీష్టములను తీర్చునట!

ఈ యర్థమునే ఈ క్రింది గీతా శ్లోకములు వివరించుచున్నవి.

"యో యో యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి,
తస్య తస్యా చలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్॥ (భగీ. అ. 7. శ్లో. 21)
సత యా శ్రద్ధయా యుక్తః తస్యారాధన మీహతే,
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్ (భగీ. అ.7. శ్లో. 22)

వర్షము నిచ్చుటలో నీ యౌదార్య మిట్లుండవలెననుచున్నారు.

మేఘము.

ఉప్పని సముద్ర జలమును త్రాగి మధురతమమైన నీటిని వర్షించును.

ఆచార్యులు

శ్రుతి సాగరమునుండి దురవగాహము లైనట్టియు, కఠోరములగు నట్టియు అర్థములను గ్రహించి, వానిని స్వాదిష్టము లొనరించి సకలానుభవ యోగ్యములగు నట్లు ప్రసాదింతురు.

మేఘము

సర్వదా వర్షించక యొకా నొకసమయము నందే వర్షించును.

ఆచార్యులు

వీరును యోగ్యులగు శ్రోతలను పరిశీలించి, ఆయా అవకాశము లందు మాత్రమే సదుపదేశములను గావింతురు.

మేఘము

నకాలమున వర్షించనిచో లోకమున నానావిధములగు పీడలుదయించును. అట్లే -

ఆచార్యులు

వీరును తగిన సమయములో నుపదేశించినచో దేహాత్మ భ్రాంతి, స్వస్వాతంత్ర్య భ్రాంతి, స్వరక్షణేన్వయ భ్రాంతి, ఆభాస బంధు భ్రాంతి, విషయ ప్రావణ్యము అను ఆత్మ వినాశకరములగు ఆరు రోగములుదయించును.

ఇట్లు చెప్పచు పోయినచో మేఘ ఆచార్య సామ్యము పెరుగును కాని తరుగదు కనుక విరమించి వేదార్థమునకు మరలుదము.

వేదాంతార్థము.

ఇది తిరుప్పావైలో ముఖ్యమైన పాశురము. విశిష్టాద్వైత సిద్ధాంత సాధమునకు ఆధారస్తంభములనదగు ఆళ్వారెంబెరు మానార్ల (నమ్మాళ్వార్లు, రామానుజులు) విషయమైన సమగ్రముగ సమన్వయమగు పాశురమిది. ఆ సమన్వయమును గూర్చి కొంత తెలిసికొనుట అప్రస్తుతము కాదను కొందును.

-నమ్మాళ్వార్ల విషయమైన సమన్వయము -

ఆళిమళైక్కణ్ణా -

సువిశాలమగు నీ భూమండలమునగల సమస్త చేతనులును భగవంతుని కృపాతిశయముచే తృప్తులగునట్లు చేయగల ఓ సదాచార్య వర్యా! అంతమాత్రమే గాక, వరికిని ఆచార్య పదవిని నిర్వహించు ఆళ్వారే! "ప్రసన్న జన కూటస్థం ప్రపద్యే శ్రీపరాఙ్కుశం". ప్రపన్నులకు మూలపురుషులు కూడనగుదురు. వీరి సంబంధమున్నంత మాత్రముచే అందరను భగవత్కృపకు పాత్రులను గావించు సామర్థ్యము గలవారు. అది వీరిగల యౌదార్యము!

"కేశన్ తమర్ కేళ్మే లెమర్ ఏళేళ్ పిఱనిక్కుమ్,
మాశదురితు పెత్తు నమ్ముడె వ్వాళ్వువాయ్ క్కిన్రవా".

ఆళ్వారుల సంబంధమున్నంత మాత్రమే చాలును భగవత్కృపకు పాత్రులగుటకు. కావుననే మనకు శ్రీనాథముని పుంగవులు - "మాతా పితా యువతయస్తు నయా విభూతి స్సర్వం యదేవ .......... తదఙ్ఘ్రియంగళమ్" - అను తనియను విత్యాను సంధేయముగా ప్రసాదించినారు.

మేఘములు వర్షించి తెల్లబారును. నమ్మాళ్వారులు వర్షించనిచో తెల్లబారుదురు.

"శొన్నాల్ విరోదమతు ఆకిలుమ్ శొల్లునన్ కేణ్మినో" - నేను చెప్పిన మీరు నన్ను నిందింతురు. ఐనను చెప్పక మానను. మీరు వినియే తీరవలయును. అను నిర్బంధముతో భగవత్కథామృతమున నోలలాడించు స్వభావము కలవారు నమ్మాళ్వారులు.

పాళీ అమ్‌తో ల్ ఉడైయ -

బలిష్ఠములై, సర్వాధారములై, అతి సుందరములై యుండు భుజములు కలవాడైన

పఱ్పనాబన్ -

బ్రహ్మపుట్టుకకు తావళమైన నాభికములము గలవాడును, సమష్టి సృష్టిని చేయగల సర్వ సమర్థుడును అయిన శ్రియఃపతి యొక్క,

కైయిల్ ఆళిపోల్ మిన్ని -

చేతియందున్న చక్రమువలె కారుణ్య వర్షమును వర్షింపజేయుట కవతరించబోవు రామానుజులను యోగదృష్టితో దర్శించి దానిచే కలిగిన ఆనందమంతయును శరీరమున కాంతులీను చుండగా -

వలమ్బురిపోల్ నిన్ఱతిర్న్దు -

ఆశ్రియఃపతి యెడమ చేతియందున్న శంఖమువలె మధ్య విరామము లేకుండ ధ్వనించి అనగా - ప్రణవార్థము నందరు నెరుంగు నట్లుగా తిరువాయ్ మొళి ప్రబంధము ద్వారా ప్రకాశపరచవలయును.

(ఒలవిల్ కాలమెల్లామ్ముడనాయ్ మన్నివళు వాలా అడియైశెయ్య వేణ్డుం - ఇత్యారులచే తాళాదే శార్ఙ్గము దైత్తశరమలై పోల్ -

ప్రణవము నందలి శేషశేషి భావసంబంధము జ్ఞానమువలన లభించు కృపావర్షమును,

వాళ -

లోకులందరును తను స్వరూపము నెరిగి, అనగా తాము భగవంతునుకే శేషభూతుల మనియు, తమకా దయమయుడొసంగిన కరణత్రయము నాతని సేవకే వినియోగించవలయుననియు నెరింగి, అనుష్ఠించి, ఆ నారాయణుని అనుగ్రహమునకు పాత్రులై సుఖించునట్లు

పెయ్‌దిడాయ్ -

మీతిరువాయ్‌మొళి ప్రబంధము ద్వారా భగవద్గుణ కథామృతమును వర్షింపుడు.

నాజ్ఞళుమ్ మార్గళినీరాడ - భగవత్కైంకర్యమునే ముఖ్యమైన భోగముగా భావించి మేము నోము అనుమిషతో భగవంతుని సంశ్లేషమును బడసి ముగళ్న్దు - సుఖింతుతముగాక!

అనగా భగవంతుని కల్యాణ గుణానుభవమునకు ఒంటరులము గాక యింతమంది సహకారులున్నారే అని సంతోషించి వారందరితోను కలసి భగవదనుభవమును గావించి, ఆనందసాగరమున నోలలాడవలయును.

ఈ పాశురమున వరుణ దేవునకై భగవంతుడొసగిన సహజమైన కార్యమునే తమ కిష్టమగు నట్లాచరింపగోరుటచే ప్రపన్నుడు తనకు విధింపబడిన నిత్యనైమిత్తికాది కర్మలనన్నిటిని భగవద్భాగవత ప్రీతికరముగ చేయవలయునను నియమము తెలియబడుచున్నది.

ఈ సందర్భమున నీ క్రింది శ్లోకమును అర్థ భావయుక్తముతో అనుసంధించ వలయును.

లక్ష్మీనాథాఖ్య సిన్ధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్యనీరమ్,
నాథా ద్రావభ్య షిఞ్చత్తదను జలజిద్యగ్రాఘువాభ్యాం ఝురాభ్యామ్ ।
గత్వా తాం యమునాఖ్యం సరిత మథయతీ న్స్వాఖ్య పద్మాకరేన్ద్రమ్,
సంపూర్య ప్రాణి సస్యం ప్రవహతినతిరాం దేశికేన్ద్ర బ్రమోఘైః ॥

"ఆచార్య వంశోజ్ఞేయః అసావసావిత్యా భగవత్తః" - అను ప్రమాణమును బట్టి అసౌ-అస్మద్గురుభ్యోనమః, అసౌ-అస్మత్పరమ గురుభ్యోనమః - ఇత్యాది క్రమాను సారముగ, ఆ భగత్తః-శ్రీధరాయ నమః వరకు, ఆచార్య వంశోజ్ఞేయః-ఆచార్య పరంపర నెరుగవలయును. అందులకే మన పూర్వాచార్యులు వాక్య గురుంపరను, శ్లోక గురుంపరను నిత్యాను సంధేయ మొనరించిరి. ఈ శ్లోకమా గురుపరంపరను బోధించుచు నొక చక్కని రూపక విన్యాసముతో చమత్కరించుచున్నది. తిలకింపుడు.

అమరకోశకారుడు చెప్పిన శరీర పర్యాయ పదములనేకము లున్నను, భగవానుడు - "మేమతం" - అని స్వతంత్ర శ్రీకృష్ణ మతాను సారముగ దీనికి "క్షేత్ర" మని పేరుంచెను. "ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్ర మిత్య భిధీయతే" - అని క్షేత్రమనగా లోకమున వాడుకలో పంటభూమి. ఆ పేరునే దీని కుంచుటచే నిదియును పుణ్యపాపములనెడు బీజములు

ఫలించుటకై భగవంతుడు కల్పించిన పంటభూమి అని తెలియుచున్నది. అనగా ఆత్మ శరీరము ద్వారా చేసిన పుణ్యపాపముల ఫలములగు సుఖదుఃఖముల ననుభవింపజేయుటకు సాధనముగా నీ శరీరమును కల్పించుచున్నాడని భావము. "చేతనా ధృతిః" - అని (భగ.అ. 13. శ్లో 2) గీతలో భగవాను డీయర్థమునే బలపరచెను.

ఈ క్షేత్రములు రెండు విధములు అవి:- 1) దైవ మాతృకములు, 2) నదీ మాతృకములు అని. దైవ మాతృములనగా భగవంతునిచే పోషింపబడునవి. (వర్షముపై నాధారపడు మెట్ట భూములు లోనగునవి), నదీ మాతృకలనగా డెల్టా (The Space enclosed by the mouths of a river నదీ ముఖముచే చుట్టబడిన భూ భాగము) భూములు. ఈ శరీరములనెడు క్షేత్రములను దైవ మాతృకలనియే పరిగణింపవలయును. ఎందువలన ననగా - భగవంతుడొక కృషీవలుడు. అతడే జీవుడను విత్తనమును ఈ శరీరమను క్షేత్రములో నాటును "అహం బీజప్రదః పితా" (భగ. అధ్యా. 14. శ్లో. 4) అనియు" మమ యోనిర్మహద్బ్రహ్మ, తస్మిన్ గర్భం రధామ్యహమ్ (భగ. అధ్యా. 14. శ్లో. 3) అనియు అతడు తెలిపియున్నాడు. సకల జగత్కారణమైన మూల ప్రకృతి నాకధీనమైనది. దానియందు జీవుడను బీజమును నేనే నాటుచున్నాను. దైవ మాతృకములగు భూములలో నీ బీజము మొలకెత్తి పెరిగి పండెడు విధానమును గూర్చి యొకింత తెలిసికొందము.

మేఘములు సముద్ర మధ్యమున కేగి కడుపార నీరు త్రాగి ఆకసముపై కెగసి నల్లని శరీరముతో నంతను వ్యాపించి, యింద్రధనుస్సును ధరించి, మెరయుచు, గర్జించుచుపోయి పర్వతములపై కురియును. ఆ నీరు ఆ పర్వతముల నుండి సెలయేరులై పారి యొక పెద్దవాగును చేరును. ఆ నీరు ప్రవహించుచు చిన్న చిన్న కాలువల గుండా ఆయా గ్రామములలోని చెరువులను నింపును. ఆ చెరువుల కుండు తూముల ద్వారా ఆ నీరు సస్యములలో ప్రవహించి ఆ బీజములను పండించును.

పైని పేర్కొనిన శ్లోకమున లక్ష్మీనాథుడు - (శ్రీధరుడు, శ్రీ.) సముద్రము, అందపారమైన కృపా నీరము కలదు. నమ్మాళ్వారులు మేఘము. నీరా సముద్ర మధ్యమున ప్రవేశించి, ఆ కృపా నీరమును కడుపార త్రాగి

ఆకసమునకెగసిరి, అనగా - భగవంతుని సంపూర్ణ కృపా పాత్రులై ప్రసన్నజన కూటుస్థులైరి. (కూటస్థుడనగా వంశమూలపురుషుడని భావము) కూటస్థు డందరకును పైన గదా యుండును. వారును మెరసి అనగా "క్షణప్రభా" అనునట్లు లోకమున కల్పకాలము మాత్రమే దర్శనభాగ్య మొసంగిరి గర్జించి అనగా - నాలుగు దివ్య ప్రబంధధములను ఉచ్చైస్స్వరమున వినిపించిరి. నలుపు చల్లదనమును తెలుపునని పూర్వాచార్య సంప్రదాయము. ఆళ్వారులును తాపత్రయో పశమకమైన చల్లని రూపముచే కలవారు. చల్లని గాలికా మేఘము కరిగి వర్షించును. నాధమునులు గావించిన కణ్ణినుణ్ శిరుత్తాంబ జపమే ఆళ్వారులను కరిగించు గాలియైనది. అంతనా మేఘము ఆ కొండపై (నాధములపై) భగవత్కారుణ్యమను నీరమును వర్షించును. ఆ నీరము శ్రీరామ మిశ్రులు, పుండరీకాక్షులు - అను రెండు సెలయేరులై క్రిందికి పారినవి. అవి యమునాచార్యులనెడు పెద్దకాలువ యందు జేరి ప్రవమించినవి. దాని నుండి రామానుజులనెడు గ్రామ తటాకమున జేరెను. ఆ తటాకము చాల విశాలమై అగాధమైనది. దానికి డెబ్బది రెండు తూములు గలవు. రామానుజులు ప్రచారమునకై యేర్పరచిన పీఠాధిపతులే ఆతూములు. వీని ద్వారా (ఆ పీఠాధిపతుల ద్వారా) ప్రాణి సస్యములకు ఆ కారుణ్య నీరము ప్రవహించి బీజముల వంకురింపజేసి ఫలవంత మొనర్చెను.

ఈ వ్యాపారము నంతను చక్కగా నెరవేర్పుడని శ్రీనమ్మాళ్వారులను ఈ పాశురము ద్వారా ఆండాళు తల్లి ప్రార్థించుచున్నారు.

ఆళ్వారులే యిట్టి కార్యమును జేయసమర్థులు. ఆయన సంబంధ మున్నంత వరకు అందరును భగవత్కృపకు పాత్రులు కాగలరు. ఆకృపను అతని సంబంధు లందరిపైనను వర్షింపజేయుటలో ఆతడెంత మాత్రమును వెనుదీయడు. ఆతడు భగవద్గుణాను భవసాగరమున బాగుగ నవగాహన మొనర్చుకొని, ఆటోపముతో ఆచార్య పీఠము నధిరోహించి, భగవత్కా రుణ్యమును వర్షింపజేయుట కుద్యమించిన ఆతని శరీరము నందొక వైలక్షణ్య ముట్టిపడునట్లు దర్శనమిచ్చి, యోగదృష్టిచే భవిష్యదాచార్యులను భగవద్రామానుజులను దర్శించిన ఆనందమంతయు ఆతని శరీరము నందంతటను కాంతులీనుచుండగా ప్రణవార్థముల నెల్లవెల్లువలుగా ప్రవహింపజేసి ప్రపన్నుల నానందపరచియు, ధనమదాంధులను, మానవులను పాడి మిడిసిపడు కవులను, నింద్య ద్రవ్యములతో

క్షుద్రదేవతలను ఆరాధించు నీచులను, విషయలాలసులగు సంసారులను గద్దించి గర్జించియు, తిరువాయ్‌మొళి ప్రబంధము ద్వారా ప్రపన్న కోటి అంతయు బ్రహ్మానంద భరితులగునట్లును, పండితులు వ్యాఖ్యానమొనరించి (కాలక్షేపముల ప్రసాదించి) లోకులను ఆనందపరచునట్లును తిరువాయ్ మొళి ప్రబంధమును ప్రసాదింపుడను ప్రార్థన ధ్వనించుచున్నది. ఇది నమ్మాళ్వారల విషయమగు అన్వయము.

ఇక శ్రీభాష్యకారపరమగు అన్వయమును గూర్చి కూడ కొంత తెలిసికొనుట యుక్తము.

ఇచ్చట మేఘశబ్దమునకు సర్వోజ్జీవన హేతువులగు అర్థముల నుపదేశించు ఆచార్యులకు రామానుజలే అర్థము.

ఆళియుళ్ పుక్కు -

శ్రుతి సాగరము, ద్రావిడ వేదసాగరము అని చెప్పబడు ఉభయ వేదాంతములలో తలస్పర్శిగా నవగాహించి

ఊళిముతల్వ నురువమ్బోల్ మెయ్ కరుత్తు -

భగవద్రామానుజులు అప్రాకృత పంచోపనిషణ్మయ దివ్య విగ్రహులు గాన గులోబులో నుంచిన దీపమువలె వారి హృదయ కుహరమున "స్వాఙ్గష్ఠ ప్రమితంచ యోగి హృదయే ష్వాసిన మీశం" - అనునట్లు వేంచేసి యున్న నూతన జలధరరుచియగు సర్వేశ్వరుని కాంతులు వెలుపలకు చిమ్ముటచే వీరికే విశేషణ మెంతయు నొప్పును. ఆశ్రీయః పతిహేతి రాజమగు చక్రము దిక్కులకును, విదిక్కులకును (రెండు దిక్కుల నడిమి భాగము) ప్రేరేపింపబడిపోయి శత్రువర్గము నంతను చీల్చి చెండాడి స్వస్థానమునకు చేరునట్లుగా

"శ్రీశైలం కలిశైలమజ్ఞాన గిరిం........... నిషేవ్య రమతే రామనుజో యంమునిః" అనునట్లు యావద్భారత దేశమును మూలమూలకేగి బాహ్యులను వలమ్బురి పోల్ నిన్రతిర్‌ల్ -

చక్రము వలె శంఖము చేతిని విడువదు. చేతియందే యుండి ఘోషించి హృదయములను చీల్చి చెండాడును. అటులనే భాష్యకారులును - "ద్వయమర్థాను సన్ధాసేన సదైవం వక్తా యావచ్ఛరీ రపాతమత్రైవ శ్రీరజ్గేసుఖ

మాస్వ" - అర్థయుక్త ద్వయ మంత్రము నను సథించుచు ఇచ్చటనే శ్రీరంగమందు చివర వరకు సుఖముగ నుండునని యాదేశించుటచే నా యాజ్ఞను పాటించుచు నచ్చటనే యుండి పరమతముల నిరసించుచు గ్రంథములను వ్రాయుచుండిరి.

శార్ఙ్గము దైత్త శరమళైపోల్ వాళులగినిల్ పెయ్ దిడాయ్ -

"ప్రణవోధనుశ్శరోహ్యాత్మా" - అను శ్రుతిని బట్టి ధనుస్సు అనగా ప్రణవము. శరమనగా ఆత్మ, ప్రణవము నుండి ఆవిర్భవించునట్టియు, ఆత్మలకు సకాల వృష్టివలె ఆనందకరములగు నట్టియు, అర్థ విశేషములను లోకమంతయు ఆనందించునట్లు వర్షింపుమని శ్రీభాష్యకారుల స్థానమందున్న ప్రస్తుత మన ఆచార్యులను ప్రార్థించుచున్నారు.

తాళాతే -

ఆయర్థోపన్యాసములైనను రుచి మారకమునుపేక్షణ భంగురమైన శరీరమున్నప్పడే వెంటనే ప్రసాదించవలయునని ప్రార్థన విభీషణుడును. "నివేదయత మం క్షిప్రం" - అని త్వరపడుటయిందులకే "యదహరేవ విజరేత్ తదహరేవ ప్రవ్రజేత్" - అనునటుల విరక్తి చెందిన వెంటనే సన్యసించ వలయును లేదా శరణాగతి నందవలయునని గదా విధి!

ఉలగినిల్ వాళ -

లోకులందరును ఆనందించునటుల, ఆచార్యులు చేతను అందరునుజ్జీవించవలయుననియే సందర్భముల నుపదేశింతురు. అవి కొందరకు బాధను కలిగించుట, వారి కర్మమూలమే గాని, ఆచార్య దోషముగాని, అర్థదోషము గాని కాదు. వర్షము అన్ని వృక్షములను చిగిర్చి, ఫలింపవలయుననియే కురియును కాని, జిల్లేడు ఆకులనురాల్చి మోడగుచున్నదన్నచో నది వర్షదోషమా? దీపమందరకును ప్రకాశము నొసంగి పదార్థములు స్పష్టముగా గోచరింపవలయుననియే వెలిగింపబడును. మిడుతలు కొన్ని యందుపడి మరణించినచో నది దీప దోషమా?

నాఙ్గళుమ్ మార్గళి నీరాడ మగిళ్న్దు -

మార్గళి అనగా అంతిమోపాయము. దానియందు మాకు నిష్ట

దినదినాభివృద్ధిని చెంది అందే మేము సదా మునిగియుండి యుజ్జీవించు నటుల సాయించవలయును అని భావము. విఖ్యాతులు కృత్స్నమైనను సర్వము విశదముచేయు శక్తి చాలక సంగ్రహించుటయే గాని వారి వైభవమంతమాత్రమే అనిగాదు. కావున, పండితులు మన్నింతురు గాక!

# ఐదవ పాశురము

"మాయనై మన్ను"

## అవతారిక

మొదటి పాశురమున నారాయణ పదముచే ఉభయ విభూతి సంబంధమును చెప్పిరి - "నార" పదమునకు స్వరూపతః నిత్యములైన నిత్య విభూతియు, తద్గత పదార్థములును, అర్థముగా గ్రహించుటచే ఉభయ విభూతి సంబంధము చెప్పబడినటులనే గదా? రెండవ పాశురమున - "పార్కడలుళ్ పైయత్తు యిన్ద పరమనడిపాడి" - యని సకలావతారకందమైన ఇంద్రుని లోటును తీర్చుటకై ఆతడు పోగొట్టు కొనిన త్రైలోక్యరాజ్యమును తిరిగి సంపాదించి యిచ్చుటకై వామనుడై యవతరించి లీలా విభూతిలోని చేతనా చేతన పదార్థములలో తారతమ్యమును చూడక అన్నిటిని తన పాదారవిందములతో స్పృశించి యిది యంతయు తనదేయని సాధించు కొనిన రీతి చెప్పబడెను. నాల్గవ పాశురమున - "తాళాతే శార్ఙముదైత్త శరమళైపోల్" - అని యోగ్యులై జ్ఞానానుష్ఠాన సంపన్నులగుటచే సదాచార్య పదవికి తగిన వసిష్ఠాదులు తనను నియమించి పనులను చేయించనట్లు చక్రవర్తి తిరుమగనై (శ్రీరాముడై) అవతరించి తన చక్రవర్తిత్వమునకు భంగము రానీయకుండ పరతంత్రుడై ప్రవర్తించిన శ్రీరామతారవృత్తాంతము చెప్పబడినది.

ఈ అయిదవ పాశురమున తారతమ్యములేక అందరకును కట్టుటకును, చివరకు కొట్టుటకును గూడ అలుసు కాగలిగినంత సౌలభ్య పరాకాష్ఠయగు శ్రీకృష్ణావతారము ప్రసంగింపబడినది. ఇందు నొక యూరున కంతకును పూర్ణానుభవమునకై తనను స్వాధీన పరచివేసిన భక్తపరాధీనత చెప్పబడినది.

నోమునోచు గోపాంగనలలో వేదాంత పరిచయములేని యొకతె "శ్రేయాంసి బహువిఘ్నాని భవన్తి మహతామపి" - అను న్యాయమును పురస్కరించుకొని - "మన నోమెట్లు సఫలమగు" నని శంకించెను. ఆమె యుద్ధేశ్యము సరియైనదే. "మహాత్ములకే విఘ్న పరంపరలచే నభీష్ట కార్యము సిద్ధించలేదే. ఇక మనకేమిగతి? అని ఆమె అభిప్రాయము. ఆమెకు శ్రీరామ పట్టాభిషేకోద్యమ వైఫల్య కథ హృద్గతమై యుండెనేమో! ఈ పట్టాభిషేకము తలపెట్టిన వాడు ఇంద్రాది దేవతలకును అభేద్యుడగు శంబరుని హతమార్చిన దశరథ చక్రవర్తి "దశసుదిక్షు అప్రతిహతా రథగతి: యస్య" పది దిక్కులయందును అడ్డులేని రథసంచారము కలవాడతడు. మహూర్తము నుంచినవాడు ఒక జన్మలో విశ్వామిత్రుని రాజర్షి పదివినుండి యొక్కమాటతో బ్రహ్మర్షి పట్టమును కట్టించిన వసిష్ఠ మహర్షి, కిరీటమును ధరించువాడు - "సహపత్న్యా విశాలాక్ష్య నారాయణము పాగమత్" అనునట్లు పట్టాభిషేకము నిర్విఘ్నముగా జరుగుటకై శ్రీరామచంద్రుడు సీతామాతతో నొకరాత్రియంతయు జాగరణతో, నియమనిష్ఠలతో, దర్భశయ్యపై శయనించి బ్రహ్మచర్య వ్రతముతో శ్రీరంగనాథుని సేవించెను. "ఇచ్ఛామోహి మహోబాహుం............" అని శ్రీరామచంద్రుడు రాజోచితములగు నలంకారములను ధరించి, వేంచేసియెప్పుడు దర్శనమిచ్చునాయని మేమందరము ఎదురుచూచున్నామని రాజభవన మంతయు దద్దరిల్లునట్లు ఏకకంఠముతో నుత్సహించినది గంగాది పుణ్యనదులందు పవిత్రమగు జలమునుదెచ్చిరి. పర్వతముల నరణ్యముల బరిశోధించి దివ్యౌషధులను స్వవిభవోచితముగ గొనియుంచిరి. బ్రాహ్మణోత్తములకును, విష్ణు కైంకర్య పరాయణులగు భాగవతోత్తములకును భూరిదానములు చేయించుటకై యేర్పాట్లు చేయబడినవి. పురమంతయు రంభా స్థంభములతోడను, చిత్రవిచిత్రములగు నలంకారములతోడను, కలువడములతోడను, గలయగ్గుపిజల్లి ముత్తియముల మ్రుగ్గులిడిన ముంగళములతోడను, అగరు ధూప సంవాసితములయిన హర్మ్యముల తోడను, వీణావేణు మురజాది మంగళవాద్యములతోడను గలకలలాడు చుండెను. పౌరులందురు మహోత్సాహముతో నందందు సంచరించుచుండిరి. గజ ఘటల ఘీంకారములను, హయహేషలును, వీరభటుల విజయధ్వానములును నొకవంక నుత్సాహజనకములయి యుండెను. ఇట్లు యున్ని

పరికరములన్నియు అనుకూలముగనున్నను పట్టాభిషేకము జరుగనే లేదు. ఇకననాది కాలమునుండియు పాపరాశిలో మునుగుచున్న మనకాయీ వ్రతానుష్ఠానము ఏ కొరతయులేక నిర్విఘ్నముగా సాగునది? "అని ప్రశ్నించెను. దానిని విని వేదాంత విద్యానుభవముగల యొక గోపిక ఆమెతో - "అయ్యో, పిల్లా! నీకు సర్వేశ్వరుని స్వభావము తెలియదు. హిరణ్యకశిపుడు తన కుమారుడైన ప్రహ్లాదుని - "ఓరీ! కులపాంసకా! నీదేవుడెందున్నాడురా? అని ప్రశ్నించగా"............... సర్వత్రాప్తి సదాస్తి కిం బహుగిరా త్వయ్యస్తి మయ్యస్తిచ" - అని యాస్తిక్య బుద్ధిచే ప్రమాణమును చేయగా ఎక్కడ ఎప్పడు చూపమనునో యని భగవంతుడు అంతటను నిండియుండి ఆతని ప్రతిజ్ఞను కాపాడిన వాడు శ్రియఃపతి కాడా? తన భక్తుడగు ప్రహ్లాదుడు నిర్భయముగా గావించిన ప్రతిజ్ఞను, హిరణ్యకశిపుడు తాను చావుకుండుటకై కోరబడిసిన వరమ్మకు భంగము రాకుండగా ఆశ్చర్య రూపమును ధరించి సభాస్థలి యందున్న స్థంభము నుండి యవతరించలేదా?

"స్వ నిగమ మపహాయ మత్ప్రతిజ్ఞాం,
ఋతమధికర్తు మనప్లుతో రథస్థః॥"

"ఆయుధమును ధరించ" నను తన ప్రతిజ్ఞవమ్మైనను" - నీచే నాయుధమును పట్టింతు" నను తన భక్తుడగు భీష్ముని ప్రతిజ్ఞను కాపాడుటకై చక్రమును చేబట్టెను.

అంతేకాదు - "నమే భక్తః ప్రణశ్యతి" - అని తానే ప్రతిజ్ఞచేయవలసి యుండగా - కౌన్తేయ! ప్రతి జానీహి నమేభక్తః ప్రణశ్యతి" - అర్జునా! నా భక్తుడు చెడడని నీవు ప్రతిజ్ఞచేయుమని యాదేశించెను. తాను ప్రతిజ్ఞచేసిన నిలబెట్టుకొనజాలనని తన కత్యంత ప్రియ భక్తుడైన యర్జునునిచే దానిని గావింపజేసినచో తానెట్టైనను దానిని కాపాడ గలనను సంకల్పముచేతనే గదా?

విభీషణునకు సముద్రమున కీవలి యొద్దున నుండగనే లక్ష్మణునిచే లంకారాజ్య పట్టాభిషేకమును చేయించెను. దానిలోని రహస్యమునిదియే.

సంశక్తులను వేటాడి శిబిరమునకు వచ్చిన అర్జునుడు తన ప్రియపుత్రుని మరణవార్తను విని, ఆతనికి తోడ్పాటు అందకుండ చేసిన

సింధురాజును మరునాడు సూర్యాస్తమయమునకు పూర్వమే సంహరింతుననియు, అట్లు చేయనిచో గాండీవముతో అగ్ని ప్రవేశము చేయుదుననియు భీషణ ప్రతిజ్ఞచేసియు, శకటవ్యూహమును సైంధవుడున్న సైన్యమును కలుపుచు సూచీ వ్యూహమును ఏర్పరచి, ఉద్దండ కోదండమును చేబూని, దండధరుని వలెసేనాముఖమున నిలువబడి ద్రోణాచార్యుడు కాపాడుచుండగా జయద్రదుని సంహరించుటకు వీలులేని పరిస్థితి యేర్పడగా శ్రీకృష్ణుడు చక్రమును అడ్డుపెట్టి పగటిని రాత్రిగాచేసి, సింధురాజును చంపించుటయును భక్తుని ప్రతిజ్ఞను కాపాడుటకాదా? కావున మనము చేసిన శ్రీవ్రతానుష్ఠాన ప్రతిజ్ఞను ఆ కృష్ణుడే కాపాడుకొనును. మనకాచింత యేల?

మన మా నారాయణుని సంకీర్తనములో దిగినచో మన వ్రతమునకు విరోధులగు దుష్టశక్తులన్నియును భగవదనుగ్రహము వలన దూరమగును. కావున "శెప్ప" అని వేదాంత విజ్ఞానము కలిగి భగవతత్త్వ మును కరతలామలకము గావించుకొనిన గోపాంగన చెప్పచున్నది.

మొదటి నాలుగు పాశురములకు విశేష, వేదాంత విషయములను వ్రాసితిని. అట్లే తక్కిన పాశురములకును వ్రాయదలంపు కలదు. కాని, వ్రాయుకొలది గ్రంథబాహుళ్యమగును. కనుక, సంగ్రహపఱచితిని.

ఇందులకు విజ్ఞలోకము మన్నించునుగాక!

అయిదవ పాశురము

మాయనై మన్ను వడమదురై మైన్దనై,
త్తూయ పెరునీర్ యమునైత్తుఱైవనై,
ఆయర్ కులత్తినిల్ తోన్ఱుం మణివిళక్కై,
త్తాయై క్కుడల్ విళక్కం శెయ్‍త దామోదరనై,
తూయోమాయ్ వన్దునాం తూ మలర్ తూవి త్తొళుదు,
నాయినాల్ పాడిమనత్తినాల్ వానిన్దనవుమ్,
తీయినిల్ తూశాకుం శెప్ప ఏల్ ఓర్ ఎంపావాయ్ ।

టీకా:- మాయనై = ఆశ్చర్య గుణచేష్టితములు గలవానిని, మన్ను = నిత్యభగవత్సంబంధముగల, వడమదురై = ఉత్తరమధురకు, మైన్దనై = నిర్వాహకుని, తూయ = పరిశుద్ధమైన, పెరు = మిక్కిలి లోతగు, నీర్ =

జలముకలిగిన, యమునైత్తు తైవనై = యమునానది యొక్క, కులత్తినిల్ = కలమునందు, తోన్ఱుం = ప్రకాశించుచున్న, రుణివిళక్కై = మంగళదీపమైవానిని, తాయై = యశోదామాతయొక్క, కుడల్ = గర్భమును, విళక్కంశెయ్త = ప్రకాశింపజేసిన, దామోదరనై = ముడులగల చిన్నత్రాటిచే కట్టబడిన ఉదరము గల శ్రీకృష్ణుని, నాం (దాసభూతులమగు) మనము, తూమోమాయ్ = పరిశుద్ధులమై, వన్దు = వచ్చి, తూ = నిర్మలమగు, మలర్ = పుష్పములను, తూవి = సమర్పించి (చల్లి), తొళుదు = అంజలిచేసి, వాయినాల్ = నోటిచే, పాడి = సోత్రము చేసి, మనత్తినాల్ = మనస్సుచేత, శిన్దిక్క = ధ్యానించినయెడల, పోయపిళ్ళైయుమ్ = వెనుక తెలియకచేసిన పాపములును, పుగుదరువా నిన్దనవుమ్ = ఇటు తర్వాత తనకు తెలియక వచ్చెడు పాపములును, తీయనిల్ = నిప్పునందుపడిన, తూశు = దూదివలెనే, అగున్ = కాలిపోవును, ఏలు = ఓ సఖీజనులారా!, ఓర్ = విమర్శించి, ఎమ్బావాయ్ = మామాట ననుసరించి, శెప్ప = సర్వేశ్వరుని దివ్య నామములను అనుసంధింపుడు.

తా: స్థిరకీర్తి జెందిన ఉత్తర మధుర యందు శ్రేయోంశములు గల శిశువై ఆశ్చర్యగుణ చేష్టితములు గలవాడును, పరిశుద్ధమై యొప్పుచున్న యమునా నదీ తీరమున విహరించువాడును, గోపాలకులమునకు మణిదీపమై విలసిల్లు వాడును, యశోద మాత గర్భమును ప్రకాశింపజేసిన దామోదరుడను తిరునామముగల వాడునైన సర్వేశ్వరుని సన్నిధికి మనము శుచిగా పోయి, సువాసన గల పుష్పాలను సమర్పించి, అంజలి జేసి వాక్కుచే నాతని కల్యాణ గుణముల నుచ్చరించి, మనస్సుచే ధ్యానము చేసినట్లయిన మన యొక్క పూర్వాఘములను, ఉత్తరాఘములును అగ్నియందుపడిన దూదివలె సమసిపోవును గాన ఆతని దివ్య నామములను ఉచ్చరింపుడని గోపికాస్త్రీలను ఆండాళు తల్లి నియమించుచున్నారు.

మనస్సుచే చింతించి, నాలుకనే కీర్తించి, చేతులలో నుంచి పూలతో పూజించిన సంచితాగామి కర్మలు నిప్పులో బడిన దూదివలె నిశ్శేషముగ భస్మీభూతములగును. ప్రారబ్ధ కర్మమనమను భవించుటచే సమసిన దేహావసానమున జీవునకు ముక్తి కరస్థము. కాన, మనమందరము హరిని భజింతము రండనుచున్నది గోదామాత.

మాయల మారియై మధురలో జన్మించె,
　　గొల్ల కొలమ్మున దల్లికడుపు
విలసిల్లజేసె, మంగళ దీపమగుచు, కా
　　ళియఫణిభేది, కే ళీ వినోద
ముల సల్పిన ఘను దామోదరు మనమెల్ల
　　స్నాతలై పూతలైనతు లొనర్చి
కమ్మని పూవుల గడక పాదారవిం
　　దమ్ములర్పించి చిత్తమ్ములందు

　　ధ్యాన మొనరించి పాటనోరాడ పాడ
　　నపురావృత్తి పద గోపురార్గళములు
　　సంచితా గామికర్మలు సమసిపోవు
　　అగ్ని లోబడ్డ మశకంబు మాడ్కినిజము!

విశేషార్థము

మాయనై -

ఆశ్చర్యకరములైన చేష్టలను గుణములను కలవాడు.

దీనిచే పరత్వ సౌలభ్యములకు చివరి హద్దు చూపబడుచున్నది.

ఆశ్చర్య చేష్టల కుదాహరణము -

బాల్య చేష్టలలో
అంతర్గృహే కృష్ణమవేక్ష్య చోరం।
బధ్వా కవాటం జననీం గతైకా।
ఉలూఖలే దామని బద్ధమేనం।
తత్రాపి దృష్ట్వా సిమితా బభూవ॥"

ఒక గోపాంగన తన యింట నొక చీకటి గదిలో ప్రవేశించి గవ్యమును దొంగలించుచున్న శ్రీకృష్ణునిచూచి, మెల్లగా తలుపులను మూసి, పైన తాళమును వేసి తల్లియగు యశోదతో చెప్పటకై పరుగుపరుగున నేగి తలుపును తట్టగా నచట నొక రోటను, త్రాటితో కట్టబడి యేడ్చుచున్న కృష్ణునిచూచెను. ఇక నేమి చేయును? సిగ్గుపడి నిశ్చేష్టురాలయ్యెను.

"ఉలూఖలేదామ నిబద్ధం" అనుటలో అర్థములో నొక స్వారస్యము కలదు.

ఏదైనను కఠిన పదార్థమును తినుటకు వీలుగా చేసికొన వలయుననిన దానిని రోటవైచి మెత్తగా దంపిన అది తినుట కుపయోగ పడును. అట్లే వేదములోని కఠినములైన అర్థములను మన మనుభవించుటకు అనుకూలముగ ప్రసాదించినారు. ఆరోలుచేయు పనిని వీరి ప్రబంధములే చేయుచుండుటచే రోలు అనగా ద్రావిడ ప్రబంధములని యర్థమును చెప్పకొనవచ్చును. ఆ ప్రబంధములయందే శ్రీమన్నారాయణుని స్వరూప రూప గుణ విభూతులన్నిటిని సుకరముగా ననుభవింపవచ్చును. ఈ యర్థమునే క్రింది శ్లోకము విశద పరచుచున్నది.

వరమిమ ముపదేశ మాద్రియ యధ్వం
సిగమ వనేషు నితాన్త చారభిన్నా: ।
విచునుత భవనేషు వల్లలీనాం
ఉపనిషదర్థము లూఖలేని బద్ధమ్ ॥

ఇక సౌలభ్యమున కుదాహరణము.

సౌలభ్యమనగా

ఎన్నడునైన యోగివిభు లెవ్వని పాదపరాగమింతయున్

కన్నుల గానరట్టి హరి కౌగిట జేర్చుచు జెట్టపట్టుచున్
తన్నుచు గ్రుద్దుచున్నగుచు తద్దయు పైబడి గూడియాడుచున్

మన్నన జేయువల్లవ కుమారుల భాగ్యమదెంత యొప్పనో!

ఇట్టి సౌలభ్యము నితరావతారములలో లోటు పడుటచేతనే భగవంతుడు కృష్ణుడై యవతరించెను. ఇది శ్రీకృష్ణుని దౌత్య, సారథ్య వ్యాపారములలో గానవచ్చును.

"నఖనియమిత కండూన్ పాణ్డవస్యన్ద నాశ్వా
ననుదిన మభిషిఞ్చలిస్థి: పయోభిః
అవతు వితత గాత్ర స్తోత్ర నిష్యూతమౌళిః
దశన విధృతరశ్మిః దేవకీ పుణ్య రాశిః ॥

తాను నడుపుచున్న అర్జునుని రథాశ్వములకు స్వయముగ మాలీషు

చేయునపుడు కొరడాను తలపాగలోను, పగ్గములను నోటును పట్టుకొని, యొడలు వంచి, దోసిలితో నీటిని చల్లుచు, గోళ్ళతో దురదతీరునట్లు గోకుచు దేవకీ పుణ్యరాశి పాటుపడుచుండెను. ఈ విధముగ అనేక సందర్భములలో ఆతని సౌల్యమును చూడవచ్చును. ఇంకను కృష్ణావతార రహస్యములను చూడగోరు వారు "తిరు విరుత్త" మనుదివ్య ప్రబంధమును చదువగలరు. భగవద్గీత యందలి 9,10 అధ్యాయములలో భగవానుడు తన పరత్వమును శతశాఖలుగా నుపదేశించి 11వ అధ్యాయమున అర్జునునకు దివ్య చక్షువు నిచ్చి దానిని ప్రత్యక్షముగా జూపెను. ఇట్టి పరత్వము మన ఆండాళు తల్లి మనకు చెప్పనట్లుగా గోచరమైన విషయమును ఈ పదము తెలుపుచున్నది. ఆళ్వారులు శ్రీకృష్ణావతారమందలి ఉలూఖలబంధన సౌలభ్యమును తలంచుకొని - "ఎత్తిరమ్" - "ఆహా! యేమి సౌలభ్యమని ఆశ్చర్యపడినట్లే ఆండాళుతల్లియు ఆతని పరత్వమును తలంచుకొని - "మాతునై" - అనుచున్నారన్న మాట!

మన్నువడ మదురై -

"మన్ను" - అనుటచే భగవత్సంబంధమొకప్పడును మారని ఉత్తర మధురయని యర్థము. ఇది బృందావన సమీపములో నున్నది. దీనికి "సిద్ధాశ్రయ" మనియు పేరు. కృతయుగమున నారాయణుడు వామనావ తారము నెత్తి త్రివిక్రముడై బలినుండి లోకత్రయమును స్వాధీన పరచుకొని దేవేంద్రునకిచ్చెను. ఆ పనికాగానే వామనుడిక్కడికి వేంచేసి పెక్కు సంవత్సరము లిచచటనే తపస్సు చేసెను. త్రేతాయుగమున శ్రీశత్రుఘ్నుడు ఇచ్చట దుష్టులగు లవణాసురుడు మొదలగు వారిని అణచి రాజధానిని నిర్మించుకొని చాల కాలమేలెను. ద్వాపర యుగమున శ్రీకృష్ణుడై యవతరించెను. "మధు - కాతీతి - మధురా" (రా. ఆదానే తీసికొనుట) అనువ్యుత్పత్తిని బట్టి మధురానగరము అవతారకందమగు క్షీరాబ్ధినాధుని క్షీరసాగమునందు విరక్తుని గావించి తన యందాసక్తుని గావించి తప్పించు కొనెను. "నాగ పరజ్కముత్సృజ్యహ్యాగతో మధురాంపురీ."

మన కర్మ మనల ననేక జన్మలలో పుట్టించునట్లు, భగవంతుని కృపయాతని ననేక జన్మములలో నవతరింపజేయును. ఈయవతారములకు ముఖ్య ప్రయోజనము సజ్జన సంరక్షణమే. పాపాత్ముల సంహరించుట కలపుమొక్కలను తీసివేయువిధముగ అప్రధానము.

మైన్దనై - ఈ పదములకు బలవంతుడు, పిల్లవాడు, యువకుడు, రాజు అని అనేకార్థములను జెప్పవచ్చును. "తన్నై కాలిల్ పెరువిలఙ్కత్తాళ్ అవెళ్‌నల్లురుళ్ కణ్ వన్ద మైన్దై" - అనగా తన తల్లిదండ్రులగు దేవకీ వసుదేవుల కాళ్లకు కంసుడు తగిలించిన సంకెళ్ళు విడిపోవనటుల గాఢాంధకారము నందు వచ్చియవతరించిన నాతండ్రీ!" - అని సాయించుటచే నాతని బలాఢ్యత్వము, లేక చిన్నతనము చెప్పబడినది. గోపికలతో గావించిన రాసక్రీడలు ఆతని యవ్వనమును తెలుపును. తన ఆటలు, పాటలు, మాటలు, చేష్టలచే గోగోపీజనమును రంజింపజేయు రాజత్వము చెప్పబడుచున్నది.

తూయోమాయ్ -

గొల్లభామలకు శుద్ధియనగనేమి? తలను, మొలను ఒక్కసారి ముంచని జాతిగదా యది యన్నచో విష్ణువుతో సంబంధము గలవారందరును వైష్ణవులేయైనను "పితా చరక్షకశ్శేషీ............" యను శ్లోకమున చెప్పినట్లు ఆయనతో గల తొమ్మిది సంబంధములను అంగీకరించి అనుష్ఠించువారే వైష్ణవులనబడుదురు.

పోయప్పిళై యుంపుగు దరువా నిన్ఱనవుం - సంచిత, అగామి పాపములన్నియును. తీయినల్ తూ శాగుమ్ - నిప్పనబడిన దూదియగును. తూశు అనగా దూది.

వేదాంతార్థము

ఈ పాశురమంతయు వేదాంత పరమగుటచే దీనికి వేదాంతార్థమును వ్రాయమానితిని.

## ఆరవ పాశురము

"పుళుం శిలమ్బినగాణ్."

### అవతారిక

మొదటి పాశురమున భగవంతునితో కలసి యుందుటయే ప్రాప్యము. దానికి సాధనమును ఆతడే, ఇక్కడ నొక శంకయుదయించు చున్నది. లోకమున నంతటను సాధ్యము వేరుగను దానిని సాధించు సాధనము వేరుగను నుండగా నిచ్చట రెండును ఒక్కడే అనుచున్నారేమి?

అని, దీనికొక లౌకికమగు నుదాహరణయున్నది. చంటి బిడ్డను క్రింద ప్రక్కపై పరుండబెట్టి తల్లి యెత్తైన మంచమున కూర్చొని యుండును. బిడ్డమేల్కొని యామె యొడిలో కూర్చొనవలయునని ఏడ్చుట కారంభించును. అప్పుడు ఆతల్లి క్రిందికి దిగివచ్చి ఆ బిడ్డ నెత్తుకొని మంచముపై తన యొడిలో కూర్చుండబెట్టుకొనును. ఇచ్చట తల్లియొడి సాధ్యమును ఆ తల్లియే సాధనమును కాలేదా? అట్లే నారాయణుడే సాధ్యము, సాధనము కూడనగుటలో నాక్షేపణ మేమున్నది? ఇట్టి సాధనములో అన్వయించు నధికారులును ఆఫలమునందు కోరిక కలవారేయని సాధస్వరూపమును కూడ. నారాయణుడే సాధనమని సాధన స్వరూపమును కూడ తెలిపినారు.

రెండవ పాశురమున ఫలము, సాధనము రెండును భగవంతుడే అని యుండు ఇచ్ఛాధికారులకు ఇచ్ఛామాత్రమే అధికారిలక్షణము. కర్మలను చేయుటకై యేర్పడిన కర్మేంద్రియములకు చేయవలసిన కృత్యములను చూపి ప్రవేశపెట్టవలసియున్నది. గాన కాలమును గడపుటకు రుచిచే పేరేపింపబడి చేయదగిన పనులు చెప్పబడినవి.

మూడవ పాశురమున భగవంతుననుభవించుటకు తోడైన వారిపట్ల వారికి కావలసిన సమృద్ధులన్నియు తెలుపబడినవి.

నాల్గవ పాశురమున ఇతర దేవతల ఆపేక్షయెంత మాత్రమును లేక ఁవదనుభవములో దిగినవారికి ఇతర దేవతలును వచ్చి కైంకర్యము చేయుదురను విషయము చెప్పబడినది.

అయిదవ పాశురములో భగవదనుభవము నందవగాహించిన వారికి తటస్థించు అనుభవనిరోధులను ఆయనుభవమే పోగొట్టునని చెప్పబడినది.

ఇట్లు అయిదు పాశురములచే ప్రాప్యముగ శ్రీకృష్ణానుభవమునకు ముఖ్యమైన అసాధారణ పరికరములను జెప్పి, పిమ్మట ముందుపది పాశురములతో ఆ సాధనముల పరిగ్రహించి అనుభవించు వారిని లేపుచున్నారు.

ఇది బ్రాహ్మీముహూర్త జాగరణము. మిక్కిలి ప్రేమగల వారు చేయు కృత్యము. వేయిమ్మంది తల్లిదండ్రుల కన్నను మన హితమును కోరువేదమాత యీ పనిని చేయుచున్నది. సాత్త్విక సమయమగు బ్రాహ్మీముహూర్తమును

నిద్రతో గడుపరాదని సూచింపబడుచున్నది. ఆయుపనిషత్తు "ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ని బోధతు" - అనుచున్నది. అది సత్త్వగుణ ముద్రేకించి యుండు మంచి సమయమగుటచే దీనిని వ్యర్థపరచకుడు." అజ్ఞాన నిద్రనుండి మేలుకొనుడు! ఆత్మ విషయమున జాగరూకులై యుండుడు! మహాత్ముల ద్వారా ప్రబోధము నందుడు!" అని జనులను హెచ్చరించుచున్నవి. వానిని ఆలకించి దైవప్రోక్తములగు ఆవాక్యములపై అచంచల విశ్వాసము గలిగి ఆవిధముగ అనుష్ఠించుటకై ఉపక్రమించవలయును. ఎపుడు జనులు తమ లక్ష్య ప్రాప్తికై దృఢనిశ్చయులై, సర్వేశ్వరుని యెడల అనుపమ భక్తి గలిగి కార్యమున కుపక్రమించుదురో, అపుడిక ప్రపంచమునందలి ఏ శక్తియు ఆకార్యము నుండి నిరోధించుటకు సమర్థము కాజాలదు సంసార బంధమున తగుల్కొని పుట్టుక, చావు, ముసలితనము, రోగము మొదలైన బాధలను అనుభవించుచున్న జీవుడు వాని నుండి తప్పించుకొని బాధారహితమైన స్థితిని బొందుడని బోధించుచున్నవి. ఇట్లే ఆళ్వారులును పెరుమాళ్లను జగద్రక్షణకై ప్రార్థించి లేపిరి. తిరుప్పళ్ళ్ యెళిచ్చితో శ్రీతొండరడిప్పొడి యాళ్వారులు శ్రీరంగనాథుని లేపిరిగదా! విశ్వమును మిత్రుడు మేలుకొలుపునట్లు విశ్వామిత్రుడు శ్రీచక్రవర్తి తిరుమగన్ (శ్రీరామచంద్రు(ని

"కౌసల్యా సుప్రజా! రామా! పూర్వా సన్ధ్యాప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥

అని సరయూనదీ తీరములో తొలిసంజరేకులు తెలతెలవారుచున్న ప్రశాంత ప్రభాతసమయములో తాను ఆక్రిందటి రాత్రి పరచిన లేత పచ్చిక పక్కమీద శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణ పణితుడై యోగనిద్రా ముద్రితమైన ఆ నిద్రావస్థలో నున్న సమయమున - "ఓ కౌసల్యానందనా! శ్రీరామ! తూర్పుతెల్లవారుచున్న దయ్యా! ఓ నరశార్దూలా! నిద్రలే! దైవికమైన ఆహ్నిక కృత్యములను నిర్వర్తింపవలయును" అని ప్రేమ యుట్టిపడు మధురోక్తులతో లేపిన శ్లోకము మనకు నిత్యాను సంధేయమైనది. ఇప్పటికిని ఆ శ్లోకముతోనే మన తిరువారాధనలోని యర్చామూర్తిని లేపి ఆరాధన సమర్పించు చున్నాము.

మహారాజులు జీతము లిచ్చి తమను లేపుటకు వంది మాగధులను పెట్టుకొని ప్రతి దినము వారిచే వీణాదివాయిద్య విశేషములచే లేపబడు

చుందురు. అట్టి తరి మనలనీ పక్షులు నిర్వ్యాజప్రేమతో - "మేలుకొనుడు, భగవత్సు ప్రభాతము ననుసరింధింపుడు, ప్రాతర్నిత్యాను సంధేయమును విన్నవింపుడు, అర్చికాది మార్గచింతనను గావింపడు". అని మృదుమధుర స్వనములతో వేయితల్లుల కన్న ప్రియముగ లేపుచున్నవి. కాన, వానికి - "నమః పక్షిభ్యః పరమదయాళుభ్యః" - అని కృతజ్ఞలను తెలియజేయుట ఎంతయు సమంజసము.

వేదాంత పరమగు నర్థములోనివి కేవలము పక్షులు గావు. పక్షులు రెండు రెక్కలతో నాకసమున సంచరించునటుల జ్ఞానానుష్ఠానములతో పరమాత్మ ననుభవించుచున్న ఆచార్యుల పిలుపులివి. వీరు కృపామాత్ర ప్రసన్నులు గదా! వీరు అనువృత్తి ప్రసన్నాచార్యులు కారు. పక్షులకు లేపుడని యెవరాదేశించిరి? వేదాంతపరమగు నర్థములో జానశ్రుతియును మహారాజును ఆత్మవిద్యకై ప్రేరేపించి రైభ్య మహర్షి సన్నిధికి పంపించిన పక్షుల వృత్తాంతము నిచ్చటనను సంధింపవలయును. ఇట్టి ఆచార్య విషయక కృతజ్ఞతతో ప్రారంబింపబడిన యీ పాశురమెంత ప్రాధాన్యమైనదో గదా?

పుళ్ళుమ్ శిలమ్బినగాణ్ పుళ్ళరైయిన్ కోయిలిల్,
వెళ్ళై విళిశఙ్గిన్ పేరరవం కేట్టిలైయో,
పిళ్ళాయ్! ఎళున్దిరాయ్ పేయ్ములై నఞ్జుణ్డు,
కళ్ళచ్చగడం కలక్కళియ క్కాలోచ్చి,
వెళ్ళత్తరవిల్ తుయిలమర్న్ద విత్తినై,
ఉళ్ళత్తుక్కొణ్డు మునివర్ గళుం యోగిగళుమ్,
మెళ్ళ యెళున్దు అరియన్న పేరరవమ్
ఉళ్ళం పుగున్దు కుళిర్న్దేలో రెమ్బావాయ్

టీక:- పుళ్ళుమ్ = పక్షులు గూడ (ఆహారము వెదకుటకై లేచి), శిలమిబ్రనకాళ్ = అరచుచు ఎగిరిపోవు చున్నవిచూడు, (లేపరా నాయన మీరు వానిని తరిమి యుందురు. వేరే గుర్తు చెప్పడన) పుళ్ = పక్షులకు, అరైయర్ = రాజైన గురుత్మంతునికి, కో = ప్రభువైన (స్వామియైన) సర్వేశ్వరుని యొక్క, ఇలిల్ = కోవెలయందు, (మేల్కొలుపుటకు ఊదునట్టి), వెళ్ళై = తెల్లని రంగుగల, విళి = అందరిని పిలుచుటకు ఘోషంచెడి, శఙ్గిన్ = శంఖము యొక్క, పేరరవమ్ = గొప్పధ్వనిని, కేట్టిలైయో = వినలేదా, (అన్ననుపలుక కుండిన), పిళ్ళామ్ = చిన్నదానా, ఎళున్దిరాయ్ = లేచిరమ్ము

అనిన (నన్నిట్లు లేపుటకు వచ్చిన మిమ్ము లేపినది ఎవరనిన), పేయ్ = పూతన యొక్క, ములై = స్తనములలోని, నఙ్జ = విషమును, ఉణ్ణు = ప్రాణముతో సహా ఆరగించి, కళ్ళమ్ = వంచన బుద్ధితో, శగడమ్ = బండి రూపమున వచ్చిన, శటాసురుని, కళక్క ఆియ = కీళ్ళ సందులు సడలునట్లుగా (కట్లు వీడునట్లుగా), కాల్ = కాలిచేత, (పాదములతో), ఓచ్చి = తన్నివిరిచి, (చంపి) వెళ్ళత్తు = క్షీర సముద్రమునందు, అరవిళ్ =శేషునిమీద, తుయిల్ = యోగ నిద్రలో, అమర్న్ద = బశయనించియున్న, విత్తినై = జగత్కారణ భూతుడైన సర్వేశ్వరుని, ఉళ్ళత్తు = మనస్సు నందు, కొణ్ణు = ఉంచుకొని (ధ్యానించి), మునితర్గళుమ్ = మనన శీలులైన మునులను, యోగిగళుమ్ = యోగాభ్యాసము చేయువారును, మెళ్ళ = మెల్లగా, ఎళున్దు = లేచి, అరియెన్ర = హరిహరి యనె, పేరరవమ్ = గొప్పధ్వని యైనను, ఉళ్ళమ్ = మా మనస్సు నందు, పుగున్దు = ప్రవేశించి, కుళిర్న్దు = చల్లనై (మమ్ములేపినది. నీవును లెమ్ము) ఎల్ఓర్ = చక్కగా యోచించి, ఎంపావమ్ =మమ్ములను అనుసరింపుము. (త్వరగా లెమ్ము ఇట్టి సమయములలో ఆలస్యము చేయపాడు సుమా!)

**తా॥** ఓ చిన్నదానా! బృహస్పతి అస్తమించెను. శుక్రుడు ఉదయించెను. బకాసురుని నోరు చీల్చినవాడును, క్రూరుడగు రావణుని గడ్డి పోచవలె గిల్లివేసిన శ్రీరాముని వీరచరితమును కన్యలందరును పాడుచు వ్రతానుష్ఠానమునకై శ్రీకృష్ణుని గలిసికొనుట కేర్పడిన స్థలమును చేరినారు. పక్షులు మేల్కొని మేతకై యొకటి మరియొక దానిని లేపుటకై కూయుచు పోవుచున్నవి. పక్షులకు రాజైన గరుడునకు ప్రభువైన నారాయణుని కోవెలలోని కైంకర్యపరులను పిలుచు తెల్లని శంఖముల యొక్క గొప్పధ్వని చెవులను పడలేదా? భగవద్విషయమున నూతనముగా ప్రవేశించిన దాని నగుటచే భాగవత విషయము చరమావధిని నీ వెరుగవు. నీవు ఈ శుభదినమున నీళ్ళలో చక్కగా మునిగి స్నానమొనర్చకుండ పరుండి యుండ దగునా? పూతన యొక్క విషమిశ్రమైన చనుబాలను త్రాగినవాడును, వంచనచే చంపనేతెంచిన రాక్షసావేశము గల శకటమును ఆకలి మంటచేనైన కోపముచే కాళ్ళను కొట్టుకొనుటలో బండికి తాకించి ముక్కలు, ముక్కలుగా విరచి వేసినవాడును, పాలసముద్రమున శేషతల్పమున పవళించి నిద్రించుచున్న నారాయణుని యోగులును, మునులును

మనస్సున నిడుకొని చల్లబరచి వణికించినవి. నీవెట్లు కదలక మెదలక పరుండియున్నావు. లేచిరమ్ము. వ్రతమనుష్ఠింతమని సంకల్పించుకొన్న నీవు ఇంతవరకు నిద్ర లేవకున్నావే. త్వరగా లెమ్ము!

పక్షులు కూసెను, (1) పక్షిరాట్పత్రమం
　　దిర శంఖ నాదమ్ము చొరదె చెవుల?
మెలమెల్లగా ముని తల్లజల్, యోగులు,
　　క్షీరాబ్ధిశాయిని శేషతల్పు
లోక నిర్మాతను, లోక సంరక్షకు
　　కపట కాంతాస్తన గరలపాయి
శకటాసురధ్వంసి చరణ విక్రముమ నో
　　నిలయుని కీర్తించునినదముదిగో!

హరిహరిహరి యంచు నాశాంత రాళమ్ము
క్రమ్మిమామ కాంత రంగములను
పల్లవింపజేసె కన్యరో! ఇకనైన
నిదుర లేచిరమ్ము! నిర్మలాంగి!

విశేషార్థము

"బ్రాహ్మేమూహూర్తే బుధ్యేత" అని స్మృతి

శ్రుతులు, స్మృతులు మానవుల కొరకే, పశుపక్ష్యాదులకా విధినిషేదములు లేవు. అవి ప్రకృత్యధీనములు. వానిలోని జీవుని జ్ఞానము తేజస్విగాదు. తేజోవంతమైన జ్ఞానము గల మానవులు ప్రకృతిని అదుపులో బెట్టుకొనగలరు. యథేచ్ఛమాచరింపగలరు. సుఖలాలసులై ఇంద్రియము లీడ్చినట్లు పోవుదురు. ఇంద్రియముల నరికట్టను గలరు. పశుపక్ష్యాదులకు ప్రకృతిని నియమించు శక్తిలేదు. ఆకలైనపుడు దొరికినది తినుట, నిద్ర వచ్చిన కన్ను మూయుట, అవసరమున మలమూత్రాలను విసర్జించుట వాని ధర్మము.

ప్రకృతి అహోరాత్రాను సారము తత్తద్ధర్మముల సాగించుచుండును. గడియారమునకు కీయిచ్చిన, వడియున్నంత వరకు ఆడుచునే యుండును. మధ్యలో నిలువజాలదు. దానిని నిలుపగలవాడు, త్వరపెట్టగలవాడు, మందగింపజేయగలవాడు మానవుడే!

"పుళ్ళరైయిన్ కోయిలిల్ వెళ్ళై
విళిశజ్గిర్ పేరరవమ్ కేట్టిలైయో"

"తెలివిమాలిన పక్షులెప్పడు పట్టిన అప్పడే లేచును, అరచును, వానికేమి వేలాపాళా?" అని బూకరించుచుంటివేమమ్మా! అది గోవినుము. గరుడవాహనుని ఆలయమున, స్వామి సేవకై అర్చకులు వచ్చి, శంఖ ధ్వనులతో భక్తుల నాహ్వానించుచున్నారు. అదియు అల్పముగాదు, మహాధ్వని. దీర్ఘ నినాదము. ఆశంఖధ్వనియే విలక్షణమైనది. ఎన్నిమారులు విని పరిచితమైనది గాదు! తెల్లని దక్షిణావర్తమైన ఆ విష్ణ్వాలయ శంఖారావమ ప్రత్యేకమైనది. ఆనాడు నీచెవికెక్కలేదా? "పిళ్ళాయ్" వయసు వచ్చినను పసితనపు చేష్టలను వీడకున్నావు. వయస్సు గాదు పెద్దరికము నిచ్చునది. సమయానుగుణ ప్రవర్తనము లేకున్న పెద్దతనము లేదు. ఇకనైనను లేచి వ్రతానుష్ఠానమునకు సిద్ధరాలవుకమ్ము.

తెల్లవారుటను మూడు హేతువులతో సాధించుచున్నారు. మొదటిది. ఇది (పక్షము) తెల్లవారు సమయము (సాధ్యము) వెళ్ళై విళిశజ్గిన్ పేరరమ్ కేట్టుప్పడు కైయాలే. తెల్లశంఖ ధ్వని పిలుపు వినబడుచున్నది. కావున -

ఎప్పడెప్పడు తెల్లని శంఖ ధ్వని పిలుపు వినబడుచున్నదో అప్పడ ప్పడెల్లను తెల్లవారుచుండును. ఇది అనుభవపూర్వమే (వ్యాప్తి జ్ఞానము)

ఇట్లు బైటనున్న గోపికలు అనుమాన రచనలో తెల్లవారుటను సాధించినారు. లోపలనున్న గోపిక యీ హేతువునందు దోషమును జూపి త్రోసిపుచ్చినది. ఆమె మంచి న్యాయశాస్త్రనిపుణురాలు.

ఉళ్ళత్తుక్కొణ్డు - హృదయముననుంచుకొని,

"పాల సముద్రముతోను, ఆదిశేషుడను పడకతోను, లక్ష్మీదేవితోను, గూడి సర్వేశ్వరుడు వేంచేసినా శరీరమున ప్రవేశించి" - అని పెరియాళ్వార్లు సాయించినట్లుగా తమ శరీరములో వేంచేసి యున్నటుల" - మునివర్ గళుం, యోగిగళుం, మునులును, యోగులును గోకులమున నిద్రించు చున్న వారి వలెను, లేపుచున్నవారి వలెను ఉన్నవారు. "మన" ధాతువునకు "ఇన్" ప్రత్యయముచేర్చి "ఉ" కారమురాగా మునిశబ్దమేర్పడినది. "మన్యతే ఇతి మునిః" అని వ్యుత్పత్తి. మన - జ్ఞానే అను ధాతుజన్యమదిగాన జ్ఞానముగలవాడని యర్థము. స్వస్వరూప జ్ఞానము, పరస్వరూప జ్ఞానము

గలవాడు ముని, యోగి అన్న -

"యోంత స్సుబోన్తరాయః,
తథాన్త ర్జ్యోతిరేవయః సయోగీ." - గీత

బాహ్యా విషయాసక్తుడు గాక తనలో వెలుగుచున్న పరమాత్మ యొక్క ఏకతాను యోగిమెళ్ళ ఎళున్దు - సావధానముగా మేలుకొని. గర్భిణీస్త్రీలు తమకడుపులో నున్న బిడ్డలకు నొప్పి కలుగకుండునట్లు లేచునటుల "హృదయేనోద్వహన్ హరిః" - శ్రీమహావిష్ణువును హృదయమున గట్టిగా పట్టుకొని మెల్లగా లేచి అరియన్ద - హరి! హరి! యనిన ఆయన కేమి భాధ కలుగునోయని భయపడి మంగళాశాసనము పాడుచు మేలుకొనుచు హరి! హరి! యనుచున్న. ఈ హరినామ సంకీర్తనమునకు గొప్పఫలము చెప్పబడుచున్నది. ఈ ధ్వని సకల పాతకములను హరించు ముఖ్యనామధేయము.

పేరరవమ్ పెద్దధ్వని

ఉళ్ళంపుగున్దు కుళిర్న్దు - మనస్సులో ప్రవేశించి చల్లనైన ప్రక్క క్రింద చల్లని నీరు ప్రవహించునటుల శ్రీనామము చెవులగుండా మనస్సులో ప్రవేశించి వణకించుచున్నది. దాని వలన శ్రీకృష్ణుని యెడబాటు వలన బీటలు జారిన మనస్సులను పదునుచేసినట్లు మమ్మానందింప జేయుచున్నది. లేచిరమ్ము అనుచున్నారు. "తాపత్రయాభీలదావాగ్నులాళు నేహరి మనీషామృతవృష్టిలేక" అన్నట్లు హృదయతాప మడప హరికీర్తన శ్రవణములే సమర్థములు. కావున, మునులు, యోగలు గావించు హరిచరణామృత పానము శ్రవణము తాపత్రయాపహము. అది తలుపులు మూసికొని పడుకొన్న నీచెవి కెక్కునా? ఇప్పటికైనా లెమ్ము. దీనిచే వేకువనే లేవవలయును. నిద్రలేచుచునే హరి కీర్తనసేయవలయునని సూచితము.

వేదాంతార్థము

పుళ్ళుం శిలమ్బిన గాణ్ - ఈ పాశురాంభమున పక్షులుగా చెప్పబడిన వారు భగవత్సంబధఘటకులై, జ్ఞానానుష్ఠాన సంపన్నులైన ఆచార్యులే

"ఉభాభ్యామేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః,
తథైవ జ్ఞాన కర్మభ్యాం ప్రాప్యతే పురుషోత్తమః ॥"

రెండురెక్కల సహాయమున పక్షులు ఆకాశమున సంచరించునట్లు భాగవతులు జ్ఞానానుష్ఠానములచే - "ఆ సమన్తాత్ కాశత ఇతి ఆకాశః" అని చెప్పబడు పరమాత్మయందు సంచరింతురు గాన పక్షులతో వీరికి సామ్యము చెప్పబడినది. దీనిని వివరముగా తెలియగోరువారు -"ఉపదేశ రత్నమాల" ను చదువగలరు. పిళ్ళాయ్ ఎళున్దిరాయ్ - భగవరాధన కాలమైనందున నీవును లేచిరమ్ము. పుళ్ళ రైయిన్ కోయిలిల్ వెళ్ళై విళినఙ్గిన్ పేరరవం కేట్టిలైయో -

నారాయణుని యొక్క కోవెల యనదగిన తిరుమంత్రము నందలి అన్య శేషత్వమును ఒడబోసి తీసివైచి పరిశుద్ధాత్మను తెలియజేయు "ఉ" కారము మధ్యయుండుటచే స్వచ్ఛమైనదై, ఆత్మలన్నింటికిని భగవత్కైం కర్యమున కుపయుక్తమై భగవంతునితో చేతనునకుగల తొమ్మిది విధములగు సంబంధములను తెలుపునదియై, దక్షిణావర్తశంఖముతో సాటియగు ప్రణవము యొక్క మహాధ్వనిని వినలేదా? ఆ ధ్వని యెట్టిదనిన?

"ఒళివిల్ కాలమెల్లా ముడవాయ్ మన్ని
వళువిలా వడియై శెయ్య వేణ్డుమ్ నామ్."

అని ఆళ్వార్లు సాయించినట్లు సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలలోను సర్వేశ్వరునకు సర్వ విధకైంకర్యములను చేయవలయుననియే

వెళ్ళత్తు అరవిల్ తుయిల్ అమర్న్దవిత్తినై -

పాలసముద్రమున శేషతలప్పముపై యోగనిద్రతో జగద్రక్షనచింతను చేయుచుండు జగత్కారణ భూతుడగు సర్వేశ్వరుడు.

ఆళ్వందారులు సాయించనట్లుగా అనంతులు - "ప్రకృష్ట విజ్ఞానబలైక ధామ" - లగుటచే శ్రియఃపతి చేయు ఆలోచనకు ఆయన యెంతయే సహకరించును గాన ఆయనితో నిత్య సంబంధము కలిగియుండుట యుక్తమే.

"భాషేద్వే శ్రీమచ్ఛబ్ద భూషితే శేషభాషితే" - అనునట్లా యనంతులు శ్రీభాష్య, మహాభాష్య కర్తయగుట యాయన విజ్ఞానమునకు అవి నికషములు.

# ఏడవ పాశురము

"కీశు కీశెన్ఱెజ్ఞుమ్"

**-: అవతారిక :-**

ముందు పాశురములలో భగవద్విషయములో నూతనముగా నవగాహించిన యొక గోపాంగనను లేపిరి. ఈ పాశురమున సంపరిచిత మైనను నూతనత్వమును భావించుచున్న యొక గోపికను లేపుచున్నారు. కొందరిని మాత్రమే లేపి లేచినవారితో నేగి శ్రీకృష్ణుని పాడుదమని తృప్తిజెందెడువారు కారు వీరు. యథార్థమగు భగవత్సంబంధాను భవమున్నచో తల్లిదండ్రులు తమ కడుపున పుట్టిన బిడ్డ యొక్క సమృద్ధికెట్లు సంతసింతురో అట్లందరి సమృద్ధికిని సంతసించు వారీ గోపాంగనలు. నిజమగు పురుషార్థ మీ భాగవత గోష్ఠితో కలసి నిరంతర నిరవచ్ఛిన్న భగవదనుభవమును బడయువచ్చు ననియే. కావుననే భగవద్భాగవత ప్రతిపత్తి అందరకు నుండవలయుననెడు ఉదార చిత్తులగుటచే ఈ గోపికలు అందరను లేపి కూర్చుకొనుచు ఈ గోపికా గృహమునకు వచ్చి తెల్లవారుటకు కొన్ని గుర్తులను చెప్పి యీమెను లేపుచున్నారు.

ఇందులో నొక సంప్రదాయ రహస్యమున్నది గమనింపుము. ముందు పాశురములో మునీశ్వరులును, యోగీశ్వరులను "హరి హరి" - అనుచు నుచ్చైస్స్వరముతో హరినామ సంకీర్తనము చేయుచు లేచుచున్నారని తెల్లవారుటకు గుర్తుగా చెప్పిలేపిరి. ఈ పాశురములో భరద్వాజ పక్షులు (తలక్రిందుగా వ్రేలాడుచు నిద్రించు పక్షులు) కీచుకీచుమని ధ్వనిచేయు చున్నవని గుర్తుచెప్పి లేపుచున్నారు. వీరికి భగవత్సంబంధమున్న వన్నియు నుద్దేశ్యములును, ఉపాదేయములును, భగవదనుభవమునకు సమయమును సూచించునదేమైనను మనకు పాదేయమే. ఇవి "ఉత్తిష్ఠత, జాగ్రత్త, ప్రాప్యవరాన్ని బోధత" అజ్ఞాన నిద్ర నుండి మేలుకొనుడు! ఆత్మ విషయమున జాగరూకులై యుండుడు! మహాత్ముల ద్వారా ప్రబోధము నందుడు!" అని శ్రుతి హెచ్చరించుచున్నంత యుపకారమును చేయుచున్నవి గదా!

ఈ ప్రకారములగు ఉపనిషద్వాక్యములను సంస్మరించు కొని, జనులు అఖండ ధైర్యోత్సాహ సమన్వితులై, వెనుక చూపులేక, ఆత్మమార్గమున

ఇతోధికముగ యత్నించవలయును. ఉత్తమయోగ్యత, అనుష్ఠానము, సదాచరణ, భగవద్భక్తి, అకుంఠిత, కార్యదీక్ష యున్నచో, ఇహపర శ్రేయోదాయకమై, సర్వోన్నతమై నిత్యానంద ప్రదమైనట్టి బ్రహ్మైక్య రూప చరమలక్ష్యమును తప్పక సాధింపవచ్చునను చున్నారు.

"అహోస్మాకమలం మోహైరాత్మా బ్రహ్మేతి నిర్భయమ్" - దేహేంద్రియలకు సాక్షియై విలసిల్లు పరబ్రహ్మమును తెలిసికొని నిర్భయులై యుండుడు - అనెడు మహాత్ములగు గురువులు, ఋషిసత్తములు మ్రోగించు వేదాంత డిండిమము, అద్వైత జయభేరి అప్రతిహతనాదము నీకర్ణగోశములందు ప్రతిధ్వనించుట లేదా అనుచు లేపుచున్నారు.

ఏడవ పాశురము

కీశుకీ శెన్జెఙ్గు మానై చ్చాత్తం కలన్దు,
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో? పేయ్ప్పెణ్ణే!
కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప క్కైపేర్త్తు,
వాశనఱుఙ్గుళ్ లాయ్-చ్చియర్, మత్తినాల్
ఓశైపడుత్తు తయిరరవమ్ కేట్టిలైయో,
నాయక పెణ్పిళ్ళాయ్! నారాయణమూర్తి,
కేశవనైప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో,
తేశముడైయాయ్! తిఱవేలో రెమ్బావాయ్

టీకా:- పేయ్ప్పెణ్ణే = ఓ వెర్రిదానా!, ఏఙ్గుం = అన్ని దిక్కులయందును, ఆనైచ్చాతం = భరద్వాజ పక్షులు, కలన్దు = కలసికొని (ఒకదానితో ఒకటి), కీశుకీశెన్దు = కీచుకీచుమను కలకలధ్వనులతో, పేశిన = పలికిన, పేచ్చు మాటల యొక్క, అరవం = గొప్పధ్వనిని, కేట్టిలైయో = వినలేదా? (అనినను మారాడక నిద్రింపగ), నఱుం = మంచి, వాశనం = పరిమళించుచున్న, నట్టికుళల్ చక్కని వెండ్రుకలు గలవారయిన, ఆయిచ్చియర్ = గొల్లపడుచులు, కాచుం = (కంఠములో ధరించి యుండు) తేలికయైన తట్ట బొట్టును, (కాసులును), పిఱప్పుం = మొగ్గలు గానుండు పుసైలును (గిన్నె బొట్టును), కలగలప్ప = గలగలమని శబ్దించునట్లు, కై = చేయి, పేర్తు = కదలించి, మత్తినాల్ = కవ్వముతో, ఓశై + పడుత్త = మ్రోయించిన (శబ్దించిన), తయిర్ + అరవం = పెరుగుశబ్దమును కేట్టిలైమో = వినలేదా?

నాయక + పేణ్ + పిళ్లామ్ స్త్రీల = కందరకు నాయకురాలైన దానా!, నారాయణన్ = ఆశ్రిత వాత్సల్యముగలరైన శ్రియఃపతియే, మూర్తి = కృష్ణావతారమెత్తి, కేశవనై = కేశిని నిరసించిన వానిని (కేశియను రాక్షసుని చంపిన వానిని), పాడవుం = మేము స్తోత్రము చేయుచున్నను, నీ = నీవు కేట్టే = వినుచుండియు, కిదత్తియో = నిద్రించుచున్నావా?, తేశం = తేజమును, ఉడైమాయ్ = ఒడవినదానా! (మిక్కిలి తేజస్సు గలదానా!), తిఱ = తలుపు తెరువుము, ఏల్ ఓర్ ఎంపావాయ్ = ఇట్లయినచో యోజింపుము, మా అభ్రాయము ననుసరింపుము . లెమ్ము!

తా:- తెల్లవారిన సమయము నెరుగక పడుకొని నిద్రించుచున్న యొక గోపకన్య యొుక్క ఇంటికి అండాళ్ళమ్మగారు గోపికలతో కలసిపోయి - "ఓ వెర్రిదానా! తెల్లవారుది సమయమయినను ఇంకను నిద్ర బోవుట యేమి? కాటుక పిట్టలు (ఒక దానితో నొకటి సందడించుచు "కీచుకీచు" మని కూయుచున్న ధ్వనిని నీవు వినలేదా? ఇంకను పరుండియే యున్నావా? చాలును. ఇక లెమ్ము!" అనినను ఆ గోపిక మాట్లాడక పరుడియే యుండగా - "ఓ పిచ్చిపిల్లా! పోని, మన వారందరును లేచి గట్టిగా తోడుకొనిన నిండుకుండలోని పెరుగును కొప్పలు వీడిలో నున్న పువ్వుల పరిమళము వలుగడల క్రమ్ముకొనియు, మెడలోని మంగళసూత్రమందున్న కాసులు, పుస్తెలు, కంఠాభరణములు గలగలమనునట్లు హస్తములతో కవ్వము చేత పెరుగును చిలుకుచు, శ్రీకృష్ణుని కళ్యాణ గుణములను పాటలలో జేర్చి గట్టిగా పాడుచున్న గొల్లపడుచుల కంఠస్వరములనైనను వినలేదా! అనగా ఆ గోపిక "పోదురూ! ఈ యూరిలో నెప్పుడును పెరుగును చిలుకుచునే యుండుట పరిపాటి గదా! అంతలోనే తెల్లవారునా!" నీ తెలివి మెచ్చుకొనదగినదే! సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణుడై మన భాగ్యముచే మన పల్లెలో నవతరించెను. మనము చూచుచుండగను, వినుచుండగనే కేశి మొదలగు రాక్షసులను జంపి మన వెతలను బాపెను. ఆ కృతజ్ఞతకై మేమాతని గుణగానము చేయుచున్నాము. నీవు వినుచు పరుండియే యున్నావు. పైగా మాపాటలు నీకానందమును గొలుప మంత మెరసిపోవుచున్నావు. ఓ తేజోముఖీ! చాలు చాలు. లేచి తలుపు తీయుము.

తెలుగు సేత :-

నాయికవైయుండి, న్యాయమానిదురింత
వేగెడి దాకను వేణిలో ల!
కీచుకీచు మటంచు నేచు నేట్రింతల
పలుకుల విగొబర్వె కలికి వినవొ?
కంటెకాసులు తాళి, కరకంకణమ్ములు
కలసి మ్రోయగ గొల్లకాంత లెల్ల
వలచుకొప్పుల దరల వాలుగంటీ, కేలు
కదలించి కవ్వాన గడవ బెరుగు

చెళ్లు బుళ్లుమటంచును చిలుకు చప్పు
డైన వినలేదొ? తరుణి! నారాయణావ
తారుకేశవు కీర్తన ధ్వనులనైన?
తలుపుతీయుము వేగమ తలిరుబోడి!

విశేషార్థము :-కీచు కీన్ఱెజ్ఞు మానైచ్చాతం కలన్దుపేశిన పేచ్చరవం కేట్టిలైయో - "కలన్దు పేశిన" అనుటచేత అవి ఉదయమున ఎడబాసిపోయి తిరిగి సాయంకాలమున కలుసుకొను ఆచారము కలదు. అంతకాలము విరహమునకు తగినట్లుగ సంశ్లేషించి యెడబాటును తెలుపు తల్లడబాటు తెలియునట్లుగా గట్టిగా అరచును. దానిని వినలేదా? పిచ్చిపిల్లా అనుచున్నారు. అంతేకాదు "వినియును, నిర్లక్ష్యము చేయుచున్నావే? బుద్ధిహీనులారా! "అనుచున్నారు. ఇచ్చట "బుద్ధి" అనగా భగవద్విషయము కన్నను భాగవత విషయము మంచిదని భావము. దాని నెరిగియు మాటలాడక పరుండి యుండుటచే "పిచ్చిపిల్లా!" అనుచున్నారు.

కాశుం పిఱప్పుం -

కాశుం = చిన్న కాసులపేరు, పిఱప్పుం = మామిడి పిందెల గొలుసు.

కలకలప్పక్కైపేర్తు -

పెరుగు యొక్క అధిక్యము చేతను, తరచుచున్న గోపికల సౌకుమార్యము చేతను కొండను కదల్చు నట్లుండుట.

నాంకనఙ్ఙుజళ లాయ్చ్చియర్ -

పూర్వకాలపు స్త్రీలు తలవెంట్రుకలకు పరిమళమునకై పూలను బైటికి ధరించిక కొప్పులోపలనే యుంచుకొని ముడుచుకొనుచుండిరి. పెరుగును తరచు అయాసముతో ఆ కొప్పువీడి పరిమళము నలుమూలలకు వ్యాపించుచున్నవి.

మత్తినాల్ ఓశైదుత్తతయి రరవం-
"ఉద్గాయతీనా మరవిన్ద లోచనం
వ్రజాఙ్గనానాం దివ మస్పృశద్ధ్వనిః।
దధ్నశ్చనిర్మన్థన శబ్ద మిశ్రితో
నిరస్యతే యేన దిశామమ ఙ్గళమ్ ॥"

గోపాంగనలు పెరుగు తరచుచు శ్రీకృష్ణుని గుణములను గట్టిగా పాడుచున్న పాటల ధ్వని, పెరుగుతరచు ధ్వనితో కలసి ఆకసమునంటెను. దానిచే దిక్కుల యందున్న అమంగళము లన్నియు పోగొట్టుబడుచుండెను. ఇట్లు గోపాంగనల కంఠధ్వని, తరచబడుచున్న పెరుగు ధ్వని, మెడలోని అభరణముల ధ్వనియు ఆకసము నంటుచున్నను నీచెవిలో పడలేదా? నీకు చెవులకును మూతలున్నవా? పోని, నీ ముక్కునకైనను మూతలు లేవుగదా?

నాయక పెణ్పిళ్ళామ్ -

మాకు నాయకురాలివైన ఓ పిల్లా! అమ్మా! మా కెల్లరకు మార్గ దర్శకురాలివై నీ తేజశ్శాలితను నిరరూపించుకొను పద్ధతియిదేనా? మేమన్న మాటల కన్నిటికిని బదులు మాటలను జెప్పిపడుకొని యుండుట నీ ధనమదాంధతయే కారణము కాబోలు! విద్యుల్లతికవలె నతిచంచలమగు ధనసంపత్తిని జూచుకొని విర్రవీగు మూఢులకన్న లోకమందవివేకి మరియొకడుండరు. అచేతనములగు మహీరుహములు సయితము ఫలభార వినమ్రములై తమ విభవము నొరుల కొసగుచున్నట్లు ప్రకృతి వైచిత్ర్యమును పరిక్షించి దురభిమానమును విడిచి యొరులకు పకరించుచు గర్వమును వీడము. పేయ్ పెణ్ణే! నాయక పెణ్పిళ్ళాయ్! అనుటలో హృదయమందలి భావబంధ మొక్కటియే యగుటచే తారత్మమము లేదు. పొగడవలయునని గాని, తెగడవలయునని గాని వారి మనస్సున లేకపోవుటచే వారామెను తమకు శేషియను సంకల్పముండియే నిష్ఠుర పెట్టుచున్నారు.

నారాయణన్ మూర్త్తి కేశవనై ప్పాడవుంనీ కేట్టేకి డత్తియో -

శ్రీకృష్ణుడు నారాయణుడే యనియు, నాతడు కేశిని చంపెననియు మేము పాడగా నీవు లేవుకపోవుటయే గాక అది నీకు కాళ్లను గ్రుద్దినట్లుకాగా మిక్కిలి సుఖముగా నిద్రించుచున్నావా!

ఇచ్చట "నారాయణ" శబ్దముచే వాత్సల్యమును, "మూర్త్తి" శబ్దముచే సౌశీల్యమును, "కేశవన్" శబ్ధముచే ఆశ్రిత విరోధులను దునుముటయును చెప్పబడుచున్నవి. దీనిచే నామెకు మరింత ధైర్యముదయించి పరుండియే యుండెను.

తేశముడై యాయ్ తిఅ -

నీ దర్శనము లభించక అంధకారములో వలె పడియున్న మాకు నీవు బైటికి వచ్చి నీ తేజస్సుతో బాహ్యావైశద్యమును కలిగించుము. లెమ్ము! త్వరితముగ లెమ్ము!! ఆలస్యము చేసితివా? మన వ్రతానుష్ఠానమునకు భంగము కలుగును సుమా!

- వేదాంతార్థము -

కీశుకిశెన్ను -

రాత్రి తమోగుణ ప్రధానము. అదిపోయి తెల్లవారుటను తెలుపునవి ఈ పక్షులు. ఆ సమయము సత్త్వగుణ ప్రధానము. ఆ విషయ మీ పక్షుల అరవుల వలననే తెలియును. అట్లే అహంకార మమకారములకు రజస్తమోగుణములు ప్రధానములైనవి. అవి దూరమగుట సాత్త్వికాహారము వలనను, మహాభగాగవతోత్తము లుపదేపదే గావించు సదుపదేశముల వలనను సాధ్యము. ఆయుపదేశములచే సత్త్వగుణము తలయెత్తును. దానితో - "రజస్తమశ్చాభి భూయస్త్వ భవతి భారత" - అనునట్లు రజస్తమస్సులు అడగిపోవును. కారణము లేనిచో కార్యముండదు గదా? ఇక అమంకార మమకారములడంగును. "కామ ఏషః క్రోధ ఏషః - రజోగుణసముద్భవః" అని కదా వీని కార్యకారణ భావము.

కలన్దు పేశిన పేచ్చరవమ్ -

ప్రచారార్థము గాని, అధ్యయనోత్సవమునకు గాని యేదియో యొక నిమిత్తముగా భాగవతోత్తము లందరు నొకచోట సమావేశమై మూడు రోజులో, పది రోజులో కలసి మెలసి -

"మచ్చిత్తాః మద్గత ప్రాణాః బోధయన్తః పరస్పరమ్,
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తిచ రమన్తిచ ॥"

అనునట్లు కాలక్షేపమును చేసి ఆదినముల నొక క్షణముగా గడపి ఆ సమావేశము సమాప్తముకాగానే వారొకరి నొకరు విడువ జాలక పరస్పరము గాఢా లింగన మొనర్చి - "తిరిగి యెప్పడు కలియుదుమో" అనియు, శ్రియః పతీ!

అపగతమదయానై రన్తి మోపాయ నిష్ఠైః ...............
వరవరముని భృత్త్యైరస్తుమ్ నిత్య యోగః" - అని

యీ సంశ్లేషమెన్నడును విఛ్ఛిన్నముకాని పరపదములో నన్నుంచి దీనిని నిరవఛ్ఛిన్నముగా సాగింపు" మనియు ప్రార్థింతురు.

ఇట్లు సంశ్లేషించి ప్రార్థించుచుండగా దుఃఖపారవశ్యమునే దగ్గర స్వరముతో నాడినమాటలు కూడ స్పష్టముగ తెలియకయుండును. తిరిగి మనము సమావేశమగు వరకు నీయాలింగనమే స్మారకముగ నుండగాక యని గొణుగుడు మాటలతో మాటమాటికిని ఆలింగ మొనరింతురు.

నాశవఱుం కుంళల్ -

వాశ-"దూరాద్గన్ధోవాతి" - అనునట్లు జ్ఞానానుష్ఠానములచే వారి వైభవమంతటను వ్యాపించును. "నఱుంకుళల్" - భగవద్విషయ వ్యామోమముగల (అయ్చ్చియర్) అనన్యార్హ శేషభూతడులైన శ్రీవైష్ణవుల యొక్క,

మత్తినాల్ -

సంకల్పాత్మక జ్ఞానముచే శిక్షితులైన సంసారి చేతనుల యొక్క ఓశైపడుత్త తయిరరవమ్ -

దివ్య ప్రబంధాను సంధాన ధ్వనిని,

కేట్టిలైయో - వినలేదా?

ఇక్కడ "తయిర్" అనగా అష్టాక్షరీ మహామంత్రములోని "మూన్దుతాళిలే తయిరై నిఱైత్తు కడైన్దు వెణ్ణై తికట్టు మాప్పోలే, మూన్ఱు వేదత్తిలుమ్ మూన్టక్షరత్తై యెడ్తుదు" - అని సాయించినారు. ఈ మంత్రార్థము

దివ్య ప్రబంధములను సారముగ నిష్పన్నమగుచున్నది. ఈ దివ్య ప్రబంధములను మన పూర్వాచార్యులు తమ బుద్ధితో మథించి, ఈ యర్థములనెడు వెన్నను ఎత్తివేసినట్లు ఎత్తిరని వినలేదా? అనగా విన్నవారని యర్థము. అందుకే వారిని "నాయకప్పెణ్ణిళ్లాయ్" అని పిలుచుచున్నారు. ఇట్టి మంత్ర మంత్రార్థముల నెరిగిన శ్రీవైష్ణవులే మనకు నాయకులు "పెణ్ణిళ్లాయ్" అనుటచే నాయాచార్యులు భరతుని వలె పారతంత్ర్య నారతులని తాత్పర్యము.

నారాయణన్ -

తత్పురుషచే పరత్వమును, బహువ్రీహిచే సౌలభ్యమును తెలియు జేయు తిరునామము. బహువ్రీహిచే అంతర్యామిత్వము సిద్ధించుచున్నది. దీనిచే నాతని వాత్సల్యము విశదమగుచున్నది. వాత్సల్యమనగా, దోషములపై దృష్టి నుంచకుండుటయే గాక, భక్తుల దోషములను గుణముల వలె ప్రీతితో నాదరించుట. బిడ్డడు పిచ్చివాడై వాడియగు ఖడ్గమును చేబూని బైటపడినచో ఉపేక్షించి ఆత్మహత్య గావించుకొనుననియు, ఎదుటపడినచో తననే చంపుననియు భయముచే నాతనికి గన్పింపకయే వెన్నంటి తిరుగు ప్రియమైన తల్లివంటిదే యీ భగవంతుని అంతర్యామిత్వము కూడ.

మూర్తి -

అట్లెప్పుడును ఎవ్వరికిని కాన్పించకమే యున్నచో నాతని భజించుటెట్లు? అందులకేదేవ తిర్యఙ్మనుష్యాదిసజాతీయ దేహములను ధరించి సకల మనుజనయన విషయుడనుచుండును. ఆయా శరీరములకు తగిన ధర్మముల తాను ఆచరించి మన చేతకూడ ఆచరింపజేయును.

కేశవనై -

ఈ పదమునకు 1) సౌందర్యము, 2) విరోధినిరసనము, 3) సర్వనిర్వాహకత్వము అను మూడు మంగళగుణములు అని భావము. ఆయర్థము లెట్లు నిష్పన్నములగుచున్న వనగా అధికము, గొప్పది అని చెప్పటకు "మతుప్" అను నొక ప్రత్యయము పదమునకు చేర్చబడును. ఇక్కడ "కేశ" శబ్దమునకు గొప్పది అనునర్థములో "మతుప్" చేర్చబడినది. "కేశాద్వా న్యతరస్యాం" - అను వ్యాకరణ సూత్రము వలన ఆ "మతుప్" నకు

ఒకప్పుడు "వ" అను దేశముగ వచ్చును. ఆదేశమనగా ఉన్న దానిని పోగొట్టి దాని స్థానమున తానుండుట. అట్లే యిక్కడ కేశ శబ్దముతో చేరియున్న మతుప్‌ను త్రోసి పైచి దానిచోట "వ" అని వచ్చుటచే "కేశవ" అయినది. అనగా మిక్కిలి అందమైన తలవెంట్రుకల వాడని అర్థము. ఇది సమస్త సౌందర్యమునకును ఉపలక్షణము. అనగా సర్వాంగసుందరుడని అర్థము.

2. విరోధి నిరసనము -

"యస్మాత్త్వమైన దుష్టాత్మా హతః కేశీ జనార్దన,
తస్మా త్కేశవ నామాసి................................ ॥"

కేశిన్ - వద్ అనియుండగా "హన్త్యర్థాత్ వధేః అన్యేభ్యో పిదృశ్యతే" - అను సూత్రము వలన "కేశిన్" అను శబ్దమునకు "చంపుట" - అను అర్థము గల "వధి" ధాతువు చేరినచో అందలి "ధి" యను దానికి "డః" అనునొక ప్రత్యయము వచ్చును. అందు "అ" అని మాత్రము మిగిలి తక్కినది లోపించును. అపుడు "కేశిన్ + వ్ + అ" అనగా "కేశిన్ - వ" అని మారును. ఆపైన ఈ శబ్దము పృషోదరాది గుణములలో చేరినది గాన "శ" కారము మీది "ఇ" కారము పోయి, "అ" కారము చేరి "న" కారము పోవును. అపడు కేశ + వ = కేశవ - అగును. దీనిచే భక్తుల విరోధులను నశింపజేయు వాడు అను అర్థము వచ్చును. "కేశి" అను నొకరాక్షసుడు గుర్రము రూపమును ధరించి శ్రీకృష్ణుని చంపుటకు రాగా శ్రీకృష్ణుడు ఆరహస్యము నెరిగి వానిని చంపెను.

3. ఇక సర్వనార్వాహకత్వ మనెడి మూడవ యర్థము.

"క" అనగా బ్రహ్మ "ఈశ" అనగా రుద్రుడు. క + ఈశ = కేశ అగును. అపుడు కలవాడు అను అర్థములో ముందు చెప్పినటుల "వన్" వచ్చును. అపుడు "కేశవః" అని యేర్పడును. అనగా బ్రహ్మ రుద్రు అను కలవాడని యర్థము సిద్ధించును. దీనికి భారతములో

"క ఇతి బ్రహ్మణోనామ ఈశో హం సర్వదేహినామ్,
ఆవాం తవాఙ్గే సమ్భూతౌ తస్మాత్కేశవ నామవాన్ ॥"

"క" అనగా బ్రహ్మ. నాపేరు సమస్తమునకు ఈశుడని, మేమిద్దరమును నీ శరీరము నుండియే పుట్టితిమి. కాబట్టి నీవు

కేశవుడవైతివి. అని శివుడు విష్ణువుతో చెప్పినట్లు కలదు. అందుచే బ్రహ్మ శివులను తన యిష్టము వచ్చినట్లు నడిపించు వాడనయర్థము. ఇట్లే మూడు విధములగు వ్యుత్పత్తులచే భగవంతుని 1) సౌందర్యము 2) ఆశ్రిత విరోధి నిరసనము. 3) సర్వ నిర్వాహకత్వము అను ప్రధానములగు మూడు గుణములు ప్రకాశింపజేయబడినవి.

# ఎనిమిదవ పాశురము

"కీళ్ వానమ్"

**-: అవతారిక :-**

ఇంతవరకు లేచిన గోపాల బాలికలందరును చేరి శ్రీకృష్ణుడు కొని యాడదగిన భక్తి సంపద సమృద్ధి గలయొక గోపబాలికను పురస్కరించుకొని శ్రీకృష్ణుని సేవించినతను యభీష్టము తప్పక సిద్ధించునను నమ్మకముతో అట్టి గోపబాలిక నిందు లేపుచున్నారు. సామాన్యముగా లోకులకు రాత్రి చెడ్డదిగను పగలు మంచిదిగను భాసించును. అందులకు కారణము రాత్రి సమయము కొందరకు పరహింసాదులకును, కొందరకు కేవలము విషయాను భవమునకును, తమో గుణోద్రేక కాలముగటచే నిద్రకును అనుకూలమగుటచే అది చెడ్డదిగను, తమ యభీష్ట పురుషార్థ సిద్ధికై వ్యాపారములు చేసికొనుట కనుకూలమైనదగుటచే పగలు మంచిదిగను భావింపబడును. ఈ గోపాంగనల కన్నసో రాత్రియేకాంతమున స్వేచ్ఛగా శ్రీకృష్ణానుభవమున కత్యంతాను కూలమగుటచే క్షణ క్షణమును ఉపాదేయమై యుండును. ఇక పగలన్నచో తమ పెద్దలాయనుభవము నడ్డి వేయుదురు గాన వారికది చెడ్డగా తోచును. ఇపుడు తెల్లవారు సమయము అగుచున్నది. మన పెద్దలు మనను శ్రీకృష్ణునితో చేరనీయరు. కావున పగలు మనకు చెడ్డది. ఇంకను రాత్రి శేషించియున్నది. ఇది మనకనుకూలమైన సమయము. కనుక, యిపుడు నిద్రింపతగదని చెప్పచు ఆ గోపికను లేపుచున్నారు.

ఇచ్చట రాత్రింబవళ్ల వైపరీత్యమును గుర్తించుట మంచిది. భగవద్గీత రెండవ అధ్యాయము 69 శ్లోకము ఇట్లు చెప్పచున్నది.

"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సానిశా పశ్యతో మునేః ॥"

తెలివైన మానవులు రెండు రకములుగా నుందురు. ఒకరు ఇంద్రియ తృప్తికొరకు భౌతిక వ్యాపారములో తెలివి కలిగి ప్రవర్తింతురు. మరియొకరు అంతర్ముఖులై ఆత్మసాక్షాత్కారాభ్యాస తత్పరులై యుందురు. అంతర్ముఖుడైన మునియొక్క అధ్యాత్మికాలోచనా పరుడైన మానవుని యొక్క వ్యాపారములు, భౌతిక విషయతత్పరులైన వ్యక్తులకు రాత్రి ప్రాయములు. భౌతిక వ్యక్తులు ఆత్మసాక్షాత్కారము తెలియని వారగుటచే అట్టి రాత్రియందు నిద్రించు చుందురు. భౌతిక వ్యక్తులకు "రాత్రి" యైన సమయమైన అంతర్ముఖుడైన ముని జాగృతుడై యుండును. ముని ఆధ్యాత్మికాను భవమున క్రమముగా అభ్యుదయము పొందుచుండుటచే ఉత్తమమైన ఆనందము అనుభవించుచుండును. భౌతిక వ్యాపార మగ్నుడైనవాడు ఆత్మానుభవ విషయమున నిద్రితుడై యుండుటచే తన నిద్రానమయమున ఒక్కొక్కప్పుడు దుఃఖమును, ఒక్కొక్కప్పుడు సుఖమును పొందుచు వివిధములైన ఇంద్రియ భోగముల గూర్చికలలు గాంచుచుండును. అంతర్ముఖుడైన వ్యక్తి భౌతిక సుఖ దుఃఖముల విషయమున ఎప్పుడును తటస్థుడైయుండును. ఆతడు భౌతిక ప్రతిక్రియలచే కలతనొందక ఆత్మ సాక్షాత్కార కార్యకలాపములను కొనసాగించు చుండును.

ఎనిమిదవ పాశురము

కీళ్‌వానమ్ వెళ్లెన్ఱు ఎరుమ్మై శిఱువీడు,

మేయ్‌వాన్ పరన్దన కాణ్ మిక్కుళ్ళ పిళ్ళై గళుమ్,
పోవాన్ పోగిన్ఱారై ప్పోగానమల్‌త్తు, కూన్ని
కూదువువాన్ వన్దు విన్ఱోమ్, కోకులముడైయ
పావాయ్! ఎళున్దిన్ఱోయ్ పాడిప్పఱైకొణ్డు
మావాయ్ పిళన్దానై మల్లరై మాట్టియ
దేవాది దేవనైచ్చె న్ఱునామ్ శేవిత్తాల్
ఆవావె న్ఱారాయ్‌న్దరుళేలో రెమ్బావాయ్.

టీకా:- కీళ్ = తూర్పు దిక్కునందు, వానమ్ = ఆకాశము, వెళ్లెన్ఱు = తెల్లవారినది, ఎరుమ్మై = ఎనుములు (గేదెలు), శిఱు = కొట్టమునుండి,

వీడు = విడువబడి, మేయ్వాన్ = మంచుతో కూడిన పచ్చికను మేయునిమిత్తము, పరందన గాణ్ యథేచ్ఛగా నలుదెసల వ్యాపించినవి, పోవాన్ = కృష్ణుని యొద్దకు పోవుటయే పరమ ప్రయోజనకరమని యెంచి, పోకిన్రారై = వెళ్ళుచున్న, మిక్కుళ్ళ = తక్కిన, పెళ్ళైగళుం = పడుచులను, పోగామల్ = పోకుండునట్లు, కాత్తు = నిలిపి, ఉన్నై = నిన్ను, కూపువాన్ = పిలుచునిమిత్తమై, వన్దు = నీవాకిట వచ్చి, నీన్రోమ్ = నిల్చున్నాము, కోదుకులముడైయ = కుతూహలము గల, పావాయ్ = అబలా! స్త్రీత్వ పూర్తిగల చిన్న దానా!, ఎళుందిరాయ్ = లెమ్ము, మా = తురగరూపుడయిన కేశియను రాక్షసుని యొక్క, వాయ్ = నోటిని, పిళన్దనాయ్ = చీల్చిన వాడును, మల్లరై = చాణూరముష్టికులను, మాట్టియ = చంపిన, దేవాదిదేవనై = దేవాది దేవుడైన సర్వేశ్వరుని, శెన్రు = చేరి, నాం = మనము, పఱై = వాద్య విశేషము, కొణ్డు = తీసికొని, పాడి =శ్రీకృష్ణుని కల్యాణ గుణములను నోరార గానముచేసి, సేవిత్తాల్ = సేవించినట్లైన, ఆరాయన్దు = మన స్థితిని పరిశీలించి, ఆ ఆ ఎన్రు = ఐయ్యో, ఐయో! అని కరుణించి, అరుళ్ = కృపజేయును, ఏల్ఓర్ ఎంపావాయ్ = ఇట్లయిన యోజింపుము. మా అభిప్రాయము ననుసరింపుము.

తాత్ప:- తూర్పుదెస తెల్లవారినది. పాలిచ్చుగేదెలు తలుగులు విడువబడినవై పచ్చిక మేయుటకు పొలములందు సంచరింపబోయినవి. తోడివారిని జతవీడి పోకుండ కలియ గట్టుకొని మేము నిన్ను బిలువనీ వాకిట వచ్చి నిలిచియున్నాము. కుతూహలము కలదానా! లెమ్ము! నీ వీ కార్యమున మిక్కిలి వేడుక కలదానవు గదా? అనగా లోపలనున్న స్త్రీ లేచి చంద్రబింబము వంటి ముఖములు గల మాలోనొకతె తూర్పు దిక్కును జూచి నందున ముఖప్రకాశము ఆ దిక్కున ప్రతిఫలించుట చేత అరుణోదయ మగునట్లుగ మీకు దోచియుండును. అంతియ గాని తెల్లవారుట కింకను చాల ప్రొద్దుకలదు. నీ వాచాలతకేమి గాని లేచిరావమ్మా! అశ్వరూపియైన కేశియను రాక్షసుని, చాణూరాదిముల్లురను సంహరించిన వాడును నిత్య సూరుల కధిపుడైన వాడునునగు శ్రీకృష్ణుని నోరార కీర్తించి, వీణాది వాద్యములతో నాతనిని చేరి యుపాసించితిమేని, మన యందాతడు కరుణించి సేవ సాయించును గాన లేచిరమ్ము! ఊరక యీ వాగ్వివాదము లేల? దీని వలన ఏ ప్రయోజనమును లేకపోగా కాల విలంబనమగును.

వేగరమ్ము, అని హెచ్చరించుచున్నారు.

తెలుగు సేత -

తెల్లవారెను తూర్పుదెస నింగి, బఱ్ఱెలు
వెలికి బోయెను మేయ వెరడు వీడి,
పోబోవు పిల్లల బోనీక నిలిపినిన్
బిలువ వచ్చితి మమ్ము ప్రియముతోడ, (ప్రేమ్మిమీర)
నీయింటి మ్రోలను నిలిచియుంటిమి చూడు,
ఆలసింపకలెమ్ము! అతివమిన్న!
మావురూపుని సోకు మర్దించి మల్లుర
హతమార్చి నట్టిదే వాదిదేవు
చేతడక్క బూని చిత్తము తత్వాద
యుగములందు జేర్చి నిగమగమ్ము
హరినుతింప మనల నాదరించును కృపా
రసతరంగితాంత రంగుడగుచు

-: విశేషార్థము :-

కీళ్వానమ్ వెళ్ళెన్రు -
తూర్పు దిక్కున ఆకాశము తెల్లవారినది.

ఈ మాటలు విని లోపలనున్న గోపిక - "అది తూర్పు తెల్లవారుటకాదు. మీరు చంద్రునివంటి ముఖములు కలవారు. అంతేకాదు శ్రేష్ఠములగు ఆభరణములు కల వారుకూడ. మీరు తెల్లవారునో అనుభవముచే మరల మరల తూర్పు దిశనే చూచుచుందురు. అందువలన మీ ముఖకాంతియు, ఆభరణ కాంతియు ప్రతిఫలించి మీకు తెల్లవారినట్లు కనిపించుచున్నది. ఇది కేవలము మీ భ్రమ. వేరొక ఆనవాలు కలదా?" అని అడుగుచున్నది.

ఎరుమైశిఱు వీడుమెయ్వాన్ పరన్దనకాణ్ - గేదెలు మంచుతోడి పచ్చికను మేయుటకై విడువబడి అంతటను వ్యాపించినవి.

గొల్లలు పశువులను వేకువనే మంచుమేతమేయుటకై బయళ్ళలోనికి త్తోలుదురు. ఆ మేత మేసినచో పశువులు అధికముగ పాలనిచ్చును. తొణ్డరడిప్పొడి యాళ్వారు ఏరీతిగా ప్రథమ పర్వమైన భగవంతుని లేపిరో అదే విధముగ

అండాళు తల్లిగారు భాగవతోత్తములను లేపుచున్నారు. వీరిరువురకును ఇదియే తారతమ్యము. ఈమె పదుగురాళ్వార్లకు ఒకే సంతతి యగుటచే వారి యందలి జ్ఞాన సంపద ఈమెకు సంక్రమించినది. అందుచేత నీమె చరమపర్వము వరకును పోగలిగినది. అనగా లోపలిగోపిక - "ఇదియును మీ భ్రమయే నమ్మా: మీ ముఖ, ఆభరణకాంతికి వెరచి చీకటి ముద్దలు కట్టి పారిపోవుచున్నది. దానిని మీరు గేదెలని భ్రమించుచున్నారు" అనెను. ఈ సంఘటన నొక కవియిట్లు చమత్కరించినాడు.

కాకులు తెల్లవారు ఝామున "కా, కా" యని అరుచుచు సంచరించును. దీనికి ఉదాహరణ మేమనగా -

తిమిరారిస్తమోహన్తి శఙ్కయా తఙ్కమానసాః
వయం కాకా వయం కాకా కింరటన్తీవ వాయసాః ॥"

సూర్యుడు తన కిరణములతో చీకట్లను తరిమి వేయుచున్నారు. చీకటి మెల్లమెల్లగా దూరమగుచున్నది. దానిని చూచి కాకులు మనము కూడ చీకటివలె నల్లగనే యున్నాము. మనలను కూడ యీ సూర్యుడు చీల్చి చెండాడునో యను భయముతో మేము. కాకులము, మేము కాకులము (కాకాః) అని అరచుచున్నవట!

గోదామాత గొల్లల పరిభాషలో గేదెలను చిన్నమేత విరుపు, పెద్దమేత విడుపు అనుచున్నారు. గేదెల వెంబడి శ్రీకృష్ణుడును తప్పక పోవును. అప్పడు మనగతి యేమగును?

ఆ మాటను విని వెలుపలనున్న గోపికలు - "పోనిమ్ము మేము భ్రమపడితిమే యనుము. నీవు తెల్లవారలేదనుటకు గుర్తేమి? అనగా గోపకి - "గుడిసెలు ఐదు లక్షలు గదా? ఆ గుడిసెలలో నున్న వారింత మందియేనా? తక్కినవారేరీ! ఇది చాలదా తెలవారలేదనుటకు గుర్తు?" అనెను.

కొదుకులము డైయపావాయ్ ఎళున్దిరాయ్ -

నీ కాతనియందును, ఆతనికి నీయందును వేడుక మిక్కుటము కదా! కావున నిన్ను పురస్కరించుకొని వెళ్ళినచో మన పని తప్పక నెరవేరును. ఆలస్యము దేనికి లేచిరమ్ము.

- వేదాంతార్థము -

ఈ పాశురములో భగవచ్ఛేషత్వము యొక్క పరాకాష్ఠ భాగవత శేషత్వ పర్యంత మనుసంప్రదాయ సిద్ధాంతము లెరింగిన వారగుటచే భగవదభిమాన పాత్రులగునొక భావతుని లేపుచున్నారు.

ప్రణవములోని అవధారణార్థమైన "ఉ" కారము అన్య శేషత్వమును నిరసించుచున్నను భాగవత శేషత్వ నడ్డుపడలేదు. అందులకు కారణము వారియందు అన్యత్వము లేకుండుటయే. అదియు భగవచ్ఛేషత్వములో నేకదేశమే. ఎట్లనగా - భాగవత శేషత్వమున్న గాని భగవచ్ఛేషత్వము పూర్తిగాకుండుటయే!

ప్రణవములోని అకారమున కర్థమును చెప్పనపుడు అందులక్ష్మీ శేషత్వము వాచ్యముగా లేకపోయినను అర్థాపత్తి ప్రమాణముచే మన పూర్వాచార్యులు అకారార్థమగు రక్షణ సార్థకమగుటకై లక్ష్మీసంబంధమును గూడ చేర్చుకొనిరి. అందుచేతనే మంత్రార్థములో తిరుమంత్ర ప్రకరణమున - "ఇతితే శ్రీ సమృద్ధమనుసంధేయమ్". అని సకల శాస్త్ర విదగ్ధులైన శ్రీసేనాపతి జీయర్ సాయించినారు. ఇందులకు మూలము ఒకరినొకరు ఎన్నడును విడువని సంబంధము కలవారగుటయే. ఇట్లే ఆళ్వందారులు స్తోత్రరత్నమున -

"సకృత్త్వదాకా రవిలోక నాశయా" అను శ్లోకమున - "కణే పితే యద్వికహోతి దుస్సహః"

భగవంతునకు లక్ష్మీమాతను విడిచియుండుట యెంత దుస్సహమో భాగవతులను విడుచుటయు అంత దుస్సహమే అని సాయించినారు.

"అకల కల్లే నిఱైయుం..............." (తిరువాయ్ 4-10-10) అని లక్ష్మియొక్క అధ్యవసాయ మెట్టిదో, "న జీవేయం క్షణమపి వినాతాం అసితేక్షణామ్" - అను పెరుమాళ్ళ అధ్యవసాయమును అట్టిదే. ఇట్టి అధ్యవసాయమే భాగవతోత్తముల విషయమై పెరుమాళ్ళకు కలదు. కావున ఏపదమునకు నారాయణుడు అర్థమగునో ఆ పదమున శ్రీదేవియును తోచునటుల భాగవతోత్తములను తోచకమానదు.

అందువలననే భాగవతశేషత్వము పైమెట్టుగా పరిగణింపబడు చున్నది. కాన మనము భగవంతునకు వలెనే లక్ష్మీదేవికి కూడ శేషభూతల

మగునట్లు భాగవతులకును శేషభూతులమే అని తిరుమంత్ర ప్రకరణము 89 సూత్రమున్న - "ఇతిలే భాగవత శేషత్వమను సన్దేయమ్" - అని "నమః' ' పదార్థ వ్యాఖ్యానమున సాయించియున్నారు. లక్ష్మియారు పురుషకారమున కుండవలసిన కృప, పారతంత్ర్యము, అనన్యార్హత్వము అను మూడు ముఖ్య గుణములు భాగవతుల యందును పుష్కలముగా నుండుటచే శ్రీదేవి యొక్క పురుషకారము వలెనే భాగవతుల యొక్క పురుష కారమును వెంటనే ఫలించును. కనుక నీ పాశురమున వారిని ప్రార్థించుచున్నారు.

సత్త్వగుణ మధికముగా నుండునది వేకువనే. దాని వలన జ్ఞానాభివృద్ధి కలుగును. ఇట్టి కాలమున గావించు ఆచార్యోపదేశములు తలకెక్కి సఫలములగును. అందుచే పురుషకారమును చేయదగిన భాగవతోత్తముని లేపుచున్నారు. లేపుట అనగా వారికి తమయందు అనుగ్రహము కలుగునట్లు చేసికొనుటయే. ఇట్టి మహనీయుల సాన్నిధ్యముచే సంసారి చేతనులయొక్క అజ్ఞానమును తాత్కాలికముగా సెలవుతీసికొనును ఈ అజ్ఞానాంధకారమునే గేదెలని సూచించుచున్నారు.

మల్లరైమాట్టియ -

మల్లురనగా చాణూరముష్టకులను ఇద్దరు బలశాలురు. వారిని శ్రీకృష్ణుడు సంహరించెను. వేదాంతార్థమున ఇట్టి విషయజంటలు అనేకములున్నవి.

1) కామక్రోధములు, 2) సుఖ దుఃఖములు, 3) అహంకార మమకారములు, 4) పుణ్యపాపములు, 5) శీతోష్ణములు 6) క్షుత్పిపాసలు, - అనునవి వీనినే ఊర్మిషట్కము అనియు, ద్వంద్వములు అనియు అందురురు. భగవంతుడు తన భక్తులకు వీనినుండనీయడు. ఇవి మోక్షమార్గమున కాటంకములు.

దేవాదిదేవనై -

పరులుగా భావింపబడు బ్రహ్మరుద్రేంద్రాదులు నిజముగ నెవ్వరికంటె తక్కువవారో ఆతడు పరాత్పరుడు. ఆతడే దేవాది దేవుడు. వానిని

శెన్రు నాంశేవిత్తాల్ - నామ్ శెన్రు శేవిత్తాల్ -

స్వప్రయత్న నివృత్తికి యోగ్యులమగు మనమే స్వప్రవృత్తి

నవలంభించి ఆయన సన్నిధి కేగినచో

ఆవావెన్ఱు - అయ్యో! అయ్యో! అని.

అనగా నన్నే ఉపాయముగా నమ్మియుండి నా ప్రవృత్తికి ప్రతిబంధకమైన స్వప్రవృత్తిని వీడి యుండవలసిన అధ్యవసాయము గలవారు నావిలంబము చేతనే గదా? ఆర్తిని అడుచుకొనజాలక పాపము తామే నాడకేతెంచినారు. వీరికెంత ఆర్తియున్నదోయని జాలిపడి

ఆరాయన్ఱు - మనము వచ్చిన పనిని విమర్శించి

ఆరుళ్ - కృప చేయును.

- వేదాంతార్థము -

భగవత్సమా శ్రయణమునకు పురుషకారమావశ్యకము. ఆ పురుషకారము చేయువారినే ఘటకులందురు. వారు పుష్కల భక్తి కలవారు కావలయును. పౌష్కల్యమనగా అది భాగవత పర్యవసాయియగుటయే. అట్టి వారికి పురుషకారమున కావశ్యకములగు కృప, పారతంత్ర్యము, అనన్యార్హత్వములు ఉండవలయును. ఈ యోగ్యత గల పరమ భాగవ తోత్తముల నీ పాశురమున తమ కభిముఖులు కావలయునని కోరుచున్నారు. వారు సెలవిచ్చినది తలకెక్కి ఫలపర్యవసాయి కావలయుననిన సత్త్వగుణమధికముగా నుండవలయును. అది జ్ఞానప్రదము. దానికి తగినది వేకువసమయమే. అట్టి సమయమున నీముముక్షువులు వారిని ప్రార్థించుచున్నారు. వారు సత్త్వగుణ ప్రధానులు గాన వారి తెల్లని సత్త్వగుణ మంతటను వ్యాపించి అజ్ఞానాంధకారమును పారద్రోలును. వారినాశ్రయించిన భక్తుల యొక్క అజ్ఞానమును తాత్కాలికముగ వేరొక స్థానమును చూచుకొనును. ఈ జ్ఞానమును బడయుట భగవత్ప్రాప్తి కొరకే గాన కొందరు లేచి భగవంతుని సందర్శించుటకే తిన్నగా పోవుచున్నారు. పురుషకారమును ఉపేక్షించి పోరాడని కొందరు వారిని మరలించి, అందరును కలసి యీ భాగవ తోత్తముల యొద్దకేతెంచి వారి పురుషకారము నర్థించిరి. ఆ భాగమునకు భగవంతుని యందును, భగవంతునకు ఆ భాగవతుని యందును అభిమాన మధికము. కావున వారి పురుషకారము తప్పక నెరవేరగలదని వీరియాశ. వారిని పుష్కరించుకొని భగవంతుని సన్నిధికి పోయినచో

నాతడు వీరి విషయ ప్రావణ్యము నణచివేయును. రజోగుణము వలన బుట్టు కామక్రోధముల నణచివేయును. అట్టి వారి సన్నిధికేగి యాతని గుణగానమును చేయగా నారాయణుడు చేయు కృత్యమును వారే చేయుటచే భగవంతుడు ఇందులకు కారణము యూర్తియే యని తలంచివారి యపేక్షితము విచ్చి రక్షించును.

సందర్భాను సారముగ ననుసంధించు కొనదగిన పద్యము.

నల్లని కృష్ణ దైవతము,
నామది నిల్వక నేను చింతిలన్,
జెల్లనే కంటిలోపలికి
జేరిన కారము భంగినిట్టులీ
యొల్లని మాటలాడ, చెలి!
ఉత్తముడాతని పచ్చపుట్టమున్
మెల్లగ దెచ్చివీ వగదె,
మించిననా వలనంత తీరగాన్ (స్వకీయము)

శ్రీకృష్ణుని విరహ దుఃఖమును సహింపలేక పరితపించుచున్న తన్ను పరిహసించున్న తోడి సఖితో శ్రీఆండాళు తల్లి యిట్లు చెప్పచుచున్నది. -

శ్రీకృష్ణుడను నల్లని పరదైవమును దర్శింపవలయునని మిక్కిలి కుతూహలపడుచు, నాజన్మము, యౌవనము, సౌందర్యము, సకల కాయిక, వాచక, మానసిక విభవములు, ఆత్మతో అర్పణమొనరించి, అనన్యార్హయై, భగవద్దాస్యానందమే నాకామినీత్వ సంపూర్ణత్వమని నిశ్చయించి, భగవంతునే వివాహమాడవలయునను కాంక్షతో ఆతనికి శృంగార నాయికనై నన్ను శృంగార నాయకుడైన శ్రీరంగనాథుడను గ్రహింపలేరని విరహాగ్ని తప్తనై ఆతని సాన్నిధ్యము లేక కృశించుచున్న నా వంటి భగవదాశ్రితుల అనుభవమునకు ప్రతికూలముగా నీవును శత్రువువలె కంటిలో కారము చేరినట్లు కఠినముగా మాట్లాడవలదు. ఇది నీకు తగదు. నీకు చేతనైనచో స్త్రీల దుఃఖము నెరుంగని శ్రీకృష్ణుని పీతాంబరమును దెచ్చి నాశరీరముపై దానిజేర్చి, నా ప్రాణములగాపాడుము. నీకెంతయు శుభము చేకూరును.

# శ్రీ వ్రతము

వేద శిరములందు నాదు మూర్ధము నందు
నెసగు నెద్ది కోర్కులొసగు నెద్ది
కులధనమ్ము మాకు కులదైవతము వేంక
టేశు పాదయుగము నెపుడు గొలుతు.

- "జ్యోతిశ్రీ"

## తొమ్మిదవ పాశురము

**"తూ మణీ మాడత్తు"**

### -: అవతారిక :-

కొందరు ప్రపన్నాచార్యులే శ్రీకృష్ణ సంశ్లేషకై మట్టలెక్కుట, కొందరు క్షుద్రమైన కామదేనువును ఆరాధించుట, కూడనిదయినను కొందరు పలుమారు ప్రపదన మొనర్చుటయు చేయుచుండగా నీ లేపబడు గోపిక యిట్లు నిర్లక్ష్యముగా హంసతూలికా తల్పముపై పరుండుట భావ్యమా? అన్నచో, ప్రపన్నులేకాదు. వారికి కూటస్థులే యిట్లు సిద్ధాంత విరుద్ధాచారము నాచరించుటయే గాక లోకులెరుంగునట్లు గ్రంథపరచుటలో నేదియో యొక రహస్య ముండవలయును. దానిందెలిసికొనుట చాల ముఖ్యము. ప్రపన్న యవస్థలు - తోళి, తాయి, నాయిక - అను మూడు విధములు. వీనిలో మొదటిది అతి ముఖ్యమైనది. అది సంబంధజ్ఞానము. భగవంతుని యందు భక్తి కలుగవలయునన్నను, కలిగిన భక్తి అభివృద్ధి కావలయునన్నను ఇది ముఖ్యము. శ్రీవైష్ణవత్వమును ప్రసాదించు అమృత గుళికయిది అన్నను బాధలేదు. ఈ సంబంధములు చేతనున కీశ్వరునితో తొమ్మిది కలవు. అవి అష్టాక్షరీ మహామంత్రములో బోధింపబడినవి. "పితాచరక్షక శ్శేషి భర్తాజ్ఞేయో (రమాపతిః) స్వామ్యాధారో మమాత్మాచ, భోక్తా (చాద్యమనూదితః) (ఆద్యమనువు అనగా మొదటి మంత్రమగు అష్టాక్షరి) 1. పితాపుత్ర సంబంధము, 2. రక్ష్య రక్షక సంబంధము, 3. శేష శేషి భావసంబంధము, 4. భర్తృ భార్యా సంబంధము, 5. జ్ఞాతృజ్ఞేయ భావ సంబంధము, 6. స్వామి స్వత్వ సంబంధము, 7. ఆధారాధేయ భావ సంబంధము, 8. శరీరాత్మ భావ సంబంధము, 9. భోక్తృ భోగ్య సంబందము.

తాయి మారవస్థయనగా - ఉపాయత్వాధ్యవసాయము. దీనినే ప్రపత్తి అని కూడనందురు. ఇదియే మన సిద్ధాంతసర్వస్వము. ప్రపత్తి యనగా భగవంతునే తనకు పరమ పురుషార్థము ప్రసాదించు ఉపాయమని నమ్మియుండుట. దీనికి "భగవత్ప్రవృత్తి ప్రతిబంధక స్వప్రవృత్తి నివృత్తి "జీవగర్ర అనగా భగవంతుని ముఖ్య కర్తవ్యము రక్షణ. ముఖ్యమనగా తాను తానుగా నుండి చేయునది. సృష్టి సంహారములు సద్వారకములు. అనగా బ్రహ్మకును, రుద్రునకును అంతర్యామి గానుండి చేయునది. ఈ కర్తవ్యమును నిర్వహించుటలో భగవంతుడెప్పడును సావధానముగనే యుండును. దానికొక యడ్డు కలదు. అది మన రక్షణను మనమే చేసికొను ఉద్యమము. దాని నాతడు సహింపడు. అది యాతని నిరపేక్ష రక్షణ కడ్డము. దానిని విడచిన గాని తాను మన రక్షణలో నిదిగాన నుద్యమింపడు. గజేంద్ర, అంబరీష, ద్రౌపది, విభీష లభృతుల రక్షణలో నగును. ఆ ప్రవృత్తిని మనము విడుచుటయే ప్రవృత్తి. ఇది "తల్లి యవస్థ".

ఇక నాయికాయవస్థ యనగా సంబంధ జ్ఞానమూలమున భగవంతుని స్వరూప, రూప, గుణ, విభూతి, చేష్టలను స్పష్టముగా నెరిగిన పిమ్మట భగవంతునెప్పడు పొందుదు మాయను ఆశజనించును. ఆ ప్రాప్తి ఆలస్యమైన కొలదియు తహతహ యధికమగును. ఆ యార్తిలో చేయదగినది, చేయరానిది అనుజ్ఞానమే యుండుదు, దానిచే మట్టలెక్కుట, కామారాధన, మాటిమాటికి ప్రపత్తి చేయుట మొదలగు ప్రవృత్తులు జనించును. అట్టి ప్రవృత్తులను చూచిన కొలది భగవంతుని తన స్వరూపాదుల యందలి విశదతమ జ్ఞానమును, అట్లు తనను పొంద వలయుననెడు మిక్కుటమైన ఆర్తియును గదా వీరి నిట్లు చేయుచున్నదని యెంతయో సంతోషముతోను పొందును. ఇట్టి తల్లియవస్థ లేపబడుచున్న గోపికకును, నాయికావస్థ లేపు వారికిని గలదని గ్రహింపవలయును.

మట్ట లెక్కుటయను విషయమును గూర్చి తి.వాయ్ 5.3 అవతారికలో ఇట్లు చెప్పబడినది.

ఒక స్త్రీ తన కిష్టమైన భర్త తనను ఆదరింపక పోవుటచేత ఆ యెడబాటును సహింపజాలక ఆతని ఆకారము నొక చిత్రపటమున చిత్రించుకొని వేసిన కన్నును తీయక దానినే చూచుచు, ఎడబాసినది మొదలు కాన్పించిన భోగములెల్లను నిష్ఫె కాన్పించక ఆహార నిద్రలు సైతము

లేక, స్నానము చేయక, ధూళి పట్టిన దేహముతో జుట్టును విరియబోసికొని, తాటిమట్టను గుర్రముగా చేసికొని కాళ్ళ మధ్య నుంచుకొని తిరుగుట. ఇది ద్రావిడుల యాచారము అని యందురు. ప్రాయశః పురుషులకే యిది నిర్ణయింపబడినను, స్త్రీలును గూడ చేయవచ్చునని సమర్థించిరి. ఇది యొక వ్యాపారము!

ఇంతకన్నను అల్పమునకై అధిక సాహసమును చూపుట యనియును చెప్పదురు. పేలములను తినుటకై వరికుప్పను తగులబెట్టుటకు చేయుబెదిరింపు గాని ఆచరణలో లేదు. దీనిని అమలు జరిపినవాడు నమ్మాళ్వారును, తిరుమంగైళ్వారును. తిరువాయ్‌మొళి 5వ శతకమందలి 3వ దశకమంతయు నీ విషయమునే తెలుపుచున్నది అందు 10వ పాశురములో - "యాంతుడలూర్‌న్దు" అను చోట తన సఖురాలితో నాయిక చెప్పినట్లు కలదు.

ఆండాళుతల్లి నా.తి. లో ప్రారంభమునందే - "అనంగదేవా!............ లేజ్ఞదపత్కైన్నై విదిక్కిత్తియే ఉన్నైయుం ఉమ్బియైయుం తోళుదేన్" - ఓ మన్మథా! నన్ను శ్రీనివాసునితో గూర్చుము. అట్లు చేతివా నేను నీకును, నీ తమ్ముడగు సాంబునకును నమస్కరింతునని ప్రార్థించినది. "యయౌ చకాచిత్ ప్రేమాన్ధా" యని ప్రేమకార్య మిట్లే గదా! యుండునది. బుద్ధి పూర్వముగా మన్మథుని ఆశ్రయించుచున్నదేమి? యనినచో "రజోరా గాత్మకం విద్ధి" - రజోగుణము అనురాగమునకు కారణముగా తెలియును (భగవద్గీత 14-7) యనిరి గదా! సాత్త్వికాగ్రేసరులను ఆశ్రయింపదగిన పెరియాళ్వారుల కుమార్తెయగు నీమెరజో గుణప్రచురుడను మన్మథుని పాదములపై పడుచున్నదేమి యనిన! నిత్యము ఎడబాసియుండనట్టి సీతామహాదేవి రామునెడబాసి యుండకుండుటకై - "సర్వాన్ దేవాన్ నమస్కృత్తి" (రా. అ 2.52) అందరు దేవతల కాళ్లపై పడెను గదా! అట్లే యీామెయు మన్మథుని ఆశ్రయించుటలో కారణము. పెరియాళ్వారులు ఆశ్రయించినది సాత్త్విక దేవతనైనచో, ఆండాళు ఆశ్రయించినది రాజస దేవతయుగు మన్మథుని నమ్మాళ్వారులు తిరునామ్ మొళి ప్రబంధములో అనేక దివ్య దేశములయందు వేంచేసియున్న అర్చామూర్తి విషయమై శరణాగతిని గావించిరి.

భగవంతుడు సర్వజ్ఞుడు. ఆయనకు తెలియని విషయములేదు. ఆయన స్వయముగా నిరపేక్ష రక్షకుడు. అది ఆయన స్వరూపము. అనన్య భోగత్వ, అనన్య శరణత్వ, అనన్య శేషత్వములు ఆత్మకు స్వరూపములు. శేషత్వ, పారతంత్ర్యములు జీవునకు సహజాలంకారములు. అందుచే వీరు ప్రపన్నులు. అనగా తమ రక్షణలో తామొకింతయును అన్వయింపరానివారు. దీనినే "పరగతస్వీకార" మందురు. భగవత్ప్రాప్తి స్వగత స్వీకారము, పరగత స్వీకారము నని రెండు విధములు. రెండును శాస్త్ర సమ్మతములే. స్వగత స్వీకారమనగా - భగవంతుని లభించుటకై తాను చేయు కృషి. పరగత స్వీకారమనగా చేతనుని బడయుటకు భగవంతుడు చేయుకృషి.

వీనిలో మొదటిది - "ఆత్మావారే ద్రష్టవ్య శ్రోతవ్యో నిదధ్యాసి తవ్యః" - అను శ్రుతి వాక్యముచే విధింపబడు ధ్యానము. ఆ ధ్యానము ప్రత్యక్ష సమానాకారతను పొందవలయునని - "యథా ద్రష్టవ్యః (భవతి) తథాసితన్యః" - అని విధించుచున్నది. అనగా కంటికి గోచరించునంత స్ఫుటముగా మనస్సుకు గోచరించునట్లు ధ్యానమును చేయవలయునని భావము. అది భగవద్గీతలో చెప్పబడిన కర్మ జ్ఞానాంగకమైన ఉపాసన.

ఇక రెండవది "నాయ మాత్మాప్రవచనేనలభ్యో నమేధయా నబహూనాశ్రుతేన, యమే వైషవృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతే తనూగ్ం స్వామ్" - అని కఠమునము చేయు శ్రవణ, మననాదుల వలన కాదు భగవంతుడు లభించునది ముండక ఉపనిషత్తులలో తెలుపబడినది ఆతడెవనినిని వరించునో యానినికి తానే స్వయంముగ తన నిజ(స్వ)రూపమును చూపించునని తెలుపుచున్నది. ఇది భగవాను డేర్పరిచిన మర్యాద గదా! సర్వజ్ఞుడు మరచునా? ఇదియే గదా సీతా మహాదేవిగా నవతరించిన లక్ష్మీదేవి తానాచరించి మనకు బోధించిన సంప్రదాయ రహస్యము. రావణుని భస్మముచేసి, దాని మూలమున రాక్షసులను భయభీతులను గావించి తన విమోచనబడయ గల్గు శక్తి తనకున్నను దానిని చూపలేదు." నత్వా కుర్మి దశగ్రీవ! భస్మ భస్మార్హతేజసా" అనెను తిరువడి తన నిజరరూపమును జూపి "శక్తి రస్తిహిమే వోఢుం లఙ్కామపి సరావణామ్ అని విన్న వించినను,

"బలైస్సమగ్రైర్యది మాం రావణం జిత్వ సంయుగే,
విజయీ స్వపురీం యాయాత్ తత్తుమేస్యా దృశస్కరమ్॥"

"ఓ ఆంజనేయా! నానాధుడగు శ్రీరాముడు తన సమగ్రబలముతో లంకకు వచ్చి యుద్ధమున రావణుని చంపి నన్ను తీసికొని అయోధ్యకు వెళ్ళినచో అదినాకు కీర్తి దాయకము. అంతేకాదు. మరియు వినుము.

"శరైస్తు సఙ్కులాం కృత్వా రామో పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సః తత్తస్య సదృశంభవేత్ ॥

"ఓ హనుమా! శత్రు బలవినాశకుడగు శ్రీరామచంద్రుడు, లంక నంతకు తన శరజాలముతో నింపివేసి, శత్రు శేషముంచక నన్ను అయోధ్యకు గొపోవవునేని అది యాయనకు కీర్తిదాయకము.

"ఈ విధమైన యుభయుల స్వరూపమును ఎరింగినవాడు గావున భగవంతుడు నా యొద్దకు తానుగా వచ్చి తాను నన్ననుభవించుట, నాచే తన ననుభవింపజేసికొనుట ఆయన పని" అని పరుండియున్న గోపికను లేపుచున్నారు.

"ఐదు లక్షల గుడిసెలలోనున్న ఆడపిల్లలందరును ఇక్కడికే విచ్చయుండగా పరుండి నిద్రించుట నీకు తగునా?" అని నిందోక్తులతో తెలుపుచున్నారు. వెలుపలనున్న గోపాంగనలు లక్ష్మణస్వామి వంటివారును, ముముక్షవుల వంటి వారును అయిన, లోపల నిద్రించు నామె నిత్య సిద్ధులవంటిది. అనగా లక్ష్మణుడు శేషత్వమునకు ప్రతినిధి. కావున, కైంకర్యముచేయనిచో శేషత్వము బ్రతుకదు. ఆ కైంకర్యమైనను లక్ష్మీనారాయణులిద్దరి గోష్ఠిలో చేయవలయును.

"భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషురంస్యతే,
అహం సర్వం కరిష్యామి జాగ్రత స్స్వపత తశ్చతే॥"

"అన్నా! శ్రీరామచంద్రా! మీరు సీతామాతతో కలసి పర్వత చరియలయందు విహరింతురుగాక! నేను మీరు ములను చేయుదు" నని - సభ్రాతుశ్చరణౌ సౌపద్య - పాదములను గట్టిగా పట్టుకొని ప్రార్థించెను. అట్లే ఈ గోపికలును కైంకర్య నిష్ఠులు ముముక్షువులును ఇట్టివారే! వారు గావించు నిద్రించుచున్నప్పడును, మేల్కొని యున్నప్పడును మీకు సర్వవిధకైంకర్య కర్మ జ్ఞాన భక్తులు భగవత్కైంకర్య బుద్ధితోనే గావింతురు. నిద్రించు గోపిక నిత్యసూరుల వంటిది. గుణాను భవముతోడనే కాలక్షేపము చేయునది. వారికి భగవత్ప్రాప్తి నిత్యసిద్ధమే యగుటచే దాని కొరకు నేమియు

చేయువలసిన అవసరము లేక పోవుటచే నిరంతరము భగవదను భవముతోనే కాలమును గడుపుచుందురు. ఈ పరుండియున్న గోపికయు నట్టి యోగ్యత గలది గాన తన యింటనే యుండి శ్రీకృష్ణాను భవముతోను, ఆతని కల్యాణ గుణానుభవముతోడను కాలమును గడపు చున్నదని భావము.

జ్ఞానులు ఐహిక భోగములకు దేవులాడక భగవత్ప్రీతికై అలమటింతురు. అందుకొరకే కలియుగమున నామకీర్తనమే మంచి యుపాయము. "నామస్మరణా దన్యోపాయంనహి పశ్యామో భవతరణే." కావున లక్ష్మీపతియై వైకుంఠ వాసియైన భగవంతుని కీర్తింపవలయును. ఆభగవంతుని యెడ ప్రపన్నులైన గాని తరింపలేరు.

## తొమ్మిదవ పాశురము

తూ మణిమాడత్తు శుత్తుమ్ విళక్కెరియ
తూపం కమళత్తుయిలణై మేల్ కణ్వళరుమ్
మామాన్ మగళే! మణిక్కదన్తాళ్ తిఱునామ్
మామీర్ అవళై యెళుప్పీరో ఉన్‌మగళ్ తాన్
ఊమయ్యో! అన్తిచ్చెవిడో? అనన్దలో?
ఏమప్పెరు న్దుయిల్ మన్దిరప్పటాలో?
మామాయన్ మాదవన్ వైకున్దన్తెన్ఱు
నామమ్ వలపుమ్ నవిన్ఱేలో రెమ్బావాయ్.

టీకా: తూ = దోషములేని (పరిశుద్ధమైన), మణి = రత్నములచే చెక్కబడిన, మాడత్తు = మేడలలో, శుత్తుమ్ = చుట్టును (నలుప్రక్కల), విళక్కు = దీపములు, ఎరియ = వెలుగుచుండగా, తూపం = సాంబ్రాణి మొదలైన వాసన గల ధూపములు, కమళ = పరిమళింపగా, త్తుయిల్ మెత్తని (నిద్రించుటకు యోగ్యమైన) అణైమేల్ = హంస తూలికా తల్పమందు, కణ్వళరుం = నిద్రబోవుచున్న, మామాన్ = మేనమామ గారి యొక్క, మగళే = కూతురా!, మణిక్కదవం = రత్నముల తలుపుయొక్క, తాళ్ = గడియను, తిఱువాయ్ = తెరువుము, మామీర్ = ఓ అత్తగారూ! (మీరు) అవళై = ఆమెను, ఎళ్ళుప్పీరో = లేపగూడదా? ఉన్‌మగళ్ తాన్ = నీ కూతురు, ఉమయ్యో? = మూగదా? అన్తి = లేక, చ్చెవిడో = చెవిటిదా?, అనన్దలో =

మిగుల నలసి నిద్రోపోవు చున్నదా? లేక, ఏమమ్ కావలి యుందుచ బడినదా? లేక, పెరున్దుయిల్ = గాఢనిద్ర బోవుట్లున మందిరప్పట్టాళో మంత్రింపబడిదా?, మా = అనేకములైన, మాయన్ = ఆశ్చర్య గుణచేష్టితములను గలవాడా? మాదవన్ = లక్ష్మికి భర్తగా నుండువాడా? (శ్రియః పతి), వైకున్దన్ = వైకుంఠ నికేతనుడా? ఎన్ఱుఎన్ఱు = అనియిట్లు, నామమ్ = అనంతనామములను, పలవుమ్ అనేకములైన, నవిన్ఱు = చెప్పితిమి. ఏల్ఓర్ ఎంపావాయ్ = ఇట్లుయినచో యోజింపుము, మా అభిప్రాయము అనుసరింపుము. ఇప్పటికైనను మాపలుకులు చెవికెక్కినవా?

తా:- పరిశుద్ధములగు మాణిక్యములతో నిర్మించబడిన మేడలో చుట్టును దీపములు వెలిగించుకొని, అగరు ధూపములు పరిమళించుచుంగడా మిక్కిలి మెత్తనైన హంస తూలికా తల్పమున పరుండి హాయిగా నిద్రబోవుచున్న యో మేనత్త కూతురా? మాణిక్యపు తలుపుల గడియను తీయుము. "ఓ అత్తగారూ! మీరైనను ఆమెను లేపుడు. మీ పుత్రిక మూగదా? లేక చెవిటిగా? లేక బద్ధకమా?" అని ప్రశ్నించగా అందులకామె మీరు భగవన్నామములను కీర్తించినచోయీ చిన్నది లేచును" అని బదులు పలికినది. "గొప్ప ఆశ్చర్యగుణచేష్టితములు గలవాడు, శ్రియః పతి, పరమపదవాసి" అని యిట్లనేక విధములైన సర్వేశరుని యొక్క తిరునామములను అనుసంధించినను లేవవేల? ఓ మామ కూతురా! లెమ్ము! హరిని సేవింతము రమ్ము॥

**తెలుగుసేత:-**

మణిమయ భవనాన మణిదీపికలు వెల్గ
కమ్మని ధూపము క్రమ్ముకొనగ,
మెత్తని పాన్పుపై మెలతరో కనుమూసి
నిదురించుచుంటివా? నెమ్మదిగను
వచ్చి తీయుము మణివాకిలి తలుపుల
గడియ నీయిల్లు బంగారుగాను,
అత్త! నీ వైనను లేపు మీ యలివేలి కుంతల
నీ కూతురే గదా? నిద్రలోన

మునిగియున్నదె? చెవిటియా? మూగ? మంత్ర
ముగ్ధయా? గుప్తయా? మేము మురవిరోధి
మాధవుని విష్ణు వైకుంఠ మాయలాని
పలుదెరంగుల బాడినాపలుకదేల?

**విశేషార్థము**

దోషములు తొలగించవలసిన అవసరములేకుండగనే సహజమగు మంచితనము గలమణులతో కట్టబడినమేడ.

భక్తులకు విరహతాపమునుపశమింపజేయ రెండు విధములున్నవి. భగవంతుని స్వరూప, రూపగుణ విభూతుల ననుభవించుట గాని, లేక పరమ భాగవతులను, వారికి సంబంధించిన పదార్థములను, చేష్టలను, మాటలను గాని అనుసంధించుట. కూరత్తాళ్వారులు "ఒక శ్రీవైష్ణవుని యొక్క గృహయాత్రననుసంధించుట హితమును, ప్రియమును" అని సాయించినారు. శ్రీపరాశరబట్టరువారును - "ఈ ముప్పది పాశురముల ననుసంధింప లేకున్నను, "నామిరున్ద విరుప్పై నినైప్పృతు" - మేమున్న స్థితిని తలచు కొనుడని భావము. ఈ ఫలస్థితికే దేవరాజ గురువులు (ఎరుమ్బియప్పా) శ్రీవరమునుల నిత్యానుష్ఠానమును - "పూర్వోత్తర దినచర్య" - అను పేరుతో సాయించిరి. ఇది పంక్తి పావనమని శ్రీవైష్ణవులు సాపాటు గోష్ఠికి ముందు దీనిని తప్పక అనుసంధించు ఆచారమున్నది. భగవంతుని స్వరూప రూపగుణ విభూతులను స్మరించుకొని, ఆపాద మస్తకమును పులకరించి, నేత్రములనుండి ఆనంద బాష్పములను గార్చు భాగవతోత్తములను సేవించుట పరమ పురుషార్థముగ శాస్త్రమున చెప్పబడియున్నది. అట్టి వైలక్షణ్యము ఈ పరున్న గోపికకు కలదు.

నమ్మాళ్వారు తులై విల్లి మంగళమనెడు పెరుమాళ్ళకోవెలను వర్ణించుచు "తువళిన్‌మామణి మాడమ్" అని సాయించినారు. ఇచ్చట ఆండాళు తల్లి గోపాంగన భవనమును "తూమణిమాడమ్" అని వర్ణించియున్నారు. ఈ రెంటికిని గల తారతమ్యమును గమనింపుడు "తువళిల్" - అనగా దోషములున్నది గాని సానబెట్టి ఆ దోషములను తీసివేసిన మణులతో కట్టిన మేడ ఆయనది. అసలు దోషములే లేని మణులతో కట్టిన మేడ యీమెది. అపహత పాప్మత్వము జీవాత్మకును కలదు.

పరమాత్మకును కలదు. జీవుని అపహత పాప్మత్వము హేయసంబంధార్హమైనది. పరమాత్మ అపహత పాప్మత్వము హేయసంబంధానర్హమైనది.

ఉపనిషత్తులలో "య ఆత్మని తిష్ఠన్, ఆత్మనోన్తరో, య మాత్మా నవేద, యస్యాత్మా శరీరమ్" - పరమాత్మకు జీవుడు శరీరస్థానమని కలదు ఈ శరీరమైన జీవునియొక్క అపహత పాప్మత్వాదులు సంసార దశలో కర్మచే కప్పబడి ప్రకాశించవు. మోక్షదశలో కర్మలుండువు గాన ఆ గుణములు ప్రకాశించును. దీనిని బట్టి పరమాత్మ కోవెల (జంగమ శ్రీమానాని హృదయాని మనీషిణాం - భక్తుల హృదయము పరమాత్మకు సంచరించు కోవెలలు) జీవుడగుచున్నాడు. ఈ జీవునకు గల అపహత పాప్మత్వాదులు ఎనిమిదియు నెనిమిది గుణముల వంటివి. ఈ మణుల కుండు దోషము మోక్షదశలో తొలగింపబడినవి కాబట్టి "తువళిళ్ మామణి" - అని దోషములు తొలగింపబడిన మాణిక్యములతో ఆయన కోవెల నిర్మింపబడినది.

జీవునకు పరమాత్మలో గల తొమ్మిది సంబంధములలో ఆధారాధేయ భావసంబంధ మొకటి. అనగా జీవుడు ఆధేయము, పరమాత్మ ఆధారము. అపుడు జీవునకు పరమాత్మ శరీరము వంటివాడు అగును. "ఐశ్వర్యాది కామః మత్స్వరూపస్యాతిశయహేతవః జ్ఞానీ తుమమ స్వరూప సత్తా హేతురీతి స్వభక్తస్తుతి పరో యంశ్లోకః యస్మాదయంమయా వినా ఆత్మధారణా సమ్భావనయామామేవా నుత్తమం ప్రాప్యస్థితోః అతఃలేన వినామమా ప్యాత్మా ధారణం నసంభవతి, తతో మమాత్మాపాసః అయమర్థః త్రయన్త సిద్ధాదిన్తోభవతు వా మావా కృష్ణ సిద్ధాన్త స్త్వయ మితి ఘుష్యతామ్ ఆధారత్వాది విశేషోహి ఆత్మత్వాది లక్షణ మితిభావః (గీతః 7-18 తాత్పర్య చన్ద్రికాయాం) ఆయనకు గల అపహత పాప్మత్వాది మణు లెప్పుడును దోష దూరములై ప్రకాశించుచునే యుండును. ఈ ప్రకారము వీరికి స్వాభావికము. కాబట్టి జీవుని శరీరము (శరీర స్థానములోనున్న పరమాత్మ) సహజప్రకాశముగల మణులతో నిర్మింపబడినదనుచున్నారు. గోపాంగన భవన మట్టిదని భగవంతుని భవనముకన్నను ఈ భవనమునకొక వైలక్షణ్యము చెప్పబడినది.

ఉపనిషత్తులలో శుద్ధాత్మ స్వరూపమును చెప్పనపుడును, పరామాత్మ స్వరూపమును చెప్పనపుడును - "అపహతపాప్మా" - ఇత్యాది వాక్యము చెప్పబడును.

**కణ్వాళరుమ్ -**

"లక్ష్మణుని వలె నిద్రలేకుండుటకు మేమును, స్వేచ్ఛగా నిద్రబోవుటకు నీవును తగియున్నాము." ఈ నిద్రించు గోపాంగన "ఫలమత ఉపపత్తేః" (అయన వలననే ఫలప్రాప్తి దాని కెన్నియో ఉపనిషత్తులు కలవు.) అను బ్రహ్మ సూత్రమునందు నమ్మకము కలది. నారాయణనే నమక్కే పఱైతరవాన్' ' - అను సిద్ధాంత మీామెదే! అనగా "భక్తులకు అభీష్టము నొసంగు వాడు నారాయణుడే కదా! వీరికీ యారాటమేల?" అని యామె తలంపు. "ఫలము ఆతడిచ్చునది కాదు. అతడే అయియిండగా నీమెయెట్లు పరుండి యున్నది?' ' అని వీరి యభిప్రాయము. "కణ్వాళరుం." అనునదిని దించుపెద్దల విషయమై వాడు నట్టి పారిభాషిక పదము.

**మామన్ మగళే -**

అర్జునుడు శ్రీకృష్ణుని బావమరది సంబంధమును పురస్క రించుకొని "అతి పరిచయాదవజ్ఞా" అనునట్లు అనిపించుకొనుటకు అలవాటుపడి చివరకు విశ్వరూపమును సేవించి "అమ్మో! ఈతనిని నేను సామాన్య ప్రాకృత చుట్టముగా భావించి అవమానపరచితినే!: ఇపుడేమి దారి?" యని

"సఖేతి మత్వా ప్రసభంయదుక్తం,
హేకృష్ణ! హే మాదవ! హే సఖేతి,
అజానతా మహి మానం తవేదం,
మయా ప్రమాదాత్త్రణయేనవాపి
తతాక్షమమే త్వామహ మప్రమేయమ్॥"

క్షమాపణ నర్థించెను. అట్లనదగిన సంబంధము నాశించి అండాళుతల్లి యాగోపికను మనత్త కూతురుగా భావించెను. ఆ గోపిక మీరే గడియను తెరచుకొని రండని చెప్పగా మణిక్కదవంతాళ్ తిరవాయ్ -

"నీవే వచ్చి తెరువుము." అను చున్నారు. దేశికులే గదా భాగవత దర్శన ప్రతిబంధకమును తొలగించవలసిన వారు. కావున నీవే వచ్చి తలుపు తెరువు మనిరి. ఈ గోపాంగనలు తలుపు తెరచియే యున్నను ఎవరైనను పురుషకారముగ నుండి ప్రవేశపెట్టిన గాని తమంత తాముగా ప్రవేశించరు.

దుర్యోధనుడు మయసభలో నీటికిని, స్ఫటికమయ మండప మునకును భేదమును గ్రహింపలేక నీరున్నచోట లేదనుకొని జారిపడగా ద్రౌపది చూచినవ్వెను. అట్లు మేనత్త సంబంధమును బట్టి పరిహసించుటకా. అనిరి. అది మాణిక్యయమ భవనమగుట బైటనున్నవారికి లోపలనున్న వన్నియు గాన్పించునట్లే, లోపలి వారికిని బైటనున్నవి కాన్పించును. గాన తలుపునకును, గడియకును భేదము గ్రహింపలేక మేము తడబడుచుండగా మా అజ్ఞత్వమును జూచి నీవు పరిహసింపదలచు చున్నావా? అయితే నీవే వచ్చి తెరువుము. అనుచున్నారు. ఈ మయసభను ధర్మరాజునకు మయుడు అత్య పూర్వముగ నిర్మించి యిచ్చిన సభాభవనము. దీనికి ఇంద్ర యమ వరుణాదుల సభలేవియు ఈడుకావు. శత్రువులగు వారికి ఉన్నది లేనట్లును, లేనిది ఉన్నట్లును తోపజేయు మయసభా విశేషములు, అందలి శిల్ప చిత్రములు, మాయామహిమలు “మయమాయ”, “మయజయము” అనుగ్రంథములలో చక్కగా సూచితములై యున్నవి. “మాయానగర” మహాద్భుత నిర్మాణా విధులను శాసించు మయశాస్త్రములు నేడు లేవు గదా? శ్రీకృష్ణునిచే దహింపజేయబడిన ఇంద్రుని ఖాండావననము మయుని రసాయనశాల (Laboratory) అనియు: అది దగ్ధమగుటచే మయుని శిల్ప ప్రతిభను చాటు గ్రంథములను, వైజ్ఞానిక శాస్త్రమునకు పనికి వచ్చు ఓషధులు మొదలగు సాధనములును నశించి పోవలోకమున మయశిల్ప ప్రభావము నామ మాత్రావశేషమైనదినియు శ్రీశరభాచార్య మహాకవి యిట్లు వాపోయినాడు -

మయ దివ్య సూత్రదారుని
“మయ మాయా, మయజయ” ప్రమాణ గ్రంథ
ద్వయమిపుడెక్కడ? ఖాండవ
భయదాగ్నికి నాడుబూది పండ్లయిపోయెన్.

మయుడు ఆచార్యుడై ఒప్పినను, నిరీహుడై లోకోద్ధరణము చేసి జగదోపకారియై అనాది కాలమున మొధటి శిల్ప ప్రవర్తకులలో ఒకడై జగత్పూజ్యుడైనట్లు స్కాందమత్స్య, నైవ స్వతపురాణాదులు వచించుచున్నవి.

మామిూర్ అవళై యెళుప్పీరో ఉన్ మగళ్ -

అత్తగారూ! మీా అమ్మాయిని లేపండి.

కదలక మెదలక పరుండియున్న గోపాంగనపై నున్న కోపమునంతను ఆమె తల్లిపై చూపుచు "మీ అమ్మాయి" అను వేర్పాటును చూపుచున్నారు.

ఈ వేర్పాటు అపురుషార్థము. పెద్దలీ వేర్పాటును ఒక శిక్షగా భావింతురు. ఒక భాగవతోత్తము డెవనిని "నావాడ"ని భావించు నోవాడు తరించును. ఒక దుర్మార్గుడు "నావా"డని యెవనిని భావించునో వాడు నశించును. ఇది భాష్యకారుల సిద్ధాంతము.

"పశుర్మనుష్యః పక్షివా యేచ వైష్ణవ సంశ్రయాః,
తేనైవతే ప్రయాస్యన్తి తద్విష్ణోః పరమం పదమ్

కలుషిత హృదయుడగు ధృతరాష్ట్రుడు తన బిడ్డలగు దుర్యోధనాదులను మామకాః" అని అభిమానించెను. వారందరును నశించిరి. శ్రీకృష్ణుడు పాండవులను "మమ ప్రాణాహి పాణ్డవాః" అని భావించెను. వారందరును ఉజ్జీవించిరి.

**మామాయన్ -**

ఆశ్చర్యకరములైన గుణములచేతను, చేష్టల చేతను స్త్రీలమగు మమ్ములను స్వాధీన పరచుకొనువాడు.

**మాతవన్ -**

దానికి మూల మా శ్రియఃపతి యగుటయే.

**వైకున్ఠన్ -**

శ్రియఃపతి యగుటచే వచ్చిన పరత్వమునకు తగిన స్థాన విశేషము కలవాడు. అట్టి గొప్ప తనము గల శ్రియఃపతి సుమండి! స్త్రీకింత సులభుడైనాడు. అమ్మా! అత్తగారూ! పరత్వమునకు మూలమైన తిరునామములను, సౌలభ్యమునకు మూలమైన తిరునామములను ఆరెండింటికిని కారణమగు శ్రియఃపతిత్వమును తెలుపు తిరునామముల నెన్నింటినో చెప్పితి మనుచున్నారు.

**- వేదాంతార్థము -**

ఇట్లు లేపబడుచున్న గోపిక తదే కోపాయాధ్యవ సాయముగల యొక భాగవతోత్తముడు. "మామేకం శరణం వ్రజ" అనుచో ఏకశబ్దము అవధారణార్థకము. అనగా నన్నే అని భావము. ఇదియు నితర యోగమును

నిషేధించును. ఆళ్వారులు - "నీ స్వీకారము నైనను నీకు ఉపాయమని తలంచకుము" అదువుం అవన దిన్నరుళే" అది కూడ ఆయన కృపచేతనే వచ్చినదని భావింపుము అని సాయించినారు.

మామాన్ మగళే -

మామాన్, అమ్మాన్ - అను రెండును పర్యాయ పదములు. అనగా "స్వామి" అని భావము. అతని బిడ్డయనగా పుత్రునివలె అభిమానింపదగిన వారని యర్థము. అట్టి వారెవరు? అనన్యార్హ భాగవతోత్తములు. వారినే తమకు అభిముఖులుగా జేసికొనుచున్నారు. వారెట్టి వారనగా -

**తూమణి మాడత్తు -**

వారి శరీరము పంచోనిషణ్మయ అప్రాకృత దివ్యమంగళ విగ్రహము.

**శుత్తుం విళక్కెరియ -**

అందు జ్ఞానమను దీపము వెలుగుచుండగా, జ్ఞానమును దీపముతో పోల్చుదురు. ఈ విషయమునే యీ క్రింది శ్లోకము నిరూపించుచున్నది.

"తేషామే వానుకమ్పార్థ మహ మజ్ఞానంతమః,
నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥"

అట్టి శరీరమున వీరి జ్ఞానము సర్వతోధికముగా ప్రకాశించుచుండగా తూపంకమళ -

జ్ఞానము పరిమళింపగా, జ్ఞానమునకు పరిమళమనగా అది అనుష్ఠాన మునకుపకరించుట. జ్ఞానము జ్ఞానము కొరకే కాదు. అది అనుష్ఠానమునకు ఉపయోగపడవలయును. పరిమళముచే పువ్వును తెలిసికొనునటుల అనుష్ఠానముచే జ్ఞానము నెరుగవచ్చును. కావుననే శాస్త్రమున అనుష్ఠాన్ద్వే జ్ఞానవత్తామను మాయ శిష్యే నోపసత్తిః కర్తవ్యా" - అని చెప్పబడినది. అనుష్ఠానము కాలు పరమపద ప్రాప్తికి ప్రధాన సాధనములు. జ్ఞానము కన్నువంటిది. అట్టి యాళ్వాచార్యుల వలననే తానును జ్ఞానానుష్ఠాన సంపన్నుడైన పరమ పురుషుని బడయుగలుగును.

"జ్ఞానమను ట్టానమివైనన్దాగనే యుడైయ
నాన, గురవై యడైన్దక్కాల్, మానిత్తీర్

తేనార్ కమలత్తిరుమామగళ్ కొళునన్
తానే వైకున్దం తరుమ్."

"భూప్రజలారా! మీరు జ్ఞానానుష్ఠానములు చెప్పిగా గల గురువు నాశ్రయించినచో శ్రియఃపతి మీకు స్వయముగ పరమపదమును యిచ్చు' ' నని శ్రీవరవరముములు ఉపదేశరత్నమాలలో అనతిచ్చిరి.

సుదీర్ఘ నిద్రపట్టునట్లు మంత్రించినారా?

ఆ మంత్రము ఉపాయ వైలక్షణ్యమును తెలుపు "నారాయణ" పదమే. గాఢనిద్ర ప్రవృత్తుల నరినట్టునట్లు ఈవైలక్షణ్యము ఇతర ప్రవృత్తులు వేనియందును అన్వయించనీయరు." కాలాళుమ్, నెంజుళలుమ్, నుజ్జాళీయుమ్" - పాదములు నిమగ్నములగును కన్నులు గుంటలుపట్టును. మనస్సు శిథిలమగును.

ఇంకను వీరికి తమ యోగ్యతను తెలిపి చట్టునవచ్చి యనుగ్రహించునటుల తగేకోపాధ్యావసాయ నిష్ఠకు తగినటుల తన్నామోచ్చారణమును చేయవలయును.

మామాయన్ - అత్యంత సులభుడు.

"నీవంత పరాత్పరుడనై యుండి యీ సౌలభ్య మెచ్చట నేర్చితివయ్యా! అనిన ఆతని గురుకుల వాసస్థానమును తెలుపుచున్న దీపదము. అనగా లక్ష్మీసమాశ్రయణము వలెనే లభించిన దీ సౌలభ్యము.

వైకున్దన్ -

ఈ సౌల్యము నిట్లు ధూలదానమును గావించుచున్నావే, మరల "అవజానన్తి మాం మూఢాః అందునే. మరియేముగుననుకొన యీ సౌలభ్యమును చూపుచున్నావు? అన్నచో - "అయ్యో! ఆ సౌలభ్యమును గుణముగా ప్రకాశింపజేయు పరత్వమున్నదని యీ పదముచెప్పచున్నది. పరత్వ, సౌలభ్యములున్ననే యావస్తువు ఉపాధేయ మగుచున్నది. "నారాయణ" పదమునకు తత్పురుషచే పరత్వమును, బహువ్రీహిచే సౌలభ్యమును తెలియుచున్నది కదా!

శయనింపక), వాశల్ = వాకిలి, తిఱువాతార్ = తెఱువకపోయినను (శ్రమ పడుచున్న మమ్ములను చూచి), మూత్తముం = ఒక మాటైనను, తారారో = మాటాడరాదా?, నాత్తత్తుళాయ్ = పరిమళించుచున్న తులసిమాలలచే నలంకరింపబడిన , ముడి = కిరీటము గల, నారాయణన్ = నారాయణుడు, నమ్మాళ్ = మనచేత, పోత్త = మంగళాశాసనము చేయబడిన వాడై, పఱై = పురుషార్థమును, తరుమ్ = యిచ్చునట్టి, పుణ్ణియనాల్ = ధర్మాత్ముడైన శ్రీరామచంద్రునిచేత, పణ్డొరునాళ్ = మునుపు శ్రీరామావతార కాలమందు, కూత్తత్తిన్ = యముని యొక్క (మృత్యువు యొక్క), వాయ్ = నోటిలో, వీళ్న్ద = పడిన, కుమ్భకరణనుమ్ = కుంభకర్ణుడును, తోత్తుం = నీకు ఓడిపోయి, పెరున్తుయిల్ = తనయొక్క దీర్ఘ నిద్రను, తాన్ = ఆతడు, ఉనక్కే = నీకే, తన్దానో = ఇచ్చి పోయినాడో అయినట్టి, అత్తవనన్దల్ = మహానిద్ర, ఉడైయాయ్ = కలదానా?, అరుం అపూర్వమగు కలమే = మా గోష్ఠికి ఆభరణమైనదా?, తేత్తమాయ్ = తడబడక తెలివి తెచ్చుకొని, వన్దు = వచ్చి, తిఱ = తలుపు తెరువుము. ఏల్ ఓర్ ఎంపాయ్ = మా భిప్రాయమును అనుసరింపుము.

తాత్ప - నోమునోచి స్వర్గఫలమును బొందదలచిన ఓ అమ్మా! తలుపులు తెరవకున్నను ఒకమారు మాటయైనను పలుకరాదా? తలుపు మూసినచో నోరును కూడ మూయవలయునాయేమి? ఐశ్వర్యము మించినచో బంధువులను "ఏమి" అనను గూడదా? సువాసనతో గూడిన తులసీ మాలికలను శిరమున దాల్చిన సర్వవ్యాపకుడగు నారాయణుడు మనచే కీర్తింపబడి మెచ్చి వ్రతాచరణమునకు వలసిన యుపకరణములను అనుగ్రహించునట్టి పరమధార్మికుని చేత పూర్వము యముని నోటబడిన కుంభకర్ణుడు ఓడిపోయి తన నిద్దురను నీకిచ్చి పోయెనా? ఓ గాఢ నిద్రగలదానా? మాకు శిరోభూషణమైన నీవు తెలివి తెచ్చుఉకొని తలుపు తెరువుము. ఎంత నిద్రపోతు తనమే నీది. ఇట్లయిన పుట్టింటికిని మెట్టింటికిని మంచి కీర్తి తేగలవు సుమా! చాలు చాలింక నిద్రమత్తు వీడి వ్రతాచరణమున మాతో సహకరింపుము. లెమ్ము! ఈ సమయమున నిద్రించుట పాడిగాదు. నిద్ర తామసము తలుపుతీయుటకు మజ్జుతనమేల? ఇది సరియైన పద్ధతిగాదు సుమా!

తెలుగేసేత :-

బహునోములను నోచి వడసిన స్వర్గసౌ
ఖ్యాంబుధి తేలిన నాతిమిన్న !
తెరవకున్నను తల్పు తెరవరో నోరైన
దెరచిన ముత్తైము లురలు నేమొ?
నుతియింప నారాయణుని తులసీ ధారి
అర్థమ్ము లిచ్చు పుణ్యమ్ము కొలది,
కూలుచు జమువాత కుంభకర్ణుడు తన
నిద్దుర నీకిచ్చి యేగె నొక్కొ?
గొల్ల కాంతల కెల్లను యొజ్జ బంతి
నైనదాన! తేరక యబ్బు నా సుఖమ్ము?
నిదుర వీడుము యికనైన నెమ్మితోడ
తరలి రమ్ముము: వేగను, తలుపు తీయ.

- విశేషార్థము -

నోత్తు -

"కృతకృత్యాః ప్రతీక్షన్తే మృత్యుం ప్రియమివా తిథిమ్."

చేయవలసిన వన్నియు చేసినవారు మృత్యువును ఇష్టమైన అతిథికొరకు నరీక్షించువారివలె నిరీక్షింతురను నీ ప్రమాణము చెప్పినట్లు ఈమె సిద్ధ సాదన నిష్ఠురాలుగాన నీమెకు ఉపాయమును గూర్చి యేమియు చీకూచింతాలేదు.

సిద్ధ సాదన నిష్ఠలకు కర్తవ్యాంశములు లేకుండుటకు కారణ మేమనగా - 1) ఆ భగవంతుని నిరపేక్ష రక్షకత్వము నెరింగినవారికి తామై యేసాధనానుష్ఠానమును చేయునవసరము లేదు. మన ప్రవృత్తి నేమాత్రమును ఆయన అంగీకరించడు. మామేకం శరణం వ్రజ - అనుచోట "ఏకమ్" అను పదమునకు స్థాన ప్రమాణముచే "ఏవ" అను అవధారణార్థమును జెప్పి,

"వ్రజ" ఎన్గిఱ స్వీకారత్తాల్ ఉపాయభావత్తైత విర్కిరడు. అన్ద స్వీకారమ్ అవనాలే వన్దతు. స్వష్ట్యవతారము ఖత్తాలే పణ్ణిన కృషిఫలమ్, అదుపు మవన దిన్నరుళే" అని సాయించినారు.

ఈ "వ్రజ" అను పదము భగవంతునుపాయముగా స్వీకరించుటలో గల ఉపాయభావమును నివర్తింపజేయుచున్నది. ఆ స్వీకారము కూడ ఆయన అనుగ్రహముచేత లభించినదే. అతడు సృష్ట్యాది వ్యాపారములు చేసిగావించిన కృషికి ఫలమే యీనాడు మన మాతనిను పాయమని నమ్మియుండుట అదియును ఆయన దయయే యన సెలవిచ్చినారు.

ఇట్లుండనిక నాతడు మన ప్రవృత్తి నొక్కదానినైనను సహింపడు గదా? గజేంద్రునకు మకరిబారినుండి విడుదలగుటకు వేయి దివ్య వర్షములు గడచినవి. ఆతని కంతవరకు ఈ స్వప్రవృత్తి నివృత్తి లేకపోవుటయే కారణము. (తనను తానే రక్షించుకొనగలనను అహం కారము విడువకపోవుట చేతనే). "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షము స్వామి మా శుచః" - అని భగవంతుడు దేవతలలో నెవ్వరికిని లేని స్వాతంత్ర్యమును ప్రమానముచేసి తెలపెను. "మోక్షయిష్యామి" అనుచోట "ణిచ్" చే నానుం వేణ్డానీయుమ్ వేణ్డా, అవైరాజుకుల మహోత్మ్యత్తాలే తన్నడైయే విట్టుప్పోఙ్గాణ్" (నీవు నన్ను పొందుటకు అడ్డముగా నున్న పాపముల గూర్చి నీవుగాని, నేనుగాని యేమియు చేయనవసరము లేదు. అవి రాజసంబంధము కలవాని శత్రువులవలె తమంతనే తప్పించుకొని పోవును) అనెను. ఆతని రక్షణము నిరపేక్షము. మన ప్రయత్నము నొకింతయు సహించడు. "నా శరీరమందున్న మురికిని నేనే పోగొట్టుకొననా? అనును.

2) చేతనునకు తన శేషత్వము లెస్సగా నెరిగినచో కర్తవ్యముండనేరదు. శేషభూతుల యోగక్షేమము లారయు భారముశేషిదే. చేతననుకిక చేయదగినదేదియు నుండదు. "నమః" అని కదా స్వరూపము శిక్షింపబడినది?

3) తన విరోధులగు పాపరాశులను చూచుకొన్నను, వానిని ప్రాయ శ్చిత్తాదులచే గాని, అనుభవము చేతనుగాని పోగొట్టు కొనదలచినచో నది సముద్రోదకమును చింతాకుతో తోడి యెండింపజేయు దలంచువాని ప్రయత్నము వంటిదే యగును. అది "అహంత్వా సర్వహిపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" అన్నవానికే శక్యమగును. కావున మనకిక కర్తవ్యము లేదు.

4) ఏ యుపాయముల నవలంభించినను నవి యచేతనులగుటచే, భగవంతుని యనుగ్రహము ద్వారముననే ఫలము నొసంగవలయును. కావున మన ప్రయత్నము వ్యర్థమే!

అగుచో లేపువారికిని ఇదియే గదా స్వరూపము! వారేల యీప్రయాసకుపాలగుచున్నారు? సిద్ధోపాయ నిష్ఠులకు ప్రాప్యత్వరలేనిచో వారు చేతను లెట్లగుదురు? సిద్ధోపాయ నిష్ఠులకు ఫలము లభించుటలో ఆలస్యముండవలసిన అవసరమేమి? వీరి విశ్వాస మాంద్యమా! అతని శక్తి మాంద్యమా! రెండును లేక యిక ఫలసిద్ధిలో నాలస్యమేల? అందుచే తహతహలాడుచున్నారు

సిద్ధోపాయ నిష్ఠులకును కర్మజ్ఞాన భక్తులుండవలయును. కాని వాని యందు ఉపాయ బుద్ధియేకూడదు.

శువర్కమ్ -

ఇచ్చట స్వర్గమనునది శ్రీకృష్ణునే. ఏలయనగా కఠోపనషత్తులో ప్రారంభముననే అనే కోపపత్తులలో స్వర్గ శబ్దమునకు "నిరతిశయానంద" మని నిర్ణయించిరి.

1. శ్రీకృష్ణుడు ఆనందస్వరూపుడు. "ఆనందో బ్రహ్మ"
2 అతడు ఆనందగుణకుడు. "ఆనన్ద బ్రహ్మలో విద్వాన్"
3. అతడు ఆనందప్రదుడు "ఏషహ్యే వానన్దయాతి." (ఆనన్దయతీత్యర్థః)
4. అతడు రసస్వరూపుడు. "రసోవైసః"
5. అతడు లభించుటయే ఆనందము. "రసగ్ హ్యే వాయంలబ్ధ్వామి నన్దీ భవతి".

ఈమె యింతమంది పిలిచినను పలుకకుండుట కేమి కారణము?

1. "సంశ్రవే మధురం వాక్యం" - అనునట్లు వారి మాటల భోగ్య తానుభవముచే నింకను విందమను ఆశతోను,
2. "ప్రహర్షేణావరుద్ధా సా" - అనునట్లు ఉన్మత్తకానుభవముచే నుక్కిరిబిక్కిరియై నోటమాట రాకపోవుటచేతను.
3. నేను దానకోటికి చరమావధిలో నుండవలసియుండగా వీరు నన్ను "అమ్మనాయ్" అనుచున్నారే. ఇది నన్ను నిందించుటయే గదాయని తన స్వరూపమును తలంచుకొనుట చేతను.
4. నేను శ్రీకృష్ణానుభవమును చేయుచున్నావని వీరు చెప్పుచున్నారు. నేనిప్పుడొక్కమాట మాటాడిన వారారోపించిన నేరము చెప్పకొని లక్ష్యపెట్టి నట్లుండనని తలంచుట చేతను మాత్తముంతారారో వాశల్ తిఱవాదార్

వాకిలిని మూసిన నోటిని మూయవలయునా! అనుచున్నారు.

భోగము నడ్డిన అడ్డుదువుగాక సత్తను కూడ అడంతువా. నిన్ను చూడక, నీ మాటలను వినక మేము బ్రతుకగలమా? నీ సరుకును (శ్రీకృష్ణుని) నీవే యుంచుకొనుము. (నీ కృష్ణునీయవద్దులే) నూసరుకునైనను మాకిమ్ము. మా సరుకు నీవేకదా? "ఆశారియన్ శిచ్చనారుయిర్పైణుమవన్, తేశారుం శిచ్చ నవన్ శీర్వడివై" (ఉప. రత్న) ఆచార్యుడు శిష్యుని ఆత్మను కాపాడవలయును. శిష్యుడాచార్యుని దివ్యమంగళ విగ్రహమును కాపాడవలయునని సాయించిరి గదా!

**నాత్తత్తుళాయ్ ముడి -**

పరిమళించుచున్న తులసిమాలికను కిరీటమందుగలవాడు.

నీ శరీరమును శ్రీకృష్ణున కర్పణచేసినను, మాకు మాటనైనను ఈయ రాదా! కన్నులను, చెవులను ఒకేమారు ఉపవసింప జేయవలయునా!

ఈ లేపబడు గోపిక - "మధురా మధురాలాపా" - అనగా, నేత్రములకు ఆనందకమైన ఆకారముగలదియు, చెవుల కింపైన మాటలు గలదియు.

(శ్రీకృష్ణ డిచ్చటమన్నాడా! అనగా, శ్రీరంగచందనమును నీవు దాచగలవా? ఆతడు ఉండవలసిన అవసరములేదు. అతడొక్కమారు కౌగిలించి విడిచిన ఆపరిమలము ఐదారు స్నానములవరకును నిలచును గదా!

"ఆతడు నాయింటనెట్లు ప్రవేశించెనందురు?"

**నారాయణన్ -**

ఆతడు లేనిచోటున్నదా! ఆతడంతటను వ్యాపించియున్నాడు గదా? ప్రహ్లాదుని, ఆతని తండ్రి - "నీ విష్ణువెచ్చటున్నాడురా?" అని యడుగుణ - "కింబహుగిరాత్వయస్తిమయ్యస్తిచ" అని బదులు చెప్పినాడు. ఇట్లు శత్రువులను కూడ విడువనివాడు. ఆయన ప్రీతికి పాత్రురాలవగు నిన్ను విడచునా?

**నమ్మాల్ పోత్తప్పఱైతరుమ్ -**

మన మాతని కీర్తించినచో మనకాతడు వ్రతోపకరణముల నిచ్చును.

పుణ్ణియనాల్ పణ్డొరునాళ్ -

"మిత్రభావేన సమ్ప్రాప్తం నత్యజేయం" ఆతనిచే రక్షింపబడుటకు ఆతనిపై ద్వేషములేకున్న చాలును. అట్టివారికి సుకృతము తానే. రుచిజనకుడు తానె ఉపాయమును తానే. ప్రాప్యము తానేయయి యుండువాడు "సుహృదం సర్వభూతానం" - అనలేదా? ఎంత ఔదార్యము? "యది వారావణ స్స్వయమ్" అంతగా అసహ్యపు చారియైన రావణుడు వచ్చినను రక్షింపసిద్ధపడినాడే! మన భాగ్యముచే వానికా బుద్ధిపుట్టలేదు.

**కూత్తత్తిన్ వాయ్ వీళన్ద -**

రావణుడు చెరలో పెట్టిన మృత్యువు వాతనే పడిన కుంభకర్ణుడు

కారుణికు డొకడు అందరును మంచి నీటిని త్రాగుటకై త్రవ్వించిన బావిలో మునిగి చనిపోయినవానివలె శత్రువులకు ప్రియుడైన శ్రీరామ చంద్రుని పట్ల అపరాదము గావించి నశించిన

కుమ్బకరణనుమ్ - కుంభకర్ణుడు.

**తోత్తుమునక్కే పెరున్తుయిల్ తాన్ తన్దానో -**

శ్రీరామచంద్రుడు పరశురాముని జయించి ఆతనిచేనున్న వింటిని లాగుకొన్నట్లు నీవు నిద్రలోకుంభకర్ణుని జయించి ఆ నిద్రను లాగుకొంటివా? వానిది నిద్రమాత్రమే నీది పెద్ద నిద్దుర.

**ఆత్తవ నన్దలు డైయామ్ -**

నేను లేచుటకొక యరక్షణ మాలస్యమైనదని నన్ను వీరు కుంభకర్ణునితో పోల్చుచున్నారేయని తాను మేలుకొనియే యున్నట్లు వారెరుంగుటకై ఒళ్ళు విరచుకొనుచు "కృష్ణకృష్ణ" యనెను.

తేత్తమాయ్ వన్దుతిఱ -

రెండవ అంతస్థులో పడుకొని యున్నదగుటచే తొట్రుపడక తెలివి తెచ్చుకొని వచ్చి తలుపు తెరువుమనుచున్నారు. ఇక్కడ ఊరంతయు గుమికూడియున్నది. ప్రక్కపైనున్న రీతిగనే సర్దుకొనక రావలదు. తగినట్లు సర్దుకొని వచ్చి తలుపు తెరువుము.

"సా ప్రస్ఖలన్తీ మదవిహ్వలాక్షి ప్రలమ్బకాఞ్చ గుణహేమ సూత్రా.
సలక్షణా లక్ష్మణ సన్నిధానం జగామతారా నమితాఙ్గ యష్టిః ॥"

మాల్యవంతమున నాలుగు మాసములు క్షనమొక యుగముగ మెరుపులకును, పిడుగులకును గురియై కాలమును గడిపిన శ్రీరామ చంద్రమూర్తి అప్పటికింకను సుగ్రీవుడు సీతాశ్వేషణ ప్రయత్నమొనరించ కుండుటకు కినిసి లక్ష్మణుని పంపగా నాతడతి కోపముతో సుగ్రీవ గుహద్వారమున ధనుష్టంకారమును గావించెను. సుగ్రీవుడా ధ్వనిని విని భయపడి, రెండు తొడలపై కూర్చొని యున్న యిద్దరు భార్యలతో నెగిరిపడి, మాలలను త్రెంపివైచి శ్రీఆంజనేయుల సలహా ప్రకారము మంటను నీటిధారతో నార్పునటుల లక్ష్మణక్రోధాగ్నిని తారతోనార్పబంపెను. ఆమె పడకలో సమ్మర్దమున చెదిరిన చెంగును గాని, దంతక్షత నఖక్షతములనుగాని కప్పికొనక, జారుచున్న బంగరు ఒడ్డాణమునటులనే జారనిచ్చి స్తనభారముచే నొకింత ముందుకు ఒంగిన శరీరముతో లక్ష్మణుని యెదుట పడెనట! తార బహుసౌందర్యవతి. ఆ సౌందర్యమును చూచిన వారు తల్లిదండ్రులామెకు తారయనుపేరిడినారో లేక ఆ సౌందర్యమును చూచిన వారు నక్షత్రములనే తారలని పిలచిరో తెలియదు. ఆ కారమునకు తగిన ప్రజ్ఞ కలది. రామత్త్వదర్శిని. తారవలె చేయక చక్కగా సర్దుకొని రమ్మనుచున్నారు. తారయట్లు వచ్చుటలో కొన్ని కారణములున్నవి. అవియేవనగా -

1. కామముచే సంశ్లేషియున్న క్రౌంచమిధునములో నొకపక్షిని చంపి కిరాతుడు శాపగ్రస్తుడయినాడు. ఇక నేబుద్ధిమంతుడును కామగ్రస్తులను చంపడు. ఈ చిహ్నములతో తార తాను కామగ్రస్తురాలనని లక్ష్మణునకు చూపించెను.

2. "ప్రణిపాతప్రసన్నా హిమ్మైథిలీ జనకాత్మజా" - యన్నటుల శరణాగతిచే లక్ష్మణుని చల్లబరచ గోరి తారయును శరణాగతిని గావించెను. శరణాగతికి ఏనియములతోను పనిలేదు. ఉన్నవాడున్నట్లే శరణాగతి చేయవలయును. అందుచే తారయును సర్దుకొనక యున్నది యున్నట్లే వచ్చివేసినది. నీవట్లు రావలసిన అవసరములేదు. మాది నిజమగు కోపము కాదు. ప్రణయ కోపమే. అనుచున్నారు. గోపాంగనలు.

వేదాంతార్థము.

ఈ పాశురమునకు వేదాంతార్థములన్నియు విశేషార్థములోనే వ్రాయబడుటచే నిచ్చట సంగ్రహముగా వ్రాయబడుచున్నవి.

ఈ పాశురమున సాధ్యసాధన (కర్మజ్ఞానభక్తి) నిష్ఠులనుగాక సిద్ధసాధన (ప్రపత్తి) నిష్ఠులను లేపుచున్నారు.

వారినొకరు లేపనవసరములేక నిత్య జాగరూకులయియే యుందురు. ఇక వారిని లేపుట యనగా వారి యుపదేశముల బడయుటకై వారిని అభిముఖులనుగా జేసికొనుటయే. అట్టి వారిని "నోత్తుచ్చువర్కం.............. అమ్మనాయ్" - అని సంబోధించుచున్నారు. అనగా వారు "నోత్తు" సిద్ధసాదన నిష్ఠకలవారు. పరమాత్మయే యుపాయమను నమ్మకము కలవారు. అట్టివారు ఫలసిద్ధికై సాదనాంతరములను చేయవలసిన యవసరము లేదు" రసగ్గ్ంహ్యే వాయం లబ్ధ్వానన్దీ భవతి" - అని రస స్వరూపుడగు శ్రియఃపతిని పరగత స్వీకార ప్రక్రియగా బడసి ఆనందింతురు. వీరు చేయవలసిన కృషినంతను ఆనారాయణుడే చేయును.

శువర్కమ్ -

మోక్షానందమును అని యర్థము. వరాహ చరమశ్లోకమున.

"అహంస్మరామి మద్భక్తం. నమామి పరమాంగతిమ్" అని కలదు. నా భక్తుడు తనకు యోగ్యమగు సమయమున గావించిన నాస్మృత్యాదులే చాలును. అతడు కాష్ఠపాషాణ స్థితిలో నన్ను స్మరించలేదను భారమాతని తలపై పెట్టుక నేనే వానిని స్మరించి అర్చిరాది మార్గమున నేనే యాతని కాతివాహిక కృత్యమును నిర్వహించి చేరవలసిన చోటునకు చేర్తుననెను.

నృసింహ చరమ శ్లోకమునకు
"యో మాం ముకున్ద! నరసింహ! జనార్థనేతి
జీవన్ స్మరన్నను దినం మరణే ఋణీవ
పాషాణ కాష్ఠ సదృశాయ దదామి ముక్తమ్." అనెను.

**గీతాచరమ శ్లోకము నందును -**

"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి" - అనెను. నేను నిన్ను నన్ను పొందకుండ నాటంకపరచు చున్నట్టి సకల పాపరాశినుండి యును

ధ్ధరింతునని అభయమొసగినాడు. ప్రతిబంధకములు పోయిన ఫలము తనంతనె సిద్ధించును.

వాశల్ ప్పిఅవాదార్ -

భగవదనుభవ విరోధులగు అహంకారమమకారములును, తలుపులును తెరవనివారు అని యర్థము.

"హిరణ్మయేవ పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్,
తత్త్వం పూషన్నపావృణు సత్య ధర్మాయ దృష్టయే ॥"

పరమాత్మను సక్షాత్కరింపజేయు జీవుని అంతరింద్రియమగు మనస్సు విషయ ప్రావణ్యముచే కలుగు అహంకార మమకారములచే నావరింపబడియున్నది.

"ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానిచో నిత్యవైరిణా,
కారు రూపేణ కౌన్తేయ! దుష్పూ రేణానలేనచ ॥"

అని భగవానుడానతిచ్చి యున్నాడు. అందువలన చేతన ధర్మమైన పరమ పురుషసాక్షాత్కారమును, తత్త్వయుక్తమైన పరమ పురుషార్థమగు కైంకర్యమును కుంటుపడినవి. దానిని పొందుటకై యామాతను (అహంకార మమకారములను) తొలగింపుమని భగవంతుని ప్రార్థించు మంత్రమిది. భగవంతుడు ఆచార్యుల పురుషకారము ద్వారా వీనిని తొలగించును.

ఇప్పడీ గోపాంగనలు ఆచార్యుల ఉపదేశము నర్థించుచున్నారు. ఆయుపదేశ బలముచేనవి తమంతనే తొలగునని వీరి యభిప్రాయము. "ఈ దేవర వారి యుపదేశముతో వానిని తొలగించిన మేము నారాయణుని హార్దికముగ స్తుతించును. దానికి సంతుష్టుడై యాతడు మాకు ప్రాప్యమును ప్రసాదించును." ఈ యహంకార మమకారములకు మూలకారణము రజస్తమోగుణములు ప్రాబల్యమే. కుంభకర్ణుని చంపినటుల ఈ భక్తుని విరోధులను నారాయణుడే తొలగించును.

కుంభకర్ణుడు నిద్రనొసంగుట యనగా -

దేవతాంతర, ఉపాయాంతర, ఫలాంతర ప్రవృత్తి హేతువైన జాగృతిని హరించి వానివిషయమై స్తబ్ధత నొసంగుట. "ప్రాజ్ఞేనాత్మ నాసంపరిష్వక్తో నబాహ్యం కిఞ్చన వేద, నాన్తరమ్, తస్మిన్నపీతో భవతి, తస్మాత్స్వపితీ త్యాచక్షతే." -

అని నటుల పరమాత్మయందు పరిపూర్ణ విశ్రాంతిని బడసి బాహ్యా ప్రపంచ విషయానుభవమును మరచి యుండును.

"సత్త్వా సక్తయతిః కృష్ణే దశ్యమానో మహోరగైః,
న వివేదాత్మనో గాత్రం తత్స్మృత్యా హ్లాద సంస్థితః॥"

శ్రీ ప్రహ్లాదుడు భగవద్ధ్యాన నిమగ్నమనస్కుడై ఘోర సర్పములు తననెంత తీవ్రముగా కరుచుచున్నను తన దేహమునే మరచెనట!

## పదునొకండవ పాశురము

"కత్తుక్కఱవై"

### -: అవతారిక :-

శ్రీకృష్ణుడు ఊరునకంతకును ఏకైక బాలుడై అందరిచేతను కొనియాడబడుచు పెరుగుచున్నట్లు, ఊరికంతకును ఒక బాలికయై, వివాహయోగ్యమైన వయస్సులోనుండి" భగవంతుని బడయుటకు నేనా నోము నోచవలసినది? కావలసినచో ఆయననే నోచుకొని నాయొద్దకు వచ్చునని పరుండియున్న యొక గోపవనితను లేపుచున్నారు. ఆమె శ్రీకృష్ణునితో సమానురాలు నుండునొక యంగనామణి.

## పదునొకండవ పాశురము

కత్తు క్కఱవై క్కణఙ్గళ్ పలకఱన్దు,
శెత్తార్ తిఱలియచ్చెన్ఱు శెరుచ్చెయ్యుమ్,
కుత్త మొన్ఱిలాతకోవలర్ తమ్ పొఱ్కొడియే!
పుత్తరవల్ కుల్పునమయిలే! పోదరాయ్,
శుత్తత్తు త్తోళిమారెల్లారుమ్ వన్దు, నిన్,
ముత్తమ్ పుగున్దు ముకిల్ వణ్ణన్ పేర్పాడ,
చ్చిత్తాదే పేశాదే శెల్వ ప్పెణ్డాట్టి, నీ
ఎత్తుక్కుఱఙ్గుమ్ పొరుళేతో రెమ్బావాయ్,

టీకా:- కత్తు = లేత వయస్సు గల, కఱవై = పశువుల యొక్క, కణఙ్గళ్ = సమూహములను, కలున్దు = పాలుపిండువారును, శెత్తార్ = శత్రువుల

యొక్క, తిఱల్ = బలము, అఱియ = నశించునట్లు, శెన్ఱు = తాము దండెత్తి పోయి, శెరు = యుద్ధమును, శెయ్యుమ్ = చేయువారును, కుత్తమ్ = కుటిలము (దోషము), ఒన్ఱు = ఒక్కటియు, ఇల్లాతద్ర = లేని, కో + వలర్తమ్ = గోపాలకుల యొక్క (పెంచు వారియొక్క, పోర్ + కొడియే = బంగారు తీగా! (స్వర్ణలత వంటి దానా!) పుత్తు = పుట్టలోని, అరవు = పాముపడగ వంటి, అల్గుల్ = నితంబ ప్రదేశము (గొప్ప పిఱుదులు) గలదానా!, పోదరాయ్ లేచిరమ్మా! శుత్తత్తు = బంధు జనులైన, తోళ్మార్ = నీతోడి కన్నియలు, ఎల్లాఱుమ్ = అందరును, వన్దు = వచ్చి, నిన్ = నీయొక్క, ముత్తమ్ = వాకిటిలో, పుగున్దు (పుహున్దు) = ప్రవేశించి, ముగిల్ = మేఘము వంటి, వణ్ణన్ = నీలవర్ణము గల సర్వేశ్వరుని యొక్క, పేర్ = తిరునామములను (ముగిల్ + వణ్ణ + పేర్), పాడ = గానముచేయగా (కీర్తింపగా), నీ = నీవు, శిత్తాదే = కదలకయును, పేశాదే = మాట్లాడకయును, శెల్వమ్ = శ్రీకృష్ణానుభవ మనెడి సంపత్తుగల, పెండాట్టి = ఓ చిన్నదానా!, నీ = నీవు, ఎత్తుక్కుపొరుల్ = ఏప్రయోజనము నుద్ధేశించి, ఉఱజ్గుమ్ = నిద్రపోవు చున్నావు?

తాత్పర్య:- ఓకన్యా రత్నమా! ఎన్ని మారులు పిలచినను, నీవు లేవకుండటకు గారణమేమి? మన గొల్లలు స్వధర్మపరులు. పాలను పిండుట, తమ గోవులకు, తమకు శత్రువులైన వారి పీచమడంచుట యును తమ నిత్య కృత్యములయందు తామసింపని వారు అట్టియ కలంక వంశమున బుట్టిన బంగారు బరిణా! పుట్టలోనున్న సర్పము యొక్క పడగవంటి పిఱుదులు గలదాన! వనమయూరము వంటి దానా! నీవు సంకల్పించిన వ్రతాచరణమున తామసింప వచ్చునా? లేచిరమ్ము. బంధుజను లందరును నీనారకిట ప్రవేశించి నీరదవర్ణుని నోరార కీర్తించుచున్నను, అదేమియు పట్టనట్లు ఉలుకక, పలుకక ఉన్నావు. నీ అభిప్రాయమేమి? ఓ సువర్ణ వర్ణాంగీ! నీ వంశమును నీలోకోత్తర సౌందర్యమును జూచి, ఆ నల్లనయ్య తనంతవలచి వరించుననియా? నీ సౌభాగ్య సౌందర్య గర్వము వీడి మాతోడరమ్ము కలసి భజింతము. ఇంకను ఆలసింతువేల? లెమ్ము! లేచి మాతో సహకరింపుము. నీదే ఆలస్యము సుమా! ఇట్టి వ్రతములందు జాగునకు తావీయరాదు తెలియునా? ఎంత బేలవు నీవు?

**తెలుగుసేత:-**

కడవల కొలది లేగటిమూల కదుపుల
    విసువక పాలను పిండి, పిండి,
సమరాన తెగనీల్గు శత్రు బలమ్మును
    చేతుల తీటవో చెండి, చెండి,
కుటిల మింతయులేని గొల్లకులమునరం
    గారుమేలైన బంగారుతీ వ,
భుజగమ్ము భోగమ్ము బోలు మల్గుల దాన
    వనమయూరము వంటి వన్నెలాడి!

తోడి వారెల్లరును గుమి కూడియింటి
మ్రోల నిల్చుండియున్నారు మొగిలు వన్నె
కాని బొగడుచు బలుకవు కదలనిట్లు
'పండియుందువ దేల సంపన్నురాల?

**- విశేషార్థము -**

**కత్తుక్కఅవై -**

ముక్తుడు పరమపదమున పరవాసుదేవుని పరత్వాను సంధానముతో క్రింది వయస్సునకు పెరుగుచున్నట్లు ఈ తొలిచూలి పడ్డ (ఆవు)లును మనుష్యుడుగా నవతరించియు పదేపదే పరత్వమును ప్రకటించుచున్న శ్రీకృష్ణుని యొక్క స్పర్శచే క్రిందివయస్సునకు పెరుగుచున్నవి. ఇక్కడ నొక విశేషము కలదు.

గోధూళి ధూసరిత కోమల గోపవేషం
గోపాల బాలకశతై రనుగమ్యమానమ్ ।
సాయంతనే ప్రతిగృహం పశుబన్ధనార్థం
గచ్ఛన్త మచ్యుత శిశుం ప్రణతో స్మినిత్యమ్॥ (కృ. కర్ణా)

అడవిలోనికి మేతకై వెళ్ళిన పశువులు శ్రీకృష్ణుని పిల్లనగ్రోవి శబ్దమును విని - "మమతన్ మోములు మీదికెత్తుకొని రోమంధంబు చాలించి హృత్క లాగ్రంబున కృష్ణునిల్పి మురళీనాదామృత శ్రేణి కర్ణములంగ్రోలుచు మేతమాని గళితానందాశ్రులై చిత్రితోపములై గోవులు

చూచుచున్నవవిగో కంజాక్షి వీక్షించితే!" అనునటుల కావలసిన మేతను మేయక డొక్కలు దించుకొనిపోయి యిండ్లను జేరుట చూచి శ్రీకృష్ణుడు జాలితో తన పశువులను అన్నగారి కొప్పగించి తాను ప్రతియింటికిని వెళ్లివాని నన్నిటిని కట్టిచేతితో అపుచ్ఛమస్తకమునిమిరి తనయింటికి పోవునాచారము కలదు అట్టి యాతని కరస్పర్శచే నాగోవులు శ్రీరాముని కరస్పర్శచే శత్రుంజయము వలె పునరుక్త పోషములై చతుర్గుణితముగా పాలిచ్చెడివి. ఆ సమృద్ధి యాతని వలననే వచ్చెనని వారికి తెలియదు. చెప్పినను నమ్మరు. అందుచే శ్రీకృష్ణుడే ఆ యధికాంశమగు పాడిని దొంగిలించి యధేష్టముగా వినియోగించు కొనుచుండెను. ఆ సంగతి తెలియక గోపాంగనలు తమ ముల్లెనే యెత్తుకొని పోవుచున్నట్లు తలచి -

"ఓయమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలుపెరుగు మననీడమ్మా!
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన: మంజులవాణీ!"

అనియు, "రాచ బిడ్డడైన రవ్వమేలె" అనియు గోలపెట్టసాగిరి. నిజమున కాతని భాగమునే యతడు హరించుచుండెను. అయినను హరించుట దోషము కాదా? యన్నచో

"ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమంపితురార్జితమ్,
అధమం భ్రాతృవిత్తంచ, స్త్రీవిత్తమధమాధమమ్॥"

అనునట్లు ఉత్తమ మార్గమున సంపాదించుకొనునే గాని అధమాధమ మార్గము నవలంభించునా? "బలియొద్ద భిక్ష చేయలేదా?" యన్నచో

"మమఖిలు బలిగేహే యాచనం జాతమాస్తాం
ఇహపున రబలానా మగ్రతో నైనకుర్వే ।
ఇతి విహిత మతిః కిం? వల్లవీనాం గృహేషు
దధిఘృత మహరస్త్వం చారుణా చోరణేన॥"

బలిచక్రవర్తిగాన "యాఙ్ఞ్మోఘావర మధిగుణే. నాధమే లబ్ధకామా అనునట్లు పెద్దవాడు లేదు పొమ్మన్నను మంచిదే, కాని నీచుని యాచించి రాదు. కనుక అచ్చట బిచ్చమెత్తినను, ఇచ్చట గోకులమున

ఆడవాళ్ళనాయూచింతును? అని నిశ్చయించుకొని చక్కని మెలకువతో గొల్లల యిండ్లలో పెరుగును, నేతిని అపహరించితివా? నిత్య ముక్తు లెప్పుడును ముప్పది యేండ్లవయస్సులో నున్నట్లే యా యావులును సదా తాలు చూలి పడ్డలవలెనే యుండును.

రాజపుత్రుడు లేబ్రాయపు యువతులు లభించిన యౌవనము మీరిన స్త్రీలవైపు చూడనటుల శ్రీకృష్ణుడు దూడల మేపుట లభించినచో పశువులను చూడనే చూడడు. ఆళ్వారులు - "తివత్తిలుమ్ పశునిరై మేమ్ప్ప వత్తి" - అని సాయించి, ఆపైన - "కన్నుమెయ్‌త్తు ఇనిదువక్కుమ్" - పరమపదము నందుండుట కన్న నాతనికి పశువులను మేపుటలో ఆనందము మెండు అని సాయించి వెంటనే దూడలను మేపుట అంతకుమించి యాతని కానందదాయకమని సాయించిరి. దూడలను మేపుమన్నచో ఆయనకు పశువులు నిత్యసూరి గోష్ఠిలోనివగు నంతియే. అందొక సంప్రదాయ రహస్యమున్నది. పశువులు మనుష్యుల కన్నను పరతంత్రమైనవి. మనుష్యులు వానిని నడిపించవలయును. నిత్య సూరులును, ముక్తులు తనలో సామ్యమును బడసినవారగుటచే వారికొరకు తాను చేయవలసిన దేమియు నుండదు. అందుచే తన విజ్ఞానము శక్తి, యితర గుణముల, ప్రకాశములేక పడియుండును. అందుచే పశువులను రక్షించుటలో ఆయన తత్పరుడు. ఇక దూడలన్నచో సామాన్య ప్రాణికి కావలసిన అన్నపానీయములకే యువిపరవశములై యుండును. అందుచే వానియందు శ్రీకృష్ణునకు ప్రేమ యధికము. వాని నన్నిటిని పచ్చిక బయళ్ళకు తోలుకొనిపోయి నిలబెట్టును. అవి ఏమి చేయవలయునో తెలియక నిలచియుండును. అంత తాను మోకరించి గడ్డిపరకలను కొరుకును. దానిని చూచి అవియును గడ్డిని కొరికితిని ఆకలిని తీర్చుకొనును. ఆపై యమునా నదికి నీరు త్రాగుటకై తీసికొనిపోవును. అవి యొడ్డన నట్లేనిలచుకొని యుండును. శ్రీకృష్ణుడు స్వయముగా మోకాలు లోతునకు దిగును. వాని నచ్చటికి పిలుచును. అవియును దిగి నిలచియుండును. తాను తన రెండు చేతులను వెనుకకు మడచుకొని అవి యెంత పరవశమైన ప్రాణులో! అట్టి పారతంత్ర్య పరాకాష్ఠ తోనున్న ప్రాణులను రక్షించుట అతనికి మిక్కిలి ప్రియము.

కణఙ్గళ్ పల -

అనేకులు కలసి చేయవలసిన పనులను వానిలో నేర్పుగల వాడొక్కడే చేయునట్లును, ఒక బ్రాహ్మణుడు వేదమునంతను సొంతముగా నధ్యయనము చేయునట్లును, క్షత్రియుడొక్కడు వయస్సు నిండుటకు ముందుగనే శ్రీరాముడు, అభిమన్యుడు మొదలగు వారివలె యుద్ధమున పరిచితుడగు నట్లును, ఈశ్వరుడొక్కడే సకలాత్మ వర్గము యొక్కయు కర్మానుగుణముగ నామరూపములను కలుగజేసి వారి నియమాదులను చేయునట్లును. ఈ గోపాంగక కులస్థుడును ఒక్కడే పశువుల నన్నిటిని పితుకగల సమర్థుడై యుండును.

**శెత్తార్ తిఱలళియ -**

శత్రువుల బలము నశించునటుల

"రుద్రుడు భస్మమును పూసుకొని తిరుగును. బ్రహ్మ బ్రాహ్మణుని వలె వేదము నధ్యయనము చేయుచు కుర్చొనును. దేవేంద్రుడు అప్సరసలతో విహరించుచుండును. వీరామనల నెదుర్కొను శక్తిగలవా"రని గర్వించుచున్న కంసుని బలమంతయు నశించునటుల.

**శెన్ఱు శెరుచ్చెయ్యుమ్ -**

శత్రువు లెత్తి వచ్చిన వారితో యుద్ధము చేయుటకాక వారున్న స్థలమున కేగి యుద్ధముచేయుట. అట్టి పరాక్రమము గలవారీ గోపాంగన వంశీయులు.

పుత్తరవల్గుల్ -

పుట్టలోనున్న పాముపలె మెత్తనైన విశాలములైన పిరుదులు గలదానా?

పునమయిలే -

అడవిలో స్వేచ్ఛగా తిరుగుచున్న నెమలి యొక్క రంగువంటి రంగుకలదానా! నెమలిపింఛము వ్యామోహమును కలిగించునటుల శ్రీకృష్ణునకును, మాకును వ్యామోహమును కలిగించుకొప్పు గలదానా!

కైవల్యమనగా - భగవదు పాసనచేసి అర్చిరాది మార్గమున పరమపదమున కేగియు భగవదనుభవము లేకుండగా నేకాంతముగా

నొకమూల స్వాత్మానుభవమును మాత్రమే చేయుచు. దానితోనే తృప్తిచెంది - "రమణత్యక్త పత్నివల్ క్వచిత్కోణే వతిష్ఠతి" అనునట్లు భర్తచే విడువబడిన భార్యవలె నుండుట.

**ఎత్తుక్కుముఱ్ఱుం పొరుళ్ -**

**నీ ప్రాప్యమును పరిశీలించక, మా విశ్లేషవ్యసనమును విచారించక శ్రీకృష్ణుని నిరతిశభోగ్యతను విస్మరించి యెందులకమ్మా పడియున్నావు? దీని వలన నీకొరగునదేమి? లెమ్ము. మాతో సహకరింపుము.**

**- వేదాంతార్థము -**

ఈ పాశురములో ముముక్షువులకు ముఖ్యప్రాప్యుడును, ప్రాపకుడును సర్వేశ్వరుడేయని నమ్మియున్న ప్రపన్నాగ్రేసరుని లేపుచున్నారు. నిద్రించువారిని గదా లేపుట! నిద్ర యనగానేమి? తామసనిద్ర కాదు. సకలేంద్రియ వ్యాపారనివృత్తిని నిద్రయందురు. విషయాంతరములనుండి నియమింపజేయుట." నైవ దంశాన్న మశకాన్ ..................రాఘవో పనయేత్ తద్గతే నాంతరాత్మనా" - అని రాముడు సీతామాతతో చెప్పినటుల తన రక్షణ చింతను విడచి భగవదనుభమున మగ్నులైయుండుట ఇట్టివారే శ్రియఃపతికి "జ్ఞానీత్వాత్మైవ మేవత" మ్మని ఆత్మవలె ధారకులు. వీరినే భగవానుడు - "ప్రియోహిజ్ఞానినో త్యర్థమహం, సచమమప్రియః" - సర్వజ్ఞుడను, సర్వశక్తి కలవాడనునైన నేనే చెప్పజాల నంత ప్రియతము డాతడని సెలవిచ్చినాడు. "భక్తాస్తే తీవమేప్రియాః" ఆ ప్రేమకు అవధిని చెప్పజాలక "అతీవ" అని వైచెను. ఇట్టివారే ఆచార్య పదవికి అర్హతగలవారు. వారిని లేపుట యనగా, వారికి సేవలుచేసి, వారి సదుపదేశములను విని, సదనుష్ఠానమును బడసి భగవంతుని కృపకు పాత్రులగుటకై వారి నభిముఖులనుగా చేసికొనుట.

ఇచ్చట నొక ముఖ్యవిషయమును మనము గమనింప వలసి యున్నది. ఒకే వ్యక్తి తానే ఉపాయము, ఉపేయము రెండును అగుట లోకానుభవ విరుద్ధము కాదా? యని యొక సందేహము కలుగకపోదు. దానికొక చక్కని యుదాహరణము కలదు. వినుడు.

తల్లియొక యున్న తాసనము పైగూర్చుండి యుండును. ప్రాకులాడు వయస్సుగల చంటి బిడ్డ తల్లియొడిలో కూర్చుండవలయునని ప్రాకుచు

నా యాసనము దరికివచ్చి పైకెక్కుటకు సాధ్యముకాక యేడ్చును. ఆయేడ్పునాలించిన తల్లిదిగి వచ్చి యా బిడ్డ నెత్తుకొని కూర్చొన బెట్టుకొనినది. ఇచ్చటకావలసిన దీతల్లియే దగ్గరకు దీసికొనినదియు దల్లియే గదా? కనుక, ఉపాయమును, ఉపేయమును ఒకటియే అయినది కదా? ఇట్టి యుదాహరణముల నెన్నింటినో చూపవచ్చును. భగవంతునకీ యుపాయత్వో పేయత్వములు రెండును స్వాభావిక ధర్మములు. ఇట్టి అధ్యవసాయము కలవారే ఆచార్య పీఠమున కధికారులు.

ఇట్టి యాచార్యుల దివ్య మంగళ విగ్రహదర్శనమే మనకొక మోక్షసాధనము. "ద్రష్టవ్య స్సర్వదేహిభిః" కదా! అదియే మనకు నిరంతరము సేవింపదగినది. ఉడయవరుల కత్యంత ప్రియశిష్యులొకరు మూగవాడు, దానితోపాటు చెముడును సహజమేగదా? ఉదయవరులకు మేల్కొనినది మొదలు మరల పరుండబోవు వరకు కావలసిన సేవలన్నియు నితరుల కవకాశమీయక వారే చేయుచుందురు. వీరై ఉడయవరులకు ప్రీతిమెండు. ఈ స్వామి యనేకులు ఉడయవరుల యొద్ద అనేక రహస్యముల దెలిసి కొనుచుండుట నిత్యము గమనించుచున్నారు. ఒక దినమున వీరికి - "అయ్యో! నాకు వినబడదే! నేనెట్లు తరింతును?" అను విచారము కలిగినది. ఉడయవరులు వారి పరితాప విధానము నెరిగి వారిచేతిని పట్టుకొని యొక గదిలోనికి తీసికొనిపోయి తమ యుత్తరీయ శాటీని తొలగించి తమ దివ్యమంగళ విగ్రహము నాపాదమస్తకము దర్శింపజేసి సంజ్ఞతోనే - "దీనినే యెల్లప్పుడును అనుసంధించుకొను" డని యాదేశించెను. తలుపు యొక్క రంధ్రములో నుండి దీనిని పరికించిన కూరేశులు "అయ్యో! ఇంత సుకరమైన మోక్షోపాయముండగా మనకీ పాడు శాస్త్రాధ్యయనమును చేయుట వలన గదా ఆచార్యులు దీని నుపదేశించక

"విశ్వాసా యాసభూమ్నాన్యసన భజనమోః గౌరవే కోవిశేషః?"

అనునట్లు అవిచలిత, గురుతను విశ్వాసగర్భితమైన ప్రపత్తిని, కర్మజ్ఞానాంగకమై, యవిచ్ఛిన్న స్మృతి సంతానాత్మకమై, అప్రయాణా ధనుష్ఠేయమైయున్న యీ భక్తిని, పరత్వముల వలె మననెత్తిని పెట్టిరని పశ్చాత్తాప పడిరట!

ఇట్టి వారి విశ్లేషను సచ్ఛిష్యులొక క్షణకాలమైనను సహింపలేరు. శ్రీ తిరుమలనంబి గారి సన్నిధిలో శ్రీ భాష్యకారులు శ్రీరామాయణ

రహస్యార్థములను సేవించి విరమించగా ఆచార్యులే వారిని "మీకేమి కావలయు" నని ప్రశ్నించిరి. అందులకు శ్రీరామానుజాచార్యులు వారి సన్నిధిలో నిరతిశయ ప్రేమతో కైంకర్యమును గావించుచున్న అనంతాచార్యులను నొక శిష్యుని తమకు ప్రసాదింపుడని ప్రార్థించిరి. ఆచార్యులటులనే అచేతన పదార్థమును ప్రసాదించినట్లు వారిని ఉడయవరులకు దత్తమొనరించిరి. ఆ స్వామి ఉడయవరులతో నేతెంచియు రెండవ దివసమున ఆచార్య విశ్లేషమూలమున చిక్కి పాలిపోవసాగిరి. ఆ విషయము నెరింగిన శ్రీ భాష్యకారులు భయపడి వారిని తిరిగి ఆచార్య సన్నిధికి పంపివేసిరి. అనంతాచార్యు లానందముతో ఆచార్య సన్నిధికి వెళ్లిరిగాని యాయాచార్యులు వారిని స్వీకరించలేదట!

ఇట్టి యారాటముతో నీ కైంకర్య నిష్ఠులకు ప్రపన్న శిఖామణులు ఈ యాచార్య విశ్లేషమును సహింపజాలక వారి దర్శన, స్పర్శన, శ్రీసూక్తి శ్రవణాదుల నపేక్షించి వారిని తమ కభిముఖులు కావలయునని ప్రార్థించుచున్నారు.

**కత్తుక్కఱివై క్కణజ్గళ్‌పల -**

అనుటచే అనేక బాల శిష్యబృందము కలవారీ యాచార్యులని తోచుచున్నది. ఆచార్యుల యొద్ధనధిగమించిన యాధ్యాత్మిక విద్య నెంతమందికి బోధించినను, యెంతప్రచారమును గావించిన యాచార్యులంత సంతసింతురు. ఇదియే "ఆచార్యా ప్రియంధన మాహృత్య' ' అను శ్రుత్యుపదేశ సారము. బాలశిష్యులనుటలో దీర్ఘకాలము ప్రచార పాటవములు కలవారై యుండవలయునని తోచుచున్నది. ఈ యవస్థలో చెప్పినది బాగుగా తలకెక్కి మంచి ప్రచారోత్సాహమును పుట్టించును.

**పలకఱన్దు -**

ఇచ్చట పవిత్రమైనవి గోవులు. వానిని పితుకుట అనుటలో
"సర్వోపనిషదోగావః దోగ్ధా గోపాలనన్దనః,
పార్థోవత్స స్సుధీర్భోక్తా, దుగ్ధం గీతామృతం మహత్ ॥"

బహు ఆధ్యాత్మిక శాస్త్ర గ్రంథములను చదివి పాలవంటి సాత్త్వికాపూర్వార్థ గ్రహణమును గావించి యాచార్యులు శిష్యులకు గావించు వివరణము సూచింపబడుచున్నది.

శెత్తార్ - వేదమును ప్రమాణముగా నంగీకరించనివారు.

భగవంతు నస్తిత్వము నంగీకరింపక అసత్త్వాయులైన వేద బాహ్యులును, వేదములో ననేక స్థలములలో శ్రియఃపతికి అప్రాకృత దివ్య మంగళ విగ్రహమును, అనంతకల్యాణ గుణరాశియును, అనంతానేక శుభనామములును కలవని యుండగా వాని నంగీకరింపక అశ్రుతి వాక్యముల కపార్థములు కల్పించు కుదృష్టులును మనకు శత్రువు లనుచున్నారు.

**ఎత్తుక్కు ఉఱక్కమ్ పొరుళ్ -**

"నీ ఎన్ పొరుళుక్కు ఉఱక్కమ్" - మీరు ఏమి ప్రయోజనమునకై నిద్రించుచున్నారు? మీ నిద్ర మా రక్షణ చింతయా? అయినచో మేము లేచియే యున్నాము గదా! మీరును లెండు. సకల చేతన రక్షణ చింతయా! ఐనచో దానికి మీ దర్శన, స్పర్శన, ఉపదేశములే చాలును. అందులనైనను లెండు. భగవంతుడేమీ యొద్దకు రావలయుననియా? ఆయన వచ్చినను - "య ఇదం పరమంగుహ్యం మద్భక్తేష్వభిదాస్యతి" అని పరతత్త్వ ప్రబోధముచే ఆయన యపేక్షించును. అందుకొరకైనను లెండు.

# పండ్రెండవ పాశురము

"కనైత్తు"

## అవతారిక

ముందు పాశురములో ప్రపన్నులయ్యును భగవత్ప్రీతికై కర్తవ్యము బుద్ధితో వర్ణాశ్రమ ధర్మముల ననుష్ఠించు ప్రపన్నుని సోదరిని లేపిరి. "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" అని భగవానుడాదేశించిన కర్మయోగాద్యుపాయ త్యాగము స్వరూపత్యానము కాదు. కాని, వాని యందుపాయ బుద్ధిని విడచుటయే. ఈ విడచుటను భగవానుడు 18వ అధ్యాయమున "త్యాగోహి పురుష వ్యాఘ్ర! త్రివిధ సన్ప్రు కీర్తితః" అని శ్లోకమున ఫలసంగకర్తృత్వ త్యాగమే త్యాగమని విశదీకరించియున్నాడు.

ఫలత్యాగమనగా తాను శ్రియఃపతికి శేషభూతుడు. శేషభూతుడనగా - "పరగతా తిశయాధాయ" కుడు. అనగా శేషికి ముఖ వికాసము

కలిగించువాడు. "దాసభూతాస్స్వత స్సర్వేహ్యాత్మానః" అనుదాస భూతా అనగా "దాసాశ్చతే భూతాశ్చ దాసభూతాః "భూసత్తాయాం" ఉండుట. చేతనుని సత్తా సత్త్వములు దాస్యమును బట్టియే యుండును. దాసులైననే ఉన్నవారుగా లెక్కింపబడుదురని తాత్పర్యము. కావున, తన స్వరూపమునకు తగిన ఫలము "శ్రియఃపతి ముఖ వికాసమే" అని తలంచుట ఫలత్యాగము.

సంగత్యాగమనగా మమతాత్యాగము. ఆ కర్మతనదని తలంచు కుండుట. అయినచో నెవరిదని తలంచవలయుననగా నౌకరు చేయు వ్యాపారమంతయు నెవరినగును? యజమానిదే కదా? అట్లే సర్వశేషియగు సర్వేశ్వరునిదేయని తలంచుట.

ఇక, కర్తృత్వత్యాగ మనగా తాను స్వాభావికముగా చేయు సాంసారిక కర్మలకు కర్తకాడు. అగ్ని సంపర్కము గల గిన్నెతో సంబంధముండుటచే ఆ గిన్నె యందలి నీటికి సలసల మను శబ్దము వచ్చునట్లుగా నాకీ కర్మవలన వచ్చిన ప్రాకృత్తిక దేహ సంబధముండుట వలననే యీ కర్మల యందలి కర్త ృ త్వమాత్మదని తోచుచున్నది. నిజముగ సాంసారిక కర్మలయందలి కర్త ృత్వ మాత్మకు స్వాభావికము కాదు. ఆగంతుకమే. ఆ కర్త ృత్వము ప్రకృతిదేయని గాని భగవంతునిదే యనిగాని తలంచవలయును. కాబట్టి శ్రీవైష్ణవ సిద్ధాంతమున నేవిధమైన త్యాగమాదేశింపబడినను అది దానియందలి "నాది" యను బుద్ధిని విడచి, "భగవంతునిదే" యను బుద్ధినుంచుమని యాదేశించుచున్నట్లు భావింపవలయును. ఇట్టి త్రివిధ త్యాగముతో గావింపబడిన కర్మలనే చేయవలయును. "హత్వాపిస ఇమాన్ లోకాన్ సాయంహన్తి నహన్యతే." క్షత్రియునకు అట్టిబుద్ధితో చేయబడిన సకలలోక సంహారమైనను ఆతనికది బంధకము కాదని గీతలో భగవాను డానతిచ్చెను. మరియు నీ రహస్యమును భగవద్గీత నాల్గవ అధ్యాయములో "చాతుర్వర్ణ్యం మాయా సృష్టం గుణకర్మ విభాగతః, తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్" - అది యెట్లు? అని ఆశ్చర్యముగా ప్రశ్నించగా - "నమాం కర్మాణిలిమ్పన్తి నమే కర్మఫలే స్పృహా" - అని సమాధానమొసగెను. నేనుచేయు స్రష్ట్యాది వ్యాపారము లన్నియును చేతనుని కర్మాధీనుడనై చేతునుగాని నాకు దానివలన నొక ఫలమును గోరికాదు. ఇది నాకే కాదు. ఎవరట్లు చేసినను వారికా కర్మసంబంధముండదని తెలియజెప్పెను.

అట్టి సిద్ధాంతి సోదరిని ముందు పాశురములో లేపిరి. అంతకుపై మెట్టునందున్న ప్రపన్నుని సోదరిని ఈ పాశురములో లేపుచున్నారు.

"సన్ధ్యా వన్దన! భద్రమస్తు భవతే, భోస్నాన! తుభ్యంనమః,
భోదేవాః పితరశ్చ! తర్పణ విధౌ నాహం క్షమః క్షమ్యతామ్ ॥

ఓ సంధ్యా వందనమా! నీకు మంగళమగు గాక దయచేయుము (పొమ్ము). నేను నిన్నాదరించవలయును. స్నానమా! నీకును అంతియే. నమస్కారము. ఓ దేవతలారా! ఓ నా పితరులారా! నా నుండి తర్పనాదుల నాశించకుడు. దయతో నన్ను మన్నింపుడు.

అయినచో నీవు తరించుట యెట్లు అథోగతి పాలగవుదువు సుమా! అన్నచో -

యత్ర క్వాపి నిషిద్ధ్య యాదవకులోత్తం సస్య కంసద్విషః,
స్మారం స్మార మఘం హరామి, తదలం మన్యే కి మన్యేనమే ॥"

ఏదియో యొక మూల కూర్చొని శ్రీకృష్ణపరమాత్మను ధ్యానించుచు నాపాతకములను బాపుకొందును. అది నాకు చాలును. దానికి మించిన దానితో నాకేమి పని?

"మత్కర్మ కుర్వతాంలోకే కర్మలోపా భవేద్యది,
తత్కర్మణి ప్రవర్తన్తే త్రిసః కోట్యో మహర్షయః ॥"

భగవంతుని సేవలో త్రికరణములతో మగ్నమైయున్న వానికి వైదిక కర్మలు లోపించినను దోషము లేదు. అతని కొరకై మూడుకోట్లు ఋషి పుంగవులు ఆకర్మల నాచరించి యా ఫలమునాతని కొసంగుదురుట! ఇది సౌమిత్రి యనుష్ఠానము. ఆతడు వనమునకు బయలు దేరుటలోనే "అహం సర్వం కరిష్యామి అగ్రత స్వపతశ్చతే" అని బయలుదేరెను. "అన్నా! నీవు నిద్రించి యున్నప్పడును, మేల్కొని యున్నప్పడును చేయవలసిన సేవలనన్నింటిని నేనే చేయుదు" నని యాతని దీక్ష ఇక నాతనికి తన నిత్య కర్మల కవకాశమెక్కడిది?

దీని సారాంశమేమనగా, మన అనుష్ఠానముగాని, అననుష్ఠానము గాని మోక్షసాధనములు కావు. ప్రధాన పురుషార్థమైన పరమ పురుషుని ప్రాప్తికి కారణమైనవియే యుపాయములు. శాస్త్రము విడువు మన్నవిగాని,

రహస్యార్థములను సేవించి విరమించగా ఆచార్యులే వారిని "మీకేమి కావలయు" నని ప్రశ్నించిరి. అందులకు శ్రీరామానుజాచార్యులు వారి సన్నిధిలో నిరతిశయ ప్రేమతో కైంకర్యమును గావించుచున్న అనంతాచార్యులను నొక శిష్యుని తమకు ప్రసాదింపుడని ప్రార్థించిరి. ఆచార్యులటులనే అచేతన పదార్థమును ప్రసాదించినట్లు వారిని ఉడయవరులకు దత్తమొనరించిరి. ఆ స్వామి ఉడయవరులతో నేతెంచియు రెండవ దివసమున ఆచార్య విశ్లేషమూలమున చిక్కి పాలిపోవసాగిరి. ఆ విషయము నెరింగిన శ్రీ భాష్యకారులు భయపడి వారిని తిరిగి ఆచార్య సన్నిధికి పంపివేసిరి. అనంతాచార్యు లానందముతో ఆచార్య సన్నిధికి వెళ్లిరిగాని యాయాచార్యులు వారిని స్వీకరించలేదట!

ఇట్టి యారాటముతో నీ కైంకర్య నిష్ఠులకు ప్రపన్న శిఖామణులు ఈ యాచార్య విశ్లేషమును సహింపజాలక వారి దర్శన, స్పర్శన, శ్రీసూక్తి శ్రవణాదుల నపేక్షించి వారిని తమ కభిముఖులు కావలయునని ప్రార్థించుచున్నారు.

**కత్తుక్కఱవై క్కణజ్గళ్పల -**

అనుటచే అనేక బాల శిష్యబృందము కలవారీ యాచార్యులని తోచుచున్నది. ఆచార్యుల యొద్దనధిగమించిన యాధ్యాత్మిక విద్య నెంతమందికి బోధించినను, యెంతప్రచారమును గావించిన యాచార్యులంత సంతసింతురు. ఇదియే "ఆచార్యా ప్రియంధన మాహృత్య' ' అను శ్రుత్యుపదేశ సారము. బాలశిష్యులనుటలో దీర్ఘకాలము ప్రచార పాటవములు కలవారై యుండవలయునని తోచుచున్నది. ఈ యవస్థలో చెప్పినది బాగుగా తలకెక్కి మంచి ప్రచారోత్సాహమును పుట్టించును.

**పలకఱన్దు -**

ఇచ్చట పవిత్రమైనవి గోవులు. వానిని పితుకుట అనుటలో
"సర్వోపనిషదోగావః దోగ్ధా గోపాలనన్దనః,
పార్థోవత్స స్సుధీర్భోక్తా, దుగ్ధం గీతామృతం మహత్ ॥"

బహు ఆధ్యాత్మిక శాస్త్ర గ్రంథములను చదివి పాలవంటి సాత్త్వికార్థ గ్రహణమును గావించి యాచార్యులు శిష్యులకు గావించు వివరణము సూచింపబడుచున్నది.

శెత్తార్ - వేదమును ప్రమాణముగా నంగీకరించనివారు.

భగవంతు నస్తిత్వము నంగీకరింపక అనత్తాయులైన వేద బాహ్యులును, వేదములో ననేక స్థలములలో శ్రియఃపతికి అప్రాకృత దివ్య మంగళ విగ్రహమును, అనంతకల్యాణ గుణరాశియును, అనంతానేక శుభనామములును కలవని యుండగా వాని నంగీకరింపక అశ్రుతి వాక్యముల కపార్థములు కల్పించు కుదృష్టులును మనకు శత్రువు లనుచున్నారు.

**ఎత్తుక్కు ఉఱఙ్గుమ్ పొరుళ్ -**

"నీ ఎన్ పొరుళుక్కు ఉఱఙ్గుమ్" - మీరు ఏమి ప్రయోజనమునకై నిద్రించుచున్నారు? మీ నిద్ర మా రక్షణ చింతయా? అయినచో మేము లేచియే యున్నాము గదా! మీరును లెండు. సకల చేతన రక్షణ చింతయా! ఐనచో దానికి మీ దర్శన, స్పర్శన, ఉపదేశములే చాలును. అందులనైనను లెండు భగవంతుడేమీ యొద్దకు రావలయుననియా? ఆయన వచ్చినను - "య ఇదం పరమంగుహ్యం మద్భక్తేష్వభిదాస్యతి" అని పరతత్త్వ ప్రబోదముచే ఆయన యపేక్షించును. అందుకొరకైనను లెండు.

# పండ్రెండవ పాశురము

"కనైత్తు"

## అవతారిక

ముందు పాశురములో ప్రపన్నులయ్యును భగవత్ప్రీతికై కర్తవ్యము బుద్ధితో వర్ణాశ్రమ ధర్మముల ననుష్ఠించు ప్రపన్నుని సోదరిని లేపిరి. "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" అని భగవానుడాదేశించిన కర్మయోగాద్యుపాయ త్యాగము స్వరూపత్యాగము కాదు. కాని, వాని యందుపాయ బుద్ధిని విడచుటయే. ఈ విడచుటను భగవానుడు 18వ అధ్యాయమున "త్యాగోహి పురుష వ్యాఘ్ర! త్రివిధ సన్ప్రకీర్తితః" అని శ్లోకమున ఫలసంగకర్తృత్వ త్యాగమే త్యాగమని విశదీకరించియున్నాడు.

ఫలత్యాగమనగా తాను శ్రియఃపతికి శేషభూతుడు. శేషభూతుడనగా - "పరగతా తిశయాధాయ" కుడు. అనగా శేషికి ముఖ వికాసము

కలిగించువాడు. "దాసభూతాస్స్వత స్సర్వేహ్యాత్మానః" అనుదాస భూతా అనగా "దాసాశ్చతే భూతాశ్చ దాసభూతాః "భూసత్తాయాం" ఉండుట. చేతనుని సత్తా సత్త్వములు దాస్యమును బట్టియే యుండును. దాసులైననే ఉన్నవారుగా లెక్కింపబడుదురని తాత్పర్యము. కావున, తన స్వరూపమునకు తగిన ఫలము "శ్రియఃపతి ముఖ వికాసమే" అని తలంచుట ఫలత్యాగము.

సంగత్యాగమనగా మమతాత్యాగము. ఆ కర్మతనదని తలంచు కుండుట. అయినచో నెవరిదని తలంచవలయుననగా నౌకరు చేయు వ్యాపారమంతయు నెవరినగును? యజమానిదే కదా? అట్లే సర్వశేషియగు సర్వేశ్వరునిదేయని తలంచుట.

ఇక, కర్తృత్వత్యాగ మనగా తాను స్వాభావికముగా చేయు సాంసారిక కర్మలకు కర్తకాడు. అగ్ని సంపర్కము గల గిన్నెతో సంబంధముండుటచే ఆ గిన్నె యందలి నీటికి సలసల మను శబ్దము వచ్చునట్లుగా నాకీ కర్మవలన వచ్చిన ప్రాకృత్తిక దేహ సంబధముండుట వలననే యీ కర్మల యందలి కర్త ృ త్వమాత్మదని తోచుచున్నది. నిజముగ సాంసారిక కర్మలయందలి కర్త ృత్వ మాత్మకు స్వాభావికము కాదు. ఆగంతుకమే. ఆ కర్త ృత్వము ప్రకృతిదేయని గాని భగవంతునిదే యనిగాని తలంచవలయును. కాబట్టి శ్రీవైష్ణవ సిద్ధాంతమున నేవిధమైన త్యాగమాదేశింపబడినను అది దానియందలి "నాది" యను బుద్ధిని విడచి, "భగవంతునిదే" యను బుద్ధినుంచుమని యాదేశించుచున్నట్లు భావింపవలయును. ఇట్టి త్రివిధ త్యాగముతో గావింపబడిన కర్మలనే చేయవలయును. "హత్వాపిస ఇమాన్ లోకాన్ సాయంహన్తి నహన్యతే." క్షత్రియునకు అట్టిబుద్ధితో చేయబడిన సకలలోక సంహారమైనను ఆతనికది బంధకము కాదని గీతలో భగవాను డానతిచ్చెను. మరియు నీ రహస్యమును భగవద్గీత నాల్గవ అధ్యాయములో "చాతుర్వర్ణ్యం మాయా సృష్టం గుణకర్మ విభాగశః, తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్" - అది యెట్లు? అని ఆశ్చర్యముగా ప్రశ్నించగా - "నమాం కర్మాణిలిమ్పన్తి నమే కర్మఫలే స్పృహా" - అని సమాధానమొసగెను. నేనుచేయు సృష్ట్యాది వ్యాపారము లన్నియును చేతనుని కర్మాధీనుడనై చేతునుగాని నాకు దానివలన నొక ఫలమును గోరికాదు. ఇది నాతే కాదు. ఎవరట్లు చేసినను వారికా కర్మసంబంధముండదని తెలియజెప్పెను.

అట్టి సిద్ధాంతి సోదరిని ముందు పాశురములో లేపిరి. అంతకుపై మెట్టునందున్న ప్రపన్నుని సోదరిని ఈ పాశురములో లేపుచున్నారు.

"సన్ధ్యా వన్దన! భద్రమస్తు భవతే, భోస్నాన! తుభ్యంనమః,
ఖోదేవాః పితరశ్చ! తర్పణ విదౌ నాహం క్షమః క్షమ్యతామ్ ॥

ఓ సంధ్యా వందనమా! నీకు మంగళమగు గాక దయచేయుము (పొమ్ము). నేను నిన్నాదరించవలయును. స్నానమా! నీకును అంతియే. నమస్కారము. ఓ దేవతలారా! ఓ నా పితరులారా! నా నుండి తర్పనాదుల నాశించకుడు. దయతో నన్ను మన్నింపుడు.

అయినచో నీవు తరించుట యెట్లు అధోగతి పాలగవుదువు సుమా! అన్నచో -

యత్ర క్వాపి నిషిద్ధ్య యాదవకులోత్తం సస్య కంసద్విషః,
స్మారం స్మార మఘం హరామి, తదలం మన్యే కి మన్యేనమే ॥"

ఏదియో యొక మూల కూర్చొని శ్రీకృష్ణపరమాత్మను ధ్యానించుచు నాపాతకములను బాపుకొందును. అది నాకు చాలును. దానికి మించిన దానితో నాకేమి పని?

"మత్కర్మ కుర్వతాంలోకే కర్మలోపా భవేద్యది,
తత్కర్మణి ప్రవర్తన్తే త్రిసః కోట్యో మహర్షయః ॥"

భగవంతుని సేవలో త్రికరణములతో మగ్నమైయున్న వానికి వైదిక కర్మలు లోపించినను దోషము లేదు. ఆతని కొరకై మూడుకోట్లు ఋషి పుంగవులు ఆకర్మల నాచరించి యా ఫలమునాతని కొసంగుదురుట! ఇది సౌమిత్రి యనుష్ఠానము. ఆతడు వనమునకు బయలు దేరుటలోనే "అహం సర్వం కరిష్యామి అగ్రత స్వపతశ్చతే" అని బయలుదేరెను. "అన్నా! నీవు నిద్రించి యున్నప్పడును, మేల్కొని యున్నప్పడును చేయవలసిన సేవలనన్నింటిని నేనే చేయుదు" నని యాతని దీక్ష ఇక నాతనికి తన నిత్య కర్మల కవకాశమెక్కడిది?

దీని సారాంశమేమనగా, మన అనుష్ఠానముగాని, అననుష్ఠానము గాని మోక్షసాధనములు కావు. ప్రధాన పురుషార్థమైన పరమ పురుషుని ప్రాప్తికి కారణమైనవియే యుపాయములు. శాస్త్రము విడువు మన్నవిగాని,

చేయుమన్నవి గాని యుపాయములు కానేరవు. అట్లు విడుచుట, పట్టుట యెవ్వని యాదేశమో ఆతడే యాఫలమున కుపాయము. "మామేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" నన్నే ఉపాయమని గట్టి నమ్మకముతో నుండుము. నీవు నన్ను పొందుట కాటంకముగానున్న పాపములన్నింటిని నేనే పోగొట్టుదును. ఇంతయేల? అసలు- "నానుంవేణ్డా నీయుంవేణ్డా, రాజకుల మాహాత్మ్యత్తావే అద్దైయే విట్టుపోంకాణ్" - నేనును పనిలేదు, నీవును పనిలేదు. నీకు గల రాజసంబంధ ప్రభావముచేతనే ఆ పాపములే భయపడి తమంత తామే పోయినజాడ కూడ తెలియకుండునట్లే పోవును. కనుక, భయమిక దేనికి?

రాజకుల సంబంధమనగా అనేక కాలమునుండియు తీవ్రముగా కలహించు వారిరువురిలో నొకడు సభ్యములగు దుస్తులతో రాజభవనమున కేగి నిరీక్షణ గృహమున నొకగంట కూర్చొని వచ్చుచుండెను. దీని నాతని శత్రువుని చూచి వీనికి రాజుతో నేదో సన్నిహిత సంబంధమున్నట్లున్నది. ఆతనితో నాపై నేరములు చెప్పి యేదియో యొకమిషతో దండింపజేయు నేమోయని భయపడి యొకదినమున ఆతని యొద్దకు వినయముతో వచ్చ వివాదమును తనంతనే పరిహరించు కొనిపోవును. ఇదియే రాజకుల మహాత్మ్యము. శ్రీరామచంద్రుని రక్షణ విషయమై లక్ష్మణుడు యెంత దీక్షయో శ్రీకృష్ణుని రక్షణలో నీమె సోదరున కంతప్రేమయు, రక్షణ దీక్షయు కలదు.

ఈ రక్షణ దీక్షకు ఏయోగములును సాటికావు. ఏ పుణ్యములును సరిపోలవు. దీనివలననే భారతీయ సంప్రదాయములో లక్ష్మణునకును, గుహునకును "పెరుమాళ్" అను పెద్ద పేరువచ్చినది. "పెరుమాళ్" అనగా "పెరుం + ఆళ్" - ఉత్తమ పురుషుడని భావము గీతలో భగవానుడు ఈ బిరుదము తన కొక్కరినే కలదని సెలవిచ్చెను. - "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః" అనెను. అంతగొప్ప బిరుదమును ఈయిద్దరికిని మన వారేల యొసంగిరో తెలిసికొనుట యుక్తము. పన్నిద్దరాళ్వారులలో శ్రీవిష్ణు చిత్తుల వారికి "పెరియాళ్వార్" అని తిరునామము కలదు.

పొఙ్గుం పరివాలే విల్లిబుత్తూర్ పట్టర్ పిరాన్ పెత్తాన్

పెరియాళ్వా రెన్నుంపెయర్".

పొంగిప్రవహించుచున్న ప్రేమచే వీరికీ పేరు వచ్చినదని శ్రీ వరవరమునులు తమ ఉపదేశ రత్నమాలలో సాయించిరి. పెరుమాళ్ల రక్షణ

దీక్షలో వీరికి వారిపైగల ప్రేమాతిశయముచే మంగళాసనము చేయుటలో వీరికి గల దీక్షయే దానికి కారణము. అంతవాడీ గోపాంగన సోదరుడు.

## పండ్రెండవ పాశురము

కనైత్తిళఙ్గత్తెరుమై కన్ఱుక్కిరఙ్గి,
నినైత్తుములై వళియే నిన్ఱు పాల్‌శోర,
ననై త్తిల్లమ్ శేఱాక్కుమ్ నచ్చెల్వన్ తఙ్గాయ్,
పనిత్తలై వీళనిన్ వాశల్ కడైపత్తి,
శినత్తినాల్తెన్నిలఙ్గై క్కోమానై చ్చెత్త,
మనత్తు క్కినియానైప్పాడవుమ్ నీవాయ్ తిఱవాయ్,
ఇనిత్తా నెళున్దిరాయ్ ఈదెన్న పేరుఱక్కమ్,
అనైత్తిల్లత్తారు మఱిన్దేలో రెమ్బావాయ్.

టీకా:- ఇళఙ్ కన్ఱు = లేతదూడలు గల, ఎరుమై = బఱ్ఱెలు, కనైత్తు పాలుపితుకువారు లేనందున అరచి, కన్ఱుక్కు = తమదూడలను, ఇరఙ్గి కరుణించు, నినైత్తు = ఆ దూడలు పాలు త్రాగునట్లు తలంచినందున, ములై + వళియే = తమ పొదుగుల ద్వారా, నిన్ఱు = నిలిచి (ఎడతెగక), పాల్ = పాలు, శోర = స్రవించుచుండగా, ఇల్లమ్ = ముంగిలిని (ఇల్లు), ననైత్తు = తడిపి, శేరు = బురదగా, అక్కుమ్ = చేయుచున్న, నల్ = మంచి, శెల్వన్ = సంపదగల వానియొక్క, తఙ్గాయ్ = చెల్లెలా!, పని = మంచు, తలై = మా తలలమీద, వీళ = పడుచుండగా, నిన్ = నీయొక్క, వాశల్ = వాకిలి (యొద్ద), కడై = గుమ్మమును, పత్తి = పట్టుకొని, శినత్తినాల్ = కోపముతోను, తెన్ = దక్షిణ దిక్కున నుండెడు, ఇలఙ్గై = లంకకు, కోమానై = ప్రభువగు రావణుని, శెత్త = చంపినవాడును, మనత్తుక్కు = మనస్సునకు, ఇనియానై = భోగ్యభూతుడునైన శ్రీరాముని, ప్పాడవుమ్ = గానము చేసినప్పటికిని, నీ = నీవు, వాయ్ = నోరును, తిఱవాయ్ = తెరచి మాట్లాడవు, ఇనిత్తాన్ = ఇకనైనను, ఎళున్దిరాయ్ = లేచిరావమ్మా! ఈదు = ఇది, ఎన్న = ఏమి, పేరు + ఉఱక్కమ్ = గాఢనిద్ర, అనైత్తు + ఇల్లిత్తాన్ = ఊరిలోనున్న వారందరును, అఱిన్దు = మేము వచ్చిన విషయము తెలిసికొనినారు, ఏల్ = ఇట్లయినచో, ఓర్ = యోజింపుము, ఎంపావాయ్ = మా అభిప్రాయము నెరిగి అనుసరింపుము.

తాత్ప:- ఓ భాగ్యవంతురాలా? నీ సంపత్సమృద్ధి ఏమని చెప్పుదును? లేదూడలా కలిగొన్న వానిపై దయగలిగి "అంబా" యని పిలుచుచు, వానితల్లి ఎనుములు తమ దూడలను తలపోయుటచేత, నిజముగ నెవరును పాలను పితుకకున్నను అవి వచ్చి తమ పొదుగులలో మూతిని పెట్టి త్రాగుచున్నట్లు భావించుటచే, ఆ భావనాతి శయముచే పొదుగు పాలు చేపునకు వచ్చి, కొడుల వెంట ధారధారలుగా విడువక స్రవించు (కారు)ట చే నిల్లంతయు నానిపోయి, ఆ బర్రెల త్రొక్కుడుచే బురద బురద అయిపోవు నంతటి పాడిగల గోపాలకుని సోదరీ! అవరణ లేని నీ వాకిట బురదనేలపై నిలచిన మాతలలపై మంచువాన కురియుచుండగా నీ గుమ్మపు గ్రంధిని పట్టుకొని నిలచి యుండి సీతామాతను అపహరించిన కోపాగ్నిచే సుందరమైన నిర్మాణ చాతుర్యము గల లంకాపురికి రాజైన దశగ్రీవుని (రావణుని) చంపిన, మన మనస్సుల కానందజనకుడగు శ్రీరామచంద్రుని గూర్చి పాడుచున్నను, నీవునోరైనను తెరువకున్నావు. మేము వచ్చినది చూచియు, రామకీర్తనము వినియు లేచిరాక పరుండియు యున్నావు. ఊరిలోనున్న పిల్లలందరును నీయింటికి వచ్చి నిన్ను లేపుచున్నారు. నీ అతిశయము అందరకును తెలియునులే! లేచి మాకు సహకరింపుము.

**తెలుగుసీత:-**

ఆకొన్నలేగల నాదరమ్మున జేరి,
ఎనుములు తచ్చింత మనము కరిగి,
పాల్చేపి చన్నుల బడి జాలువారి యి
ల్లెల్ల జంబాలమై యుల్లసిల్లు,
ధన్యురాలా? మంచు తలలపై గురియంగ
దడయుచు నీ యింటి గడపపట్టి,
సీతను చెరగొన్న యాతుధానునిలంక
కథనేతను యముని కతిథిజేసి,

సాధు మానస మానంద జలధిదేల్చి,
నట్టి శ్రీరఘురాము నోరార బాడి
నప్పటికి మారు మాటాడ, నందరెలిగి
నారమిక లెమ్ము, నిదుర బంగారు బొమ్మ!

-విశేషార్థము -

కన్నైత్తు = ఇళం కన్ఱు ఎరుమ్మై కన్ఱుక్కు ఇరఙ్గి నినైత్తు కనైత్తు.

పాలు చేపునకు వచ్చి పొదుగులు దించుటచే త్రాగునట్టి దూడలు గాని: పితుకునట్టి గోపాలకులు గాని రాకపోవుటచే పొదుగుల పీడచే బర్రెలు అరచుచున్నవి. ఈ విషయమున నివి శ్రీకృష్ణునితో పోల్చదగినవి. ఉదారులనగా ఇతరుల కియ్యలేక ఉండువారు. అది వారికి సహజమైన ధర్మము. కొందరు కొన్ని నోములను నోచియూ ప్రసాదము నిచ్చి ఖర్చుచేసి కొందురు. అది మిగిలిన వ్రతభంగమగున నివారి భయము. అటులనే శ్రీకృష్ణ పరమాత్మ పాత్రలను "ఉదారు" లని ప్రశంసించును. లోకములో నిచ్చువారి నుదారులందురు. అడిగిన వారికి లేదనకుండ నిచ్చుటయే ఉదారుల లక్షణము. అది యడుగు వారు ననేకదా ప్రకాశించును?

ఇళంకత్తెఱుమ్మై -

అవి లేతవయస్సు పడ్డలనికాని, చిన్నవయస్సు దూడలు కలవని కాని చెప్పవచ్చును. అట్టివానికే పాలు అధికముగానుండును. అందువలననే పాలు చేపునకు వచ్చి పితుకనిచో బాధ అధికముగా నుండును. ఆ దూడలకు తల్లిపాలు మాత్రమే ఆహారము. గడ్డిగాద తినలేవు. అందుచే తల్లులకు వానిపై ప్రేమ అధికమగుటచే వానికి పాలిచ్చుటలో నాలస్యమును సహింపజాలక పితుకువారు వచ్చు వరకును కర్ణకఠోరముగా నరచుచునే యుండును.

కన్ఱుక్కు ఒరఙ్గి -

ఈ పశువుల ఆరాటము తమ పాలచేపుచే కలుగుచున్న బాధచే గాక తనబిడ్డ ఆకలితో నలమటించుచున్నదనియే. ఇది భగవంతునకు తన భక్తుల పట్లనుండు ఆరాటమునకు నిదర్శనము. గజేంద్రుడు - "నీవే తప్ప నిత: పరంబెరుగమన్నింపు" మని ప్రార్థించిన పిమ్మట యొక్కక్షణ విలంబముసైనను సహింపగలిగెనా? అటులనే ఈ గోపాంగనలును ఈమెను లేపుటకై అంత ఆర్తితో వచ్చియు ఆమె లేచుటకు చేయు ఆలస్యమును సహింపలేకయున్నారు. తమ స్థితికి దయతలచి లెమ్మనుచున్నారు. అదియే ఈ వర్ణనలోని భావము.

నిన్ఱుపాల్ శోఱ - విడువకుండగా పాలు కారుచుండగా.

మేఘములు వర్షించవలయునని సముద్రమునకేగి యచ్చట కడుపునిండుగ నీరుత్రాగి వచ్చి వర్షింపవలయును. ఈ పశువుల కాపాటు లేదు. తలంచుకున్నంతనే పాలు కారును. ఆ తలంపు మారిననే ఆధార మగును. కావుననే "నిన్ను" అనుచున్నారు. తిరుపతి, సింహాచలము, బదరి మున్నగు మార్గములలోని పర్వతముల నుండి నీటిధారలు కారుచున్నట్లే యీ పశువుల పొదుగుల నుండి పాలు కారుచున్నది. ఆ సమృద్ధిమేత వలన కాదు. శ్రీకృష్ణుని పాలన వలననే.

మనత్తుక్కినియానై - మనస్సునకు భోగ్య భూతుడైన శ్రీరఘురామభద్రుని.

"ఇతఃపరం మృత సఞ్జీవనం రామవృత్తాన్త" మ్మని శ్రీరఘు రామచంద్రుని తిరునామ వ్యాఖ్యానారంభమున శ్రీభట్టరువారు శ్రీ విష్ణునామ సహస్రములో సాయించిరి. ఆ వృత్తాంతము శ్రీకృష్ణుని విరహ వ్యధచే బీటలు వారిన హృదయమును చల్లబరచి పదనుగావించును దానిని మేము

పాడుప్పుం - పాడినను

నీవాయ్ తిఱవాయ్ - నీవు నోరుతెరువవు.

మా కొరకు గాకున్నను నీయానంద పారవశ్యము నైనను మాకు ప్రదర్శింపవలదా? యనుచున్నారు.

ఇనిత్తానెళు న్దిరాయ్ - ఇకనైనను లేచిరమ్ము.

భగవంతుడు పాలసముద్రమున పవళించినను ఆర్తుల ఆలాపములను వినిలేచి యవతరించి వారి యిక్కట్టులను బాపును. నీవు లేచినను చాలును. మాయార్తిని చూచియైనను లేవవచ్చు గదా?

ఈదెన్న పేరుఱక్కమ్ - ఇదియేమి గాఢనిద్ర?

నీ నిద్ర భక్తుల ఆర్తికి మేల్కొను భగవంతుని నిద్రవంటిది కాదు. పగలనుభవించిన చిత్తక్షోభ శాంతించుటకై విశ్రమించు సంసారుల నిద్రవంటిదియు కాదు. ఇదియేమి విచిత్రమైన నిద్దురమ్మా! నీది వైదిక నిద్రయును కాదు. లౌకిక నిద్రయును కాదు. భగవంతుని నిద్రవంటి యోగ నిద్రయును కాదు. ఇది యొక అపూర్వ నిద్రవలెనున్నదే! ఇట్టిది మునుపెన్నడును చూచినది లేదు. విన్నదిలేదు. ఇట్టి నిద్రను ఏమందురో మా బుద్ధికి తోచుటలేదు. లేచి మాకు వివరింపుమమ్మా!

- వేదాంతార్థము -

ఈ పాశురమున భాగవతాభిమాన నిష్ఠలను లేపుచున్నారు.

భారతీయ సంప్రదాయమున భగవదభిమాన నిష్ఠకలవారిని ప్రథమ పర్వ నిష్ఠలనియు, భాగవతాభిన నిష్ఠకలవారిని చరమ పర్వనిష్ఠలనియు పేర్కొనుట కలదు. భగవంతుడును

"మమభక్త భక్తేషు ప్రీతి రభ్యధికామతా."

"నాకు నాభక్తులు పట్ల కన్నను, నా భక్త భక్తుల పట్ల ప్రీతి అధిక" మిన సెలవిచ్చెను. ఆళ్వారుల మూడపత్తు, 7వ తిరువాయ్‌మొళి యంతయు భాగవత నిష్ఠగల మహాత్ముల పట్ల తమకు గల ఆదరమును తెలుపుచు తొమ్మిదవ పాశురమును

కులం తాఙ్గ శాతిగల్ నాలిలుం కీళిళున్దు, ఎత్తనై
నలన్దానిలాద శణ్డాల గ్గళాగిలుమ్
కులన్తాఙ్గ శక్కరత్తణ్ణల్ మణివణ్ణ ర్కాళెన్నుళ్
కలన్దార్, అడియార్ తమ్మడియార్ ఎమ్మడిగళే.

జాతిని బట్టి యెంత నీచులైనను చక్రధారియగు శ్రీమన్నారాయణునకు దాసులైన వారికి దాసులైనవారు మనకు పరమ ప్రాప్యులని సాయించినారు.

పదియపాశురము పట్టినంత క్రిందికి దిగి "అడియార్ అడియార్ దమ్ అడియార్ అడియార్ తమక్కు, అడియారడియార్ తమ్మడియారడి యోఙ్గళే". దాసదాసులకు దాసులైన వారికి మనము దాసులమని సాయించిరి.

ఆళ్వందారులు నుస్తోత్రరత్నమున
"సవృత్త వ్యదాకారవిలో కనాశయా
తృణీకృతా నుత్తమభుక్తి ముక్తిభిః।
మహాత్మభిర్మామవలో క్యతాంనయం
కణేపి యద్విరహో తిదుస్సహః॥

"ప్రభూ! మిమ్ములను సేవించు నాశతో భుక్తిముక్తులను కూడ నిరసించు భాగవతుల విశ్లేషమును మిరొక్క క్షణమైనను సహింపలేరుకదా?

అట్టి భాగవతుల కటాక్షమునకు నన్ను పాత్రుడను గావించుమని యిట్టి భాగవత నిష్ఠనే ప్రార్థించినారు. శ్రీకులశేఖరాళ్వారులు ముకుందమాలలోను, శ్రీవరవరముని పుంగవులు తమయతి రాజ వింశతిలోను తమకు భాగవత పరమావధి నిష్ఠను నిరవచ్ఛిన్నముగా సాగునటుల ప్రసాదించుమని ప్రార్థించియున్నారు.

శ్రీరామాయణములోని పాత్రలలో నుత్కృష్ట పాత్రయెవ్వరని ప్రశ్నించినచో మనసంప్రదాయ వేత్తల నోట వెలువడునని శత్రుఘ్నుడు, శబరి అనియే. కాని, వారిరువురిలో శత్రుఘ్నునికన్నను శబరియే మిన్నయని నారామాయణ కల్పద్రుమమున నిరరూపించి యున్నాను చూడగలరు. 24 రామాయణ జంటల విమర్శనమిది. ఈ భాగవత నిష్ఠ కలవారిపై భగవంతునకు గల యాదరాతిశయము నారయుడు.

శృంగదేశపురాధినాధుడగు గుహుడు శ్రీరామభద్రుని అర్చించుటకై సకల సన్నాహములను గావించుకొని వారిని తన గుడిసెకు రమ్మని పార్థించగా శ్రీరాముడాతనితో

"అర్చితా శ్చైవ హృష్టాశ్చ భవతా సర్వధానయమ్ ।
పద్భ్యా మభిగమా చ్చైవ స్నేహ సన్దర్శనేన చ॥"

"నాయనా! గుహా! నీవు నాకడకు నడచి వచ్చుట, ప్రీతి వచనములు పలుకుటవలననే మాకు పూజ పూర్తియై అపరిమితానందము కలిగిన" దనెను. గుహుడింకను నిర్బంధించగా "మేముత్తమ క్షత్రియుల మగుటచే నిచ్చువారలమే గాని తీసికొనువారము కాదు. తీసికొనుట మాకుల ధర్మమునకు విరుద్ధ" మని త్రోచివుచ్చెను. కాని, ఆచార్యాభిమానమే తన సర్వస్వమని నమ్మి, వారి సేవలో నిమగ్నమైన శబరియను దీర్ఘజీవి యొసంగిన పండ్ల నత్యంత ప్రీతితో తీసికొని నారగించెను. ఈ తారతమ్యమునకు మొదట గుహుడిచ్చిన ఫలములను తీసికొనక నిషేధించినవారు, ఆ జాతిదేయైన శబరిపెట్టిన ఎంగిలిపండ్లను ప్రియముతో నారగించెననగా అంతిమోపాయనిష్ఠా గరిష్ఠురాలీ శబరి యగుటయే కారణము. గుహుడు భగవద్భక్తుడు. శబరి భాగవత భక్తురాలు "మమ మద్భక్త భక్తేషు ప్రీతిరభ్యధి కామతా" యని భగవంతుని ప్రతిజ్ఞ. నాకు నా భక్తుల యందు కన్నను నా భక్తుల భక్తులయందు ప్రీతి మెండని స్వయముగ సెలవిచ్చెను. అందుచే

నాతడుచ్ఛిష్ట దోషమును నరకుగొనలేదు. చూచితిరా? భాగవత భక్తిప్రభావము!

శబరి ఆ పండ్లరుచిని తెలిసికొనుట తన కొరకై కొరికినచో నవిఉచ్ఛిష్టములే యగును. శ్రీరామచంద్రునకా పండ్ల అరుచి బాధను కలిగించరాదను దృష్టితో కొరకి యుమిసినదిగాని బాగున్నతని తినలేదు. ఇట్లే చేదుగా నుండుటకవకాశము గలదోస, బీర మొదలగునవి గాని, పుల్లగనుండు పండ్లు వగైరా గాని పెద్దలకు, పెరుమాళ్ళకు (దేవుళ్ళకు), వినియోగించుటకు ముందు కొంచెము ఎంగిలి కాకుండ నోటనుంచుకొని మ్రింగక ప్రశంసించక ఉమిసి వినియోగించినను తప్పుకాదు. శబరి నీచజాతికి చెందినదైనను ఆచార్య సేవా ప్రభావముచే శ్రీరామ సందర్శన తత్కృపా కటాక్ష పాత్రురాలగుచు యోగమునకు సాక్షాత్తుగా నధికారము లేకున్నను, యజ్ఞాదులకు బదులుగా ఆచార్య శుశ్రూష యుండుటచే యోగాధికారిణియై తత్ప్రభావముచే, శ్రీరామభద్రుని కటాక్ష పాత్రముచే నిర్దగ్ధ సమస్త పాపములు గలదియై పరమపదమును బడసెను.

ఆహా! ఆచార్య శుశ్రూషకెంత ప్రభావము కలదో!

ఈ విధమగు గంభీరమైన వేదాంతార్థ మీ పాశురమున ధ్వనించుచున్నది.

## పదమూడవ పాశురము

"పుళ్ళిన్ వాయ్"

### - అవతారిక -

ఈ పాశురమున గోపికను లేపుటలో "పోతరిక్కణ్ణినాయ్" అని ఆమెలోక విలక్షణమైన నేత్ర సౌందర్యము కలదని సూచించుచు సంబోధించిరి. దీని వలన నీమెకు తన నేత్ర సౌందర్యాభిమానము పూర్తిగనున్నట్లు తోచుచున్నది. శ్రియఃపతికి సకలావయవములును లోక విలక్షణమైనవేయైనను కళ్లలో నాతని సిరితాండవించుచుండును. అందుచే రాజసూయ యాగమున అగ్రపూజార్హతను నిర్ణయించుటలో పెద్దగా నెన్నుకొనబడిన భీష్మాచార్యులు - "పశ్యతే పృథు తామ్రాక్ష స్స్వయంభూతే జనార్దనః"

ధర్వనందనా! నీ బంధువు, విశాలమైన తామరపువ్వును బోలిన నేత్ర సౌందర్యము గల శ్రీకృష్ణుడుగాక మరెవ్వరర్హులు? ఆ కన్నులే యాతని యగ్రపూజార్హతను చాటుచున్న" దని నేత్ర సౌందర్యమును బట్టియే శ్రీకృష్ణుని అగ్ర పూజార్హతను నిర్ణయించెను.

అగ్రజు నానతి దుశ్శాసనుడు నిండు పేరోలగమున దనవలువల నొల్చుచుండనేమియు దోపక ద్రౌపది ఆపద్బాంధవుడగు శ్రీకృష్ణుని - "శంఖచక్ర గదా పాణేద్వారకా నిలయాచ్యుత" అని మొరపెట్టినను వినపించుకొనని యాతడు "పుండరీకాక్ష అను పేరువినగనే కనులు తెరచెను. ఛాన్దోగ్యదహర విద్యలో హృదయపుండరీకమున భగవంతుని ధ్యానించుటలో ఆతని సకలావయవములను విడచి - "కపాస్య సంపుణ్డరీక మేవమక్షిణీ" - అని కపాస్య విశేషణముతో పుండరీకము నలంకరించి నేత్రముల సౌందర్యమును సూచించి ఉపాస్య ప్రాధాన్యమా కన్నుల కొసంగెను. దానికి శ్రీభాష్యకారులు (రామనుజులు) గమ్భీరామ్భస్సము ద్భూత, సుమృష్టనాళ, రవి కరనికర వికసిత, పుణ్డరీకదళామలాయతే క్షణః" - అని శాస్త్రీయార్థమును నిర్ణయించిరి. దీనిని బట్టి భగవంతుడాదరించునది నేత్ర సౌందర్యమునే అనితేటతెల్లమగుచున్నాడు. ఆ సౌందర్యము ఈనాడు లేపబడుచున్న భగవంతుడాదరించు గోపాంగనకు పుష్కలముగానున్నది. దీనిని భగవంతుడధికముగ నాదరించి తానే తనయొద్దకు రాగలడను నమ్మక మీామె కధికముగనుండుటచే లేవకపరున్నది.

సరయూనదీ తీరములో తొలిసంజరేకులు తెలతెలవారుచున్న ప్రశాంత ప్రభాత సమయములో తాను క్రిందటి రాత్రి పరచిన లేత పచ్చిక పక్కమీద శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణ సహితుడై యోగ నిద్రాముద్రితమైన అనిద్రావస్థలోనున్న సమయములో - "ఓ కౌసల్యానందనా! శ్రీరామ! తూర్పు తెల్లవారుచున్న దయ్యా! ఓ నరశార్దూలా! నిద్రలే! దైవికమైన ఆహ్నిక కృత్యములను నిర్వర్తింపవలయు.". అని రాముడు పరమాత్మయని తెలిసిన తాత్త్వికజ్ఞానియైన విశ్వామిత్రులవారు స్వామికి మేలుకొలుపు పాడినటుల.

నిర్జిత శ్రీపుణ్డరీక హిరిణ్యాయత లోచనే।
ఉత్తిష్ఠమే కౌతుకాయ నేత్రసౌన్దర్య కామినః ॥

అని శ్రీకృష్ణుడే వచ్చి తనను లేపునని యీామె నమ్మకము. ఇది సత్యమే! భగవంతునకు నేత్ర సౌందర్యవతులన్న ప్రీతిమెండు. నేత్రమనగా

జ్ఞానము. దానికి సౌందర్యమనగా శ్రీమన్నారాయణుని గూర్చినదగుట. అది కలచేతనుడు స్త్రీ కావలయును. అనగా ఆత్మగుణములలోని పారతంత్ర్యము ప్రధానముగా నుండవలయును. అదియున్న వారి నాతడధికముగ నాదరించును.

"ప్రియో హిజ్ఞానినో త్యర్థమహం సచమమప్రియః"

"సచమమ ప్రియః ఎంత అత్యర్థము? అతడు నాకు ప్రియుడు. ఆ ప్రీతి హద్దును నేనే చెప్పజాలను. అనెను. వారి కడకాతడే యేతెంచును. పాండవుల నొక్క క్షణమైనను విడువక లెన్నంటెను గదా? శ్రీరాముడు తండ్రి యాజ్ఞయను నెపముతో ఋషి పుంగవులు, తదితర భక్తుల యొద్దకు తానే స్వయముగనేగెను. తన కెవరిపై నాదరముండునో వారి కట్టి జ్ఞానములేకున్నను తానే ప్రసాదించును.

"తేషాం సతతయుక్తానాం భజతాం, ప్రీతి పూర్వకమ్,
దదామి బుద్ధియోగం యేనమా ముపయాన్తి తే॥".
"తేషామే వానుక వణ్ణర్థం అహమజ్ఞాన జంతమః,
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞాన దీపేన భాస్వతా ॥

నన్ను పొందటకు తగిన జ్ఞానమును నేనే వారికి ప్రీతితో నిత్తును. నన్ను చేరుటకు మార్గమదియే! వారి వారి హృదయములందుండి జ్ఞాన దీపమును వెలిగింతును. అది వారి యజ్ఞానాంధకారమును పారద్రోలును. అనెను అందులకే ఆయనకు గల వేయినామములలో "తత్" అనునొక నామము ముఖ్యముగా కలదు. దానికి శ్రీభట్టరు వారు - "స్వజ్ఞాన భక్తిం భక్తానాం తనోతీతి తదుచ్యతే" - తన భక్తులకు తనను గురించిన భక్తి రూపాసన్నమైన జ్ఞానమును తానే ప్రసాదింపజేయును. (తమ - విస్తారే), అని సాయించిరి. ఇట్టి జ్ఞానమును ఆళ్వారులకు "మయర్వఱ మతినల మరుళినన్" - అని వారే సాయించుటను విని మన భాష్యకారులు గూడ శ్రీభాష్యమంగళాచరణ శ్లోకమున - "దానిని నాకియ్యవా?" అని ప్రార్థించిరి. తనకు ప్రియులైన వారికి తానే ఆ జ్ఞానము నిచ్చి తనతో చేర్చుకొనువాడు సహజముగ నా జ్ఞానమున్న వారిని విడచునా? ఆ జ్ఞానమును అందమైనది గాన, శ్రియఃపతియే తనకు దిక్కనెడి నిశ్చలమైన అధ్యవసాయము. అది కలవారు తమ రక్షణమును తాము చేసికొనక అతని సహాయమునకై

ఎదురుచూచుచుందురు అదియే కదా సీతామాత సిద్ధాంతము.

"నత్వా కుర్మిదశగ్రీవ! భస్మ." అని తన శక్తిని గాని, "శక్తి రస్తిహిమే వోఢుం అజ్ఞామపి సరావణాం" - అని చెప్పటయే గాక ప్రత్యక్షముగా చూపినను అతని శక్తిని గాని తన విమోచనోపాయముగా నవలంబించక - "శరైస్తు సఙ్కులాంకృత్వా రామోపరబలార్దనః మాంనయేద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్," ఆ శ్రీరఘురాముడే వచ్చి, నాయాటంకములను తొలగించి, నన్ను తీసికొని పోయినచో నది యాతని నిరపేక్ష రక్షకత్వ స్వరరూపమునకు తగుననెడు. ఇట్టి యధ్యవసాయమున్న వారి యొద్దకు భగవంతుడు తానే వచ్చి వారి నుద్ధరించును. ఈ లేపబడుచున్న గోపికను అట్టి యోగ్యత కలదు.

## పదమూడవ పాశురము.

పుళ్ళిన్‌వాయ్ కీణ్డానై పొల్లావరక్కనై,
క్కిళ్ళిక్కళైన్దానై కీర్తిమై పాడిప్పోయ్,
పిళ్ళైకళెల్లారుం పావైక్కళంపుక్కార్,
వెళ్ళి యెళున్దు వియాళము ఉఱఙ్గిత్తు।

పుళ్ళుం శిలుమ్బినకాణ్, పోతరిక్కణ్ణినాయ్।
కుళ్ళ క్కుళిరక్కుడైన్దు నీరాడాతే।
పళ్ళిక్కిడత్తియో పావాయ్, నీనన్నాళాల్,
కళ్ళం తవిర్న్దు కలన్దేలో రెమ్బావాయ్.

టీకా:- పుళ్ళిన్ = పక్షి రూపమున వచ్చిన బకారుని యొక్క, వాయ్ = నోటిని, కీణ్డానై = చీల్చిన వాడును, ప్పొల్లాదుష్టుడైన, అరక్కనై = రాక్షసుడగు రావణుని, కిల్లి = గిల్లి, క్కళైన్దానె = అనాయాసముగా పారవైచిన శ్రీరామచంద్రమూర్తి యొక్క, కీర్తియై = వీరచరితమును, ప్పాడి = గానముచేసి, ప్పోయ్ = వెడలి (పోయి), పిళ్ళైగళ్ = నోము నోచు బాలికలు, ఎల్లారుమ్ = అందరమును, పావైక్కళమ్ = సంకేత స్థలము నందు, పుక్కార్ = ప్రవేశించిరి, వెళ్ళి = శుక్రుడు, ఎళున్దు = ఉదయించెను, వియాళ = గురుడు (బృహస్పతి), ఉలఙ్గిత్తు = అస్తమించెను. (మీకు నక్షములన్నియు శుక్ర గురువులు గానే తోచును అని చెప్పచున్నారు), పుళ్ళుమ్ = పక్షులును, శిలుంబినగాణ్ =

కూయుచు పోవుచున్నవి, (ఆహారమును వెదకుటకు పోయి స్థలములందు) చూడుము, పోదరిక్కణ్ణినాయ్ = తామర పుష్పముల సౌందర్యమును కొల్లగొనిన నేత్రములు గల దానా!, పావాయ్ = చిన్నదానా! (మృదు స్వభావము గల), నీ = నీవు, నన్నానాళ్ = ఈ మంచి దినమందు (శ్రీకృష్ణుడును మనమును గలసియుండుటకు చేకూడిన) కళ్ళమ్ = కపమును (కృష్ణుని గుణచేష్టతములను నీవు ఒంటరిగా స్మరించు), తవిరున్దు = విడిచి, కలన్దు = మాతోడ గలసికొని, కుళ్ళ కుళిర = మిక్కిలి చల్లనగునట్లుగా, కుడైన్దు = అవగాహించి, నీరాడాదే = స్నానము చేయక, పళ్ళి = పడకయందు, క్కిడత్తియో = నిద్రించున్నావా?, ఏల్ఓర్ = ఏమియాశ్చర్యము! ఎంపావాయ్ = మా యభిప్రాయము ననుసరింపుము. ఏమి! వినుచుంటివా?

తాత్ప:- ఓ నళినాయతాక్షీ! బకాసురుని చంపిన శ్రీకృష్ణుని యొక్కయు, క్రూరుడగు రావణుని అనాయాసముగా సంహరించినట్టి శ్రీరాముని యొక్కయు వీరచరితమును కన్యలందరును ఆనందముగా పాడుకొనుచు వ్రతానుష్ఠానమునకై శ్రీకృష్ణుడును, తామును కూడవలయునని యేర్పడిన స్థలమునకు పోయిచేరిరి. తెల్లవారు సమయమైనది. శుక్రోదయమైనది. బృహస్పతి నక్షత్రమస్తమించినది. పక్షులరచుచు ఆహారమునకై పోవుచున్నవి. తామరపువ్వు నందు తుమ్మెద వాలినట్లున్న అందమైన నేత్రములు కలదానా? మృదువైన స్వభావము కలదానా! బొమ్మవంటి అందము కలదానా? శ్రీకృష్ణునితో నిర్భయముగా విహరించుట కేర్పడిన యీ మంచి శుభావసరమున చల్లని నీటిలో చల్లగ స్నానమాచరింపక ప్రక్కను పట్టుకొని ప్రాకులాడుచున్నావా? కపటము వీడి లేచిమమ్ము కలిసికొనరమ్ము! నీవు అభిమానవతిని గావా? లెమ్ము. మా మాట లాలకింపుము. ఆలసింపక రమ్ము!

తెలుగుసేత :-

పులుగులు కూసెను: బోడిచెను చుక్కయు,
గురుడస్తమించెను, కువలయాక్షి!
పులుగు జీల్చినవాని, బోలసుదిండిని సంహ
రించినవాని, గీర్తించుకొనుచు,
ప్రాణసఖియలెల్ల పయనమై పోయిరి
వనితామణీ! నోము పట్టునకును,

ఈ శుభ దినమ్మున నిందాకలేవక
ప్రక్కను వీడక పవ్వళించి,

కునుకుచుంటివ దేలనే? కుముదవదన! (కూర్మి, సఖియ)
కపట నిద్దుర విడనాడి, కలసిమెలసి,
ఇవతళించెడు జలముల నీరమాడ
పోవుదముర మ్ము! ఇకనైన పువ్వుబోణి!

విశేషార్థము

"మనత్తుక్కిని యానైప్పాడవుం" అనుమాట చెవిని సోకగనే లేపబడు గోపాంగన యిట్లు తలపోసినది. "అయ్యో! వీరు నాయింటికి వచ్చి లేపగా ముందుగ లేవని నాయపరాధము తీరునటుల నేనే వీరితో ప్రసంగింతు" నని "ఓ మానవతులారా! మీలో ఏయొక్కరికైనను శ్రీరామచరిత్రను పాడుటకు వచ్చునా?" అని ప్రశ్నించెను. దానికి లేపవచ్చిన గోపికలు - "ఓ మహామతీ! మేము రామవృత్తాంతమునేగాక, శ్రీకృష్ణ వృత్తాంతమును కూడ పాడితిమి. రామాయణమైనది. భారతమైనది. భాగవతమైనది. శ్రీపాంచరాత్రాగమమైనది. నీవు లేచుటయే తరువాయి." అనిరి.

శ్రీరామవృత్తాంతము సరియే. భారత, భాగవతములు శ్రీకృష్ణ వృత్తాంతమునకు ప్రధానమైన గ్రంథరాజములు గదా! "శ్రీ మహాభారతత్తాల్ దూతుపోనవన్ ఏత్తంశొల్లుగిఱదు." భారతసారము శ్రీకృష్ణ వృత్తాంతమే యని సాయించిరి. పాంచరాత్రము ఆరవపాశురమున "పుళ్లరైయిన్ కోయిలిల్ వెళ్ళవిళి శఙ్గమ్ పేరరవమ్" - గరుడధ్వజుని కోవెలలోని ఆరాధనా పరికరమగు శుఖధ్వని అనుటయు, "శఙ్గొడి క్కాట్టైవెణ్పల్ తవత్తవర్, తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోకిన్దార్" - "ఎర్రని కన్నులును, కాషాయ వస్త్రములును, తెల్లని దంతములును గల సత్త్వ నిష్ఠులగు సన్న్యాసులు (ప్రపన్నులు) బ్రాహ్మీముహూర్తమున మేల్కొని కాల్యకృత్యముల దీర్చుకొని తమ దేవాలయములకు ఆరాధన చేయుటకై ఆరాధనోపకరణముల దీసికొని పోవుచున్నా" రని చెప్పటచే పాంచరాత్రాగమము గూడవినిపించితి మనుచున్నారు. ఇట్టి యధికారికి ఇతరోపాయత్యాగము, ఇతర ఫలత్యాగము, ఇతర దేవతా త్యాగము నుండవలయును గదా! నమ్మాళ్వారు ఆండాళ్ తల్లి మొదలగు ప్రకృష్ట జ్ఞానులే మడల్ గ్రహణము. (ఉదాహరణము).

కామారాధనము మొదలగు వ్యాపారములను చేసినట్లు వారి ప్రబంధముల లోనే కన్పడుచున్నదే! అది దోషము కాదా? అన్నచో "జ్ఞానవిపాక కార్యమాన అజ్ఞానత్తా లేవరుమత్తై యెల్లామ్ అడిక్కళజ్జ పెఱుమ్" శ్రీ వచన. ప్ర. 1. సరూ 91), కర్మవలన కలుగు అజ్ఞానముచే చేయబడునవి దోషారహములే కాని, భక్తి పారవశ్యముచే వచ్చునట్టి ప్రవృత్తులన్నియును అత్యంత శ్లాఘ్యమున్నైనవని చెప్పబడెను. దీనిచే భగవంతుని పొందుటలో త్వరాతిశయము సూచింపబడుచున్నది.

**పుళ్ళిన్‌వాయ్ కీణ్డానై -**

ఒక నీళ్ళమడుగు నమీపవములో నొకకొంగ ఆహారము తినుచుండగా ఒక రాక్షసుడా కొంగలో ప్రవేశించి శ్రీకృష్ణుని, ఆతని యనుచర వర్గమును హింసింపదొడగెను. దానిని గ్రహించి శ్రీకృష్ణుడు దాని ముక్కును పట్టుకొని మామూలు శిశువు గడ్డిపోచను సులభముగా రెండుగా చీల్చునట్లు రెండుగా చీల్చివైచెను. ఈ సంఘటన వలన భగవద్గీత లోని క్రింది విషయము సూచింపబడుచున్నది.

"కర్మేంద్రియాణి సంయమ్య యఆస్తే మనసా స్మరన్,
ఇన్ద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యా చారస్స ఉచ్యతే॥" (భ.గీ. అ 3. శ్లో 6.)

ఆత్మ జ్ఞానమును సంపాదింపవలయునని కర్మేంద్రియములను బలవంతముగా బిగబట్టుకొని యుండుము నెవ్వడు విషయలంపటుడగుచే మనస్సుతో విషయములను తలంచుచుందురో వాడు మిథ్యాచారి అనగా మోసగాడు అని భావము. ఇక్కడ చేపలను పట్టుకొనవలయునని యొక కొంగ తన కన్నులను, ముక్కును మూసికొని, రెక్కలను, కాళ్ళను కదల్పనీయక బిగించియుంచి, మనస్సుతో చేపనే తలంచుచుండుటచే పైన చెప్పబడిన మిథ్యాచారిని పోలియున్నది. ఈ కొంగను చీల్చి పారవైచుటచే ఆ మిథ్యాచారికిని యిదేఫలమని భగవంతుడు సూచించెను. ఈ గోపికలకీ కొంగను చంపుట రావణుని సంహారమువలె తోచుచున్నది.

**కుళ్ళక్కుళిర క్కుడైన్దు నీరాడాతే పళ్ళిక్కిడత్తియో -**

మాతో కలసి గడగడ వణికించునట్లుగా మునిగి స్నానము చేయక పరుండియున్నావా? లేచిరమ్ము. మన మిాశీతోదక స్నానము నభిలషించు నది యింతకాలము మనలును తపింపజేయుచున్న విరహతాపమారుటకే

గదా? ఆలసించిన సూర్యుడుదయించి నీటిని వెచ్చచేయును ఆ వేడి నీ రామనతాపమునార్చునది? మన యీ స్నానము విరహము నార్చుటకే గాకయిక నెన్నడును నిట్టి విశ్లేషవ్యసనమును రానీయక రక్షించును. ఈ స్నానముకంతరార్థము శ్రీకృష్ణ కల్యాణ గుణావగాహనము. దానిని మాతో కలసి చేయకపరుండి యున్నావా? ఇట్టి యవకాశము మరిరాదు సుమా!

**కళ్ళంతవిర్న్దు కలన్దు -**

స్వయంపాకుల వలె నీవు ఒంటరిగా శ్రీకృష్ణ కల్యాణగుణముల ననుభవించుట యను కపట నాటకమును విడువుము. అది తగదు. లేచి మాతో కలసి ప్రత్యక్ష కృష్ణానుభవమునకు సహకరింపుము. లెమ్ము. త్వరపడుము. ఇట్టి వేళల ఆలసింపరాదు సుమా! లే! లెమ్ము!

**వేదాంతార్థము**

**పుళ్ళిన్వాయ్ కీణ్డానై -**

"శ్రేయాంసి బహువిఘ్నాని." - మంచి పనులకు అన్నియు ఆటం కములే. ఆ పనులలో ఉత్తమోత్తమమైనది భగవత్ప్రాప్తి. దానికి సాధనము భగవంతుని సందర్శనము. "భిద్యతే హృదయగ్రన్థి............ తస్మిన్ దృష్టేపరావరే.' ' పరులని లోకులు భావించు బ్రహ్మరుద్రేంద్రాదులను అపరులను (తక్కువ వారిని) గా జేయు శ్రియఃపతిని దర్శించినచో జీవుని ప్రకృతి బంధము డుల్లిపోవును. ఆదర్శనమున కాటంకము విషయప్రావణ్యమును, దానివలన బుట్టునట్టి అహంకార మమకారములను కారణము. అని మన ప్రయత్నముచే తొలగవు. మరింత బలపడును. భగవంతుడే తన ప్రయత్నముచే తొలగింపవలయును. దానికొరకై యాతని ప్రార్థించ వలయును. దానికి ఈ శావాస్యోపనిషత్తులో నొక మంత్రము కలదు. దాని నెరిగి అనుసంధించవలయును. అది యిది -

"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యా హితంముఖమ్,
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టతే ॥"

"ఓ దయామయా! నామనస్సు విషయప్రావణ్యముతో నావరింపబడి యున్నది. అందుచే నాధర్మమైన నీ దర్శనముచేయ జాలకున్నాను. కావున, కృపతో నీవా విషయ ప్రావణ్యమును తొలగింపుము. "అనునది మంచి

హృదయముతో ప్రార్థింతుమేని దానిని ఆ దయాసాగరుడే పోగొట్టును. ఎవరికి? ఆయననే ఉపాయమనగా నమ్మిన వారికి "మామేవయే ప్రపద్యన్తే మాయా మేతాంతరన్తితే.", "మామేకం శరణం వ్రజ అహంత్వాసర్వ పాపేభ్యో మోక్షయిష్యామి?", "అహం స్మరామి మద్భక్తం నయామి పరమాంగతిమ్" చేయేల? ఆ భక్తుని భారమంతయు భగవంతునిదేయని - "సత్యం తే ప్రతిజానే ప్రియోసిమే." అని ప్రమాణము చేసి చెప్పెను. ప్రస్తుత పాశురములోని బకాసురనిరసన వృత్తాంతము ఈ యర్థమునే సమర్థించుచున్నది. ఆ బకాసురుడే అహంకార మమకారములు. అది యా గోపాంగనల కుండెడివి. వాని నాతడే తొలగించివైచెను. దేవాసుర యుద్ధవిజయానంతరము దేవతలకు జనించిన అహంకార మమకారములను తన విలక్షణ చర్యవలన తొలగించిన ఘట్టము లీ విషయమును ఋజువు చేయుచున్నవి

**పొల్లానరక్కనై -**

రాక్షసుడనగా రావణుడు. అనగా కామక్రోధములు. ఇవి పొల్లా. చెడ్డవి. ఇవి చేయించని పాపములేదు. రావణుడు కామము, క్రోధముల వలన చేయని పాపము లేదు. "కామార్తా హిప్రవృత్తి కృపణాశ్చేత నాచేతనేషు.' ' అని వివేకమును హరించును. ఇది పెద్దపిన్నయని చూడనీయదు. అర్జునుడు కోపముతో ధర్మరాజును చంపుటకై దొరకొనెను. ఇది మిక్కిలి అపకారి. ఒక కవి యిట్లు వచించినాడు చదువుడు -

"అపకారిణి చేత్కోపః కోపః కోపే కుతోనతే?" అనెను.

నీ కపకారము చేసెనని గదా వానిపై నంత కక్షను సాధించుచున్నావు. ఐనచో కోపమును మించిన అపకారి లోకములేదే! దానిపైన కక్షను సాధించవచ్చును కదా? అట్లు చేయలేదేమి? యనెను. భగవద్గీత తృతీయాధ్యా యావసానమున శ్రీకృష్ణుని,

"అధకేన ప్రయుక్తో యం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్న పివార్ణ్ష్ణేయబలాదిన నియోజితః ॥"

"ఓ కృష్ణా! ప్రాజ్ఞుడైనను, కూడదని తెలిసినను లోపలనుండు నొక శక్తి బలముచే ప్రేరేపింపబడి పాపమును చేయుచున్నాడే. ఆశక్తియేది?" అని అర్జునుడు ప్రశ్నించగా శ్రీకృష్ణుడు,

"కామ ఏషః క్రోధ ఏషః రజోగుణ సముద్భవః ।
మహాశనో మహా పాప్మా విద్ధ్యేన మిహవైరిణమ్ ॥

"ఓ అర్జునా! అది రజోగుణమువలన పుట్టిన కామము యొక్క శక్తి. అది ప్రేమించిన విషయమును పొందువరకు ప్రాణిని తికమకలు పెట్టి చంపును. అతనికా విషయము లభించినచో" నిరుగు పొరుగు వారు దానిని లభించనీయక అడ్డుపడుచున్నారని వారి మీద విరుచుకపడును. చివరకు అది క్రోధముగా మారును. ఇందుకామము మహాశవము తిండిపోతు. ఎంత అనుభవించినను దానికి తృప్తి తీరదు. కుంభకర్ణుడే అనుకొనుము. ఇక క్రోధమందువా. అది మహా పాపము. అంతకు మించినపాపము మరియొకటిలే" దని కాను దౌర్జన్యమును బహు ముఖముగా వినిపించి చివరకు - "జహిశత్రుం మహాబహో! కామ రూపందురాసనమ్" అని యుపదేశించెను

ఈ విధమగు విషయ పావణ్య జనితాహంకార మమకారములను, కామ క్రోధములను తన భక్తుల కుండనీయక భగవానుడు తొలగించి వేయును. కావుననే

"సర్వేషామేవ ధర్మాణా ముత్తమో వైష్ణవో విధిః ।
రక్షతే భగవాన్ విష్ణుః భక్తా నాత్మ శరీరవత్ ॥"

"భగవంతుడు తన భక్తులను తన శరీరమును వలెనే రక్షించును. అందరును వైష్ణవులుకండు. అనగా విష్ణు చిహ్నములను ధరించి, విష్ణు మంత్రము ననుసందంచి, నిష్ఠా వ్వరాధనను చేసి, వైష్ణవ మార్గమును, విష్ణుసాయుజ్యమును బడయుడు" అని తెలియజేయుచున్నది.

ఇచ్చట, "పాల్లావరక్కనై" అని కేవల రాక్షసుడనక - "పాల్లా = దుష్టుడైన" అని యొక విశేషమును చేర్చెను. దీనిచే వేదాంతార్థములో - చెడ్డ కామక్రోధములు "అనునర్థము సిద్ధించుచున్నది. అయినచో మంచి కామక్రోధములు కూడ ఉన్నట్లు తోచుచున్నది నిజమే! కామమున మంచి, చెడ్డలున్నవి. పాకృత పదార్థముల యందలి కామము చెడ్డది. భగవంతుని యందుండు, భగవద్భక్తుల యందును గల కామము మంచిది. ఇది ఉపనిషత్తులలో - "నిదిధ్యాసి తవ్యః" - అని విధింపబడియున్నది. "యథాద్రష్టవ్యః తధానిదిధ్యాసితవ్యః" - కంటికి గోచరించు నంతటి

విశదముగా మనస్సునకు గోచరించునట్లు ధ్యానింపుమని శాస్త్రము చెప్పుచున్నది. అదియే భగవత్కామము. ఇది శ్రేష్ఠమైనది. అట్లే క్రోధమును మంచిది, చెడ్డది అని రెండు విధములుగా నుండును ఇది భగవంతుని యందును, భగవద్భక్తుల యందును, ఆచార్యుల యందును ఉన్నచో చెడ్డది. శత్రువుల పట్ల ప్రవర్తించినచో మంచిది

ఈ రహస్యమును ఈ "పొల్లా" అను విశేషము తెలుపుచున్నది.

వెళ్ళియెళున్దు -

శుక్రుడు తేజిష్ఠమైన నక్షత్రము, అర్ధచంద్ర ప్రకాశమై వెలుగొందును. దీనిని బట్టి పరిశుద్ధమైన జ్ఞానమభివృద్ధి చెందినదని యర్థము.

వియాళముఱఙ్గిత్తు -

గురుగ్రహమస్తమించినది. అనగా జ్ఞానము వృద్ధియైనచో అస్తమించినది అజ్ఞానమే గదా! కాలక్షేప కూటములో నన్వయించిన వారికి పాపములు పోయి దేహాత్మ భ్రాంతి మొదలగు ఆత్మవ్యాధులు అరును తొలగి ఆత్మ యాథాత్మ్య జ్ఞానముదయించును. ఇదియే శుక్రోదయము.

పళ్ళిక్కిడత్తియో -

ఓ కన్యారత్నమా! ఒంటరిగా చేయు అనుభవమున కేమియానంద మున్నదమ్మా! మనమందరము కలసి ఆయనుభవము చేయుదము.

పావాయ్‌నీ - మృదు స్వభావము గల నీవు

మార్దవ మనగా నెడబాటును సహింపజాలకుండుట. నీవు భాగవత విరహమును సహించిన స్వభావము కలదానవై యుండి యొంటరిగా భగవద్గుణానుభవమును చేయదగునా? భగవద్విరహము నైనను సహింపగలము గాని భాగవత విరహమును మేము సహింపగలమా? భాగవత విరహమును భగవంతుడే సంహింపలేడే! ఇది నీబుద్ధికి తోచతలేదా? ఒకనాడు నారదమహర్షి శ్రీమన్నారాయణుని సేవించుటకై వైకుంఠమున కేగెనట. అచ్చట ఆయన కాన్పించలేదు. సూర్యమండలమునకు బోయెను. అందును ఆయన కనిపించలేదు. ఆయన హృదయము కలతజెందినది. ఆయినను, ఆ మహర్షి అన్వేషణను మానలేదు. ఇట్లు అన్వేషించుచు పోగా పోగా ఒక చోట మాత్రము వీణ, మృదంగము

మొదలగు వాయిద్య పరికరములతో ఉన్మత్తకానంద పరవశులై కొందరు భగవద్భజన గావించుచుండుట కానవచ్చెను. ఆ భజనపరులలో దాను ఒకడై శ్రీహరి నిశ్చింతగా కూర్చొని యుండెను. ఆ పరమ పురుషుడు కన్పింపగనే నారదుని హృదయ మానందసాగరమున నీదులాడినది. పడిన శ్రమయంతయు మటుమాయమైనది. నెమ్మదిగా ఆ మహాప్రభువుతో నారదుడిట్లనినాడు. "ప్రభూ! నేను మీ కొరకెక్కడనో గాలించితిని. చివరకు నాశ్రమకు ఫలితముగా మీరిక్కడ దొరకితిరి. ఆందోళమునకు గురియైన నా మానస మిప్పుడు కుదుటపడినది." అని తాను తిరిగిన స్థానముల నొక్కొక్కటిగా నేకరవు పెట్టెను. అది విని భగవానుడాతని తోనిట్లనెను.

"నాహంతసామి వైకేణ్ఠే న యోగిహృదయే రవౌ,
మద్భక్తా యత్రదాయన్తే తత్రతిష్ఠామి నారద! ॥"

ఓ నారదా! నేను గానలోలుడని నీకు తెలియదా. సంగీతమునకు కరగుదును. నీవు సంగీత సాధనము చేతనే నాయనుగ్రహమునకు పాత్రుడనైతివను విషయమును మరచితివి కాబోలు! నా భక్తులు జేయునాగుణాను సంధానమును విడువజాలక యచ్చట స్థావర ప్రతిష్ఠగ (తిష్ఠామి, ష్ఠా = గతిని వృత్తౌ) నుందుననెను.

ముదలాళ్వారులు ముగ్గురు నొక్కచోట చేరియుండగా మధ్యను ఇరుకుకొని దర్శనమిచ్చెను గదా! లక్ష్మణుడవతారమును చాలించిన వెంటనే - "లక్ష్మణేన గతాంగతిమ్" - అని రామచంద్ర మూర్తియు నవతారమును చాలించెను గదా! నీవీ భాగవత గోష్ఠిలో చేరకుండగ నొంటరిగా నెట్లు పవ్వళించగలవు? భగవద్గుణాను సంధానములో మైవరచితా?

**నన్నాళాల్ -**

ఓ తరుణీ శిరోమణీ! మనకిది యెంత మంచి దినము!
"అద్య మేసఫలం జన్మ సుప్రభాతా చమేనిశా,
యదున్ని ద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్ర క్షామ్యహం ముఖమ్॥"

మనమందరమును కలసి దేవదేవునకు సుప్రభాతమును విన్నవించి వారి శ్రీ ముఖమండలమును దర్శించి సేవించినచో మనకెంత యానందము కలుగునో నీవెరుగవా. మనకదియే సుప్రభాతము సుమా!

**కళ్ళమ్ తవిర్న్దు -**

ఓ కన్యకుల వసంతమా! వైష్ణవులకు ఒంటరి తనము తగదు. "అడియార్గళ్ కుళాజ్గళ్ ఉడన్ కూడువ తెన్నుకొలో" - భాగవత గోష్ఠిలో చేరి భగవదనుభవము జేయునదెన్నడో గదా! యని మనకు మన కూటస్థులకు నమ్మాళ్వారులు నేర్పినయనుష్ఠానము.

పెరియనంబి గారు, క్రిమి కంఠుడను దుర్మార్గుడు పెట్టిన బాధను సహింపలేక కూరత్తాళ్వారుల యొడిలో తలనుంచుకొని పరమ పదించినపుడు అనాథ ప్రేత సంస్కార సంఘసభ్యులు వచ్చిచూచి - "ఈయన అనాథ కాదురా! ఈయనకొక ఆప్తులున్నారురా!" అని విడచిపోవుచుండగా కూరత్తాళ్వారులు వారితో - "ఓరీ! మూర్ఖులారా! శ్రీవైష్ణవులెన్నడును అనాథులు కారు. వారివెంట భగవానుడెప్పుడును పంచాయుధ సమన్వితుడై యుండి వారిని తన శరీరము వలె కాపాడుచుండును" అనిరి.

అందుచే ఓ కన్యా తిలకమా! నీవు ఒంటరిగా భగవద్గుణాను సంధానమును వీడి మా గోష్ఠిలో జేరి నీవానందించి, మమ్మానదింపజేయు' ' మను చున్నారు.

## పదునాల్గవ పాశురము

**"ఉజ్గళ్"**

## అవతారిక

ఈ వ్రతమునకు అవసరమగు సామగ్రినంతను సిద్ధపరచు సామర్థ్యమున్నదై తాను ముందుగా లేచి అందరును తానే లేపగలదానని చెప్పి, దానిని మరచి నిదురబోవుచున్న యొక మధుర భాషిణిని లేపుచున్నారు.

## పదునాల్గవ పాశురము

ఉజ్గళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్।
శెజ్గళునీర్ వాయ్నెకిళ్ న్దామ్బల్ వాయ్ కూమ్బిన కాణ్,

శెఙ్గల్పొడి క్కూఱై వెణ్బల్ తపత్తవర్ ।
తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోకిన్డార్ ।
ఎఙ్గళైయున్న మెళ్ళుప్పవాన్ వాయ్‌పేశుమ్,
నఙ్గాయ్! విళున్దిరాయ్, నాణాతాయ్! నావుడైయామ్!
శఙ్గొడు శక్కర మేన్దుమ్, తడ క్కైయన్,
పఙ్గయ క్కణ్ణానై ప్పాడేలో రెమ్బావాయ్.

టీకా:- ఉఙ్గళ్ = నీయొక్క, పుళై+కడై కాలిబాట (ఇంటి, పెరటి) యందుగల, తోటత్తు = తోట యొక్క, నావియుళ్ = దిగుడు బావిలోనున్న, శెఙ్గళునీర్ = ఎర్రదామరలు (కలువలు), వాయ్ + నెగిళున్దు = నోరు తెరచినవి (వికసించినవి), అమ్బల్ = నల్లకలువలు, వాయ్ + కూమ్బిన = కళ్ళు మూసినవి (ముకుళించినవి), కాణ్ = చూడుము, శఙ్గల్ + ప్పొడి జేగురు రంగులో తడిసిన, కూఱై = వస్త్రములు గలవారును, వెణ్ = తెల్లని, సల్ = పండ్లు గల, తపత్తవర్ = తపో వేషధారులగు సన్న్యాసులు, తఙ్గళ్ = తమ యొక్క, తిరుక్కోయిల్ = దేవాలయములలో, శఙ్గిడువాన్ = కుఞ్చికోలనియెడు బీగముచే తలుపు తెరచుటకు పోగిన్డార్, పోవుచున్నారు (తిరువారాధన చేయుటకై), ఎఙ్గలై = స్నానముచేయుటకై, యున్నమమును, మున్నమ్ = ముందుగ వచ్చి, ఎళున్పవాన్ = లేపెదని (లేపునట్లు), వాయ్ + పేశుమ్ = మాట చెప్పి (లేకపోయిన), నఙ్గామ్ = పూర్ణులారా, ఎలున్దిరాయ్ = లేచిరమ్ము, నాణాదాయ్ = సిగ్గులేనిదానా, నా + వుడైయామ్ = నీ మధురమైన సంభాషణమును వినవచ్చితిమి, శఙ్గడు = పాంచజన్యమును (శంఖమును), శక్కరం = శ్రీ సుదర్శన చక్రమును, ఎలున్దుమ్ = ధరించినవాడై, తడ = దీర్ఘములగు, కణ్ణానై = నేత్రములు గలవాడును అయిన సర్వేశ్వరుని, పాడ = గానము చేయుటకు (రమ్ము) ఏల్ = ఇష్టమున్నచో, ఓర్ = యోజింపుము, ఎంపావాయ్ం = మా యీ యభిప్రాయమును మన్నించిరమ్ము!

తాత్ప:- ఓ కన్యారత్నమా! ఎంతగట్టిదానవే? నీవు ముందుగా లేచి మమ్ములను లేపుటకై మాటయిచ్చియు అట్లుచేయవు గదా! పోని, మేము వచ్చి లేపినను లేవకున్నావు. "ఇంకను వేకువ కాలే" దని బూకరింతువా? మంచి మాటకారివే. నాలుకున్నదని గడుచుమాటలాడ లజ్జింపవలదా? మేమసత్యము లాడుచున్నామని యందువేమో? మే మసత్యములాడు

చున్నామని యందువేమో? అదిగో, నీ దొడ్డిలోనున్న తోటలోని నడబావిలో నున్న ఎర్రదామరలు వికసించినవి. కన్నుమూసినన నిన్ను పరిహసించు చున్నవి. నీవు అభిమానవతివి కావా. లెమ్ము. సహస్ర పత్రముల దెగడు నీ కనుగవ నొక్కమారు తెరిచిచూడుము, ఎంత పొద్దెక్కినదో తెలియును. విచ్చిన తామరల జూచి పరుల సంపద నోర్వలేని వానివలె నల్లకలువలు ముకుళించినవి అవియైన తెల్లవారినదని తెల్పుచుండుట లేదా? ఒకవేళ లేదనియే అనుకొనుము. కాని, కాషాయ వస్త్రములను ధరించి, తెల్లని దంతములు గలిగి తపో వేషధారులగు సన్న్యాసులు తమతమ దేవ స్థానములకు కుంచెకోలలు అను భీగములలో తలుపులు తీయునిమిత్తమై పోవుచున్నారు. తామ సారాధన కాలము సాత్త్వికులకు ప్రమాణమో? కాక, సాత్త్వికమగు నీ మాటప్రమాణమో? మాకేదియును తెలియుట లేదు. సిగ్గు లేనిదానా! లేచిరమ్ము. నీ మధురములైన మాటలను వినుటకై వచ్చితిమి. శంఖమును, చక్రమును ధరించు విశాలములగు చేతులు కలవాడును, పుండరీకాక్షుడును నైన నారాయణుని గూర్చి పాడవలయును. జాగుచేయక లేచిరమ్ము!

**తెనుగుసేత :-**

పూదోట నడబావి బూచె కెందామరలు
కాంచుమామ్ముకుళించె కలువ పూలు,
కావులీను మడుంగు కటి జుట్టి, తెల్లని
పలుచాలు తోడి తపస్వివరులు,
దేవాలయముతల్పు దీయగుంచికబూని,
వెడలు చుండిరదిగో! వెలదిమిన్న!
"మిమ్ము ముందుగ వచ్చి మేలుకొల్పెద" నంచు,
మాటిచ్చి మరచిన మాటకారి

దాన! లేవమ్మ! యింకమందాక్షహీన!
పరమ పూరుష వ్యాదీర్ఘ బాహువులను
దర్శనము పాంచజన్యము దాల్చువాని
గాన మొనరింపరావమ్మ! కంజనేత్రి! (కమల నయన!)

విశేషార్థము

ఉజ్జళ్ పుళ్ళైక్కడై = ఒక విధమైనతామర పూవులు వికసించి, కలువపూవు లుముకుళించినంత ప్రొద్దెక్కినది.

శెజ్జళునీర్ వాయ్ నెకళ్న్దు అమ్బల్వాయ్ కూమ్బినకాణ్ -

స్త్రీల నేత్రములను కలువ పూవులతో పోల్చుట కలదు.

నజ్ఞాయ్ = పూర్ణురాలా!

నాణాదాయ్, నావుడైయామ్ = సిగ్గుమాలిన వారికి నాలుక బలము మెండు. నీకా భాగ్యమబ్బినది.

పజ్జయక్కణ్ణానై = పుండరీకాక్షుని, ఇది నారాయణునకు మాత్రమే అసాధారణ లక్షణము.

ఇక్కడనుండి విశేష, వేదాంతార్థములను పూర్తిగా విరమించు కొనవలసి వచ్చినందులకు మిక్కిలి విచారించు చున్నాను. పెద్దలు, ద్రవిడ భాషాభిమానులు, రసజ్ఞులు, పరిత్యలోకము నన్ను మన్నింతురుగాక!

పండితలోకము ఈ చొరవకు కినియక యప్పటి యట్ల ఆదర భావమును కలిగియుందురుగాక!

సతీర్థ్యులు నాయీ సాహసమునకు పరిహసింపకుందురుగాక!

## పదునైదవపాశురము

ఎల్లే! యిళజ్గిళియే ఇన్నముఱజ్గుతియో;
శిల్లెన్ఱళైయేన్మిన్, నంగైమీర్ పోదరుగిన్ఱేన్,
వల్లైఉన్ కట్టురైకళ్! వణ్డే ఉన్వాయఱిదుమ్!
వల్లీర్గళ్ నీజ్గళేనానేదా నాయిడుగ,
ఒల్లైనీపోదాయ్ ఉనక్కెన్నవేఱుడైయై,
ఎల్లారుమ్ పోన్దారో? పోందార్ పోన్దెణ్ణిక్కొళ్,
వల్లానైకొన్ఱానైమాత్తారై మాత్తళిక్క
వల్లానై, మాయనైప్పాడేలో రెమ్బావాయ్.

టీకా:- ఇళంకిళియే = లేతచిలుకా!, ఎల్లే = ఓహో! (ఏమి ఆశ్చర్యము!), ఇన్నమ్ = ఇంకను, ఉఱజ్గుదియో = నిద్రించుచున్నావా? (అని వచ్చినవారడుగగా?), నంగైమీర్ = పూర్ణులారా!, పోదరుగిన్ఱేన్ = ఇదిగోవచ్చు చున్నాను, శిల్లెన్ఱు = చివుక్కుమని, (జల్లుమని), అళైమేన్మిన్ = పిలువకుడు (అరవకుడు), మీర్ = మీరు, నజ్గై = గొప్పవారు, వల్లై = నీవు మాట్లాడుటలో సమర్థురాలవు, ఉన్ = నీయొక్క, కట్టు + ఉరైగళ్ గడుసు మాటలు (పుల్ల విరుపు మాటలను), ఉన్ + వాయ్ = నీ నోటి సామర్థ్యమును, పణ్డే = మునుపే, అఱిదుమ్ = మేము ఎరుగుదము, (అని వచ్చిన వారు చెప్పగా) నీఙ్గళే = ఇట్లు చెప్పినమీరే, వల్లీర్గళ్ = సమర్థురాండ్రు, నానేదాన్ =(మీరు చెప్పినట్లుగనే) నేనే, అయిదుగ = నేర్పరిగ ఉండనిమ్ము, (మీకు నేను చేయవలసినదేమి చెప్పడు), నీ = నీవు, ఒల్లై = త్వరగా, పోదామ్ = లేచిరమ్ము, ఉనక్కు = నీకు మాత్రము, వేఱు = వేరే అనుభూతి, ఎన్న = ఏమి ప్రయోజనము?, ఉడైయై = ఉద్దేశించి యున్నావు? (అని అడుగగా), పోన్దార్ = వచ్చియున్నారు, పోన్దు = వచ్చి, ఎణ్ణిక్కొళ్ = లెక్కపెట్టుకొనుము, (అనగా), వల్లానై = బలిష్ఠమగు కువలయా పీడనమను ఏనుగును, కొన్ఱానై = చంపిన వాడైన, మాత్తారై = కంసుడు మొదలగు శత్రువుల యొక్క, మాత్తు = మదము (శాత్రవము)ను, అళిక్క నశింపజేయుటకు, వేల్లానై = సమర్థుడైన, మాయనై = ఆశ్చర్య గుణచేష్టితములు గల శ్రీకృష్ణుని, పాడ = కీర్తించుటకు, వల్లానై పోదామ్ = నీవు శీఘ్రముగా లేచిరా!

తాత్ప:- "ఓ లేత చిలుకా! ఇంకను నిద్రించుచున్నావా? ఇది యేమి యాశ్చర్యమే!" అనగా (బ్రాహ్మీ ముహూర్తములో పడకపై నుండియే పరమాత్మను ఏకాంతముగా ధ్యానించుచున్న గోపాంగన), "గుణాలంకృతులారా! ఇదుగోవచ్చుచున్నాను" అనెను. బైటనున్న గోపికలు - "ఓ చిన్న చిలుకా! నీవు మాటలలో చాలచమత్కారము కలదానవు. నీ నేర్పరితనము, నీ వుల్లవిరుపు దెప్పడు మాటలు మేమిది వరకే యెరుగుదుము." అనిన లోపలి గోపిక "మీరే అట్టి సామర్థ్యము కలవారు, నేనేమియు కాదు. పోనిండు, మీరు చెప్పినట్లు నేనే అట్టి దానిననుడు. రావలసిన వారందరును వచ్చినారా?" బైటి గోపికలు. "ఆ, అందరు వచ్చియున్నారు. మా మాటలపై నీకు నమ్మకము లేకపోయినచో నీవు వచ్చి చూచుకొనుము." లోపలి గోపిక "నేను వచ్చిచేయవలసిన పనియేమి?"

బైటి గోపికలు కువలయాపీడనమను కంసుని యేనుగును, కంసాది శత్రువులను సంహరించిన సర్వేశ్వరుని కల్యాణ గుణములను కీర్తింతము. లేచిరమ్ము! వట్టి మాటలతోనే సరిపెట్టుచున్నావు గాని పడక విడచి లేచిరాకున్నావు. నిన్ను రానీక యాపినదెవరు? సమాన ధర్ములతో కలసి పంచుకొన్న సౌఖ్యమే ఆనందాతిరేకమును కలిగించును. "ఏకస్స్వాదున భుంజీత." మిక్కిలి రుచిగల పదార్థమును ఒక్కరే భుజింపరాదు అనెడి న్యాయమును వినలేదా? మనకు లభించిన ఆనందమును నలుగురకును పంచిపెట్టదలచి అపరిమిత సంతోషముతో మనము తలపెట్టిన వ్రతమిది అనుటమరచితివాయేమి? పోనీ, ఇప్పటికైనను త్వరగారా!

నిద్రించు గోపకన్యలను మేలుకొలుపు పాశురములలో నిది కడపటిది. ఇంతకు పూర్వపు 9 పాశురములలో లేపవచ్చిన వారిమాటలే, ఇందులో పవ్వళించిన యామె మాటలను గూడ కలసి ఉక్తి రూపముననున్న ప్రత్యుక్తి పాశురము.

తెలుగుసేత:-

ఎందాక నిద్రింతువే? లేతకీరమా!
　　వరవర్ణినులు మీరు దురుసుపల్కు
లాడబోకుండిదే యరుగు దెంచితినేను,
　　గట్టిదానవు, నీవు గడుసుమాట
లన్నిన్ను మేమెల్ల మున్నే యెరుంగుదు
　　మంగన: మీరల దిట్టనగుదు గాక
నేన, యేమందురు? నీ వ్యైక్యతే యొంటి
　　భోగభాగ్యమ్ము పొందె దేల?

బయలుదేరుము వేగిర: బాధ్యతెరిగి
అందరేతెంచి నారము, అరచికొనుము,
కువలయాపీడనమ్మను కుంజరమును
సంహరించిన మాయవి చక్రపాణి

రమ్ము గీర్తింప దుర్దమా రాతిఘాతి.

ఈ ప్రబంధమున మొదటి పాశురము మొదలు అయిదు పాశురముల వరకు ప్రపన్నుని నిష్ఠాక్రమమును, ప్రపత్తవ్యుదగు శ్రియఃపతి

అత్యంత సులభుదగుటకు మూలమైన అవతారక్రమమును తెలుపబడినది. ఆపైన ఆరవపాశురము మొదలు పదునైదవ పాశురము వరకును ప్రపత్తి ముందుగా నుండవలసిన వాక్య గురుపరంపరా ప్రభావము తెలుపబడినది. భగవత్ప్రాప్తికై ప్రయత్నించువారు గాని, అధికముగా భగవద్విషయమున అవగాహించువారు గాని మనకు సమముగా ఉద్దేశ్యులే అని చెప్పబడుచున్నది.

## పదునారవ పాశురము

నాయకనాయ్ నిన్ఱ నన్ద కోపనుడైయ
కోయిల్ కాప్పానే! కొడిత్తోన్ఱుమ్ తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్,
ఆయర్ శిఱుమియరో ముక్కు, అఱైపఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలేవాయ్ నేర్న్దాన్,
తుయోమాయ్ వన్దోమ్ తుయిలెళపాడువాన్,
వాయాల్ మున్నం మున్నమ్ మాత్తాలేయమ్మా! నీ
నేశనిలై క్కతవమ్ నీక్కేలో రెమ్బావాయ్

టీకా:- నాయకనాయ్ + నిన్ఱ = (ముందు లేచినవారు నిద్రించుచున్న వారిని లేపగా అందరును గూడిపోయి) మాకు నాయకుడై యున్న, నన్దగోపనుడైయ = శ్రీనంద గోపుని యొక్క, కోయిల్ = తిరుమాలిగను, కాప్పానే = కాపాడువాడా! (కాపరీ!), కొడి = ధ్వజము (టెక్కెము), తోన్ఱుమ్ = ప్రకాశించుచున్న, తోరణ = మకరతోరణములు గల, వాశల్ = తోరణపు వాకిలిని (ద్వారమును), కాప్పానే = రక్షించు ద్వారపాలకుడా! (కాచియుండు వాడా!) మణిక్కదనం = సుందరమైన తలుపు యొక్క, తాళ్ గడియ (తాళము), తిరవాయ్ = తెరువుము (ప్రవేశింపజేయ వలయును అనగానే పూతన వంటి వారేమో, మిమ్ములోపల ప్రవేశింపజేయుటకు భయముగా నున్నది అనిన), ఆయర్ గొల్ల కులమున బుట్టిన (కుడి ఎడమ తెలియని), శిఱుమియర్ = చిన్న పిల్లలమైన, ఓముక్కు = మాకు, మాయన్ = ఆశ్చర్య గుణచేష్టతములు గల, మణివణ్ణన్ = నీలమాణిక్య వర్ణుడైన శ్రీకృష్ణుడు, నెన్నల్ + ఏ = నిన్ననే, అఱై = శబ్దించెడు, పఱై = వాద్యము (దక్కి) ను ఇప్పించెదనని,

వాయ్ నేర్న్దాన్ ఇచ్చునట్లు చెప్పినాడు (అతడు చెప్పినను మీరు ప్రయోజనాంత పరులు గదా! అనిన), తూయోమాయ్ అనన్య = ప్రయోజనులమై (పవిత్రలమై), తుయిల్ + ఎళ = నిద్రలేచునట్లు ప్పాడువాన్ = పాడువారమై (మేల్కొలుపు పాటలు పాడుటకై), వన్దోమ్ = వచ్చి యున్నారు, అమ్మా! = ఓ స్వామీ, మున్నం మున్నం = ముందు ముందుగా, వాయాల్ = నీ నోటితో, మాత్తాదే = అడ్డుపెట్టక, నేశమ్ = స్నేహము గల (గట్టిగా చేరియున్న), నిలై = సెలవు యొక్క, కదవమ్ = తలుపులను, నీ = నేవే, నీక్కుం = తెరువుము.

తాత్ప:- మాకందరకు ప్రభువగు నందగోపుని యొక్క భవనమును రక్షించు వాడా! తోరణములతో ప్రకాశించుచున్న లోపలివాకిలిని రక్షించువాడా! మణిమయమగు తలుపుల యొక్క గడియను తెరువుము. ఆశ్చర్యకరములగు చేష్టలుగల వాడును, నీల మణివలె ప్రకాశించు శరీరకాంతి కలవాడునునగు శ్రీకృష్ణుడు మంచి చెడ్డలెరుగని గొల్లకన్నియలమగు మాకు నిన్ననే వ్రతాచరణమునకు తగిన తాళవాద్యము (దక్కి) నొసగుదునని మాట యిచ్చినాడు. అట్టి శ్రీకృష్ణుని కీర్తింపవచ్చితిమి. మొట్టమొదటనే మారుమాట పలుకకుము. గడపలకు చక్కగా కలసియున్న తలుపుల గడియలను తీయుము.

తెలుగుసేత :-

మాన్యడౌ నందుని మాళిగ కాపరీ!
ధ్వజ పటాలంకృత ద్వారపాల!
గొల్ల కన్యలమిదె, కొనుము వందనము, ర
త్న ఖచిత ద్వారబంధనము తెరువు
మణివర్ణుడౌ మాయి మాట యొసగెనిన్న
మాకు డక్కియిడగ మాననీయ!
పరిశుద్ధ తరలమై యరుదెంచి నారము
నిదురచే పంగను నీలవర్ణు

మొట్ట మొదటనే మమునడ్డు పెట్టుమాట
లాడబోకుము, జరిగిన యరమరలను
నీవనీచేత బోద్రోచి పోవనిమ్ము
మమ్ములోనికి సుప్రభాతమ్ము పాడ..

# పదేనేడవ పాశురము

అమ్బరమే తణ్ణీరే శోఱే అఱఞ్చెయ్యుమ్,
ఎమ్బెరుమాన్! నన్ద గోపాలా! ఎళున్దిరాయ్,
కొమ్బనార్కెల్లాం కుళున్దే! కుల విళక్కే!
ఎమ్బెరు మాట్టి! యశోదాయ్! అఱివుఱాయ్,
అమ్బరమూ డఱుత్తోఙ్గి ఉలగళన్ద,
ఉమ్బర్ కోమానే! ఉ ఱఙ్గా దెళున్దిరాయ్,
శెమ్పొఱ్కళలడిచ్చెల్వా! బలదేవా!
ఉమ్బియుం నీయుముఱఙ్గేలో రెమ్బావాయ్.

టీకా:- అమ్బరమే = వస్త్రమును, తణ్ణీరే = చల్లని తీర్థము (నీరము) ను, శోఱే = అన్నమును, అఱమ్ = ధర్మ బుద్ధితో, శెయ్యుమ్ = దానము చేయునట్టి, ఎమ్ = మాకు, పెరుమాన్ = స్వామియైన, నన్దగోపాలా! = శ్రీ ఓనంద గోపాలా!, ఎళున్దిరాయ్ = లెమ్ము (లేవవలయును), కొంబు + అనార్క్కు + ఎల్లామ్ = ప్రబ్బలి చెట్లవంటి స్త్రీల కందరికిని, కొళున్దే = చిగురువలెనుండు దానా, కులవిళక్కే = గొప్ప కులమునకు మంగళ దీపమై ప్రకాశించుదానా! (వంశ ప్రకాశిక ప్రదీపమా!), ఎమ్ =మాకు, పెరుమాట్టి = స్వామినియునైన (యజమానురాలా!) యశోదాయ్ = యశోదాదేవీ, అఱువురాయ్ = లేవ వలయును (మేల్కొనుము), అమ్బరమ్ = ఆకాశమంతయు, ఊడు = మధ్య ప్రదేశమును, అఱుత్తు = భేదించుకొన (చీల్చి), ఓఙ్గి = ఉన్నతముగా (పరమ పదమునకు) పెరిగి, ఉలగు = లోకములను (సమస్త), అళన్ద = (పాదములతో) కొలచుట చేత, ఉమ్మర్ = దేవతలకు (నిత్యసూరులను), కోమానే = ప్రభువై వాడా!, ఉఱఙ్గాడు = నిద్రించక, ఎళున్దిరాయ్ = లేవ వలయును (అనగా శ్రీకృష్ణుడు లేవకుండగా ముందుగా బలరాముని లేపు క్రమము తప్పితిమని), శెమ్ + పొన్కళల్ = ఎర్రని బంగారు కడియములు, ప్రకాశించుచున్న (బిరుదు పెండరము గల), అది = శ్రీపాదములు గల, శెల్వా = శ్రీమంతుడవగు (సుందరుడగు), బలదేవా = బలదేవుడా? (బలరాముడా!) ఉమ్బియుమ్ = నీతమ్ముడైన శ్రీకృష్ణుడును, నీయుమ్ = నీవును, ఉఱఙ్గేల్ = నిద్రింపకుండవలయును (నిద్రపోకుడు).

తాత్ప:- ద్వారపాలకులు తలుపులు తెరచి గోపాంగనలను లోనకి పంపిరి. వారు మొదటిదియగు నందుని మంచము వద్దకు పోయిరి. ఆనందుడు

బట్టలను, చల్లని తీర్థమును, అన్నమును ధర్మబుద్ధితో దానముచే యస్వభావము కలవాడు. ఆతని యా విశేషణములలో - "మాకు స్వామియైన ఓ నందగోపాలా!" అని సంబోధనా పూర్వకముగా లేపిరి. ఆతడు సంజ్ఞతోనే లోపలికేగ అనుమతి నొసంగెను. అచ్చట రెండవ మంచముపై ప్రబ్బలి కొమ్మవలె సుకూరియగు నట్టియు, చిగురు వలె కోమలియగు నట్టియు, గోపకులమునకు కులదీపమువలె ప్రకాశించునదియు, తమ స్వామినియైనది యునగు యశోదా విని మేల్కొలిపిరి. సంజ్ఞను బట్టి ఆమె యనుమతించినట్లు గ్రహించి. "ఆకసమంటునట్లుగ పెరిగి, సకల లోకములను కొలచినవాడును, దేవతలకు రాజైన వాడునునగు కృష్ణుని - "ఓ కృష్ణా! మేల్కొను" మని లేపిరి. కాని, యాయన కదలను, మెదలను లేదు అంతనా గోపాంగనలు ఆలోచించి" - మనము పెద్దవాడైన బల రాముని లేపకయే ఆతని తమ్ముడు కృష్ణుని లేపుటయును నొక పెద్ద తప్పచేసితిమి. అందువలననే యాతడు లేవలేదు కాబోలు!" అని తెలిసికొని - "బంగారు గండపెండేరము కాలికి గలయో బలరామా! నీ తమ్ముడు శ్రీకృష్ణుడును, నీవును నిద్రింపక లేచిరం" డని క్రమముగా లేపుచున్నారు. గండపెండేరము వీరత్వమునకు గుర్తు.

తెలుగు సేత:-

కడుపున కన్నంబు, కట్టంగ బట్టయు,
          త్రాగనీరము నిచ్చు దానశౌండ్య!
మారాజ! నిదురలెమ్మా నందగోపాల!
          కోమలాంగులలోన గొమిరెమిన్న
మాకుల దీపమా! మాస్వామి నీయశో
          దాదేవి! సుప్రభాతమ్ము లెమ్ము!
నింగి దూటుచు పొంగనంగమ్ము వెంచిలో
          కాల గొల్చిన వగకాడ! మింటి

దిమ్మరీడుల యెకిమీడ! దేవకీకు
మార! నిద్రలేవయ్య! బంగారు గండ
పెండెరము కాలివాడ! తమ్ముండు, నీవు
మేలుకొనరయ్య! బలదేవ! మేలుకొనుడు.

# పదునెనిమిదవ పాశురము

ఉన్దు మదగళిత్త నోడాద తోళ్వలియన్
నన్దగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దజ్కమళుం కుళలీ! కడైతిఱవాయ్
వన్దు ఎఙ్గుమ్ కోళియళైత్తన గాణీ, మాదవి
ప్పన్దల్ మేల్ పల్కాల్ కుయిలినఙ్గల్కూ వినగాణ్
పన్దార్ విరలి! యున్మైత్తునన్ పేర్పాడ
శెన్దామలై క్కైయాల్ శీరార్ వళైయొళిప్ప
వన్దు తిఱవాయ్ మగిళ్న్దేలో రెమ్బావాయ్.

టీకా:- మధ = మదజలము, ఉన్దు = స్రవించుచుండెడి, కళిత్తన్ = ఏనుగుల వంటి, ఓ డాద = శత్రువులకు వెనుదీయని, తోళ్ = భుజముల యొక్క, వలియన్ = బలముగల, నన్దగోపాలన్ = నందగోపాలుని యొక్క, మరుమగళే = కోడలా!, కన్దమ్ = గంధము (సువాసన), కరుళుమ్ = పరిమళించుచున్న, కుళలీ = కుంతము (వెంట్రుకలు గలదానా!, నప్పిన్నాయ్ = నీళాదేవి, కడై = తలుపును, తిఱవాయ్ = తెఱువుము (అనిన నేను లేచుటకు తెల్లవారినదా యనగా), కోడి = కోళ్ళు, వన్దు = వచ్చి, మాధవి = మాధవీ లతయొక్క, ప్పన్దల్ మేల్ = పందిరి మీద, (జాజి పందిరిపై), కుయిల్ = కోకిల యొక్క, ఇనజ్గల్ = సమూహములు, పల్కాల్ = పలుమారులు, కూవిన = కూయుచున్నవి, కాణ్ = చూడుము, పన్దు = బంతిలో, ఆర్ = అమరియున్న, విరలి = వేళ్ళుగల దానా!, ఉన్ = నీయొక్క, మైత్తునన్ = మేనమామ కొడుకు యొక్క (మేనరికపు సంబంధులగు మీరిరువురును సల్లాపములాడు నపుడు నీ పక్షమునుండి), పేర్ = నీ మేనమామ కుమారుడు శ్రీకృష్ణుని తిరునామములను, పాడ = మేము కీర్తించుటకు అనుగుణముగ, శీర్ = సౌందర్య సంపదచేత, ఆర్ = అతిశయించియుండు, (పూర్ణమైన), వళై = చేతికంకణాది ఆభరణములు (హస్తములలో ధరించి యుండు), ఒళిప్ప = శబ్దించునట్లుగా, (ధ్వనించు నట్లుగా), వన్దు = వచ్చి, శెర్ + తామరై + కైయామ్ = ఎర్రతామర పుష్పము వంటి (మృదువైన) చేతులలో, మగిళిన్దు ఏల్ ఓర్ ఎంపావాయ్ = సంతోషముతో, వన్దు = వచ్చి, తిఱవాయ్ = తలుపు(ను) తెరువుము.

తాత్ప:- మద జలధారలు కురియు ఏనుగులు కలవాడును, చెక్కుచెదరిని

భుజబలము కలవాడునునగు నందుని యొక్క కోడలా! నీళాదేవీ! సుగంధము విరజిమ్ము కొప్పు కలదానా! గడియ తెరువుము. కోళ్ళు నాలుగు దిశలను దిరుగుచు కూయుచున్నవి. మాధవీలతల పొదలందు కోకిలలు కమ్మగా పాడుచున్నవి. క్రీడార్థ కందుకమును చేతబట్టుకొనియే నిదురించుచున్నదానా! నీవల్ల భువి దివ్య నామములను కీర్తింపవచ్చితిమి. అందము కులుకు గాజులు గలగలమని చేయు చప్పుడుతో ఎఱ్ఱదామరల వంటి మృదువైన చేతులతో తలుపులు తెరువుము అనుచున్నారు.

**తెలుగుసేత:-**

మదపుటేన్గులగముల్ మర్దింప జాలిన
  బాహో పటిమగల్గు భాగ్యశాలి,
శ్రీ నన్దభూపాలు మేన గోడలసాగ
  నిగ్గుల వలపుల నెరులదాన,
నీలా మహాదేవి! కోలాహలము సేయు
  కొక్కురో కోయంచు కోళ్ళగుంపు,
గురివింద పందిరి కొనరెక్కి కోయిలల్
  కుహుకుహూ యంచును గూయదొడగె,

కందు కమునాడియలసిన కాంతవేగ
నిదుర లేవమ్మ! కీర్తింప నీదుప్రియుని
తలుపు తెరువుము కెందామరలను బోలు
కరతలమ్ముల నులియంగ గంకణములు.

## పందొమ్మిదవ పాశురము

కత్తు విళక్కెరియ క్కోట్టు క్కాల్కట్టిన్మేల్,
మెత్తెన్ఱ పఞ్చ శయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూఙ్గుళల్ నప్పిన్నై కొఙ్గైమేల్.
వైత్తు క్కిడన్ద మలర్ మార్పా! వాయ్ తిఱువాయ్,
మైత్తడఙ్కణ్ణినాయ్! నీయున్ మణాళనై,
ఎత్తనై పోదుమ్ తుయిలెళ వెట్టాయ్ కాణ్
ఎత్తనై యేలుమ్ పిరినాత్త కిల్లాయాల్,
తత్తువ మన్ఱు తకవేలో రెమ్బావాయ్.

టీకా:- కుత్తు విళక్కు = గుత్తి దీపములు, విరియ = నలు ప్రక్కల వెలగుచుండగా, కోట్టుక్కాల్ = ఏనుగు దంతములచే చేయబడిన కాళ్ళు గల, కట్టిల్ మేల్ = మంచము మీద, చల్లదనము, సువాసన, సౌందర్యము (అందము), తెల్లదనము, మృదుత్వము గలిగిన మేలైన పరుపుపైన వికసించిన పుష్పములను కొప్పునదాల్చియున్న నీలాదేవియొక్క స్తనములను మీదనిడుకొని శయనించి యున్న విశాల వక్ష స్థలము గలవాడా! లేచి చింతింపవలదు" అని యొక మాటచెప్పరాదా! యనిన, అందుకవకాశ మియ్యకున్న నాళాదేవియొక మనోభావమును గ్రహించి, ఓదేవీ! నీవును మా వంటి యాడుదానవే కదా? కాటుకతో కూడిన విశాల నేత్రములు కలదానా! నీవు నీ భర్తను ఒక్క క్షణకాలమైనను నిద్రనుండి లేపి పుణ్యము కట్టుకొనుము నీ ప్రాణనాథుని యెంత ప్రొద్దైనను నిదురమేల్కొన నీయవు. క్షణకాలమైన ప్రియునెడబాసి యుండలేవే ఏమి ఆశ్చర్యము! ఇది నీ స్వరూప స్వభావములకు తగదు సుమా!

తెలుగుసేత :-

కంబాల దీపాలు కాంతీనగ దంత
పల్యంకమున మేలి పాన్పుమీద,
నిర్వాధి గంధవన్నిత్య నూతనసుమ
గుచ్ఛ శోభిత నీలకుంతలాఢ్య!
పీవరో రోజ నప్పిన్న వరాట్టుకు
చద్వయీా లీన విశాలవక్ష!
నీవేని పల్కరాదావాయి యరవిచ్చి?
కాటుక దిద్దిన కంటిచాన!

ప్రాణ కాంతుని క్షణమైన పడకవిడచి
వెడల నీయవె? విగడియ విరహమేని
తాళలేవిట్టి స్వార్థము తగునె? పూరు
షోత్తముడు నీకొకర్తెకు గుత్త యగునె?

## ఇరువదియవ పాశురము

ముప్పత్తు మూవర్ అమరర్కు మున్ శెన్రు,
కప్పమ్ తివిర్కుమ్ కలియే! తుయిలెళాయ్,
శెప్పముడైయాయ్! తిఱలు డైయాయ్! శెత్తార్కు,
వెప్పమ్ కొడుక్కుమ్ విమలా! తుయిలెళాయ్,
శెప్పన్న మెన్ములై శెవ్వాయ్చ్చిరు మరుఙ్గుల్,
నప్పిన్నై నఙ్గాయ్! తిరువే! తుయిలెళాయ్,
ఉక్కముం తట్టొళియుమ్ తన్దున్ మణాళనై,
ఇప్పోతే ఎమ్మైనీ రాట్టేలో రెమ్బావాయ్.

టీకా.- ముప్పత్తు మూవర్ = ముప్పది మూడుకోట్ల, అమరర్కు = దేవలకు, మున్ = ముప్ప వచ్చుటకు ముందుగా, శెన్రు = వారు తలచిన స్థలములకు పోయి, కప్పమ్ = వారియొక్క భయమును, తవిర్కుమ్ = తొలగించుటకు, కలియే = సామర్థ్యము కలవాడా!, తుయిలెళాయ్ = మేలుకొనుమ్ము (నిద్ర నుండి లేచిరమ్ము), శెప్పమ్ = అర్జనము, ఉడైయాయ్ కలవాడా! (ఆశ్రితులను రక్షించువాడా), తిరల్ = బలము, ఉడైయామ్ = ఒదవిన వాడా!, శెత్తార్కు = ఆశ్రిత విరోధులకు, వెప్పమ్ = భయమును, కొడుక్కుమ్ = కలిగించునట్టి, విమలా పరిశుద్ధుడా (నిర్మలుగా), తుయిలెళామ్ = నిద్రనుండి మేల్కొనుము, శెప్ప + అన్న = బంగారు కలశము వంటి, మెన్ = మృదువైన, ములై = స్తనములును, శెవ్వయ్ = ఎర్రని అదరమును, చిరు + మరుఙ్గుల్ సన్నని నడుమును గలిగిన నప్పిన్నై నప్పిన్నయను పేరుగల, నఙ్గాయ్ = పూర్ణురాలా, తిరువే = శ్రీ మహాలక్ష్మివంటిదానా?, తుయిలెళాయ్ = నిద్రనుండి మేల్కొని, ఉక్కుమ్ = మా నోమునకు ఉపకరణమగు ఆలపట్టము (విసన కర్రను, త ట్టొళియుమ్ = కంచుటద్దమును, ఉన్ = నీ యొక్క, మణాళనై నీ పెనిమిటియైన శ్రీకృష్ణుని, తన్దు = ఇచ్చి, ఎమ్మై = విరహముచే కృశించి యున్న మమ్ములను, ఇప్పొదే = ఇప్పుడే, నీరాట్టు = స్నానము చేయింపుము, ఏలోరెమ్బావాయ్ = మా విన్నప మాలింపుము.

తాత్ప:- అష్ట వస్తువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతియను ముప్పది ముగ్గురు దేవతలకు ముందు నిలిచి, వారి భయమును మాన్పి, వారు తమ శత్రువులకు కష్టములు చెల్లించకుండా రక్షించునట్టి దేవా? విమలుడగువాడా! నిదురమేలుకొనుము. బంగారు

గిండ్ల వంటి స్తనములు, సన్నని నడుము, పగడము వలె నెర్రనైన పెదవితో గూడ మమ్ములను స్నానమాడించి సుఖింపజేయుము.

తెలుగుసేత:-

ముమ్ముందు యేతెంచి ముప్పది మూడుకో
టుల యమరుల భీతి తొలగదోయ
బాలింప దీనుల జాలన యౌదార్య
శౌర్య సంపదలున్న శాంతమూర్తి!
పరిపంథులను భయం పరచు తేజశ్శాలి
మేలుకోవయ్య! మమ్మేలుకొనుము
బంగారు కుండల రంగారు వక్షోజ
ములును నెన్నడుము కెమ్మోవిదాన

నిదుర లేవమ్మ! సీమంతి నీమతల్లి
ఆలపట్టటము దెమ్మునీ లావ ధూటి
దర్పణము నిమ్ము నందనందనుని మమ్ము
చెలగి యిప్పడు నీరాడజేయు మమ్మ!

## ఇవదియొకటవ పాశురము

ఏత్తకలజ్ఞ శెతిర్ పోజ్ఞిమీతళిప్ప,
మాత్తాతే పాల్ శొరియుమ్ పళ్ళల్ పెరుమ్పశుక్కళ్,
ఆత్తప్ప డెత్తాన్ మకనే! అఱివుఱాయ్,
ఊత్తముడైయామ్! పెరియాయ్!, ఉలికినిల్,
తోత్తమాయ్ నిన్ఱ శుడే! తుయిలెళాయ్,
మాత్తారునక్కు వలితులైన్తున్ వాశఱ్కణ్,
ఆత్తాతువ న్దున్నడి పణియుమాపోలే,
పోత్తియామ్ వన్దోమ్ పుకళ్న్దేలో రెమ్బావాయ్.

టీకా:- ఏత్తకలజ్ఞళ్ = పాలు పితుకుటకై పెట్టిన భాండములు, ఎదిర్ పొజ్ఞి = పైకి పొర్లి, మీదళిప్ప = పొరలునట్లు, మాత్తాదే = ఎడతెగక, పాల్ = పాలను, శొఱియుమ్ = వర్షించునట్టి (స్రవింపజేయునట్టి), వళ్ళల్ సాధువులైన (ఔదార్యముగల), పెరుమ్ = బలిసియుండు, పశుక్కళ్ = పశువులను, ఆత్త

= సమృద్ధిగా (లెక్కలేనన్ని) ప్పడైత్తాన్ = సంపాదించిన నంద గోపుని యొక్క, మకనే = ప్రియమైన పుత్రుడా, అఱివుఱాయ్ం మేలుకొనుము, ఉత్తముడైయామ్ = నమ్మిన వారిని కాపాడుట యందు శ్రద్ధ కలవాడా!, పెరియామ్ = గొప్పవాడా!, ఉలకినిల్ = (ఈ) లోకమందు, తోత్తమాయ్ నిన్ఱ = ఆశ్రితులను రక్షించుటకవతరించి యున్న, శుడరే = తేజోరూపుడా!, తుయిలెళాయ్ = నిద్రనుండి మేలుకొనుము, ఉనక్కు = నీకు, మాత్తార్ = శత్రువులు, వలి = బలమును, తులైన్దు = పోగొట్టుకొని, ఉన్ = నీయొక్క, వాశల్కణ్ = వాకిలియందు, అత్తాదు = వేరుగతిలేక, వన్దు = వచ్చి, ఉన్నడి = నీయొక్క పాదములను, పణియు మాపోల్ = సేవించునటులనే, యామ్ = మేమును, పుకళ్న్దు నీ యొక్క కళ్యాణగుణములను కీర్తించి, పోత్తి = మంగళాశాసనము చేయుటకు, వన్దోమ్ = వచ్చియున్నాము, ఏలో రెమ్బావాయ్ = మా ప్రార్థన మంగీకరించుము.

తాత్ప:- ఓ నందకుమారా! నిద్ర లెమ్ము. నీ తండ్రియైన నందులవారు గొప్ప యైశ్వర్య సంపన్నుడు. పాలుపితుకుటకై పెట్టిన పాత్రలన్నియు నిండి పొంగి పొరలి పారునట్లు క్షీరధారల నెడతెగక గురియించు సాధువులైన పెద్దయాల మందలను గలిగినవాడు. అట్టి వాని పుత్రుడవు నీవు. వేదాంతములకును అంతుతెలియని మహిమోన్నతుడవు. నీ తేజస్సు సహస్రకోటి సూర్యప్రకాశము. అట్టి నీవులోక రక్షణార్థము. నీ తేజస్సును కుంచించుకొని, మాకన్నులు చూడవీలగునట్లు విభవావతారుడై అవతరించినావు. మమ్మును గ్రహింప వచ్చిన పరమాత్మవు కాని వేరుకాదు. ఓ మహిమోన్నత తేజ స్వరూపా! నిద్రనుండి మేలుకొనుము. శత్రుకోటి నీముందు నిల్వలేక బలహీనులై వేరుగతిలేక దీనులై నీ సన్నిధికి వచ్చి నీ పాదముల నాశ్రయించునటులనే, ఓ భక్తమందారమా! మేమును నీ యొక్క కళ్యాణ గుణములకును, నీ సౌందర్య గాంభీర్య సౌశీల్య సౌహార్దములకును వశలమై నిన్నునుతించి మంగళాశాసనము చేయు నిమిత్తమై వచ్చియున్నాము. ఓ తేజోరూపుడా! నిద్ర చాలించి వచ్చి మమ్మును గ్రహింపుము. తత్త్వమరసి లెమ్ము. నీ పాదసేవికలమగు మా విన్నప మాలింపుము. ఎన్ని మారులు నిద్ర లేపుదుము. ధర్మోద్ధరణ భారమును మోయవలసిన నీకీ నిద్రపోతు తనము పనికి రాదు సుమా!

తెలుగుసేత:-

ఆక యొకింతయు లేక పట్టిన పాల
　　పాత్రులు నిండారి పైన పొరలి
పొరు నట్టుల పాల వర్షించు నావుల
　　గలవాని పుత్రుడా! కన్నుదెరుము
రక్షింప భక్తుల శిక్షింపవైరుల
　　తేరి చూడగ రానితేజు పుడమి
దూపు గట్టియట్టు లేపు నూపిన తండ్రి
　　మేలుకోవయ్య మమ్మేలు కొనుము,

ఎదురుకొనుట కుభుజబలమేది? నీదు
పగఱునీ యింటి వాకిట వంచబడిన
యట్లు యోస్వామి! మమ్మునీ యడుగుదామ
రలను గీర్తించు శరణాగతులముగనుము.

## ఇరువది రెండవ పాశురము

అఙ్గణ్ మాఞాలత్తరశర్, అభిమాన
బఙ్గమాయ్ వన్దునిన్ పళ్ళిక్కట్టి ఱ్కీళే,
శఙ్గమిరుప్పార్ పోల్వన్దు తలైప్పెయ్ తోమ్,
కిఙ్గిణివాయ్చ్చెయ్త తామరై ప్పూప్పోలే,
శెఙ్గణ్ శిఱిచ్చిఱితే యెమ్మేల్ విఙియానో,
తిఙ్గళు మాదిత్తియను మెలున్దాఱ్పోల్,
అఙ్గణిరణ్డు ఙ్కొణ్డెఙ్గళ్ మేల్ నోక్కుదియేల్,
ఎఙ్గళ్ మేల్శాపమిన్దేలో రెమ్బావాయ్.

టీకా:- అమ్ = సుందరమైన, కణ్ = ప్రదేశములు గల, మా = మిక్కిలి గొప్పదైన, ఞాలత్తు = పృథివియందలి, అరశర్ = రాజులు, అభిమాన = అహంకారమును, బఙ్గమాయ్ = పోగొట్టుకొని, వన్దు = వచ్చి, నిన్ = నీయొక్క, పళ్లి = పడుకొన్న, కట్టిల్ = మంచము యొక్క, కీలే = క్రింద, శఙ్గమ్ = గుంపులుగా, ఇరుప్పార్పోల్ = ఉండువారివలె, వన్దు = వచ్చి (మేమును నీవుండు చోటునకు), తలైప్పెయిదోమ్ = చేరితిమి, కిఙ్గిణి = చిరుమువ్వలు

(చిన్నగజ్జెలు), వాయ్‌చెయ్‌దు = నోరు విచ్చిన, తామరై + పూ + పోల్ = తామర పూవులవలె, శమ్ = ఎర్రని, కణ్ = కన్నులు, శిఱిచ్చిఱిదే = కొంచెముగా, ఎమ్మేల్ = (యమ్ + మేల్) = మాపై, విళియావో = ప్రసరింపజేయుమా!, తిజ్గళుమ్ = చంద్రుడును, ఆదిత్తియనుమ్ = సూర్యుడును, ఎళున్దాఱ్పోల్ = ఉదయించినట్లు, ఆమ్ = సుందరమయిన, కణ్ = కన్నులు, ఇరణ్డు + కొణ్డు (ఇరణ్డుఙ్గొడు) రెండింటిని గొని, ఎజ్గళ్‌మేల్ = మాపైన్, నోక్కుదియేల్ = నీచూపు పడినచో, (కటాక్షించినట్లయినచో), ఎజ్గళ్‌మేల్ = మామీదనున్న, శాపవ్ం = పాపము, ఇళిన్దు = నశించును, ఎలోరెమ్బావాయ్ = దయతో సమగ్రహింపుము.

తాత్ప:- ఓ దేవా! సస్యశ్యామల సుందరమైన ఈ సువిశాల భూభాగములకు రాజులమనుకొనిన వారు తమ అహంకార మమకారములను అణచుకొని వచ్చి, నీదయకు కాచుకొన్నట్లు, విశ్వ విశ్వంభరాధీశ్వరుడవగు నీవు శయనించుచోట గుంపుగూడి దేహాభిమానము, ఆత్మాభిమానము, అహంకార మమకారములను వదిలి మేమును నీయడుగు దమ్ముల కడజేరితిమి. ఎర్రదామర పూవుల వలె నొప్పచున్న నీ నేత్రములను మాపైనొక్కమారు ప్రసరింపజేయుము. సూర్యచంద్రులుదయించినట్లున్న నీ పవిత్ర దృక్ప్రసారముచేత రూపాములన్నియు నశించును. మేము పవిత్రులమగుదుము. మా మనవిని ఆలకింపుము.

తెలుగుసేత:-

విపులావనీ నాథుల పగత గర్వులై
నీదు కంకటికను నెలవుజేసి
కొనినయట్టుల, మేము కోమలాంగులమెల్ల
నీ పాదసన్నిధి నిలిచినాము
చిరుత గజ్జెలువోలె చెన్నొందు కెంపుదా
మరలు నాదరవిక స్వరవిలోచ
నాంచలమ్ముల కాంతులించుక మాపయి
ప్రసరింపజేయుమా! పరమపురుష!,

వేడి వెలుగును జల్లని వెలుగుబోలు
రెండు కన్నుల నెండరేయెండ గురిసి

# ఇరువది నాలుగవ పాశురము

అన్టివ్వులగ మలన్దాయ్! అడిపోత్తి
శెన్టజ్గత్తెన్ని లజ్గై శెత్తాయ్! తిఱల్‌పోత్తి,
పొన్టచ్చగడము దైత్తాయ్! పుగళ్‌పోత్తి,
కన్టుకుణిలా వెఱిన్దాయ్! కరళ్ పోత్తి,
కున్టు కుడైయా ఎడుత్తాయ్! కుణుంపోత్తి,
వెన్టువగై కెడుక్కుమ్ నిన్‌కైయిల్ మేల్ పోత్తి,
ఎన్టెన్టున్ శేవగమ్ యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్టుయామ్ వన్దోమ్ ఇరజ్గేలో రెమ్బావాయ్.

టీకా:- అన్టి = వామనావతార కాలమున (తమలోకమును బలిచక్రవర్తి అపహరింప దేవతలు శ్రమపడుచున్ననాడు), ఇవ్వులగమ్ = ఈ లోకములను, అళాన్దాయ్ = రెండడుగులచే కొలుచుకొన్న) వాని యొక్క, అడి = శ్రీ పాదములకు, పోత్తి = మంగళమగుగాక, అజ్గు = శ్రీరామావతార కాలమున (నీలాదేవి నెడబాపిననీచుడగు రావణుడున్న స్థలమునకు, శెన్టు =వెళ్లి, తెన్ = సుందరమైన, ఇలంగై = లంకను (సొగసైన కోటగల లంకానగర మందుండు దుష్టరాక్షసులను), శెత్తాయ్ = నశింపజేసిన వాని యొక్క, తిఱల్ = భుజపరాక్రమమునకు, పోత్తిః మంగళము కలుగవలయును, పొన్ట = నశించునట్లు, (కట్టు వీడి రూపునట్లుకూయు) గా, చ్చగడం = శకటాసురుని, ఉదైత్తాయ్ = పాదము చేతన్ని చంపిన వాని యొక్క, పుకళ్ = పొగడ్తకు, (కీర్తికి), పొత్తి = మంగళముగుగాక!, కన్టు = దూడ రూపమై వచ్చిన వత్సాసురుని, కుణిల్ + అ + కుణిలా = బంతి కట్టిన కర్రగాగొని, ఎఱిన్దాయ్ = కపిత్తాసురుని పైకి ఎగురవేసిన వానియొక్క, కళల్ = అడుగులకు, పొత్తి = మంగలమగు గాక!, కున్టు = గోవర్థన పర్వతమును, కుడైయామ్ = గొడుగుగా, ఎడుత్తాయ్ = ఎత్తిన వానియొక్క, కుణమ్ = నీ కృపాగుణమనకు, పోత్తి = మంగళమగు గాక!, వెన్టు = వేరుతో, పగై = ద్వేషమును, కెడుక్కుమ్ = నశింపజేసిన, నిన్ నీయొక్క, కైయిల్ = చేతిలోనున్న, వేల్ = బల్లెమునకు, పోత్తి = మంగళమగు గాక! ఎన్నెన్టు = ఈ ప్రారము మంగళాశాసనము చేసి, ఉన్ = నీయొక్క, శేవగమే = వీర చరిత్రము (శౌర్యము)నే, ఎత్తి = పొగడి (కొనియాడి), పఱై = నిన్ను, కొళ్వార్ = అనుభవించుట కొరకు, ఇన్టు = ఈనాడు (బందువులయు,

ఊరివారలయు సమ్మతి గల్గిన వాడు), యామ్ = మేము (బంధువులచే బహుకాలముగ శ్రమింపబడుచు), వన్దోమ్ = వచ్చితిమి గాన (నిన్నె డబాసి జీవింపలేక), ఇరఙ్గ = దయజూడుము, ఏలోరెమ్బావాయ్ = మా యాశముల నెరవేర్పుము. నిరాశపరులను గావింపకుము.

తాత్ప:- ఓ దేవా! బలి, దేవతల మైశ్వర్యము నంతయు నపహరింపగా వారు బాధపడుచున్న సమయమున వామనుడవై యవతరించి, యే రెండు పాదములో లోకములనన్నిటిని కొలచితివో ఆనీ రెండు పాదవకును మంగళమగు గాక! సీతాదేవిని అపహరించిన దక్షిన ద్వీపాది (లంక) పతియగు రావణుని లంకకేగి మిక్కిలి అందమైన లంకాపట్టణమునంతను నాశనమొనర్చిన నీ బలమునకు మంగళమగుగాక! రక్షణకొరకై పెట్టిన బండిలో రాక్షసుడు ప్రవేశించి నిన్ను చంపుటకై యత్నించిన వానిని కాలితో తన్ని ఆ రాక్షసుని తుత్తుని యలొనరించిన నీ కీర్తికి మంగళాశాసనమగు గాక! దూడ రూపమును ధరించి వచ్చిన రాక్షసుడును, వెలగ చెట్టుగ దారికి అడ్డముగా నిలిచియున్న కపిత్థాసురుడును నిన్ను చంపనుద్యమించి సంకేతము చేసికొని రాగా నీవాకుట్రను గ్రహించి వత్సాసురుని కాళ్ళు పట్టుకొని త్రిప్పి కపితాసురునిపై విసరి యిద్దరిని నొకసారిగా సంహరించిన నీ శ్రీపాదములకు మంగళాశాసనమగుగాక! దేవేంద్రుడు రాళ్ళ వర్షమును కురింపగా గోవర్ధనగిరిని గొడుగుగా నెత్తియుంచిన నీ అన్నృశంస్య గుణములకు మంగలాశాసన మగుగాక! (ఆశ్రిత రక్షణము అన్నృశంస్యము) శత్రువులను చీల్చి చెండాడునట్టి నీచేతి బల్లెమునకు మంగళాశాసన మగుగాక! ఇట్లనేకములైన నీ వీరచరితములను నోరార స్తుతియించి మా నోమునకువలసిన పరికరములను తీసికొనుటకై నేడు వేము వచ్చియున్నాము. దయయుంచి వానిని ప్రసాదింపుము. మాయార్తిని వమ్ము చేయకుము నీ దివ్య గుణ సంకీర్తము గావించి నీ యాదరాభిమానముల చూరగొని మా కోరికల దీర్చుకొన వచ్చిన గొల్ల కన్నెల మగుమాపై కడగంటి వెన్నెలల సారించుము.

తెలుగుసేత:-

జయమంగళము శ్రీశః జగముల గొలచిన
యానాటి నీదుపాదాబ్జములకు

శుభమంగళములంక జొచ్చి యాపొలదిండి
దనుజుల జెండు దోర్దండముకు
శ్రీ మంగళము బండిరేద్రిమ్మరిని మట్టు
పెట్టిన నీ పాదఘట్టనకును

మాటకందని నీ మహిమలనుతించి
కోరికల బొందవచ్చిన గొల్లకన్నె
లాతపత్రీ కృతోన్నతా హోర్యనీకు
మంగళము! సర్వజేతకు మంగళమ్ము!

## ఇరువది యైదవ పాశురము

ఒరుత్తి మగనాయ్ ప్పిఱన్దు ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర
త్తరిక్కిలా నాగిత్తాన్ తీఙ్గు నినైన్ద,
కరుత్తైప్పిళై ప్పిత్తు క్కఞ్జ న్వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱనెడుమాలే! యున్నై
యరుత్తిక్క శెల్వముమ్ శేవనముమ్ యామ్బాడి
వరుత్త ముమ్దీర్ న్దుమగిళ్ న్దేలో రెమ్బావాయ్.

టీకా:- ఒరుత్తి = అసమానయగు దేవకీ దేవికి, మదర్ + అయ్ + పుత్రుడవై, పిఱన్దు = పుట్టి ఓర్ + ఇరవిల్ = ఒకే రాత్రి యందే (బృందావనమున నందగోపని యింటికిజేరి), ఒరుత్తి + మగనాయ్ యశోదాదేవికి కుమారుడుగా, ఒళిత్తు = ఏకాంతముగా (దాగి), వళర = పెరుగుచుండగా, తరక్కు = సహనము, ఇల్లాన్ + ఆహిత్తాన్ = లేనివాడియి, తాన్ = తాను, (ఈ విషయము నెరిగిన కంసుడు), తీఙ్గు = శ్రీకృష్ణుని యే విధము చేతనైనను చంప, నినైన్ద = తలంచిన, కఞ్జన్ = కంసుని యొక్క, కరుత్తై = అభిప్రాయమును, పిళైప్పిత్తు = వ్యర్థమగునట్టుచేసి, వయిత్తిల్ = ఆతని గర్భమందు, నెరుప్పు + ఎన్న = అగ్నివలె, నిన్ఱ నిలచియున్న, నెడుమాలే = ఆశ్రిత వ్యామోహము కలవాడా! (పరదైవమా) ఉన్నై = నిన్ను, అదుతిత్తు = పురుషార్థమును యాచించుటకై, వన్దోమ్ = వచ్చినాము. పఱై = కాంక్షితము, తరుదియాగిల్ = నెరవేర్చి పురుషార్థమును ఇచ్చినట్లయిన, తిరుత్తక్క = తగిన, శెల్వమ్ = సంపదను, శేవగమ్ = పరాక్రమమును, యామ్ = మేము, ప్రీతితో గానముచేసి, వరుత్తముమ్ = నిన్నెడ బాసిన శ్రమము, తీర్న్దు = తొలగిపోయి,

మగిళ్న్దు = సంతోషించిన వారమగుదుము. ఏలో రెమ్బావాయ్ మా ప్రార్థనను అంగీకరించి దయచూపుము.

తాత్ప:- ఓ దేవా! నీవు పుట్టుక లేనివాడయినను, నీవంటి కొడుకును కోరిన, పృశ్ని, సుతపులకు అట్టి వరమును ప్రసాదించి, నిన్ను బోలినవాడు వేరొక్కడు లేనందున నీవే వారికి కొడుకుగా అవతరించినావు. అయినేమి? నీముద్దు ముచ్చటలు చూచి యానందించు భాగ్యము వారికి లేదు. కంసుని భీతికి జడిసిన నీ తండ్రి వసుదేవుడొక్క రాత్రికే నిన్ను రేపల్లెకు యశోద ప్రక్కకుజేర్చెను. యశోదతపః ఫలమే మందుము? పరదైవమైన నీలాల్య వినోదములననుభవించి యానందించినది. యశోదానందుల కొడుకుగానే పెరుగుచున్నను ఈ వృత్తాంతమును నారదుని వలన విని కంసుడు రాబోవు ననర్థము నెరుగక సహింపలేని వాడైయేదో విధముగ నిన్ను చంపవలయునని చెడ్డ బుద్ధితోనుండగా వాని ప్రయత్నము నంతను వ్యర్థపరచి వానికడుపున చిచ్చున బెట్టినట్లు నిలచిన భక్తవత్సలా! కృష్ణా! నిన్ను పురుషార్థమును వేడవచ్చితిమి. మా సంకల్పము నీడేర్చదలచితివేని శ్రీలక్ష్మీదేవి యాశపడదగిన సంపదను, దానిని సార్థకపరచగల నీ పరాక్రమమును మేమానందపరవశలమై పాడి నీ విశ్లేష వ్యసనము నంతను బాసి సుఖించునట్లు చేయుము.

తెలుగుసేత :-

ఒక తల్లి తనయుడై యొదవియారేయియే
యొకతెకు బుడుతడై యొదిగి యొదిగి,
మనికి గిట్టనిమేన మామమదిబొదలు
తలపుల నెల్లరిత్తల నొనర్చి,
కలవరింతయు వంత కలతయునులు కింత
యుడివోని కంసుని కడుపులోన
కడివోని బెడిదంపు కారుచిచ్చును బోలె
అదిరి నిల్చిన హాటకాంబరుండ,

"దేహి" యని వచ్చినారము దీనబంధు!
యీవు కరుణింపను తియింతు మేము నీదు
భవ్య సౌభాగ్య సౌశీల్య, వైభవముల,
బాయతాప, మానందము పరిఢవిల్ల.

# ఇరువది యారవ పాశురము

మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్,
మేలైయార్ శెయ్‌వనగళ్ వేణ్డువన కేట్టియేల్,
ఞాలత్తై యెల్లామ్ నడుజ్గ మురల్వన,
పాలన్న వణ్ణత్తున్ పాఞ్చ శన్నియమే,
పోల్వన శజ్గజ్గళ్ పోయ్‌ప్పాడు డైయనక,
శాలప్పెరుమ్ పఱయే పల్లాణ్డిశైప్పారే,
కోలవిళక్కే కొడియే వితానమ్,
ఆలినిలైయామ్! అరుళేలో రెమ్బావాయ్.

టీకా.- మాలే = ఆశ్రితుల విషయమందు వ్యామోహము కలవాడా!, మణివణ్ణా! = ఇంద్ర నీలము వంటి శరీర వర్ణము గలవాడా!, అలినిలైయామ్ = మఱ్ఱియాకు మీద పవళించిన స్వామీ!, మార్గళి + నీ + రాడువార్ = మార్గశిర మాసమున స్నానము చేయుటకు, మేలైయార్ = మన ప్రాచీనుల, శెయ్‌వనగళ్ = చేయు కార్యములు, వేండువన = వలయునని, కేట్టియేల్ = ఎంటివేని వానిని చెప్పెదము, ఞాలత్తైర్ + ఎల్లామ్ = ఈ లోకమంతయు, నడుజ్గ = అదరునట్లు, మురల్వన = ఘోషించునట్టి, పాలన్న = పాలవంటి, వణ్ణతు = వర్ణము గల, ఉన్ = నీయొక్క, పాఞ్చశన్నియమే + పోల్వన = పాంచజన్యమును పోలిన, శజ్గజ్గళ్ = శంఖములు, పోయ్‌ప్పాడ + ఉడైయవవే = విశాలము గల యవియై, శాలప్పెరుమ్ = మిక్కిలి పెద్దదయిన, పఱైయే = వాద్య విశేషము, పల్లాణ్డు = పల్లాండను మంగళమును, ఇశైప్పారే = దానము చేయు వారును, కోళవిళక్కే = దీపస్తంభమును, కొడియే = ధ్వజమును, వితానమే = మేలుకట్టును, అరుళ్ = కృపచేయుము (ఇమ్ము), ఏలో రెమ్బావాయ్ = మా ప్రార్థన మన్నింపుము.

తాత్ప:- ఓ వటపత్ర శాయీ! నల్లని కాంతి కలవాడా! మాపై నీకు అనురాగము మెండు అందుకనియే దర్శనమిచ్చితివి. వేకువనే లేచివచ్చి ఇచ్చట కొలవుదీరి మా కోర్కులవి నవధరించితివి. ఇంద్రనీల కాంతివంతమగు నీసు కుమార సుందర శరీరమును మా నయన గోచర మొనర్చితివి. మా మధ్ధ్యకు వచ్చితివి. ఇదియే మా భాగ్యము. కృష్ణా! మార్గళిస్నానమునకు వలయు పరికరములను కోరివచ్చియున్నాము. "ఇది ప్రస్థిమైన క్రియాకలాపమే యగునా?" యని శంకింపకుము. దీనిని పెద్దల నుష్ఠించియున్నారు. దీనికి

మించిన ప్రమాణమేమున్నది?" ఐనచో మాకేమి కావలయును? "అందువా వినుము. ఈ ప్రపంచమున గలవారల నందరను గడగడ వణుకునట్లు ధ్వనిచేయగల, పాలవలె తెల్లనైననీ చేతిశంఖమును పోలిన శంఖములును, మిక్కిలి వైశాల్యము గల చాల పెద్దదైన వాద్యమొక్కటియు, మంగళధ్వహో రతులను పాడగల వారొక్కరును, మంగళదీపమును, జండాయును, ఛాందినియును మాకు కావలయును. దయచేసి ప్రసాదింపుము.

తెలుగుసేత:-

కమలాక్ష! హరిమణీ రమణీయ మార్గశ
        ర్షస్నాన జపతపాచారపరులు,
శిష్టులు గావించు చెయిదమ్ము లర్థమ్ము
        లెవ్వినా, ఆలింపు మిందిరేశ!
వటపలాశ శయాన! నటనా విచక్షణ
        క్షోణీతల మునెల్ల క్షోభపెట్టు
పాలవెన్నెల లీను పాంచజన్యము బోలు
        కమనీయమ్ములు శంఖములు మాకు

నీకు పల్లాండు పాడెడి నెలతలకును
నను గుణంబగు డక్కి, కేతనము కంబ
దివ్వియలు మేల్వితానము దివ్యమంగ
ళాంగ! కృపనొసంగుము కరుణాంతరంగ?

## ఇరువది యేడవ పాశురము

కూడారై వెల్లుమ్ శీర్‌గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడిప్పఱై కొణ్డుయామ్ పెఱుశమ్మానమ్,
నాడుపు కళుమ్ పరిశినాల్ నన్నాక,
శూడకమే తోళ్‌వళైమే తోడే శెవిప్పూవే.
పాడకమే యెన్ఱనైయపల్ కలనుమ్ యామణి వోమ్,
ఆడైయుడుప్పోయ్ అతన్ పిన్నే పాల్‌చ్చోఱు
మూడ నెయ్‌పెయ్‌తు ముళజ్గై వళివార,
కూడియిరున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.

టీకా:- కూడార్రై = నిన్నాశ్రయింపని వారిని (శత్రువులను), వెల్లుమ్ = గెలువగల, శీర్ = కల్యాణ గుణములు గల, గోవిందా = గోవిందుడా! (గోవుల నానందింపజేయు వాడా!), ఉన్నై = నిన్ను గూర్చి, పాడి = కీర్తించి, పఱై = నీ వద్దనుండి మాకు కావలసిన ప్రాప్యమును, కొణ్డు = తీసికొని, యామ్ = మేము, పెరుమ్ = లభించెడు, శమ్మానమ్ = సన్మానమును, నాడు = లోకమంతయు, పుగళుమ్ = పొగడునట్టి (పొగడునట్టి), పరిశినాల్ = బహుమానము చేత, నన్ఱాగ = చక్కగా, శూడగమ్ = కంకణములు, (చేతి ఆభరణములు), తోళ్ + వళైయే = భుజకడియములు, తోడే = కమ్మలు, శివి + పూవే = కర్ణావతంసములు (చెవిపూలు), పాడగమే = అందెలు, (పాదాభరణములు), ఎన్ఱనైయ్ = అనియిట్లు చెప్పబడిన, పల్‌కలనుమ్ = అనేకములైన ఆభరణములను, యావ్ం = మేము, అణినోవ్ం = అలంకరింతుము, అడై = విలువగల వస్త్రములు ధరింపగల వారము, అడన్‌పిన్నే = దాని తర్వాత, పాల్ + శోయి = పాలతో జేరిన పరమాన్నము (పాయసము), మూడ = మునుగునట్లు, నెయ్ = నెయ్యి, పెయ్‌దు = చేర్చి (పోసి), ముళంగై = మోచేతి యందు (ముంజేతి మార్గము గుండ), వళివార = కారునట్లు భుజించి, కూడియిరున్దు = కూడియుండి (నీతోబాటు కలిసియుండి), కుళిల్‌న్దు = విశ్లేష వ్యసనము తీర సుఖించెదము. ఉల్లము చల్లనగును. ఏలో రెమ్బావాయ్. దీనికియును మతింపుము.

తెలుగుసేత :-

ఆరుల శౌర్యమ్మును అణగించు బలియుడా!
　　గోవింద! మేమునిన్ గొలిచిపాడి,
చేకొని డక్కయు, చేతను ల్వొగడంగ
　　బడయు సన్మానంబు నుడువ నిమ్ము.
కరకంకణమ్ములం గదములు కమ్మలు
　　చెవిపూలు కాలిమంజీరములను,
లోనగు పలునగ లొనరంగ గైసేసి,
　　వలివంపు మేలి దువ్వలు వగట్టి

పాయ సాన్నము మునుంగ నేయివోసి,
పిదప నయ్యది మోచేతి వెంటగార
నించు రుచిపాకముల నెచ్చరించుకొనుచు
తింద మందరు గూడియానంద మొంద.

# ఇరువది యెనిమిదవ పాశురము

కఱవైగళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్న్దు ఉణ్బోమ్,
అఱివొన్ఱు మిల్లాత కాయ్క్కులత్తు, ఉన్దన్నై
ప్పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ నాముడైయోమ్,
కుఱైవొన్ఱు మిల్లాత కోవిన్దా!, వున్దన్నో
డుఱవేల్ నమక్కిఙ్గొళిక్క వొళియాదు,
అఱియాద పిళ్ళైగళో మన్బినాల్, ఉన్దన్నై
చిఱు పేరళైత్త నవుమ్ శీఱియరుళాదే,
ఇఱైవా! నీతారయ్ పఱైయేలో రెమ్బావాయ్.

టీకా:- కఱవైగళ్ = పశువుల యొక్క, పిన్‌శెన్ఱు = వెంబడిపోయి, కానమ్ = అడవిని, శేర్న్దు = జేరి, ఉణ్బోమ్ = జీవించు వాడము, అఱివు = జ్ఞానము, ఒన్ఱుమ్ = కొంచెమైనను, ఇల్లాడ = లేనట్టి, ఆమ్ + కులత్తు = గొల్ల కులమున, ఉన్దన్నై = నీ యొక్క, పిఱవి = జన్మము, పెఱున్దనై = కల్గునట్లు లభించిన, పుణ్ణియమ్ = పున్నెము, యామ్ = మేము, ఉడైయోం = కలవారము, కుఱైవు = కొరత, ఒన్ఱుమ్ = కొంచెమైనను, ఇల్లాద = లేనట్టి, కోవాందా = గోవిందుడా, ఉన్దన్నోదు = నీతో, ఉఱవేల్ = మాకు ఉండు సంబంధము, నమక్కు = మనకు, ఇఙ్గు = ఇక్కడ, ఒళక్కే = తొలగించుకొనినను, ఒళియాడు = పోనట్టిది, అఱియాడ = తెలివిలేని, పిళ్ళైగళోమ్ = ఆడుబిడ్డలము, అన్బినాల్ = ప్రేమచే, ఉన్దన్నై = నిన్ను, శిఱుపేర్ = చిన్నపేరుచే, అళైత్తనవుమ్ = పిలిచినందులకు, శీఱియరుళాదే = కోపగించుకొనక, ఇఱైవా = సర్వస్వామియైన శ్రీకృష్ణా!, పఱై = మా కోరికను, నీ = నీవు, తారాయ్ = కృపసేయుము, ఏలరెమ్బావాయ్ = మా యొక్క ఆపేక్షితమును నెరవేర్చుము.

తాత్ప:- ఓ కృష్ణా! ఆవుల వెంటబోయి అడవులలో దిరుగుచు, గడ్డియున్న చోటును చూచి మేపుకొనుచు, శరీరము పోషించుకొనుచు ఏ జ్ఞానమును లేక గొల్లపల్లెలో బుట్టిన మేము నిన్ను మాజాతిలో చేరిన వానినిగా బడయ తగినట్టి గొప్ప పుణ్యము చేసితిమి. ఏవిధమైన లోటును లేని గోవిందా! సర్వలోకములకు ప్రభువగువాడా! నీతో మాకు గల సంబంధము నీచేతను, మాచేతను మాన్పుటకు వీలుకానిది. లోకజ్ఞానమించుకయులేని బాలలము. నిన్ను పేరుపెట్టి పిలిచినందులకు కోపింపక మాకోరికలు తీర్చి యనుగ్రహింపుము.

(ఈ చివరి రెండు పాశురములను మంగళాశాసము తరువాత చామరమును వీచుచు హారతి నిచ్చుచు గాని తిరుమళ్ళమ్ (తులసీపూలు) వేయుచుగాని చదువలయును)

తెలుగుసేత:-

ఆలమందల తోడ నడవికి బోవుటే
దేహయాత్రోపాధి దేవ! మాకు
తెలివిమాలిన గొల్లకులమున బుడమిని
బుట్టుట మాపూర్వపుణ్య ఫలము!
కొరత యింతయులేని గోవింద! మనకున్న
ఈ బంధమును బాపు నెవరితరము?
తెలిసియు దెలియని వలపు బలుపుజేసి
హే కృష్ణ! హేగోప! హేసఖాయ

టంచు నినుననన్ను పలుకుల నెంచుకొనక
తెల్లదామరపూవుల దెగడు కనుల
సంజ కెంజాయ సొరనీక సరసలోచ
నాంతకాంతుల బరపు మా వంతలుడుగ

## ఇరువది తొమ్మిదవ పాశురము

శిత్తమ్ శిఱుకాలే వన్దున్నై చ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయే,
పెత్తమ్ మేయ్త్తుణ్ణుమ్ కులత్తి పిఱున్దు, నీ
కేత్తైవ లెజ్గళై కొళ్ళామల్ పోగాదు,
ఇత్తైక్కు మేళేలు పిఱవిక్కుమ్, ఉన్దన్నో
డుత్తో మేయా మోం ఉనక్కే నామాట్చెయ్ వోమ్,
మత్తైన నజ్కా మజ్గళ్ మాత్తేలో రెమ్బావాయ్.

టీకా:- గోవిందా = గోవిందా!, శిత్తం శిరుకాలే = మిక్కిలి ప్రాతః కాలమందు (అతి వేకువనే), వన్దు = వచ్చి, (అందరును), ఉన్నై = నిన్ను, శేవిత్తు = సేవించి, ఉన్ = నీయొక్క, పొత్తామర్ = పొందామరల వంటి, అడియే =

అడుగులను, పోత్తుం = మంగళాశాసనము చేసెడు, పొరుళ్ = అభిప్రాయము, కేలాయ్ = వినుము, పెత్తం = మందను, మేయత్తు = మేపి, ఉణ్ణుం = భుజించెడి, (జీవించెడి), కులత్తిల్ = కులమున, పిఱన్ద = పుట్టిన, నీ = నీవు, కుట్రేవల్ = అంతరంగిక సేవలయందు, ఎజ్గళై = మమ్ము, కొళ్లముల్ = అంగీకరింపక, పోగాడు = పోరాడు, ఇత్తై = నేడు (ఈ దినమున), పఱై = వాద్య విశేషమును, కొళ్వార్ = తీసికొనిపోవు వారము, అన్ఱు = కాము, కామ్ = కనుము, ఎత్తైక్కుం = సర్వకాల మందును, ఏళేయ = ఏడేడు, పిఱవిక్కుం = జన్మలకును, ఉన్దన్నోడు = నీ తోడనే, ఉత్తోమే = సంబంధముగల వారముగనే, యూవోమ్ = ఉండుము, ఉనక్కే = నీకే, యామ్ = మేము, ఆళ్ = కైంకర్యమును, శెయ్వోం = చేయగల వారముగాన, నం = మా యొక్క, మత్తై = ఇతరములైన, కారుజ్గల్ = కోరికలను, మాత్తు = పోగొట్టుము, ఏలో రెమ్బావాయ్ = నిరాశ చేయకుము.

తాత్ప:- ఓ కృష్ణా! వేకువ ఝామున వచ్చి మిమ్ము సేవించి తామరల వంటి మీ యడుగుల కీర్తించుటకు ప్రయోజనమును వినుము. పశువులను కడుపారమేపి, తర్వాత భుజించునట్టి స్వభావము గల గొల్ల కులమున బుట్టిన మీరు మావలన కైంకర్యములు చేయించుకొనక పోరాదు. నేడు ఏ ప్రయోజనమును పొందకుండ వదలిపోవు వారముకాము. ఏడు జన్మములకును నీతో చుట్టఱికము గలవారమై యుందుము. దాని కన్యములైన మా యొక్క కోరికలను పోగొట్టవలయు ననుటయే మా యొక్క మనోభిప్రాయము అని విన్నపము చేయుచున్నారు.

తెలుగుసేత:-

నెచ్చెలి పిండులో నేతెంచి వేగమ
మున్నె సంసేవించి మోదమలర
పొంగామరల దోయి బొగడుట లోగల
భావమ్మునరయుమో భవ్యతేజ,!
పశులమేపి భుజించు వంశమ్ములో బుట్టి
వారింప రాదు గోపాల! మాదు
కైంకర్యములను, డక్కం గొనుటకై కాదు
నుమ్ముమా యీరాక శోభనాంగ!

పూనియేడేడు జన్మలకైన నీదు
పాదపంకేజ దాస్యతత్వదల, మన్య
కాంక్షలేవియు మామది కలుగ నీకు
పరమ పావన భవదీయ పాదమాన.

## ముప్పదియవ పాశురము

పఙ్గక్కడల్ కడైన్ద మాతవనై క్కేవవనై,
తిఙ్గళ్ తిరుముకత్తు చ్చేయిళై యార్ శిన్ఱిఱైఞ్జ,
అఙ్గప్పఱై కొణ్డ వాత్తై, యాణిపుదువై
ప్పైఙ్గమలత్తణ్డెరియ ప్పట్టర్ పిరాన్ కోతైశొన్న,
శఙ్గత్తమిళ్ మాలై ముప్పతుమ్ తప్పామే,
ఇఙ్గప్పరిశురై ప్పారీరిణ్డు మాల్వడైత్తోల్,
ఎఙ్గుమ్ తిరువరుళ్ పెత్తిమ్బురువ రెమ్బావాయ్.

టీకా:- పఙ్గక్కడల్ = అలలుగల సముద్రమును, కడైన్ద = దేవతలకు గాను చిలికిన, మాదవనై = లక్ష్మీపతియైన, కేశవనై = కేశియను రాక్షసుని సంహరించిన శ్రీకృష్ణుని, తిఙ్గళ్ = చంద్రుని వంటి, తిరుముకత్తు = తిరుముఖ మండలము గల, శైయిళైయార్ = మంచి యాభరణములు గల గొప్ప బాలికను, శెన్ఱు = వెళ్ళి, ఇఱైఞ్జి = స్తుతించి, అఙ్గు = గోకులమాడు, అప్పఱై = ఆ ప్రాప్యమును, (అడక్కడు), కొణ్డు = తాము పొందిన, అత్తై = ప్రకారమును (వృత్తాంతమును), అణిపుదువై = భూమికి అలంకారమగు శ్రీవిల్లి పుత్తూరు నందు, పైయ్ = అందమైన, కమలమ్ = కమలములచే (తామర మణులచే) కట్టబడిన, తణ్ = చల్లని, (శ్రమహరమగు) తెరియల్ = మాలికను (హారమును), భట్టర్ = విష్ణు చిత్తుల, పిరాన్ = పెరియాళ్వారులయొక్క, కోడై = కూతురగు ఆండాళు (గోదాదేవి), శొన్న = చెప్పిన, శఙ్గమ్ = జనసామాన్య వ్యావహారిక భాసయగు, తమిళ్ = తమిళము నందలి, మాలై = పాశుర (పద్య) రూపమగు మాలికయైన, ముప్పదుమ్ = ముప్పదింటిని, (ముప్పది పాటలను), తప్పామే = తప్పక, ఇఙ్గు = ఈ లోకమందు, ఉరైపాల్ = కీర్తించువారు, ఈరు + ఇరుణ్డు = (ఈరిరుణ్డు) నాలుగైన, మాల్ = దీర్ఘములైన, పరై = కొండలవంటి, తోళ్ = భుజములు, శెమ్గణ్ = ఎర్రని కన్నులు, తిరుముదత్తు = తిరుముఖ మండలము గల,

శెల్వ = సంపత్సూర్ణుడైన (ఉభయ విభూతి నాయకుడైన, తిరుమాలాల్ = శ్రీ మహావిష్ణువు యొక్క, తిరు + పరుళ్ = ఉపమానము లేని అధికమైన కృపను (పరిపూర్ణమైన కృపను), పెత్తు = లభించి (పొంది), ఇమ్బరుపర్ = ఆనందముతో ఉరువర్ = కూడిన వారైయుందురు.

**తాత్ప**:- గోకులమునందు చంద్రబింబ సదృశాననులై యొప్పుతున్న గోపబాలికలు, క్షీరబ్ధిని దేవతలకుగాను చిలికిన మాధవుడును, కేశవుడునైన శ్రీకృష్ణుని సన్నిధికిబోయి తాము పొందిన పురుషార్థ ప్రకారములు గురించి పెరియాళ్వారుల పుత్రికయగు ఆండాళు తల్లి జనసామాన్యమున కర్థమగునట్లుగా తమిళ భాషలో వ్రాసిన తిరుప్పావైయను శ్రీవ్రతమును శ్రీసూక్తి మాలికయగు పాశురములను త్వకుండ యీలోకమునందు అనుసంధించువాడు శ్రియఃపతి యొక్క పరిపూర్ణ కృపకు బాత్రులై ఇహపరలోకము నందును బ్రహ్మానందమును జెందెదరుగాక!

తెలుగుసేత:-

లో లోర్మిమాలికా జాలపారావార
మధనుని కేశవుమాను హీశు,
రాకానిశాకాంత రమణీయ ముఖులలం
కారాంచితలు గొల్లకన్నెలచట
పాడివాంఛితముల బడసిన వార్తను
విష్ణుచిత్తులవారి ప్రియతనూజ
శ్రీవిల్లి పుత్తూరు చేడెలలో మిన్న
గోద ద్రావిడమున గూర్చినట్టి

తెలుగు ననుజ్యోతి భక్తితో దీర్చినట్టి
పద్దియమ్ముల నిచ్చ ముప్పదియు విడక
చదువు వానిన గరుణించు శౌరిచంద్ర
వదను డబ్జాక్షుడాజాను బాహువెపుడు

గద్యము

ఇది శ్రీనివాస పురము శ్రీ శేషాచార్యుల పుత్రికయు శ్రీ తిరుమల గిరివాసుని దివ్యపాదుకా సేవిక శ్రీ మదభినవ రంగనాథ చరణనలిన విన్యస్త

పూనియేడేడు జన్మలకైన నీదు
పాదపంకేజ దాస్యతత్పదల, మన్య
కాంక్షలేవియు మామది కలుగ నీకు
పరమ పావన భవదీయ పాదమాన.

## ముప్పదియవ పాశురము

పఙ్గక్కడళ్ కడైన్ద మాతవనై క్కేవవనై,
తిఙ్గళ్ తిరుముకత్తు చ్చేయిళై యార్ శిన్ఱిఱైఞ్జి,
అఙ్గప్పఱై కొణ్డ వాత్తై, యాణిపుదువై
ప్పైఙ్గమలత్తణ్డెరియ ప్పట్టర్ పిరాన్ కోదైశొన్న,
శఙ్గత్తమిళ్ మాలై ముప్పతుమ్ తప్పామే,
ఇఙ్గప్పరిశురై ప్పారీరిణ్డు మాల్వడైత్తోల్,
ఎఙ్గుమ్ తిరువరుళ్ పెత్తిమ్బురువ రెమ్బావాయ్.

టీకా:- పఙ్గక్కడల్ = అలలుగల సముద్రమును, కడైన్ద = దేవతలకు గాను చితికిన, మాదవనై = లక్ష్మీపతియైన, కేశవనై = కేశియను రాక్షసుని సంహరించిన శ్రీకృష్ణుని, తిఙ్గళ్ = చంద్రుని వంటి, తిరుముకత్తు = తిరుముఖ మండలము గల, శైయిళైయార్ = మంచి యాభరణములు గల గొప్ప బాలికను, శెన్టు = వెళ్ళి, ఇఱైఞ్జి = స్తుతించి, అఙ్గ = గోకులమాడు, అప్పఱై = ఆ ప్రాప్యమును, (అడక్కడు), కొణ్డు = తాము పొందిన, ఆత్తై = ప్రకారమును (వృత్తాంతమును), ఆణిపుదువై = భూమికి అలంకారమగు శ్రీవిల్లి పుత్తూరు నందు, పైయ్ = అందమైన, కమలమ్ = కమలములచే (తామర మణులచే) కట్టబడిన, తణ్ = చల్లని, (శ్రమహరమగు) తెరియల్ = మాలికను (హారమును), భట్టర్ = విష్ణు చిత్తుల, పిరాన్ = పెరియాళ్వారులయొక్క, కోదై = కూతురగు ఆండాళు (గోదాదేవి), శొన్న = చెప్పిన, శఙ్గమ్ = జనసామాన్య వ్యావహారిక భాసయగు, తమిళ్ = తమిళము నందలి, మాలై = పాశుర (పద్య) రూపమగు మాలికయైన, ముప్పదుమ్ = ముప్పదింటిని, (ముప్పది పాటలను), తప్పామే = తప్పక, ఇఙ్గు = ఈ లోకమందు, ఉరైపాల్ = కీర్తించువారు, ఈరు + ఇరుణ్డు = (ఈరిరుణ్డు) నాలుగైన, మాల్ = దీర్ఘములైన, వరై = కొండలవంటి, తోళ్ = భుజములు, శెమ్గణ్ = ఎర్రని కన్నులు, తిరుముదత్తు = తిరుముఖ మండలము గల,

శెల్వ = సంపత్స్వరూపుడైన (ఉభయ విభూతి నాయకుడైన, తిరుమాలాల్ = శ్రీ మహావిష్ణువు యొక్క, తిరు + పరుళ్ = ఉపమానము లేని అధికమైన కృపను (పరిపూర్ణమైన కృపను), పెత్తు = లభించి (పొంది), ఇమ్బరుపర్ = ఆనందముతో ఉరువర్ = కూడిన వారైయుందురు.

**తాత్ప:-** గోకులమునందు చంద్రబింబ సదృశాననులై యొప్పతున్న గోపబాలికలు, క్షీరబ్ధిని దేవతలకుగాను చిలికిన మాధవుడును, కేశవుడునైన శ్రీకృష్ణుని సన్నిధికిబోయి తాము పొందిన పురుషార్థ ప్రకారములు గురించి పెరియాళ్వారుల పుత్రికయగు ఆండాళు తల్లి జనసామాన్యమున కర్థమగునట్లుగా తమిళ భాషలో వ్రాసిన తిరుప్పావైయను శ్రీవ్రతమును శ్రీసూక్తి మాలికయగు పాశురములను తప్పకుండ యీలోకమునందు అనుసంధించువాడు శ్రియఃపతి యొక్క పరిపూర్ణ కృపకు బాత్రులై ఇహపరలోకము నందును బ్రహ్మానందమును జెందెదరుగాక!

తెలుగుసేత:-

లో లోర్మిమాలికా జాలపారావార
మధనుని కేశవుమాను హీశు,
రాకానిశాకాంత రమణీయ ముఖులలం
కారాంచితలు గొల్లకన్నెలచట
- పాడివాంఛితముల బడసిన వార్తను
విష్ణుచిత్తులవారి ప్రియతనూజ
శ్రీవిల్లి పుత్తూరు చేడెలలో మిన్న
గోద ద్రావిడమున గూర్చినట్టి

తెలుగు ననుజ్యోతి భక్తితో దీర్చినట్టి
పద్దియమ్ముల నిచ్చ ముప్పదియు విడక
చదువు వానిన గరుణించు శౌరిచంద్ర
వదను డబ్జాక్షుడాజాను బాహువెపుడు

గద్యము

ఇది శ్రీనివాస పురము శ్రీ శేషాచార్యుల పుత్రికయు శ్రీ తిరుమల గిరివాసుని దివ్యపాదుకా సేవిక శ్రీ మదభినవ రంగనాధ చరణనలిన విన్యస్త

సమస్తాత్మభరణయునగు శ్రీ జ్యోతీకుమారిచే అనూదితమైన శ్రీవ్రత
పాశురార్థ వివరణము సంపూర్ణము.

ఓం లోకాస్సమస్తా సుఖినోభవంతు ఓం

స్వోచ్ఛిష్ఠ మాలికాబంధ గంధబంధుర జిష్ణవే,

విష్ణు చిత్త తనూజాయై గోదాయై నిత్య మంగళమ్ ॥

శ్రీ ఆండాళ్ దివ్య తిరువడికళే శరణమ్.

56046

